VICTORY

విక్టరీ



# కళ్యాణ జాతక విశ్లేషణ




"జ్యోతిషాచార్య"

Dr. పండిట్ మల్లాది మణి Ph.D

# కళ్యాణ జాతక విశ్లేషణ

By

"జ్యోతిషాచార్య"

**డా॥ పండిట్ మల్లాది మణి**, Ph.D.

1-1-730, గాంధీనగర్,

హైదరాబాద్- 500080,

ఫోన్ : **040-65151424, 27608435,**

సెల్ : **8790817964**

**e.mail:www.pandit.malladimani@gmail.com**

© Ln. **I. Ramakumar**, PMJF

Immadisetty Akkeswara Rao

Charitable Trust, Vijayawada.

ప్రథమ ముద్రణ : 2003

ద్వితీయ ముద్రణ : 2008

తృతీయ ముద్రణ : 2012

చతుర్థ ముద్రణ : 2014

**Price : Rs. 120-00**

**సోల్ డిస్ట్రిబ్యూటర్స్**

## శ్రీ వెంకటేశ్వర బుక్ డిపో

30-17-3A, వారణాశివారి వీధి,

సీతారాంపురం, విజయవాడ - 2.

ఫోన్ : **0866 - 2444156**

## సాయి వెంకటేశ్వర బుక్ డిపో

26-27-77, బాటా షోరూమ్ ఎదురు,

గాంధీనగర్, విజయవాడ - 520 003.

ఫోన్ : **(0866) 2570192, 2570309**

## శ్రీ వెంకటేశ్వర బుక్ డిపో

ప్లాట్ నెం. 3, 103, 2-4-1085,

సాయిలక్ష్మీ నికేతన్,

రామకృష్ణా హాస్పటల్ ఎదురువీధి,

కాచిగూడ కుమార్ థియేటర్ దగ్గర,

నింబోలి అడ్డ, హైదరాబాదు - 500027.

ఫోన్ : **(040) 65528228, 24653879**

(ఫాక్స్) **24745257**, సెల్ : **9346771314**

**మనవి :** మాచే ప్రచురించబడిన అన్ని రకముల పుస్తకములు అన్ని ప్రముఖ బుక్ షాపు లలోను, విశాలాంధ్ర మరియు ప్రజాశక్తి బుక్ హౌస్ అన్ని బ్రాంచి లలోను లభించును. లభించని యెడల మమ్ములను నేరుగా సంప్రదించగలరు. పుస్తకాలలో ఏవైనా లోపాలు, తప్పులు ఉన్నా తెలియచేసిన తదుపరిముద్రణలో సరిచేయగలం.ఏవిషయమైన **ramakumarimmadisetty@yahoo.com** మెయిల్‌కు తెలియ జేయవచ్చును. మీకు కావలసిన పుస్తకాలకు : **SBI online A/c. No. 32987503888** **విక్టరీ పబ్లిషర్స్, విజయవాడ** పేరున జమచేసి, మీకు దగ్గర గల ట్రాన్స్‌పోర్టు వివరాలు తెలుపవలెను.

***Published by :* విక్టరీ పబ్లిషర్స్, విజయవాడ**

**We have made many efforts to present this book without errors. But some errors might have crept in. We do not take any legal responsibility for such errors and omissions. If you bring them to our notice we shall correct them in our next edition. All disputes are subject to Vijayawada Jurisdiction only.**



# కళ్యాణ జాతక విశ్లేషణ

"జ్యోతిషాచార్య"

డా|| పండిట్ మల్లాది మణి, Ph.D.

*President, Founder : Indian Institute of Divine Sciences*

**విక్టరీ పబ్లిషర్స్**

డోర్. నెం. 30-17-3ఎ, వారణాశివారి వీధి, సీతారాంపురం,
విజయవాడ- 520 002. ఫోన్ : 0866 - 2444156.

# అంకితం



అత్యంత ప్రేమతో, అంతులేని అవ్యాజానురాగంతో
నాకు జాతక శాస్త్రాన్ని సమయాసమయాలను పాటించకుండా
తన అనారోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా
నన్ను అన్ని విధాలా ప్రోత్సహించి, శాస్త్రాన్ని నాకు స్వయంగా
బోధించిన మహామనీషి, జాతక చక్రవర్తి, ఆంధ్రావని అంతటా
పేరు ప్రఖ్యాతులతో వెలిగి వేలాది శిష్యులను
తనకు ప్రతిరూపంగా వదలివెళ్ళిన దైవ స్వరూపులు,
సరస్వతీ పుత్రులు అయిన

**కీ.శే. శ్రీ వి.వి.రావు** గారి

చరణపద్మాలకు ఈ పుస్తకం అంకితం.

# కృతజ్ఞత

నాకు ఈ గ్రంథం వ్రాయాలనే సంకల్పం కలిగిన తర్వాత నేను శాస్త్రాన్ని చెపుతూ ఉంటే దానిలోని భావాన్ని గ్రహించి విశదీకరించి చక్కని తేటతెలుగులో, మంచి శైలితో సామాన్య ప్రజలకు కూడా అర్థమయ్యే రీతిలో వ్రాయగలిగే నేర్పు, దానికి తగిన ఓర్పు కలిగిన వ్యక్తి కావాలనిపించింది. నా భాషా, భావాలను చక్కగా సమన్వయించి దోష రహితంగా శ్రద్ధగా వ్రాయగలిగేవారు ఎవరా అని ఆలోచిస్తున్న తరుణంలో నా మదిలో తళుక్కుమని మెరిసిన స్త్రీ రత్నం **శ్రీమతి మానుపాటి సత్యకుమారి,** నిజంగా సార్థక నామధేయురాలు.

నాతోపాటు సమయాభావం లేకుండా అకుంఠిత దీక్షతో శ్రమించి ఉత్సాహంతో నాకు అన్ని విధాలా సహకరించి ఈ పుస్తకం ముద్రింపబడడానికి కారణభూతురాలైన ఆమెకు నేను సర్వదా కృతజ్ఞుడిని.

ఉదయం వంటావార్పు, పిల్లలు – వారి పని, శ్రీవారు – వారి సేవ, మరియు మామూలు ఇంటిపని, పైగా రోజంతా ఆఫీసులో స్టెనోగ్రాఫరుగా పని, విధి నిర్వహణ, సాయంత్రం మళ్ళీ వంటావార్పు, ఇంటి పని వీటితో సతమతమవుతూ కూడా, చిరునవ్వుతో నేను చెప్పినది యథాతథంగా వ్రాసి దాన్ని మళ్ళీ ఫెయిర్ చేసి, ప్రూఫ్ రీడింగ్ కూడా చేసి నాకు సకాలంలో పుస్తకాన్ని అందించిన మహామనిషి, సోదరతుల్యురాలు **శ్రీమతి సత్యకుమారి.** ఆమెకు నేను ఏమిచ్చి ఆమె రుణం తీర్చుకోగలను? ఏదో చంద్రుడికో నూలుపోగులాగా నా కృతజ్ఞత చెప్పుకోవడం తప్ప.

అడగగానే తన ఒప్పుదల తన శ్రీమతికిచ్చి ఆమె ద్వారా నాతో అన్ని విధాల సహకరించిన **శ్రీ మానుపాటి మధుసూదనరావుగారికి** మరిన్ని మనఃపూర్వక అభినందనలు.

**– మల్లాది మణి**

# ఒక సత్యసూక్తి

**"పుస్తకం వనితా విత్తం**
**పరహస్తం గతం గతః!**
**అధవాపున రాయతి -**
**పుస్తకం జీర్ణం, స్త్రీ భ్రష్టంచ విత్తం ఖండశః!!**


# తాత్పర్యము

మన చేతిలో ఉన్న పుస్తకంగాని, స్త్రీగాని, ధనం కాని మరొకరి చేతికిచ్చినపుడు అవి సవ్యంగా ఎన్నడూ తిరిగిరావు. పుస్తకం జీర్ణస్థితిలోను, స్త్రీ భ్రష్టురాలుగాను, ధనం వాయిదాలలోనే వస్తాయి.

# అందుకే....

మీరు ఈ పుస్తకాన్ని ఎవ్వరికి ఇవ్వకండి. కావలసిన వారిని కొనుక్కోమనండి. లేకపోతే జీర్ణస్థితిలో తిరిగి రావచ్చు లేక అసలే రాకపోవచ్చు. అందుకే "అంత్య నిష్టూరం కంటే ఆది నిష్టూరం మేలు!" అనే సత్యసూక్తిని మరువకండి!

**- మల్లాది మణి**



# విషయసూచిక


| | | |
|---|---|---|
| | మీది ఏ సాం[ప్రదాయం ............ | vi - xxx |
| 1. | ఉపోద్ఘాతము ........................ | 1 |
| 2. | [గ్రహమైత్రి .......................... | 12 |
| 3. | తారాబలం .......................... | 21 |
| 4. | రజ్జుదోషం .......................... | 29 |
| 5. | గణపొంతన ......................... | 32 |
| 6. | కుజదోషం .......................... | 35 |
| 7. | కళత్ర స్థానం......................... | 45 |
| 8. | ద్విద్వాదశాలు ....................... | 51 |
| 9. | నవ పంచకాలు ..................... | 53 |
| 10. | షష్టాష్టకాలు.......................... | 54 |
| 11. | కాలసర్ప దోషం ..................... | 56 |

| | | |
|---|---|---|
| 12. | సప్తాసప్తమాలు ...................... | 60 |
| 13. | పంచమభావం ...................... | 63 |
| 14. | లగ్నసప్తమ అష్టమ భావాలు ........ | 77 |
| 15. | వివాహాలు ఎందుకు ఆగిపోతాయి? | 80 |
| 16. | నక్షత్ర స్వభావం ..................... | 82 |
| 17. | పంచాంగంలో 18 పాయింట్లు ..... | 103 |
| 18. | విదేశయానం ......................... | 105 |
| 19. | ద్వికళత్ర దోషం ..................... | 108 |
| 20. | వైధవ్య ప్రారబ్ధం..................... | 117 |
| 21. | దాంపత్య మారకత్వం ............... | 123 |
| 22. | దీర్ఘకాల మాంగల్యం................ | 133 |
| 23. | నాడీ దోషం.......................... | 140 |
| 24. | నిషిద్ధ వివాహాలు .................... | 143 |
| 25. | ఇతర విషయాలు.................... | 147 |
| 26. | అభ్యాస చక్రాలు .................... | 149 |
| 27. | పుత్ర సంతానం....................... | 152 |
| 28. | ముహూర్త వివరాలు ................ | 159 |
| 29. | నపుంసకత్వం ........................ | 171 |

# మీది ఏ సాంప్రదాయం?

1. మీ అమ్మాయి “శ” అనే అక్షరానికి “ష” అనే అక్షరం పలుకుతోందా? ఉదాహరణకి “శర్మ”కు, “షెర్మ”, శాంతికి “షాంతి”, శిల్పకి “షిల్ప”, జయశ్రీకి “జయశ్రీ” అంటోందా? అలా అయితే మీరు గమనించి ఆమె ఉచ్చారణ సరిచేయండి. ఇంగ్లీషులో "Shanti", "Shilpa", "Shri"అనే స్పెల్లింగు వాడనీయక "Santi", "Silpa", "Sri" లేక "Sree" అని మాత్రమే వ్రాసే అలవాటు చేయండి. చక్కటి ఉచ్చారణ మనిషి యొక్క గౌరవాన్ని ఇనుమడింప చేస్తుంది. “మా అమ్మాయి ఇంగ్లీషు మీడియం అండీ, తెలుగు సరిగా రాదు” అని గాని లేక “ఈ కాలపు జనరేషన్ అంతేనండి” అని వారిని ప్రోత్సహిస్తే మీ సాంప్రదాయం ఏమిటో, మీ పెంపకం ఎలాంటిదో ఎదుటివారికి మీరు చెప్పకుండానే అర్థమైపోతుందని గ్రహించండి. ఆమెకు భాషా స్పష్టత, తెలుగు భాషలోని తియ్యదనం విశదీకరించి చెప్పండి. అంతేకాని శర్మకు, షెర్మ, భారతి, మాధవికి ఒత్తులు తీసేయడం చేయనీయకండి.

2. ఈ రోజుల్లో అమ్మాయిలు ఒకరిని చూసి ఒకళ్ళు ఫ్యాషన్ కోసం “వాళ్ళు”కు వాల్లు, “పెళ్ళి”కి పెల్లి, “కళ్ళు”కు కల్లు, “నీళ్ళు”కు నీల్లు అనడం మరీ సర్వ సామాన్యమై పోయింది. ఇది వినడానికి ఎంతో జుగుప్సాకరంగా ఉంటుంది. మనిషికి గౌరవం అనేది వాళ్ళు వాడే భాషవల్ల కూడా వస్తుందని గ్రహించండి. అధికారమదం, అవినీతి ధనం ఉన్నా రాజకీయ నాయకులకు భాషా దారిద్ర్యం ఉంది. కాబట్టి వారిని మనం ఆదర్శంగా తీసుకొని అనుకరించకూడదు.

3. మీ అమ్మాయి టి.వి.లోని యాంకర్ అమ్మాయిలా భుజాలు ఎగరేస్తూ, చేతులు తిప్పుతూ అనవసరంగా తెచ్చిపెట్టుకున్న నవ్వుతో ఇంగ్లీషు భాషలోని "Yah", "Well", "OK", "And", "Like" అన్న పదాలే పదే పదే ఉపయోగిస్తూ ఒక్క వాక్యం కూడా పూర్తిగా మాట్లాడలేక పోతుందా? ఆమె మాట్లాడేటప్పుడు పెదవి విరుపులు, తల ఎగరవేయడాలు చేస్తూ మధ్యలో “ఫ్చ్” “ఫ్చ్” అంటూ బట్లర్ ఇంగ్లీషు మాట్లాడుతోందా? అలా మాట్లాడుతూ ఉంటే మీరు సరిదిద్ది చక్కటి భాషలో హుందాగా, వినమ్రతగా మాట్లాడేటట్లు అలవాటు చేయండి. ప్రపంచంలోని పెద్దపండితులు, శాస్త్రజ్ఞులు, న్యాయకోవిదులు, రాజకీయ లేక మరే అంశంలో అయినా నిష్ణాతులైనవారు అలా మాట్లాడగా ఎప్పుడైనా చూశారా? మనది చక్కటి బ్రిటిషు భాష అని మర్చిపోకండి. వీలైనంతవరకు చక్కటి పదాలు వాడేటట్లు అలవాటు చేయండి. అమెరికాలోని నీచ ప్రవృత్తి లేక నీచ వృత్తిలో ఉన్నవారి భాషను మనం నేర్చుకుని అదే గొప్ప అనుకోవడం మన కుసంస్కారానికి పరాకాష్ఠ. మరియు మన భాషా దరిద్రానికి నిలువు దర్పణం. "Guy" లేక "Fellow" అనడం కంటే "Boy" లేక "Gentleman" అనడంలో ఎంతో తేడా వుంది. చక్కటి పదప్రయోగం వల్ల వారి హుందాతనం పెరుగుతుందే తప్ప వారి దర్జాతనం ఏమీ

తగ్గదు అని తెలుసుకోవాలి. తెలుగు రానట్లు తడుముకుంటూ నత్తిగా మాట్లాడుతుంటే వినేవారికి ఇబ్బందికరంగా ఉంటుంది. పైగా మాతృభాష రానివారిని ఏ దేశం, ఏ సమాజం హర్షించదు కదా, అసహ్యించుకుంటుంది.

4. మీరు పిల్లని చూడటానికి వెళ్ళేటప్పుడు మీరు ముగ్గురు లేక నలుగురు అది కూడా మీ ఇంటివాళ్ళయితేనే తీసుకువెళ్ళండి. మీ మేనమామలు, మేనత్తలు, ఆడపడుచులు, తోడికోడళ్ళు అంటూ అందరూ గుంపులుగా వెళ్ళి పిల్ల తరపు వాళ్ళని ఇబ్బంది పెట్టకండి. అమ్మాయిని అనవసరపు ప్రశ్నలతో వేధించడంలాంటివి చేయకండి. లేచి నడవమనడం, లేక ఇష్టం లేకపోయినా బలవంతంగా పాడించడం, లేక పాడమని బలవంతం చేయడం లాంటివి చేయకండి. ఒకసారి వెళ్ళి చూసి నచ్చిన తర్వాత మళ్ళీ ఇంకొకసారి చూడాలని అడగడం మంచి సాంప్రదాయానికి విరుద్ధం. అది మర్యాదస్తుల లక్షణం కాదు. మళ్ళీ చూడాలని పిల్ల తరుపు వాళ్ళు పిల్లవాడిని రమ్మంటే పిల్లవాడు వచ్చేటట్లయితే అప్పుడు మీరు రెండవసారి చూస్తామని అడగవచ్చు. ఎందుకంటే మొగపిల్లవాడి తరుపువారికి కోడలు కావాలి. ఆడపిల్ల తరుపువారికి అల్లుడు కావాలి. కాబట్టి ఇద్దరూ సమానమే కాని ఒకరు ఎక్కువ మరొకరు తక్కువ అనుకోవడం మన సంకుచిత మనస్తత్వానికి ప్రతీక అని తెలుసుకోండి. మర్యాద అనేది ఒకరి సొత్తు కాదు. ఇచ్చి పుచ్చుకున్నప్పుడే వారిరువురికి సభ్యత ఉన్నట్లు నిరూపణ అవుతుంది.

5. మీరు కనుక అబ్బాయి తల్లిదండ్రులైతే మీ అబ్బాయి పెళ్ళికుమార్తెతో ప్రత్యేకంగా ఒంటరిగా మాట్లాడుతానంటే మీరు ఒప్పుకోకండి. ఆధునికత పేరులో మనకున్న మంచి సాంప్రదాయాన్ని ధ్వంసం చేయకండి. పిల్లవాడు తన తల్లిదండ్రులకు తెలియకుండా, పెండ్లి కుమార్తె తల్లిదండ్రులకు తెలియకుండా, అక్కడ ఉన్న బంధుమిత్ర వర్గానికి తెలియకుండా ఇంకా ఏమీ నిశ్చయం కాకుండా, పరకన్యతో ప్రత్యేకంగా రహస్య సంభాషణ కోసం అంత కుతూహలం చూపటం ఎంత దైన్యం? మీ అబ్బాయి మీద మీకు వాత్సల్యం ఉండవచ్చు. కాని అతని వాంఛ సమర్ధనీయం కాదు. విధిలేక ఆ పిల్ల మరియు ఇష్టం లేకపోయినా ఆ పిల్ల తల్లిదండ్రులు దీనికి ఒప్పుకుంటున్నారని కచ్చితంగా తెలిసి కూడా మీ అబ్బాయిని సంతృప్తిపరచడం కోసం వధువు తల్లిదండ్రుల నిస్సహాయతను అవకాశంగా తీసుకొని మీరు మీ అబ్బాయిని కట్టడి చేయకపోతే మీది ఎన్నటికీ మంచి సాంప్రదాయం గల కుటుంబం కాదు. అటువంటప్పుడు "మంచి సాంప్రదాయం గల ఇంటిలోంచి వచ్చిన పిల్ల కావాలి" అని అడిగే అర్హత, హక్కూ మీకులేదు. పిల్లవాడు ఒంటరిగా మాట్లాడటం వల్ల జరిగే వివాహం కూడా జరగదు కదా, కొన్ని చోట్ల వివాదాలకు, సంఘర్షణలకు దారితీసిన సందర్భాలు నాకు తెలుసు. పిల్లవాడు ప్రశ్నలు ఏమేమి అడగాలో ముందే నిర్ణయించుకుని వాటికి సమాధానాలు ఎలా ఉండాలో కూడా ఊహించుకుని ప్రశ్నలు అడుగుతాడు. కాని పిల్లకు ఏ ప్రశ్నకు ఏ సమాధానం చెప్పాలో తెలియక తనకు తట్టినది జవాబుగా చెప్తుంది. పిల్లవాడు

ఇంతకు ముందే ఇవే ప్రశ్నలు అన్ని చోట్ల వేసి అన్ని చోట్ల సమాధానాలు తీసుకున్నాడు కాబట్టి వాటిని బేరీజు వేసుకుంటాడు. ఆ అవకాశం పిల్లకు ఉండదు కాబట్టి ఇలా ప్రత్యేకంగా మాట్లాడించటం ఆడపిల్లకు అన్యాయం చేసినట్లవుతుంది. అన్నీ బాగున్నా పిల్ల చెప్పిన సమాధానాలు పిల్లవానికి నచ్చక ఆ సంబంధం తప్పిపోతుంది. కనుక పిల్లవాడు ఏమి అడగాలనుకున్నా పెద్దల సమక్షంలో అడగడంలో ఉన్న ఔచిత్యం కన్యను ఒంటరిదాన్ని చేసి అడగడంతో ఉండదు. ఇది నిజం. అందరి సమక్షంలో అడిగినప్పుడు పిల్లవాడిమనస్తత్వం ఆడపిల్ల వాళ్ళకు కూడా తెలుస్తుంది. రెండవది పిల్ల అమాయకంగా జవాబు చెప్పినా సరిదిద్దడానికి పెద్దలకు అవకాశం ఉంటుంది. ఇది అందరూ గ్రహించి పిల్లను పెళ్ళి చూపులలో మానసిక ఒత్తిడికి గురి చేయకండి. వివాహం కుదరాలనే తొందరపాటుతో పిల్ల స్వేచ్ఛను హరించకండి. ఈ దుష్ట సంప్రదాయాన్ని ఇక్కడితో త్రుంచివేయండి.

“కాదు, మా అబ్బాయి ఆ అమ్మాయితో మాట్లాడి తీరాలనుకుంటే వారిద్దరిని ఫోనులో సంప్రదించుకోమనండి. సంభాషణ సారాంశం నచ్చితే అప్పుడు పిల్లను చూడడానికి అబ్బాయి వాళ్లు వెళ్లవచ్చు. ఫోనులో మాట్లాడినది కూడా రహస్యమే కాబట్టి అబ్బాయికి అభ్యంతరం ఖచ్చితంగా ఉండకూడదు. అలాకాకుండా అభ్యంతరం ఉంటే ఆ అబ్బాయిలో వికృతమైన ఆలోచనలు మీరు గ్రహించవచ్చు. అవునో కాదో మీకు మీరే ఆలోచించుకుని సరియైన నిర్ణయానికి రండి. ఎందుకంటే, మీరు మీ భార్య కలిసి దాదాపు పాతికేళ్లపైనా దంపతులుగా జీవిస్తున్నా మీలో మీకు భావాలు వేరుగానే ఉన్నాయి. ఒకే అభిప్రాయంలో ఇద్దరూ ఎన్నోసార్లు విభేదించి ఉండి ఉండవచ్చు. మీ ఆయన మిమ్మల్ని కోప్పడటం, మీ ఆవిడ మిమ్మల్ని విసుక్కోవడం జరుగుతూనే ఉంది. అంటే మీ ఇద్దరూ భార్యాభర్తలుగా ఎన్నో సంవత్సరాలనుంచి కలిసి జీవనం సాగిస్తున్నా, భేదాభిప్రాయాలు ఉంటూనేఉన్నాయి, వస్తూనే ఉన్నాయి. మీ ఇద్దరికీ ఒకే అభిప్రాయం ఇప్పటికీ లేదు. అలాంటపుడు 25 నిమిషాలు మాట్లాడితే భావాలు అర్థం చేసుకుంటామని చెప్పడం ఎంత హాస్యాస్పదం? దానిని మెచ్చుకునే తల్లిదండ్రులకు వాళ్లబ్బాయి మీద ఉన్న ధృతరాష్ట్ర ప్రేమను మనం అర్థం చేసుకోవచ్చు. ఇంతమాట్లాడి, అన్ని భావాలు గ్రహించిన వధూవరులు రోజులలో లేక కొన్ని మాసాలలోనే విడాకులకు న్యాయస్థానాలకు ఎందుకు పోతున్నారు ఒకరి భావాలు, ఒకరు ఏమి అర్థం చేసుకున్నారు? విడాకులైన వారందరిని నేను ప్రశ్నిస్తే నీళ్లు నమలడం తప్ప మరేమీ సరియైన సమాధానం చెప్పలేకపోయారు.

**కొసమెఱుపు :** నా భార్యతో నేను రహస్య సంభాషణ కోరలేదు. భావాలర్థం చేసుకున్నామని చెప్పలేదు. వివాహమైన తర్వాత మెల్లగా ఒకరిని ఒకరు అర్థం చేసుకున్నాము. ఇప్పటికి 42 సంవత్సరాలు పూర్తి అయ్యాయి. ఏ భావాలు, సంభాషణలు లేకుండా వివాహం చేసుకున్న మేము సుఖశాంతులలో దాంపత్య జీవితం ఇప్పటికీ గడుపుతూనే ఉన్నాము. కాని ఇప్పటి యువత రహస్య సంభాషణ చేసి, భావాలర్థం చేసుకొని విడిపోతున్నారు! మసి పూసి మారేడుకాయ చేస్తున్న యువతను తల్లిదండ్రులు ప్రోత్సహించడం ఆత్మవంచనే!!

ఇంకొక ముఖ్య విషయం ఏమంటే నాకు అప్పుడప్పుడు అమ్మాయిల దగ్గర నుంచి అనేక ఊళ్ళ నుంచి ఫోన్లు వస్తూనే వున్నాయి. సారాంశం ఏమంటే "మీది ఏ సాంప్రదాయం" చాలా బాగుందని, అన్నీ నిజాలు వ్రాసినానని అంటూ, తమకు కూడా ప్రత్యేక సంభాషణ ఇష్టం లేదని, తమ తల్లిదండ్రులకు అనేక కారణాలను విపులంగా వివరించి చెప్పినా, తల్లి దండ్రులు వినకుండా కొంచెం సర్దుకుపోతే అన్నీ సానుకూలమవుతాయని మమ్మల్నే సర్దుకు పొమ్మంటారే తప్ప, వచ్చిన ప్రతి అబ్బాయికి నన్ను ఒంటరిదాన్ని చేసి వేశ్యను వేశ్యామాత అప్పగించినట్లు మా పెద్దవాళ్ళు చేయడం బాధగా ఉంది. ఎందుకంటే వచ్చిన పిల్లవాడి చూపులు కొన్నిసార్లు చాలా అసభ్యంగా కూడా ఉంటాయి. అదే కాక వాళ్ళ ద్వందార్థాల మాటలు కూడా వినడానికి జుగుప్సాకరంగా ఉంటున్నాయి అని చెప్పి బాధపడటం జరుగు తూనే ఉంది. ఇలాంటి దుష్ట సంప్రదాయాన్ని త్రుంచి వేయాలంటే ప్రత్యేక సంభాషణకు వధూవరుల తల్లిదండ్రులు ఇద్దరూ ఏనాటికీ ప్రోత్సహించకూడదు. ఈ హీనమైన పాశ్చాత్య పోకడలకు స్వస్తి చెప్పండి. పిల్ల ఒప్పుకోకూడదు. అప్పుడే ఈ దౌర్భాగ్యపు అలవాటు నశిస్తుంది. ఏ కన్యా కూడా ఒప్పుకోకపోతే వరుడు ఏం చేయగలడు? తీయగానవ్వుతూ మాట్లాడి నచ్చలేదని ఏ అమ్మాయిని వంచించలేడు. ఈ సత్యాన్ని ప్రతి వధువు గ్రహించాలి.

6. పిల్లను చూడడానికి మీరు వెళ్ళినపుడు మీ గౌరవార్థం వారు అందించే ఫలహారాలను మీరు ఎంగిలి చేసి ఏమీ తినకుండా అన్నీ వదిలివేసి, వారు ఇచ్చిన పానీయాలు ఒక గుక్క త్రాగి మిగిలినదంతా వదలివేసి రాకండి. మిమ్మల్ని గౌరవించాలని వారు పెట్టినపుడు మీరు వారిని అగౌరవపరచి రావడం మీ యొక్క అహంకారానికి నిలువుటద్దం. ఒకవేళ తీసుకునే ఉద్దేశం లేనప్పుడు ఆ సంగతి పెళ్ళికుమార్తె తల్లిదండ్రులకు ముందే చెప్పండి. మీ యొక్క సదుద్దేశం వారు గ్రహించి హర్షిస్తారు. అంతేకాని మీకు ఫలహారాలు పెట్టిన తర్వాత ఎంగిలి చేసి వదలివేయడం మీలోని అహానికి సాక్ష్యం అదేనని మరచిపోకండి.

7. పిల్లను చూడడానికి మీరు వెళ్ళేటప్పుడు దానికయ్యే ఖర్చులు మీరే పెట్టకోవడం ధర్మం. మరి సభ్యత కూడా. అంతేగాని ఆ ఖర్చులు ఏదో వొంక పెట్టి ఆడపిల్ల వాళ్ళమీద వేయడం మీయొక్క లోభప్రవృత్తికి నిజమైన తార్కాణంఅని మర్చిపోకండి. ఎందుకంటే వధువుని చూడడానికి వెళ్ళడం అనేది మీ అవసరం కూడా. అందువల్ల ఆ ఖర్చులు మీరే పెట్టుకోవడం ముమ్మాటికీ సబబు.

8. ఆడపిల్లవాళ్ల దగ్గర ఫొటో, జాతకం తీసుకుని మీరు మీ అబ్బాయి ఫొటో జాతకం వెంటనే ఇవ్వడం మర్యాదస్తుల లక్షణం. ఏదో కుంటిసాకు పెట్టి ఇవ్వకపోవడం వల్ల మీ సంకుచితపు ఆలోచనలు బహిర్గతమౌతాయని మరువవద్దు. ఇచ్చిపుచ్చుకోవడంలో ఉన్న మంచి మర్యాద ఒక్క తీసుకోవడంలో ఉండదు.

9. ఫొటోలు, జాతకాలు త్రిప్పి పంపకపోవడం, లేక వచ్చి తీసుకెళ్ళండని చెప్పడం, పోస్టు చేసేశామని అబద్ధం చెప్పడం, తగిన తపాలా బిళ్లలు అంటించకుండా పోస్టు చేయడం

చాలా నీచం. అటువంటి దౌర్భాగ్యపు పనులు మీరు చేయకండి. అలాగే ఫోటో వాపసు పంపేటప్పుడు మీరు ఒక నాలుగు వాక్యాలు వ్రాసి మీ అడ్రసు వ్రాసి పంపటం వల్ల ఎవరు పంపారో ఆడపిల్ల వాళ్ళకు తెలుస్తుంది. ఒక్క ఫోటో మాత్రమే కవర్లో పెట్టి ఫ్రమ్ అడ్రస్ లేకుండా, స్టాంపులు లేకుండా పంపడం లాంటి అసహ్యమైన పనులు మానండి. లేకపోతే ఎవరి సంబంధం కుదరలేదో ఆడపిల్ల వాళ్ళకుతెలియదు. అందుకని హుందాగా ప్రవర్తించండి.

10. పిల్లవాడు, పిల్ల కలిపి ఎంత సంపాదిస్తున్నారు అన్న విషయం ప్రాధాన్యం కాని ఎవరు ఎంత సంపాదిస్తున్నారనేది ముఖ్యం కాదు. ఇద్దరి సంపాదన కలిపితే జీవితం సాఫీగా సాగుతుందని అనుకున్నప్పుడు పిల్లవాడే ఎక్కువ సంపాదించాలి అనుకోవడంలో అంత అర్థం లేదని నా అభిప్రాయం. ఎందుకంటే పిల్లవాడి జీతం ఎక్కువ ఉన్నా ఒక్కొక్కప్పుడు పిల్లవాడి ఇంటికి తెచ్చే జీతం పిల్ల తెచ్చేదానికంటే తక్కువ ఉండవచ్చు. ఇలా చాలా సంసారాలు ఉన్నాయి. కాని వాళ్లలో 'అహం' (Superiority complex or Inferiority complex) అనేవి రావడం లేదు. పైగా పిల్లవాడు చెప్పినంత జీతం ఎప్పటికీ చేతికి రాదని అందరికీ తెలుసు. అందువల్ల పిల్లవాడి కంటె పిల్లకు జీతం కొంచెం ఎక్కువ ఉన్నంత మాత్రాన ఆ సంబంధం వదలివేయటం అమాయకత్వమే అవుతుంది. వారి జీవితంలో సహాయ సహకారాలు వాళ్ల జీతాల మీద ఆధారపడవు. కటింగ్స్ అన్నీ పోతే భర్తకన్నా భార్య జీతమే ఎక్కువ కావచ్చు. "బంగారంలాంటి సంబంధం" అన్నీ బాగున్నాయి. ఈడుజోడుగా వున్నారు. జాతకం కూడా కలిసింది. ఆ పిల్లవాడికి జీతం మా అమ్మాయి కంటే తక్కువ. అందుకనే మా అమ్మాయిని ఇవ్వలేదు" అని ఎవరితో చెప్పినా విన్నవారు మీరు పొరపాటు చేశారనే చెప్తారు. పిల్లకంటే ముందు మీరే రేపు "ఇగో", "క్లాష్" వస్తుందని పిల్లముందు పదిసార్లు అంటే ఆ పిల్లకు మీరనుకున్న "ఇగో" పెళ్ళి కాకుండానే వస్తుందని మర్చిపోకండి.

11. పిల్లవాడు ఏం చేసి సంపాదిస్తున్నాడనేది ఇప్పుడు ఆడపిల్లలకు ముఖ్యం అయిపోయింది. ఎంత సంపాదిస్తున్నాడనే దానికి ప్రాముఖ్యం ఇవ్వడంలేదు. కాని పిల్లవాడు ఎంత సంపాదిస్తున్నాడనేది ముఖ్యం గాని, ఏం చేసి సంపాదిస్తున్నాడనేది ముఖ్యం కాదు. ఒక్కొక్క పురుషుడు ఒక్కొక్క రీతిలో సంపాదిస్తాడు. ఉదాహరణకు ఒకరు వ్యవసాయం, ఇంకొకరు వ్యాపారం, మరొకరు లలితకళలతో జీవిస్తారు. అతని సంపాదన బట్టి ఈ రోజుల్లో అతనికి గౌరవం లభిస్తోంది. కాని అతను ఏం చేసి సంపాదిస్తున్నాడనేది ఎవరూ ఆలోచించడం లేదు. ఎందుకంటే మల్లాది వెంకట కృష్ణమూర్తి కథలు, సీరియల్సు వ్రాసి బాగా సంపాదిస్తున్నాడు. వేటూరి సుందర రామమూర్తి పాటలు వ్రాసి సంపాదిస్తున్నారు. బాలసుబ్రహ్మణ్యం పాటలు పాడి సంపాదిస్తున్నాడు. మాగంటివారు, మల్లాదివారు వ్యాపారంలో కోట్లు గడిస్తున్నారు. కోటి విద్యలు కూటికొరకే. ఇంజనీరే కావాలి. డాక్టరే కావాలి. ఎందుకంటే వాళ్లకు సంపాదన ఎక్కువ. పైగా నిలకడగా జీతం వస్తుంది అనుకోవటం ఈ రోజులలో పొరపాటు. వ్యాపారంలో గ్యారంటీ లేదనుకుంటే ఈ రోజుల్లో ఉద్యోగం కూడా గ్యారంటీ

లేదని మర్చిపోకండి. పెద్ద పెద్ద కంపెనీలు మూతపడ్డాయి. బ్యాంకులన్నిటిలో వి.ఆర్.ఎస్ ఇచ్చి బయటకు పంపేసారు. గవర్నమెంటులో ఉద్యోగాల మీద నిషేధం ఇంకా కొనసాగుతోంది. ప్రైవేటు కంపెనీలలో ఎప్పుడు పొమ్మంటారో తెలీదు. అలాంటప్పుడు "వ్యాపారం చేసే పిల్లవాడు వద్దు", "స్వయంవృత్తిలో వుంటే వద్దు" అనడం వల్ల వివాహాలు ఆలస్యం అయి పిల్లలు ముప్పయ్యోపడిలో పడిపోతున్నా వారు ఇంకా తల్లిదండ్రుల చాటున ఉన్న చిన్నపిల్లలలాగా ఆలోచిస్తూ మూర్ఖత్వంతో సుఖసంతోషాలకు దూరం అవుతున్నారు. వయసు, కోరికలు రెండూ రోజురోజుకు పెరిగి రాజీపడలేక వివాహం కాకుండా ఉండిపోతున్నారు. వివాహం అయినా కొన్ని చోట్ల విద్య, సంపాదనవల్ల ఆడపిల్లలకు వచ్చే అహంచే దాంపత్య విచ్ఛిన్నం కూడా అయిపోతోందని మనం మర్చిపోకూడదు. ఎందుకంటే ఆడపిల్లలకు ఎంత చదువు, ఉద్యోగం, హోదా, అంతస్తు, ఆస్తిఉన్నా తను కోడలు అని తెలుసుకుని అత్తమామలతో సహకరించటం ఉత్తమ కన్యల లక్షణం. అలాకాకుండా అంతులేని స్వార్థం, మిడిసిపాటు, అహంకారంతో దాంపత్యం విచ్ఛిన్నం చేసుకోవడం వివేకశూన్యం. మరియు హీనసంస్కారానికి అది సాక్షీభూతం. విద్యవల్ల విజ్ఞానం, వినయం పెరగాలి గాని గర్వం, గయ్యాళితనం రాకూడదు. అలావస్తే ఆ విద్యకు అర్థం లేదు. తల్లిదండ్రులకు అంతకంటే అవమానం మరొకటి ఉండదు.

12. ఒక శాఖకు చెందినవారు అదే శాఖలోనివారు కావాలని మొండిపట్టుగా ఉండటం వారికే నష్టం. ఒక శాఖవారు కనీసం అదే శాఖలోని అంతర్ శాఖ వాళ్లని చేసుకోవడానికి ముందుకు రావాలి. వేరే శాఖ వాళ్ళని చేసుకుంటే "కష్టనష్టాలు వస్తాయి. ఆచార వ్యవహారాల్లో కుదరదు" అంటూ ఉంటారు. కాని అది సరికాదని మా ఉద్దేశ్యం. పిల్ల మన ఇంటికి వచ్చినప్పుడు కాలక్రమేణా మన పద్ధతులకు అలవాటు పడిపోతుంది. కడపలో పుట్టిన కన్య శ్రీకాకుళం అబ్బాయిని చేసుకొన్నా ఆ ఇద్దరికీ ఉదారం, ఓర్పు ఉంటే దాంపత్య జీవితం హాయిగా గడిచిపోతుంది. ఒకే శాఖలో కావాలని చేసుకున్నా ఆ ఇద్దరికీ సరిపడక విడాకులు తీసుకున్నవారు ఎంతోమంది ఉన్నారు. అలాగే వేరు వేరు శాఖలలోంచి వచ్చి కావాలని వివాహం చేసుకొని సంతోష జీవితం గడుపుతున్నవారూ ఉన్నారు. ఈ శాఖలు ప్రాంతం ప్రకారం వచ్చినవే గాని వేరే విధంగా కావు. ఒక శాఖవారు ఇంకొక శాఖవారిని విమర్శించడం మానివేసి మనం అందరం ఒకటే అని ప్రకటించి సహకరించుకొంటే వివాహాలు త్వరగా అవుతాయి.

13. మేము తల్లిదండ్రులం. ముందు వచ్చి చూసి నచ్చితే తర్వాత మా అబ్బాయి వచ్చి చూస్తాడనే పద్ధతి ఈ రోజులలో పనికి రాదు. పిల్ల మరియు పిల్లవాడు విద్యలో, సంపాదనలో, ఆలోచనా సరళిలో, ఒకటిగానే ఉంటున్నారు. మీరు ఇంకా మా అబ్బాయి మేం చెప్పింది కాదనడని లేక మా అమ్మాయి మా మాట కాదందని దర్పంగా చెప్పకండి. ఎందుకంటే మీరు వెతికి తెచ్చిన అమ్మాయిని మీ అబ్బాయి కాదన్నా లేక మీరు మెచ్చిన అబ్బాయిని మీ అమ్మాయి కాదంటే మీరు ఏమీ చేయలేరు. మళ్ళీ వేటకు బయలుదేరాల్సిందే.

అంటే నిర్ణయం ఆ అబ్బాయి, అమ్మాయిలదే. అనవసరంగా మీకు మీరుగా పెద్దరికం ఆపాదించుకుని పిల్లని మేము చూస్తామని ఒక డజనుమందిని చూసి మీకు నచ్చిన పిల్లను మీ అబ్బాయికి చూపిస్తానంటే ఏ పిల్లా లేక ఆ అమ్మాయి తల్లిదండ్రులు ఈ రోజుల్లో ఒప్పుకోరు. మీకు బాగా నచ్చిన అమ్మాయిని మీ అబ్బాయి ఒప్పుకోకపోవచ్చు. అప్పుడు మీ అబ్బాయి గురించి మీరు చెప్పినది అంతా పూర్తిగా అసత్యం అని తేలిపోతుంది. ఆడపిల్లలంటే పుచ్చు వంకాయలు కాదు ఏరిపారవేయడానికని తెలుసుకోండి. పెళ్లిచూపులంటే పెళ్లి కుమారుడు ఉండాల్సిందేనన్న సూత్రం మర్చిపోకుండా పాటించండి. మీ అబ్బాయి సౌలభ్యం కోసమో లేక మాకు సమయం లేదనో అని పిల్ల తరుపున వాళ్లని ఇబ్బంది పెడదామనుకుంటే ఈ రోజుల్లో చెల్లదు. రోజుకు ముగ్గురు చొప్పున చూసినా నాలుగు రోజుల్లో డజనుమంది అవుతారు. డజనుమందిని చూడడం ఎక్కువే అయినా ఒక్క కోడలు తెచ్చుకోవడానికి అది చాలు. ఆశకు అంతులేదు. ఏదైనా ఒక పిల్ల నచ్చగానే ఇంక చూడటం ఆపకపోతే అంతు లేకుండా ఆశగా చూస్తూనే ఉంటే మీ అబ్బాయి శలవు లేదని వెళ్ళిపోతాడు. తమ వివాహం సమయంలో కాకపోవడానికి కారణం యాభైశాతం పైగా తల్లిదండ్రులేనని చాలామంది వధూవరులు మరీ మరీ చెప్తున్నారు. కాలం మారింది. తరంమారింది. మనం కూడా మారాలని గ్రహిద్దాం.

14. ఒక కన్యకు వివాహమై మరొకరి ఇంటికి కోడలుగా వెళ్లినప్పుడు ఆమె సెల్‌ఫోన్ ఎలా ఉపయోగించాలో కూడా నేర్చుకోవాలి. ఇంట్లో అందరూ ఉన్నప్పుడు ఆ కోడలుకు తల్లి దగ్గర నుంచి గాని తండ్రి దగ్గర నుంచి గాని ఫోను వస్తే అక్కడి నుండి లేచి దూరంగా వెళ్ళి మాట్లాడకూడదు. అందరి సమక్షంలో మాట్లాడితే ఏ శంకా రాదు. పైగా "మా అత్తగారు ఇక్కడే ఉన్నారు. నువ్వు ఆవిడతో మాట్లాడు" అని అత్తగారికి సెల్‌ఫోన్ ఇస్తే అత్తగారికి సంతోషంగా ఉంటుంది. తనను గౌరవించినట్లు ఆమెకు భావన కలుగుతుంది. అంతేగాని ఫోను రాగానే ప్రతిసారి దూరంగా వెళ్లి తల్లిదండ్రులతో లేక మరెవ్వరితోనైనా రహస్యంగా మాట్లాడటం చాలామంది అత్తగారింటి వాళ్ళకు ఇష్టం ఉండదు. ఇది చాలా అనుభవం మీద వ్రాస్తున్న విషయం. సామాన్య విషయాలు కూడా కోడలు రహస్యంగా మాట్లాడటం వల్ల ఇతరులకు లేనిపోని అనుమానాలకు తావిచ్చినట్లు అవుతుంది. మామూలు సంభాషణ చేయడానికి కూడా రహస్యంగా మాట్లాడాలని అనుకోవటం మూర్ఖత్వం. దానివల్ల అభిప్రాయ భేదాలు రావడానికి ఆస్కారం ఉంది. 24 గంటలూ పుట్టింటివాళ్ళతో మాట్లాడడానికి ఏం రహస్యాలు ఉంటాయి. ఇక్కడ జరిగేవి అన్నీ క్రికెట్ కామెంటరీ లాగా పుట్టింటికి చేరవేయ వలసిన అవసరం ఏమిటి అని అత్తింటివాళ్ళు బాధపడవచ్చు. సెల్‌ఫోన్ వల్ల హాని జరగకుండా చూసుకోండి. ఈ విషయం అమ్మాయిల తల్లిదండ్రులు గట్టిగా చెప్పడమే కాక తన కుమార్తె పుట్టింటికి ఫోన్ అనవసరంగా చేస్తున్నా వద్దని మందలించాలి. ఇది చాలా అవసరం.

15. మేము మా అమ్మాయికి రెండు లేక మూడు సంవత్సరాల కంటే వయసున్న అబ్బాయిలను చూడటం లేదు. రెండు సంవత్సరాల తేడా ఉన్న అబ్బాయిల సంబంధాలే

చూస్తున్నాము. లేకపోతే "మా అమ్మాయి ఒప్పుకోదండీ" అంటూండడము మనం వినడం సర్వసాధారణమైపోయింది. "మా అమ్మాయి ఒప్పుకోదు" అని చెప్పటం చాలా తప్పు. ఎందుకంటే తన వివాహ విషయంలో తన యొక్క నిర్ణయమే గాని, తల్లిదండ్రులు తాను కోరిన విద్య, రంగు, ఎత్తు, ఉద్యోగం, సంపాదన, వయస్సు ఉన్నవాడిని వెతికి తీసుకురావాలే గానీ తల్లిదండ్రులు మెచ్చి తెచ్చిన సంబంధం తాను చేసుకోనని చెప్పకనే చెప్తోంది. అంటే వాళ్ల అమ్మాయికి తన నిర్ణయమే గాని పెద్దల మాటలకు విలువ ఇవ్వనంత మూర్ఖత్వం, అహం ఉందని తెలిసిపోతుంది. అంటే తల్లిదండ్రులు ఒక మంచి సంబంధం తెచ్చి వారి అమ్మాయినిచ్చి వివాహం చేయడంకాదు. వాళ్ల అమ్మాయి చెప్పిన అర్హతలు మాత్రమే ఉన్న వరుడు కోసం ఆ తల్లిదండ్రులు దేశం అంతా గాలించాలని అర్థం. అలా కుదరని పక్షంలో ఆ అమ్మాయి 30 ఏళ్ళు వచ్చినా కన్యగానే ఉండిపోవడానికి సిద్ధపడుతోంది. ఇది చాలా బాధాకరం. తల్లిదండ్రులు ఏమీ చేయలేక "ఈ రోజుల్లో పిల్లలు మన మాట వినరండీ" అని చిన్నబుచ్చుకుంటూ చెప్తారు.

ఇక వయసు విషయానికి వస్తే వధూవరులకు వయోభేదం కనీసం 4 లేక 5 సంవత్స రాలైనా ఉండాలి. లేకపోతే వారికి దాంపత్య సాఫల్యం వల్ల 4 సంవత్సరాల తర్వాత ఇద్దరు పిల్లలు ఉండవచ్చు. లేక ఒక గర్భస్రావం లాంటిది కావచ్చు. లేక కుటుంబనియంత్రణ పాటించడం వల్ల స్త్రీలలో శారీరకంగా మార్పు తథ్యం. నాలుగుసంవత్సరాల తర్వాత కూడా పురుషునిలో శారీరకంగా మార్పు రాదు. అతను అలాగే ఉంటాడు. రెండు కాన్పులు, లేక పైన చెప్పిన వాటివల్ల స్త్రీలలో సహజంగానే శారీరకంగా మార్పు వస్తుంది. ముఖంలో లేతదనం తగ్గి ముదురు ముఖమౌతుంది. స్తన్యం ఇవ్వడం వల్ల వక్షసౌందర్యం సడలిపోతుంది. పొట్టమీద అనేక మచ్చలు గర్భం ధరించడం వల్ల ఏర్పడతాయి. దీనికి తోడు కొంతమంది లావెక్కుతారు. ఒక్కొక్కప్పుడు బొత్తిగా శ్రమ చెయ్యని స్త్రీలకు ఊబకాయం వస్తుంది. వివాహం జరిగిన మూడు లేక నాలుగు సంవత్సరాలకే తన భార్య తనకు అక్కలాగానో, లేక తన ఒదినగారిలాగానో అయితే ఆ అబ్బాయికి ఇష్టం ఉండదు. ఎందుకంటే తన భార్య, తన తల్లి ఒకే శరీరాకృతి కలిగి ఉండటం వల్ల అతను ఖిన్నుడవుతాడు. భార్య మీద ఉత్సాహం తగ్గుతుంది. కలిసి బయటకు వెళ్ళడానికి సంకోచిస్తాడు. వీలైనంత వరకు తను ఒక్కడే వెడతాడు. తనను వినోద విహారాలకు, పెళ్ళిళ్ళకు, సంబరాలకు కూడా తన భర్త తీసుకువెళ్ళడం లేదని గ్రహించి మొదట బాధపడుతుంది. తర్వాత ఆ బాధ కోపంగా మారి అతనితో కలహిస్తుంది. ఒక్కొక్కప్పుడు ఆ కలహాలు విపరీత దుష్ఫలితాలకు కూడా దారితీసి ఇద్దరూ విడిపోవడం కూడా కొన్నిచోట్ల జరిగింది. కాబట్టి విజ్ఞులైన తల్లిదండ్రులు తమ కుమార్తెల నియంతృత్వ నిర్ణయాలన్నింటికి కళ్ళెం వేసి నిజానిజాలు, జీవనస్రవంతిలోని మాధుర్యాన్ని విప్పి చెప్పాలే గాని వారికి భయపడితే నష్టపోయేది తమ పిల్లలే అని వారు గ్రహించాలి. వరహీనం వివాహం ముందే కాదు వివాహానంతరం కూడా ఉండకూడదు. అందువల్లే

మన పెద్దలు కనీస వయోపరిమితి 5 సంవత్సరాలుగా నిర్ణయించారు. ఒకవేళ అమ్మాయి వాళ్లు ఒప్పుకోనంటే పిల్లవాడి తల్లిదండ్రులు లొంగిపోనక్కరలేదు. వేరే సంబంధం చూసుకోండి. అంతేకాని తెలిసి తెలిసి భవిష్యత్తులో మీ అబ్బాయికి దాంపత్యంలో ఇబ్బందిపడే పరిస్థితి తేవద్దు. ఎందుకంటే అర్థం లేని వయోభేద నిర్ణయం చేసి తానది మార్చుకోనని భీష్మించుకునే మొండితత్వం గల కన్యను మీ ఇంటికి తెచ్చుకుంటే మీ దైనందిక జీవితం ఎలా ఉంటుందో మీరే ఊహించుకోవచ్చు. అదేకాకుండా కొంతమంది కన్యలు వరుడు నాకు అన్నయ్యలాగా ఉండకూడదు అంటూంటారు. ఒక గర్భం తర్వాత తాను పక్కయింటి లావు పిన్నిగారిలా కనపడదని గ్యారంటీ ఇవ్వగలదా? ఎందుకంటే కన్యలు అందరూ లావుగానే ఉంటున్నారు. ఇంకా లావు అవ్వచ్చు.

16. చాలామంది “అమ్మాయిలు తక్కువఉన్నారు” అంటూంటారు. అది నిజమే కావచ్చు. కాని ఒక ముఖ్యవిషయం మీరు గమనించవలసింది ఏమంటే ఏ మ్యారేజి బ్యూరోలలో అయినాసరే అమ్మాయిల అప్లికేషన్లు ఎక్కువ ఉంటాయి. ఎందుకంటే 22 లేక 23 సంవత్సరాల వయసు వచ్చిన ప్రతి అమ్మాయి ఫొటో జాతకం తల్లిదండ్రులు మ్యారేజి బ్యూరోలో తెచ్చిపెడతారు. కాని అదే తన కుమారుడైతే 22, 23కు వివాహం చేసే ఉద్దేశ్యమే ఉండదు. ఉదాహరణకు 22 సంవత్సరాల వయసు గల మీ కుమార్తె గురించి అన్ని చోట్ల రిజిష్టరు చేస్తారు. కాని మీ అబ్బాయి గురించి త్వరపడరు. పైగా“ఇంకా వాడికి 22 ఏళ్ళేగా, చిన్నవాడు” అంటారు. అంటే ప్రతి బ్యూరోలో 100 మంది అమ్మాయిలుంటే 50 లేక 45 మంది అబ్బాయిలే ఉంటారుఅని మర్చిపోకండి. అందువల్ల అమ్మాయిలు నిజంగా తక్కువగా ఉన్నా దాని ప్రభావం మీ అబ్బాయి వివాహం మీద పడదని మీరు గ్రహించండి. అనవసర భయాలకు లోనయి ఇతరులకుకూడా భయం కలిగించకండి. ఈ సత్యం తెలియక కొంతమంది వధువు తల్లిదండ్రులు అహంకారం, గర్వంగా మాట్లాడటం, వరుని తల్లిదండ్రులతో టెలి ఫోనులో వారిని కించపరుస్తూ మాట్లాడటం చేస్తున్నారు. అలా చేయడం వల్ల మీ కుసంస్కార ప్రదర్శన మీరే చేసుకుంటున్నారు మరువకండి.

17. వధూవరుల చదువు విషయానికి వస్తే బి.ఇ. /బి.టెక్. పాసైన అమ్మాయి ఎం.సి.ఏ. అబ్బాయిని వద్దు అంటుంది. కారణం తాను ఎంసెట్ రాసానని కాబట్టి తాను తెలివిగలదానిని అని తనకు తాను ఊహించుకొని, ఇంజనీరు అంటే B.E., B.tech. చదవని ఆ అబ్బాయి ఎం.సి.ఏ.కాబట్టి ఇంజనీరు కాదనుకుంటుంది. ఇది చాలా తప్పు. ఎందుకంటే ప్రతి అమ్మాయికి 37 పర్సంటేజ్ కోటాలో సీటు సంపాదించినవాళ్ళే. లక్షకు పైగా ర్యాంకు వచ్చినా బి.ఇ. సీటు ఇస్తున్నారు. పిలిచి సీటు ఇచ్చినా ఇంకా సీట్లు మిగిలిపోతున్నాయి. ఇంజనీరింగు కళాశాలలు ఎన్ని ఉన్నాయో దాంట్లో సగం కూడా ఎం.సి.ఏ కళాశాలలు లేవు. బి.ఇ.లో సీటు వచ్చినంత మాత్రాన తాను గొప్ప అనుకోవటం మూర్ఖత్వం కాక మరేమీ కాదు. ఇంజనీరింగ్‌లో 4 సంవత్సరాలు చదువు ఉన్నా మొదటి సంవత్సర చదువు ఇంజనీరింగ్ అంశాలతో

సంబంధం ఉండదు. అంటే మిగిలిన ఇంజనీరింగ్ చదువు మూడేళ్ళు మాత్రమే. అది కూడా ఇంటర్మీడియట్ పూర్తిచేసి డిగ్రీలో రిజర్వేషన్ కోటాలో చేరింది. తండ్రి డబ్బు కలవాడైతే ఏదో ఒక కాలేజీలో సీటు కొని ఇస్తాడు. నిజంగా పస ఉన్న పిల్ల గవర్నమెంట్ కోటాలో 30 వేలు కట్టి యూనివర్శిటీ క్యాంపస్‌లో చదువుతుంది. అవునా కాదా అని మీరే ఆలోచించండి. ఇక ఎం.సి.ఏ. అబ్బాయి ఇంటర్మీడియట్ తరువాత బి.ఎస్.సి. మూడేళ్ళు, ఆ తరువాత ఎం.సి.ఏ మూడేళ్ళు చదువుతాడు అంటే మొత్తం మీద ఆరు సంవత్సరాలు చదువుతాడు. అంటే ఎం.బి.బి.ఎస్. కంటే కూడా ఒక సంవత్సర కాలం ఎక్కువ చదువుతున్నాడు. కంప్యూటర్ మీద అతనికున్న పట్టు బి.ఇ. చదివిన అమ్మాయికి ఉండదు. ఎందుకంటే ఆమె చదివే మూడేళ్ళలో హార్డ్‌వేర్ మరియు సాఫ్ట్‌వేర్ రెండూ కలిపి చదువుతుంది. అందువల్ల ఆమెకు కంప్యూటర్ మీద పూర్తి ప్రతిభ ఉండదు. బి.ఇ. చదివిన ఏ అమ్మాయి ప్రోగ్రాములు అసలు వ్రాయలేదు. అదే ఎం.సి.ఏ చదివిన ఏ అబ్బాయి అయినా చాలా కష్టతరమైన పెద్ద పెద్ద ప్రోగ్రాములు వ్రాయడమే కాక, వాటిని పూర్తిగా అర్థం చేసుకుని సరియగు వ్యాఖ్యలు చేసి అందరికీ అర్థమయ్యే రీతిలో చెప్పగలడనేది వాస్తవం. ఇంకొక విషయం ఏమంటే బి.ఇ. అనేది ఒక డిగ్రీ మాత్రమే. ఈ డిగ్రీ చదవడానికి తెలివి కన్నా డబ్బున్న తండ్రి సీటు కొనిస్తే చాలు. అంటే ఇంటర్మీడియట్ తరువాత ఏ డిగ్రీచదివినా,ఏ అంశంతో చదివినా అది డిగ్రీయే కాని పోస్టుగ్రాడ్యుయేట్ కానేకాదు. అలా కాకుంటే, బి.ఎస్సీ. చదివిన అమ్మాయి తాను ఎమ్.ఎస్.సి. కంటే గొప్ప అంటే ఎవరైనా ఒప్పుకుంటారా? లేక బి.కాం. చదివిన అమ్మాయి ఎం.కాం. కంటే గొప్ప అంటే విన్నవాళ్ళు నవ్వుకోరా? ప్రపంచం అన్ని దేశాల్లో ఎం.సి.ఏ పోస్టుగ్రాడ్యుయేట్ డిగ్రీగా అన్ని యూనివర్శిటీలు ఒప్పుకుంటుంటే భారతదేశంలో ఒక రాష్ట్రంలో ఒక ఊరు పిల్లలు తాము ఎం.సి.ఏ కంటే గొప్ప అనుకున్నా, అలా అనుకుని సంతోషపడడమే కాని ఆ సంతోషానికి అర్థం లేదు. ఒకవేళ తానుకూడా పోస్టుగ్రాడ్యుయేట్ అనిపించుకోవాలంటే ఆమె తప్పక ఎమ్.ఏ.గాని, ఎమ్.కాం.గాని,ఎం.బి.ఏ.గాని లేకఎం.ఎస్.సి. గాని, ఎం.సి.ఏగాని చదివి తీరాల్సిందే. అలా చదవడానికి ఇష్టపడితే తాను చదివిన బి.ఇ. ఎం.సి.ఏ. కంటే తక్కువ అయినట్లుగా ఒప్పుకున్నట్లే కదా? ఒకవేళ ఆ అమ్మాయి అమెరికాలోఎం.ఎస్. చేసినా ఎం.సి.ఏ. చేసిన అబ్బాయితో సమానమే కాని, ఎంతమాత్రం గొప్పకాదు!ఎందుకంటే ఒకరు అమెరికాలో చదివారు, మరొకరు ఇండియాలో చదివారు. అంతే తేడా గాని మరేమీకాదు. ఈ రెండూ పి.జి డిగ్రీలే! పైగా ఎం.సి.ఏ. అనే బదులు దాని పేరు ఎం.సి.ఇ. (మాస్టర్ ఇన్ కంప్యూటర్ ఇంజనీరింగ్) అంటే ప్రతీ అమ్మాయి తృప్తిపడేదే. అవునోకాదో మీ అమ్మాయినే మీరు అడిగి చూడండి. కాబట్టి అన్నీ బాగున్నప్పుడు బి.ఇ. అమ్మాయి ఎం.సి.ఏ. అబ్బాయిని చేసుకోవటం చిన్నతనం ఏమీ కాదు. అందువల్ల మంచి సంబంధం వచ్చి అన్ని అంశాలు కుదిరినప్పుడు కూడా ఆ సంబంధం వదులుకోవడానికి మీ అమ్మాయి సిద్ధపడితే మీ అమ్మాయి ఎంత తెలివిగలదో మీరే ఊహించుకోండి! ఒకవేళ మీరు మీ అమ్మాయి తెలివి గురించి చెప్పినా దానికి విలువ ఉండదని గ్రహించండి.

అదే కాకుండా సంతోషమైన దాంపత్య జీవితానికి డిగ్రీలు సరిహద్దులు కావు అని మీ అమ్మాయికి తెలియ చెప్పండి!!

18. నా దగ్గఱకు వధూవరుల జాతకాల పొంతన పరిశీలించడానికై ప్రతిరోజు ఎంతో మంది వస్తూ ఉంటారు. వారిలో కొంతమంది వధూవరుల యిద్దరిది ఒకే గోత్రమైతే ఆ వధువును దగ్గఱ బంధువులచేతగాని, లేక తమ గోత్రం కాక మరో గోత్రం ఉన్నవారి చేత కన్యాదానం చేయిస్తే తప్పు కాదని ఫలానా వారు సలహా యిచ్చారని "యిది నిజమా? అలా చేయవచ్చా?" అని అడుగుతూ ఉంటారు. మనం మౌలికంగా ఏ గోత్రంలో జన్మించామో ఆ గోత్ర బంధం మరియు భావన ఎప్పటికి శాశ్వతం, మరియు హరించవు. వివాహం నచ్చిన వరునితోనే చేయాలనే తలంపుతో ఇతరులచేత కన్యాదానం చేయించినా అది శాస్త్ర సమ్మతం కాదు. ఎందుకంటే కన్యాదానం చేయడమనేది ఒక పుణ్యక్రతువు ఆ కన్యాదాన ఫలం తల్లిదండ్రులు పొందాలి. ఒకవేళ మరోవ్యక్తి కన్యాదానం చేసినా ఆ కన్యాదాతలు ఎన్నటికి కన్యాదానం చేసినంత మాత్రాన ఆ వధువుకు తల్లిదండ్రులు కారు. ఒక కన్యను మరొకరికి దత్తత యిచ్చి వారిచేత కన్యదానం చేయించడం అనేది శాస్త్రజ్ఞాన విహీనులు యిచ్చే సలహాను ఎన్నడూ పాటించకండి. ఎందుకంటే కన్యను దత్తత యిచ్చే ప్రవృత్తిగాని, ఆ ప్రసక్తిగాని ఏ శాస్త్రంలోనూ చెప్పబడలేదు. అలాంటి మంత్రనిబద్ధత కూడా లేదు. కాని మన హైందవ సంప్రదాయ ప్రకారం పుత్ర సంతతి లేనివారు పున్నామ నరకం నుంచి విముక్తి పొందడానికి సగోత్రీకులైన తొమ్మిది సంవత్సరములు నిండని బాలుని దత్తత స్వీకారం చేసుకొని ఆ బాలునికి ఉపనయనం, బ్రహ్మోపదేశం,మహాగాయత్రీ మంత్రపూజ, మొదలగు సంస్కారములు శాస్త్రరీత్యా మరియు మతపరమైన మిగిలిన కార్యక్రమాలు జరిపించి ఆ బాలునికి తాను తండ్రి అవుతాడు. ఆ బాలుని వల్ల వంశవృద్ధి అవటమే కాక ఆ బాలుడు చేసే దహనకర్మ కాండ, పిండప్రదానం, మరియు ఆబ్ధీకములు యొక్క పుణ్యఫలం పొంది తరిస్తాడు. అందువల్ల సగోత్రీకుడైన ఒక బాలుని దత్తత స్వీకారం చేసుకొనుట శాస్త్ర సమ్మతం. అంతేకాని, కన్యా దత్తత అనేదిఎక్కడా లేదు. కాబట్టి పరగోత్రీకులైన వేరే వారి చేత సగోత్ర వివాహం చేయించడం మిక్కిలి నీచం మరియు హేయం. ఎందుకంటే పరులుదానం చేసినంత మాత్రాన కన్యయొక్క గోత్రం మారదు. కాబట్టి యీ సత్యం మనం అందరం గ్రహించాలి. నేను మీకు ఈ విషయాన్ని తేలికగా అర్థం కావడానికి ఒక ఉదాహరణ ఇస్తాను.

ఒకాయనకు ప్రథమ సంతానం పుత్రసంతానం ఉంది. ఆయనకు మళ్ళీ మూడు నాలుగు సంవత్సరాల తరువాత ఒక ఆడపిల్ల కలిగిందని అనుకొందాం. ఇప్పుడు యీ ఆడపిల్లను వేరేవారిచేత ఆ అమ్మాయి అన్నగారికి కన్యాదానం చేయించి వివాహం చేస్తే అది ఎంతవరకు సమంజసమోలేక ఎంత సాంప్రదాయమో మీరే నిర్ణయించుకోండి. ఇలా చేయడం సమర్ధనీయం అనుకుంటే వరుస వావి లేకుండా వివాహాలు జరిపించవచ్చు. అందుకనే మన హైందవ సాంప్రదాయాన్ని మతాచారాన్ని గౌరవించి పాటించాలేగాని, తాత్కాలిక

సౌలభ్యం కోసం మిడిమిడి జ్ఞానంతో గాని లేక అడిగినవారిని సంతృప్తిపరిచే ఉద్దేశ్యంతోగాని యిలాంటి దౌర్భాగ్యపు సలహాలు ఎవరిచ్చినా పాటించకండి. శాస్త్ర నిబంధన అనేది లక్ష్మణరేఖ లాంటిది. దానిని మనం ఎప్పుడు దాటకూడదు పసలేని వక్ర సంభాషణ చేసి సామాన్యులకు అజ్ఞానం బోధించకూడదు. వధూవరుల ఇద్దరి గోత్రాలలో ఒక్క ఋషి కూడా కలవ కూడదని తెలుసుకోండి. 26వ అధ్యాయంలో గోత్రాల వివరాలు చూడండి.

19. ఈరోజుల్లో ప్రతివారు తాము తెలివైనవారమని అనుకొని లేదా లౌక్యం ఎక్కువ పాటిస్తామని అనే ఉద్దేశ్యంతో ఉంటారు. అలా వుండటం తప్పుఒప్పుల నిర్ణయం మీ విజ్ఞతకే వదిలివేస్తున్నాను. కాని లౌక్యం అనే పేరుతో అసత్యం చెప్పడమనేది సమర్ధనీయం కాదు. ఎవరైనా ఏ కారణం చేతనైనా తమకు వచ్చిన సంబంధం నచ్చకపోతే లేక వధువుగాని లేక వరుడుగాని ఇష్టపడకపోవడంవల్ల వదిలి వేయదలుచుకుంటే జాతకాలు కుదరలేదని అబద్ధం చెప్తారు. చాలా లౌక్యంగా చెప్పామని సంతోషిస్తారు.

కాని ఇది ఎంత దోషమో అని ఎవరు కూడా, కనీస ఆలోచన చేయడము లేదు. ఒక వధువు మరియు వరుడు యొక్క జాతకాల్లోని నక్షత్రములను మరియు జాతకాలలోని గ్రహాల బలాబలాలను మరియు ఆ గ్రహాల వీక్షణ, సంయోగ, ఉచ్ఛ, నీచాలను పరిశీలించి జ్యోతిష శాస్త్ర పండితుడు వధూవరుల జాతక పొంతన చాలా బాగుందని చెప్పిన తరువాత కూడా జాతకాలు కుదరలేదని మా జ్యోతిష్యుడు చెప్పాడని శాస్త్ర పండితుడిని అసత్యవంతునిగా చిత్రీకరించడం, పొంతన కుదిరిన గ్రహాలను కుదరలేదని నింద వేయడం వల్ల గ్రహాలను అవమానించడం, దూషించడం పలుమార్లు చేస్తే ఆ తరువాత వారికి నచ్చిన సంబంధం చేసినా ఆ నవదంపతుల జీవితంలో సుఖసంతోషాలు లోపించడమే లేక ఒక్కొక్కప్పుడు గ్రహక్రోధం వల్ల ఆ దాంపత్యంలో పుత్ర సంతానం లేకపోవడమో లేక దాంపత్య విచ్ఛిన్నమో కూడా కావచ్చు. ఎందుకంటే జాతకం కుదిరిన తరువాత కుజదోషం ఉందని గ్రహాల మీద నింద వేస్తే ఆ పాప ఫలిత ప్రభావం ఆ నవదంపతుల మీద పడుతుందని మనం మరచి పోరాదు. ఎందుకంటే మహోన్నతమైన మరియు అత్యంత శక్తి కలిగిన పుణ్య గ్రహాలైనటువంటి గురు, శుక్ర, బుధ గ్రహాలపైన దేవుళ్ల మీద అబద్ధం చెప్పడం హైందవ సాంప్రదాయానికి విరుద్ధం మరియు హేయం. కాబట్టి ఇలాంటి హీనమైన పనులు చేయకండి. దాని బదులు, మా అమ్మాయి లేక మా అబ్బాయి ఎక్కువ ఉత్సాహం చూపించటం లేదని చెప్పడం తప్పు కాదు. వరునికి వధువు నచ్చకపోతే చెప్తున్నాడు కదా అలాగే వధువు కూడా చెప్పడం దోషం కాదు. మంచి సంప్రదాయ కుటుంబీకులు అయితే, మీరు చెప్పిన దానికి హర్షిస్తారు. అవమానంగా భావించరు. ఇది మాత్రం సత్యం. కాబట్టి సంకుచిత సంస్కారంతో అసత్యాలు పలికి అది లౌక్యం అనుకొని భావి దంపతుల జీవితాలతో ఆటలాడుకోకండి.

20. కొంతమంది నా దగ్గఱకు వచ్చిన వారి అబ్బాయిది కాని లేక అమ్మాయిది కాని జాతకాలు పరిశీలించమన్నప్పుడు నేను మీకు క్రిందటిసారి వచ్చినప్పుడు మీరు చూపించిన

జాతకాలు కుదిరేయని మరియు అన్నివిధాల బాగుందని చెప్పాను కదా అని అడిగితే వారు ఆ సంబంధములు కుదరలేదని చెపితే ఎందుకని నేను వాళ్లని అడిగినప్పుడు వాళ్లు చెప్పే సమాధానాలు నాకు నమ్మశక్యం కాకుండా ఉన్నా, నమ్మవలసి వస్తోంది. ఎందుకంటే ప్రతివారు యీ అంశాలనే పదే పదే చెప్పడం వల్ల ఆ కారణాలు కఠోర సత్యాలుగా గ్రహించాను. అవి ఏమంటే.

సంబంధం కోసం ఫోన్లు చేయడం, అన్ని వివరాలు అడిగి తెలుసుకోవడం, ఆ తరువాత మళ్లీ ఫోను చేస్తామని చెప్పడం. కాని వారు చెప్పిన ప్రకారం మళ్ళీ ఫోను చేయకపోవడం. ఎవరికీ అర్థం కాని విషయం ఏమంటే మళ్లీ ఫోను చేస్తామని అబద్ధం ఎందుకు చెప్తున్నారు? నచ్చని పక్షంలో ఏ విషయంలో నచ్చలేదో ఆ విషయాన్ని సున్నితంగా మొదలే చెపితే వారి మీద ఒక విలువ గౌరవం ఉంటుంది. కాని నిర్లక్ష్యంగా ఎదుటివారిని కించపరుస్తున్నట్లుగా మౌనం పాటించడం మంచి సాంప్రదాయపు లక్షణం కాదు. మళ్లీ ఫోను చెయ్యడం అనేది వారిచ్చిన వాగ్దానమే కాబట్టి, తమ వాగ్దానాన్ని వారే పాటించనపుడు ఆ కుటుంబంలోని వ్యక్తులు ఎంత మర్యాదహీనులో అని అందరికి అర్థమవుతుంది. ఇలాంటి పొరపాటు మీరు ఎన్నడూ చేయకండి. మీకు ఆ సంబంధం నచ్చినా నచ్చక పోయినా, మీ భావప్రకటనను లేక మీ జవాబును మీ వాగ్దాన ప్రకారం మళ్లీ ఫోను చేసి తెలియచేయడం మీ విధి మరియు మర్యాద లక్షణం. ప్రతివారు రోజుకి ఎన్నో ఫోన్లు చేస్తూ ఉంటారు. కాని వివాహ సంబంధం లాంటి ముఖ్య విషయంలో ఒక ఫోను చేయడానికి నిర్లక్ష్యం చేస్తే, ఇలాంటి కనీస మర్యాద పాటించని అహంకారంతోను మరియు గర్వంతో ఉన్నవాళ్ల సంబంధం తప్పిపోయినందుకు అవతలవారు సంతోషిస్తారు. కాని బాధపడరని మనం గ్రహించాలి. ఎందుకంటే  కొందరు నచ్చలేదని చెప్తే అవతలివారు బాధ పడతారని, అందుకనే ఫోను చెయ్యలేదని ఎంతోమంది నాకు చెప్పారు. ఇలా చెప్పడం వల్ల వారు తాము సున్నిత మనస్కులని ఆదర్శంతులని నటిస్తున్నారని నాకు ప్రతిసారి అర్థమవుతూనే వుంటుంది. ఎందుకంటే నిజంగా అంత సున్నిత మనస్కులైతే లేక ఆదర్శవంతులైతే ఫోను చేస్తామని వాగ్దానం చేసి ఆ వాగ్దానాన్ని తామే భంగపరిస్తే అవతల బాధపడతారని తెలియనంత అమాయకులు, సున్నితమనస్కులు  ఈ రోజుల్లో ఎవరూ లేరు. ఎందుకంటే, వారి యొక్క నిర్లక్ష్యధోరణి అహంకార, గర్వాలను దాచుకునేందుకు ఆదర్శమనే దుప్పటిని కప్పు కొంటు న్నారని ఎవరికైనా తెలిసిపోతుంది. కాబట్టి మీరు ఎప్పుడు శుష్కవాగ్దానాలు చేసి మీ వ్యక్తిత్వ విలువలను సామాజికంగా వేలంపాట పాడకండి. ఎందుకంటే మీ సంప్రదాయాన్ని గౌరవించి మీ సంబంధం కోసం ఫోను చేసిన అవతలివారు మీ జవాబు కోసం ఎదురుచూస్తారని గ్రహించండి వారిని మీరు సందిగ్ధంలో పెట్టి వారి అయోమయపరిస్థితికి కారణభూతులు కాకండి. కనీసం వారు వేరే సంబంధం చూసుకోవడానికి మీరుఅడ్డుగోడ కాకూడదు ఎందుకంటే మీ ఫోను కోసం వారు ఎదురుచూస్తూ ఉండచ్చు. ఈ విషయం మీరు గ్రహించండి.

21. కొంతమంది అన్ని విషయాలు పూర్తిగాఅడిగి తెలుసుకొని ఆ వివరాలన్నీ పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాత, వారే ఇష్టపడి జాతకాలు పరిశీలన చేయడానికి పూర్తి వివరాలు అవతలవారికి ఇచ్చి వారి వివరాలు అన్నీ అడిగి తీసుకొన్నవారు మంచి జ్యోతిష పండితులకు చూపించి జాతకం కుదిరిందని సంతోషంతో మీకు చెప్పినప్పుడు మీరు అప్పుడు ఆ సంబంధంలోని లోపాలు చెప్పి అవతలివారిని మనస్తాపానికి గురి చేయడమే కాకుండా ఆ సంబంధాన్ని తిరస్కరించడం అందరికి పరిపాటి అయిపోయింది. ఎందుకంటే అన్ని విషయాలు పూర్తిగా గ్రహించి క్షుణ్ణంగా అన్ని వివరాలు తెలుసుకొన్న తరువాతే జాతకాన్ని పరిశీలించడం కోసం జన్మ తేది, జన్మ సమయం, జన్మస్థలం యివ్వడం జరుగుతుంది. కాబట్టి జాతకం కుదిరిందని చెప్పినప్పుడు అర్థరహితమైన కుంటిసాకులు చెప్పడం ఎప్పుడూ సమర్థనీయం కాదు. ఉదాహరణకు “మేము విదేశ సంబంధం చూస్తున్నామనో ఇతర శాఖలవారిని మా పెద్దవారు ఒప్పుకోరనో లేక మాకు మా ఊరిసంబంధం కావలని చెపుతూ ఉంటారు. ఇలా చెప్పడం అర్థరహితం ఎందుకంటే అన్ని వివరాలు ముందే తెలుసుకొని ఆ తరువాత ఇలా కుంటిసాకులు చెప్పడం ఎన్నటికి సమర్థనీయం కాదు. ఈ మధ్య నా దగ్గరకు ఒకాయన తన కుమారుని వివాహ నిమిత్తం పలుసార్లు వచ్చాడు. మంచి సంబంధం చెప్పినా కూడా ఆ పిల్లకు తల్లి లేదనో, తండ్రి లేడనో లేక ఆ కన్యకు సోదరుడు లేడనో చాలా సంబంధాలు వదిలివేసాడు. విచిత్రం ఏమిటంటే ఆయనకు వయసు పెద్దదని హృద్రోగంతో బాధపడుతున్నాడని తెలిసి కూడ చక్కటి సంబంధాలు తన మొండి వైఖరి వల్ల వదులుకొన్నాడు. విధి బలీయమైనది విధి వ్రాతను ఎవరు చెరపలేరు సరికదా తిరిగి వ్రాయలేరు. ఈ సంగతి అందరికి తెలుసు. అయినా కూడా ఆ పెద్దమనిషి నేను చెప్పిన భాషలోని భావనలను గాని హెచ్చరిక మరియు నా సంభాషణంలోని గూడార్థమును గాని గ్రహించలేదు. తండ్రిగాని తల్లిగాని లేకపోతే ఆ సంబంధాన్ని వదలివేసేవాడు. పాపం ఆయన హఠాత్తుగా ఒకరోజు మరణించాడు. ఇప్పుడు ఆయన కుమారుడికి ఎవరైన తండ్రి లేనివాడని కించపరుస్తూ ఆ సంబంధాన్ని వదిలివేస్తే ఆయన కుమారునకు వివాహం అవుతుందా? ఆ నిర్ణయాన్ని ఎంతమంది హర్షిస్తారు? వివాహానికి మరణానికి ఎప్పుడు సారూప్యం ఉండదు. ఎందుకంటే వారి నిబంధనలు ఒక్కొక్కప్పుడు వారికే వర్తింపజేస్తే ఏదైనా జరగరానిదే జరిగితే తమ పిల్లలను వివాహ భవిష్యత్తు ఏమవుతుందో అని అందరు ఆలోచించాలి. అందుకనే ఇలాంటి దౌర్భాగ్యపు ఆలోచనలకు స్వస్తి పలకండి ఎందుకంటే స్వార్థానికి ఒక హద్దు ఉంది. అది మనం గ్రహించాలి.

కాబట్టి ఇలాంటి స్వార్థపూరిత మరియు వివేక శూన్యమైన ఆలోచనలు దరికి రానీయకండి. అంతేకాక ఎవరు చెప్పినా ఇటువంటి పసలేని పనికిమాలిన ఉచిత సలహాలు విని అదే నిజమనుకొని భ్రమించితే ఒక్కొక్కప్పుడు మీరు కూడా విధివంచితులైతే ఈ తప్పుడు ఆలోచనలకి మీ సంతానం కూడ సమిధలవుతారేమోనని ఆలోచించండి. మనం మన

అవసరార్థం ఒక సంబంధం నిశ్చయంచేయడానికి ఎవరికైనా ఫోను చేసినప్పుడు మనం కొన్ని మర్యాదలు విధిగా పాటించాలి కాని, మనసంభాషణంలో అహం, అసహనం, దర్పం లేక డాంబికం ధ్వనించకూడదు. ఎందుకంటే ప్రస్తుత కాలంలో ఏ వధువు మరియు వరుడూ విద్యార్హతలు లేకుండా గాని, మంచి ఉద్యోగం లేకుండాగాని లేరు. అందరికి ఉన్నతమైన విద్యా ఉద్యోగ సంపాదనలు ఆస్తిపాస్తులు కూడా ఉంటున్నాయి. ఇలాంటప్పుడు వధూవరుల తల్లిదండ్రులు వివాహ విషయం గురించి ఫోను చేసినప్పుడు వారి మాటలలో ఆదరం, స్పష్టత మరియు సున్నితం కనపడాలి. విచారకరమైన విషయం ఏమంటే కనీస మర్యాదలు పాటించక అహం ప్రదర్శిస్తూ మాట్లాడే వారిది ఎన్నటికీ మంచి సంస్కారం కాదు. ఎవరైనా ఫోను చేసినప్పుడు ముందు వారిని పరిచయం చేసుకొంటూ వివరాలు చెప్పడం మర్యాదస్తుల లక్షణం అని మనం గ్రహించాలి. అలా కాకుండ ముందుగానే ఏమీ పరిచయాలు లేకుండా హఠాత్తుగా టి నెంబరు, రంగు, చదువు, సంపాదన వివరాలు కర్కశంగానో, దర్పంతోగాను అడగడం చేయకూడదు. సంభాషణలో సౌమ్యం, నమ్రత చూపించాలి. టి నెంబరు తీసుకున్న తర్వాత తమ టి నెంబరు తెలియదనడం లేక తర్వాత ఇస్తామనడం, లేక కావాలనే తప్పు చెప్పడం కూడా చేస్తున్నారు. ఇంత కంటే నీచం ఇంకొకటి ఉండదు. ఎందుకంటే ఇచ్చి పుచ్చుకుందామనే ప్రవృత్తి అందరికి ఉండాలి. కాని మోసబుద్ధితో వివాహం పరిచయాలు ప్రారంభించకూడదు. ఇది మర్చిపోకండి.

22. మనం ఒక సంబంధం గురించి ఎవరికైనా ఫోన్ చేయాల్సి వచ్చినప్పుడు మనం ఎలాంటి పరిస్థితులలో కూడా ఒకే రింగు ఇచ్చి వదిలివేయడం మళ్లీ వారి వద్ద నుండి ఫోన్ రాకపోతే మళ్ళీ రింగు ఇచ్చి వదిలివేయడం చేయకూడదు. ఇలా చేయడం వల్ల మీలో అర్థం లేని లేకితనం, మీరు చెప్పకనే చెపుతున్నారు అన్నమాట. ఎందుకంటే లక్షల రూపాయలు ఖర్చుచేసి వివాహం చేయగలిగిన మీరు ఒక ఫోనుకాల్‌ఖర్చుకు లోభించడం వల్ల మీ యొక్క సంకుచిత మనస్సుకు ఇది ఒక దర్పణం. కాబట్టి ఇలాంటి తక్కువ తరగతి పనులు చేయకండి. దీని బదులు మీరు ఫోను చేసి నేరుగా మాట్లాడటం ఎంతో మేలు అని మీరు గ్రహించాలి.

23. కొంతమంది వారి అమ్మాయి లేక అబ్బాయి టి.నెం. ఇవ్వడానికి ఇష్టపడరు. కానీ ఇతరుల టి.నెం. అడిగి తీసుకొని, ఆ ఎదుటివారు వీరి టి.నెం. అడిగినప్పుడు ఆ నెంబరు తెలియదని చెప్పడం లేక కావాలనే తప్పు నెంబరు ఇవ్వడంలాంటి హేయమైన పనులు చేస్తున్నారు. ఈ అలవాటు చాలా సంస్కారహీనమైన లక్షణం. ఎవరికి వారు మేము తెలివి ప్రదర్శిస్తున్నామని ఎన్నడూ అనుకోకూడదు. కాబట్టి ఇలాంటి దౌర్భాగ్యపు పనులు మానండి. మరొకరి వద్ద నుంచి వారి టి.నెంబరు తీసుకున్నప్పుడు మన టి.నెంబరు కూడా ఇవ్వాలనే జ్ఞానం మనకు ఉండాలి.

24. కొంతమందికి మేము మగపెళ్ళివారమని అహం ఎక్కువగా ఉంటుంది. ఈ రోజులలో ఈ మనస్తత్వం పనికిరాదు. ఎందుకంటే, ఒకరికి అల్లుడు కావాలి, మరొకరికి కోడలు కావాలి కాబట్టి ఇద్దరు సమానమే అనే అభిప్రాయం ఉండాలి. ఇలా కాకుండా,

కొంతమంది మగపెళ్ళివారు వారి బంధువుల చేత పెళ్ళి కుమార్తె తల్లిదండ్రులకు ఫోను చేయించి ఆ అమ్మాయి వివరాలు అన్నీ తెలుసుకోమంటారు. ఆడపిల్ల తల్లిదండ్రులు వరుని వివరాలు ఫోన్ చేసిన వ్యక్తిని అడిగినప్పుడు ఆ వ్యక్తి ఒకటో, రెండో వివరాలు చెప్పి మిగిలిన వివరాలు తనకు తెలియవని కాబట్టి అన్ని వివరాలు పెళ్ళికుమారుని తండ్రికి ఫోన్ చేసి మీరు అడగవచ్చని సలహా ఇస్తారు. ఇక్కడ మనం అర్థం చేసుకొనవలసిన విషయం ఏమంటే వరుని తల్లి తండ్రులు తమకు వధువు తల్లితండ్రులే ఫోన్ చేయాలని, అలా చేస్తే వారి గౌరవం తగ్గదని భావిస్తారు. ఈ భావనకు అర్థంలేదు. పైగా వారి అహంకారానికి ప్రతీక. ఒకసారి ఇలాగే ఒక వధువు ఇంటికి ఫోన్ చేసి తన మేనల్లుడు వివాహామునకు వున్నాడని, చెప్పి ఆ తరువాత వధువు యొక్క వివరాలు అన్నీ క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నాడు. వధువు తల్లిదండ్రులు ఆయనను వరుని యొక్క వివరములు అడిగినప్పుడు ఒకటో రెండో వివరములు చెప్పి మిగిలిన విషయములు మా బావగారితో మీరే నేరుగా ఈ నెంబరుకు ఫోన్ చేసి ఆయనతో మాట్లాడితే అన్ని వివరములు తెలుస్తాయని ఒక ఉచిత సలహా పారేశాడు. దీనికి వధువు యొక్క తండ్రికి మనస్తాపం కలిగి ఏ వివరములు తెలియనపుడు ఎందుకు ఫోన్ చేశావని, ఇంక ఎప్పుడూ ఇలాంటి పనికిరాని మధ్యవర్తిత్వం చేయవద్దని ఫోన్ చేసిన బంధువును గట్టిగా మందలించాడు. పాపం ఆ బంధువు ఏమి చెప్పలేక మౌనంగా ఉండి పోయాడు. కాబట్టి మీరు ఇటువంటి పసలేని మధ్యవర్తిత్వం చేయకండి. ఎందుకంటే మిమ్మల్ని ఫోన్ చేయమని ప్రోత్సహించిన వారు హాయిగానే వుంటారు మీరు మాత్రం ఒక్కొక్కప్పుడు అవమానమునకు గురికావలసి వస్తుందని మర్చిపోకండి.

25. చాలామంది వధూవరుల ఇద్దరి జాతకములు నాకు చూపించి కుదిరినది లేనిది చెప్పమని నన్ను అడిగినప్పుడు ఆ రెండు జాతకములు పరిశీలించి చాలా బాగా కుదిరిందని నేను చెప్పి వారిద్దరికి వివాహంచేయవచ్చని చెప్పినా ఆ సంబంధం వదిలి వేశామని మరొక జాతకం చూడమని చెప్పి నాకు ఇస్తారు. నేను ఆ సంబంధం ఎందుకు వదిలివేశారని అడిగితే వారు చెప్పిన కారణం నాకు విచిత్రమనిపించింది. ఎందుకంటే, వారు అన్నీ బాగున్నా తప్పక చేసుకుందామనుకున్నా, పెద్దకోడలు కంటే కాబోయే చిన్నకోడలు రెండు మూడు మాసములు వయసులో పెద్దదని కానీ, లేక చిన్న అల్లుడు వారి పెద్దల్లుడు కంటే కొన్నిరోజులో లేక కొన్ని వారములో పెద్దవాళ్ళని అందుకనే ఆ సంబంధం వదిలివేశామని చెప్పారు. ఇలా కుదిరిన సంబంధాన్ని వదిలివేయడం చాలా తప్పు. పైగా ఇది మూర్ఖపు వాదన. ఎందుకంటే, అల్లుళ్ళు లేక కోడళ్ళు కానీ, ఒకే ఇంటిలో ఉన్నప్పుడు వారి వయోభేదం వరుసక్రమంలో ఉండాలనీ, ఏ శాస్త్రంలోనూ చెప్పబడలేదు.

ఉదాహరణకు దశరథ మహారాజు నలుగురు కోడళ్ళు ఒకరి కంటే ఒకరు వరుస క్రమంలో చిన్నవారుగా లేరు. అదే కాకుండా మనం తెలుసుకోవలసినది ఏమిటంటే ఎప్పుడైనా ఎక్కడైనా స్థానానికి విలువ ఉంటుంది కానీ వయసుకు విలువ వుండదు. ఎలాగంటే కంచి కామకోటి పీఠాధిపతిని గాని లేక శృంగేరీ పీఠాధిపతినిగాని, మనం దర్శించినప్పుడు

పీఠాధిపతులకంటే వయసులో ఎంతో పెద్దవారైనా సరే పీఠాధిపతులకు పాదప్రణామం చేస్తారు. అంటే వారి పాదములకు శిరస్సు వంచి భక్తితోను, గౌరవంతోను నమస్కరిస్తాము. కానీ ఎవరు కూడా ఆ పీఠాధిపతి కంటే వయస్సులో మేము పెద్దవారమని వారిని నిర్లక్ష్యం ఎన్నటికి చేయరు. ఎందుకంటే వయస్సులో చిన్నవారయినా, పీఠాధిపతి స్థానంలో ఉన్న ఆ వ్యక్తికి ఆ విలువ ఆ స్థానాన్ని బట్టి వచ్చింది. అందువల్ల వయసులో చిన్నవారైనా సరే, వారికి మనం తప్పక నమస్కరించాలి. మీకు ఇంకొక ఉదాహరణ కూడా ఉటంకిస్తాను. న్యాయస్థానంలో న్యాయాధిపతికి వయస్సు 40 సం॥ అనుకుందాం,న్యాయస్థానంలో న్యాయాధి పతి ప్రవేశించినప్పుడు అందరూ గౌరవంగా లేచినిలబడి గౌరవంగా నమస్కరించడం అనేది మనం రోజు చూస్తూనే వున్నాం. న్యాయాధిపతి కంటే ఎక్కువ వయస్సు ఉన్న న్యాయవాదులు కానీ, లేక ప్రేక్షక జనం కానీ, లేక సాక్షులు కానీ తప్పకుండా లేచి నుంచుంటారు. అంటే వయసులో చిన్నవారైనా, న్యాయాధిపతి స్థానంలో ఉన్నాడు కాబట్టి ఆ స్థాన విలువ ఆయనకు వచ్చింది. కాని వయస్సుకి విలువ వుండదు. కాబట్టి పెద్దకోడలు కంటే చిన్నకోడలు వయస్సులో తక్కువ ఉండాలని కానీ లేక చిన్న అల్లుడు పెద్దల్లుడు కంటే ఒక్క రోజు కూడా పెద్దగా ఉండకూడదని గానీ ఏ నిబంధన ఎక్కడా లేదు. కాబట్టి మనం అమాయకంగా తెచ్చిపెట్టుకున్న మూర్ఖత్వాన్ని, ఒక ఆచారంగా భావించి ఆ ఆచారమే నిజమని నమ్మి మంచి సంబంధాలను చేజేతులా పాడు చేసుకోకూడదు. ఇంకొక ముఖ్య విషయం ఏమంటే మీ పెద్ద కోడలుకి వివాహమై 3 సం॥ అయినా సంతానం కలుగలేదు అనుకోండి. మీ రెండవ కోడలుకి వివాహమైన సంవత్సరమునకే పుత్ర సంతానం కలిగింది. ఆ తరువాత ఒక సంవత్సరమునకు పెద్ద కోడలు పుత్ర సంతానం కలిగింది. అంటే చిన్నకోడలి పుత్రుడు వయసులో పెద్ద కోడలి కుమారునికంటే 2 సం॥లు పెద్దగా వుంటాడు. కానీ పెద్దకోడలు యొక్క కుమారునికి వయస్సు 1సం॥ వుంటుంది. ఇప్పుడు పెద్ద కోడలు యొక్క పుత్రుడు వయస్సులో చిన్నవాడైనా మీ ఇంటికి పెద్ద మనుమడు పెద్ద కోడలి పుత్రుడే. కాని వయస్సులో పెద్ద కదా అని చిన్నకోడలి పుత్రుడిని ముందు పుట్టినందు వల్ల పెద్ద మనవడిగా భావించకూడదు. కౌరవ, పాండవుల మధ్య కూడా ఈ సమస్య దుర్యోధనుడు కౌరవసభలో రాయబారంలో ధృతరాష్ట్రుడిని ప్రశ్నించాడు.

ఎందుకంటే పెద్ద కొడుకు పుత్రుడు. స్థాన విలువ వల్ల పెద్ద మనుమడే అవుతాడు. మీరు ఈ సత్యాన్ని గ్రహించి అనవసరంగా సాంప్రదాయం ఆచారం వంటి పదాలను తప్పుగా అర్థం చేసుకొని అన్ని అర్హతలు ఉండి కుదిరిన సంబంధాన్ని ఎప్పుడూ చేజేతులా ఒదులుకోకండి. ఎందుకంటే వివేకశూన్యులు, పండిత పసలేనివారు ఇచ్చిన సలహాలు నిజమని భ్రమపడకూడదు. వాటిని పాటించకూడదు..

26. ఒకసారి విడాకులు తీసుకున్నవారు పునర్వివాహం చేసుకొనే నిర్ణయం తీసుకున్నప్పుడు సాధారణంగా వాళ్ళు మళ్ళీ విడాకులు పొందిన వారినే చేసుకోవాలిగాని అవివాహితులు ఎవరూ ముందుకు రారనేదీ సత్యం. వచ్చిన సంబంధాలలోని మంచి చెడూ వారికి వారే అనుభవపూర్వకంగా గాని లేక సముఖంగాని చర్చా విశ్లేషణలోనే గమనించాలి

గాని, రహస్యంగా వారి వివరాలు సేకరించడం, ఇద్దరికి సమంజసంగా కాదు. ఇష్టం లేకపోతే ఆ సంబంధం వదిలి వేయడానికి ఇద్దరికి హక్కు ఉన్నప్పుడు గూఢచారితనం చేయడం వారి సంకుచిత స్వభావాన్ని వారికి వారే బట్టబయలు చేసుకుంటున్నట్లే అని అర్థం చేసుకోవాలి. ఎందుకంటే విడాకులు పొందినవారెవరైనా సరే, అంటే వధువైతే, వరుని లోపాలు, వరుడైతే వధువు లోపాలు చెపుతూ, తామెంత మంచివారమో, ఎలా మోసపోయామనే చెప్తారు. గాని తాము చేసిన తప్పులు మాత్రం బయటకు చెప్పరు. పైగా పూసగుచ్చినట్లు ఎదుట వారి లోపాలను దినవారిగా చెప్పటం నేను రోజూ వింటూనే ఉన్నాను. ఇలా మాట్లాడినా ఎవరూ నమ్మరని తెలిసినా, తమ తప్పులు ఒప్పుకోరనేది అందరికీ తెలుసు. రెండు చేతులు కలిస్తేనే తప్పట్లు. మొదటి వివాహం ఎందుకు విచ్ఛిన్నమయిందో గుచ్చి గుచ్చి అడగటం, దాని మీద తర్జన భర్జనలు చేయడం కన్నా, వధూవరులు తల్లిదండ్రులు, అలాగే వధూవరులు కూడా ఒకే నిర్ణయానికి రావాలి. అదేమిటంటే "వారేమి తప్పులు చేశారో ఆ తప్పులు మళ్ళీ చేయకూడదని, ఎటువంటి పరిస్థితులలోనైనా వారి ప్రథమ వివాహం గురించి ఇంకొకరు ఎప్పుడు కూడా ప్రస్తావించకూడదని ఈ నిర్ణయానికి కట్టుబడి ఉండాలని వధూవరులు వారి తల్లిదండ్రులు నిర్ణయించుకుని ఆ కట్టుబాటుని జీవితం అంతా గౌరవిస్తే రెండవ వివాహం సుఖమయప్రదం అవుతుందని నేను అనుభవపూర్వకంగా చెప్తున్నాను. ఎందుకంటే నేను చేసిన పునర్వివాహాలు లన్నీ ఇదే నిర్ణయంతో జరిపించాను. వారందరు సుఖజీవనం గడుపుతున్నారు.

27. సాధారణంగా వివాహం నిశ్చయంచేయడానికి పిల్లతల్లిదండ్రులో వారి బంధువులో వరుని ఇంటికి వెడతారు. అప్పుడు వరుని తల్లిదండ్రులు కూడా వారి బంధువులను కొందరిని సహాయంగా తెచ్చుకుంటారు. అంటే వివాహ విషయాలు చర్చించేటప్పుడు వధూవరులు తప్ప ఇరువురి తరఫున వారి వారి బంధువులు పదికి పైనే ఉంటారు. కాని విచిత్రమేమంటే వధూవరులిద్దరిని సంభాషణలో పాల్గొనడానికి కాదుకదా! వినడానికి కూడా అవకాశమియ్యరు. ఇది చాలా దైన్యం పైగా వివాహ హీనమవుతుంది. ఎందుకంటే వరుని తల్లిదండ్రులు పైకి ఎన్ని ఆదర్శాలు వల్లవేసినా ఆ సమయంలో మాత్రం లజ్జాహీనంగా బేరసారాలు చేయడం నేను తరచూ చూస్తూనే ఉన్నాను. వరుని తల్లిదండ్రులు అడిగినంత నగదు, నగలు, కట్నాలు, కానుకలు, ఇవ్వలేని పక్షంలో ఆ సంబంధం ఏదో కుంటిసాకు చెప్పి వదలివేసే నీచమనస్కులు నాకు తెలుసు. పైగా తమ పిల్లవాడితో వాళ్లు పేచీ పెట్టారు. ఇన్ని నిబంధనలు పెట్టారు. ఎంతో సర్దిచెప్పి సర్దుకుపోదామన్నా వారు అసలు వినకుండా మొండిపట్టు పట్టికూర్చున్నారని ఎంత సర్దిచెప్పినా వినలేదని అసత్యాలు చెప్పటం జరుగుతోంది. కొంతమంది వధూవరులు తర్వాత ఫోనులో మాట్లాడుకున్నా, ఆ ఇద్దరు తమ తల్లిదండ్రులు చెప్పేదే సత్యమనే ధోరణిలో ఉండి మాట్లాడుకుంటారు కాబట్టి ఆ సంబంధం కుదరదు. వధూవరులిద్దరూ హతాశులవుతారు కాని ఏమి చేయలేరు. అందుకని "మాదేమీ లేదు అంతా మా అబ్బాయిదని చెప్పే వరుని తల్లిదండ్రులు వరునికి సంభాషణలో పాలుపంచుకునే అవకాశం ఇచ్చితీరాలి.

అబ్బాయిని ఏదో నెపంతో లేడని చెప్పడంకాని, లేక కావాలని బయటకు పంపివేయడంగాని చేయకూడదు. వరుడుకూడా తప్పకుండా తాను కూడా తన వివాహ విషయాలు చర్చించేటప్పుడు తన తల్లిదండ్రులు, కాబోయే అత్తమామలు ఏం మాట్లాడతారో తెలుసుకోవటం చాలా ముఖ్యం. అలా తెలుసుకోవడంవల్ల వధూవరులిద్దరికి అందరి మనస్తత్వాలు తేలికగా అర్ధమవుతాయి. దానికనుగుణంగానే వారి మనోభావాలలో ఎవరెటువంటివారో అనే రూపం ఏర్పడుతుంది. ఇది మంచికి నాంది అని వధూవరులు, వారి తల్లిదండ్రులు అర్ధం చేసుకోవాలి. వరుడు వధువు రహస్య సంభాషణ వివాహం కుదురక ముందు వివాహం కుదిరిన తర్వాత తల్లిదండ్రుల రహస్య సంభాషణ. భేష్! చాలా బాగుంది. వివాహం కూడా రహస్యంగా చేస్తే పోలా! అంతా చిదంబర రహస్యంగానే ఉంటుంది. ఇది నిజంగా మేలు లక్షలు ఇరుప్రక్కలవారికి మిగులుతాయి!

కృత్రిమమైన వధూవరుల వ్యర్ధ రహస్య సంభాషణకంటే, సహజమైన అందరి మనస్తత్వాలకు చదవడానికి వధూవరులిద్దరికి చక్కని అవకాశం కాబట్టి. వీరిద్దరు తమ తల్లిదండ్రులను ఒప్పించి తాము కూడా వివాహ విషయాలు నిర్ణయించేటప్పుడు వారుకూడా ఉండాలి, లేకపోతే "మాదేం లేదండీ అంతా వాడి ఇష్టం అని చెప్పే తల్లిదండ్రులది అసత్యమే ఎందుకంటే" "అంతావాళ్ల యిష్టం" అని ఆదర్శ పలుకులు పలికే పెద్దలు వాళ్లు లేకుండా తమ సంభాషణలో బేరసారాలు చేయవచ్చనే హేయమైన ఆలోచనకు ఇప్పుడైనా స్వస్తిపలికి, వివాహ సంభాషణలో వధూవరులిద్దరిని భాగస్వాములు చేస్తే నిజంగా పెద్దలు పలికే ఆదర్శాలు నిజం అవుతాయి లేకపోతే తల్లిదండ్రులు ఆదిలోనే అసత్యం చెప్పి ఆదర్శం అనే ముసుగులో ఆత్మవంచన చేసుకొన్నట్లే.

28. వధూవరులు, వారి తల్లిదండ్రులు కూడా ఒకే ఊరిలో ఉన్నప్పుడు వరుడు వధువు ఫోటో కావాలని అడగడం అంత సమంజసం కాదు. ఎందుకంటే కొందరు ఫోటోలో చాలా అందంగా కనబడతారు. మరికొందరు చాలా ఆకర్షణీయంగా చిరునవ్వు కలిగి ముఖంతో ఉంటారు. కాని ఫోటోలో బాగుండకపోవచ్చు. అందుకని ఫోటోలకు ప్రాధాన్యం ఇవ్వకూడదు. ఫోటో విషయాన్ని పక్కకు పెట్టి జాతకం కుదిరితే వధువు తరఫువారు అమ్మాయిని చూడమని అడిగినప్పుడు వెళ్లి చూడాలి. ముఖాముఖి కలుసుకుని మాట్లాడినప్పుడు ఆ అమ్మాయిలోని హావభావాలు, వారి ఇంటి పరిశుభ్రత, వారి గౌరవ మర్యాదలే కాక వారి సంభాషణ తీరు మీకు బాగా నచ్చవచ్చు. ఆ అమ్మాయితో సంభాషించినపుడు ఆ అమ్మాయిలోని సంస్కారం హుందాతనం, ఆమె చిరునవ్వులోని ఆకర్షణ మీకు బాగా నచ్చవచ్చు. అదేకాక కంఠస్వర మాధుర్యం హాస్యచతురత (sense of humor) మీరు గ్రహించవచ్చు. అలాకాకుండా ఫోటో చూసి వద్దంటే విలువైన మంచి సంబంధం కూడా మీరు చేజేతులా ఒదిలి వేసినట్లేనని గ్రహించండి.

మా అబ్బాయి ప్రతిపిల్లని చూసి వాళ్లని ఇబ్బంది పెట్టడానికి ఇష్టపడడు. మా అభిమతం కూడా అదే" అంటూ వారిని, వారే ఆదర్శవంతులు అయినట్లు నటిస్తూ ఉంటారు. ఇది

ఆత్మవంచనే కాని ఆదర్శం కాదు. ఎందుకంటే ఫోటో చూసి ఆ ఫోటో నచ్చిన తర్వాత మొగపెళ్లివారు, వరుడు కట్టగట్టుకుని ఒక ఏడు, ఎనిమిది మంది వెళ్లి వాళ్ల యింట్లో ఒక పూట పూర్తిగా గడిపి ఆ తర్వాత మా అబ్బాయికి నచ్చలేదని చెప్పడం రోజూ జరుగుతున్న ప్రక్రియే. అబ్బాయికి నచ్చనప్పుడు అలా చెప్పడం వల్ల ఆడపిల్ల తల్లిదండ్రులు బాధపడతారని మా అబ్బాయికి నచ్చలేదని చెప్పడం మానేస్తారా? లేక అమ్మాయిని చూసిన తర్వాత వధువు తరఫువారే ఫోన్ చేయాలనే అహంతో ఏమీ చెప్పకుండా, వారం పదిరోజులైనా మౌనంగా ఉండిపోకుండా ఉంటున్నారా లేదా? కాబట్టి ఎదుటివారు బాధపడతారనే విషయం చెప్పడం ఎన్నటికి సత్యంకాదని అందరికి తెలుసు, పిల్లి కళ్లుమూసుకుని పాలు త్రాగినట్లు. కాబట్టి ఇద్దరూ ఒకే ఊరిలో ఉన్నప్పుడు అమ్మాయిని చూసి వచ్చి ఆలస్యం చేయకుండా తమ అభిప్రాయం నిజంగా చెప్పడంవల్ల వారు ఆదర్శవంతులని నిరూపించుకున్నట్లవుతుంది. ఇది నిజం. పైగా చేసుకునేది లేనిది వెంటనే నిర్ణయించబడుతుంది కాబట్టి వేరే సంబంధం చూసుకునేందుకు వధువు తల్లిదండ్రులకు వెసులుబాటు ఉంటుంది. కొంతమంది ఏ నిర్ణయము చెప్పకుండా నాన్చి, నాన్చి ఆఖరికి ముహూర్తాలన్నీ దాటిపోయి మళ్లీ మూడు నెలల వరకు ముహూర్తం లేనప్పుడు అప్పుడు చేస్తారు. వాళ్లు మాత్రం స్వార్ధ చింతనతో వేరే సంబంధం నిశ్చయం చేసుకుంటారు. ఇలాంటి దౌర్భాగ్యపు పనులు చేసి ఒక కన్యకు జరిగే వివాహానికి మీరు కారణభూతులైతే మీ అబ్బాయి వైవాహిక జీవితం దుఃఖమయం అవచ్చు.

**"పై అభిప్రాయాలతో మీరు నాతో ఏకీభవిస్తే ఇతరులకు చెప్పండి. వారికి మంచి విషయాలు చెప్పిన వారవుతారు. ఒకవేళ నచ్చకపోతే ఎందుకు నచ్చలేదో శాస్త్ర ప్రామాణికంగా సోదాహరణాలతో నాకు చెప్పండి. నాలోని తప్పులు సరిదిద్దినవారవుతారు."**

***-రచయిత***

# రచయితగా నా మాట...

భారతావనిలో వివాహం అనేది అతి ముఖ్యమైన, అందరికీ అత్యంత సంతోషకరమైన మరియు అతి పవిత్రమైన క్రతువు. ఈ మహా క్రతువు యొక్క యజ్ఞఫలం మన జీవిత పర్యంతం హాయిగా, ఆనందంగా అనుభవించి సంతోషంగా గడుపుకోవాలని పెద్దలందరూ హృదయపూర్వకంగా కళ్యాణ సంరంభంలో ఆశీర్వదిస్తారు. అనేక దేవతలను ఆవాహన చేసి, వారిని పూజించి ఆ తర్వాత వివాహ యజ్ఞం జరిపించి అనేక దేవతల ఆశీస్సులు నవ దంపతులకు కలిగాయని సంతసం పొందుతారు. ఆ సంతోష సమయంలో అన్నదానం, వస్త్రదానం, గో, భూదానాలు కూడా చేసి సద్బ్రాహ్మణులను గౌరవించి వారి ఆశీర్వాదములు పొంది సంతసిస్తారు.

పెద్దలు మరియు సత్పురుషుల ఆశీర్వాదాలు పొందడం ముఖ్యమైనా అది ఒక మానవ కార్యక్రమమే అవుతుంది. కాని సృష్టికర్త బ్రహ్మ వ్రాసిన జీవిత సరళిని ఆయన నిర్ణయించిన రీతిలో నడిపించేది నవగ్రహాలేనని మన పూర్వులు అనేక శాస్త్రాల ద్వారా స్పష్టం చేశారు. ఒక్కొక్క పద్ధతిలో బ్రహ్మ లిఖితానుసారంగా మనకు జీవితంలో ఒకసారి పరమపదసోపాన పటంలోని కాలసర్పాలలాగా లేదా మరొకసారి ఉన్నతమైన స్థితికి మార్గమైన నిచ్చెనలు లాగా మనకు అనుకూల, ప్రతికూల అంశాలను అనుభవపూర్వకంగా జీవితంలో కలిగిస్తూ వుంటారు. వాటి వలన మనకు సుఖదుఃఖాలు కలుగుతూ ఉంటాయి. అలా కలిగించడం నవగ్రహాల ధర్మం మరియు అది వారి ప్రవృత్తి కాబట్టి వారి కార్యం వారు నియమానుసారంగా నిర్వర్తిస్తూనే ఉంటారు. అందువల్లనే జీవితంలో మనం పూలబాటలో నడచినా ఒక్కొక్కప్పుడు ముళ్లమార్గాన్ని కూడా దాటవలసి వస్తుంది. ఒక కార్యాలయంలో ఉన్నతాధికారి చేసిన నిర్ణయాలను మిగిలిన వారు ఏ విధంగా అమలుపరుస్తారో అదే విధంగా బ్రహ్మ లిఖితాన్ని నవగ్రహాలు అమలుపరుస్తున్నాయనుకోవచ్చు.

మన జాతకచక్రంలో మనం ఏ సమయంలో ఏ రాశి ప్రభావంలో ఉంటామో ఆ రాశి అధిపతి యొక్క గుణగణాల కర్మను వారు కలిగించే కష్టసుఖాలను అనుభవిస్తాము. అందుకనే గ్రహస్థితి బాగా లేనప్పుడు మనం ఏమీ చెయ్యలేము. గ్రహస్థితి బాగున్నప్పుడు ఆ గ్రహప్రభావం వలన ఎన్నో కార్యాలు మనం సాధించగలం. మనం వివాహానికి పూర్వమే వధూవరుల గ్రహస్థితిని పరిశీలించి వారి భావి జీవితం ఆనందదాయకమా? కాదా! అని నిర్ణయించడం మనకు శ్రేయస్కరం. ఆ అవగాహన వల్ల కొంచెమైనా కష్టనష్టాలు తగ్గడం, వారి దాంపత్య జీవితంలో సుఖసంతోషాలు పెంపొందించడానికి ఆస్కారం వుంది.

ప్రతివారు ప్రస్తుత కాలంలో జాతకచక్రం పరిశీలించి వధూవరుల వైవాహిక జీవిత నౌక పయనించే మార్గం సరళంగా, సాఫీగా సాగిపోతుందా లేక ఒత్తిడి లేక ఒడిదుడుకులతో కూడి ఉంటుందా అని తెలుసుకోవాలనుకోవడం సహజం. ఇలా తెలుసుకోవాలంటే ఇప్పుడు సామాన్యులకు అది కొంతవరకు అసామాన్యం అయింది. ఎందుకంటే దీన్ని గురించి అనేకమంది పండితులు అనేక గ్రంథాలు వ్రాసినా అవి చాలావరకు కఠినమైన గ్రాంధిక భాషలో ఉండటమే కాక, అవి సంస్కృత పదభూయిష్టమై అక్కడక్కడ శ్లోకాలతో ఉంటాయి.

ఎన్నిసార్లు చదివినా సామాన్య ప్రజలకు అవి ఒక పట్టాన కొరుకుడు పడవు. పోని ఏ గురువు వద్దనైనా శుశ్రూష చేసి శాస్త్ర విజ్ఞానం నేర్చుకోవాలనే ఉత్సాహం ఉన్నా సమయ ప్రభావం వల్ల నేర్చుకోలేకపోతున్నారు. దీనికి తోడు జ్యోతిష్యులను అవసరార్ధం మనం సంప్రదించడానికి వారివద్దకు వెళ్ళినప్పుడు వారు వాడే భాష వారి పాండిత్యాన్ని మనకు చూపడానికా అన్నట్లు ఉంటుంది కాని, సామాన్య పరిభాషలో ఉండదు. వారు చెప్పే వాక్యాలు మనకు ఒక్కొక్కప్పుడు ఏమీ అర్ధం కాకపోయినా అర్ధమైనట్లుగా తల ఊపి నిస్సహాయంగా బయటకు వచ్చేస్తాము. పైగా ధనదాహంతో వారు అడిగిన రుసుము మనం చెల్లించాల్సి వస్తుంది. అలా ప్రతిసారి మనం రుసుము చెల్లిస్తూనే ఉంటాము. ఒక్కొక్కప్పుడు వారు జాతక చక్రం సరిగా పరిశీలించక వారివారి తొందరలో ఏదో చెప్పి పంపించివేస్తారు. అలా చెప్పేటప్పుడు కుదిరిన జాతకం కూడా కుదరలేదని చెప్పవచ్చు. అలా చెప్పడం వల్ల వివాహాలు అన్యాయంగా తప్పిపోతున్నాయి. అందువల్ల తల్లిదండ్రులకు మనోవ్యాకులతే కాకుండా, కొన్నిసార్లు వధూవరులకు కూడా ఆశాభంగం కలుగుతోంది.

ప్రతివారు తమ ఇంటి జ్యోతిష్యుడు చాలా పాండిత్యం ఉన్నవాడిని, జ్ఞానఖని అని నమ్ముతూ ఉంటారు. ఆ జ్యోతిష్యుడు చెప్పినదే వారికి శిరోధార్యమవుతుంది. వారి విశ్వాసం ఆ జ్యోతిష్యుడి మీద ఎంత బలంగా ఉంటుందంటే ఆ జ్యోతిష్యుడు ఇష్టపడకపోతే అన్ని విధాల వారికి నచ్చిన మంచి సంబంధమైనా వదిలివేస్తారు. దానికి కారణం ఆ జ్యోతిష్యుడి మీద వీరికున్నది ఎక్కువ అభిమానమే తప్ప మరేమీ కాదు. అభిమానమే కొంతకాలం తర్వాత నమ్మకంగా మారిపోతుంది. ప్రతిరోజూ ఎంత ఎక్కువమంది ఆయనను సంప్రదించ డానికి వస్తే ఆ జ్యోతిష్యుడు అంత పాండిత్యం గలవాడని అనుకుంటారే తప్ప సత్యాన్వేషణ చేయరు. ఆ జ్యోతిష్యుడు ఇంత పర్సెంటు కుదిరిందని చెప్పినా ఇదేమిటని ఆలోచించరు. కుదిరిందో లేదో స్పష్టంగా చెప్పాలి గాని పర్సంటేజి ఏమిటని అనుకోరు. ఇద్దరి మానవుల మధ్య ఉన్న ప్రేమాభిమానాలుగాని స్నేహితుల మధ్య ఉన్న సహాయ సహకారాలనుగాని లేక భార్యాభర్తలమధ్య ఉన్న ప్రేమానుబంధాలుగాని కొలవడానికి ప్రామాణికత గల కొలమానం ఎక్కడైనా ఉందా? ఉంటే నాకు కూడా చెప్పండి. నేను కూడా కష్టపడి జాతకం అంతా పరిశీలించి చూడక్కరలేదు. మార్కులు చూసి ఫలితం చెప్పేస్తాను. గ్రహస్థితి పరిశీలించే శ్రమ, సమయం రెండూ తగ్గుతాయి. పంచాంగమే శాస్త్ర ప్రామాణికంగా నమ్మి శాస్త్ర

పఠన, శాస్త్ర శోధన వదలివేస్తాను. మరి కొందరు తాము తెలిసినంత చెప్పామని ఎందుకైనా మళ్లీ మరొకరికి చూపండని సలహా ఇస్తారు. ఇలాంటి చచ్చు సలహాలు ఇచ్చేవారు జాతకాలు చూడకూడదు. తన పాండిత్యంలో నమ్మకం లేనప్పుడు జాతకాలు చెప్పకూడదు. ఇలా చేయడం వల్ల జ్యోతిషులంటే ప్రజావాహినిలో అనేక సందేహాలు కలుగుతున్నాయి. ఇద్దరు జ్యోతిష్యులు వేరువేరు అభిప్రాయాలు వెల్లడిస్తూ ఉంటే సామాన్య ప్రజలకు అంతా అయోమయంగా ఉంటుంది.

ఇంకొక ముఖ్య విషయం ఏమంటే చాలామంది "మా బావగారి అబ్బాయి లేక మా పినమామ గారి బావమరిది లేక మా మేనల్లుడు జాతకాలు చూస్తారు. వాళ్లు చూసి చెప్తే మాకు అభ్యంతరం లేదు" అంటూ చెప్తారు. తెలుసుకోవలసినది ఏమంటే తమ బంధువనే అభిమానమేగాని నిజంగా ఆ బంధువుకు ఎంత పాండిత్యం ఉందో వీరికి తెలియదు. అటువంటప్పుడు అలాంటి వారి వద్దకు వెళ్ళకుండా మంచి పాండిత్యం కలిగి ప్రతిరోజు క్రమం తప్పకుండా జాతకాలు చూసే పండితుడిని సంప్రదించండి. అంతేకాని మీ బంధుప్రీతి మీ పిల్లల భావి జీవనం కంటే ముఖ్యం కాదని తెలుసుకోండి.

ఇంకొక చిత్రమైన విషయం ఏమంటే నా దగ్గరకు వచ్చి జాతకం చూపించుకున్న వాళ్లు "మీరు కుదిరిందని చెప్తున్నారు గాని, మా జ్యోతిష్యుడు జాతకం చూడగానే "ఛీ ఛీ వెధవ జాతకం, ఇది నష్ట జాతకం" అంటూజాతకపత్రం విసిరివేశాడని, ఇంకా ఇలా చేసాడని, అలా అన్నారని చెప్తూ ఉంటారు. ఒక ముఖ్య విషయం ఏమంటే మంచి పాండిత్యం ఉన్న జ్యోతిష్యుడు, వివేకం లేకుండా అలా జాతకాలను నిందిస్తూ పారవేయడు. ఏ జాతకాన్ని అవహేళన చేయడు. జాతకపత్రాన్ని అలా విసిరివేయడు. మూర్ఖులు, అహంకారులు, జ్ఞాన శూన్యులు మాత్రమే అలా చేస్తారని నా భావన. రెండవ విషయం ఏమంటే ఫలానావారు కుదిరిందని చెప్పారు. మీరు కుదరలేదన్నారంటే కోపోద్రేకాలకు లోనయి "ఆత్మస్తుతి - పరనింద" చేయడం ఇతర జ్యోతిష్యుల గురించి హీనంగా విమర్శ చేయడం కుసంస్కార లక్షణం. అట్టి జ్యోతిష్యుల వాక్కు ఫలించదు అని నా గట్టి నమ్మకం. ఎందుకంటే జ్యోతిష పండితులు రాగద్వేషాలకు అతీతంగా ఉండాలి. సత్యమే చెప్పాలి. ధనకాంక్ష, కీర్తి కండూతులకు దూరంగా ఉండాలి.

ఇవన్నీ నేను అనుభవపూర్వకంగా తెలుసుకున్న తర్వాత అత్యంత సరళ భాషలో సామాన్యులకు సైతం అర్థమయ్యేలా ఒక చిన్న పుస్తకం వ్రాయాలనే సంకల్పం కలిగింది. నిజానికి ఇది చాలా సాహసకార్యమైనా, యధాశక్తి నాకు తెలిసినది ఇతరులకు తెలియజెప్పటంలో తప్పులేదనిపించింది. అందుకనే ఈ సాహసం చేశాను.

**హైదరాబాద్** - రచయిత

**3 -10-2008**

# ఒక మాట...

నేను 2003లో ప్రథమంగా వ్రాసిన ఈ పుస్తకం మంచి పేరు ప్రఖ్యాతులు పొంది ఎంతోమందికి జ్యోతిషశాస్త్రం మీద స్పష్టమైన ఒక అవగాహన కలిగిందని చెప్పడానికి ఎంతో సంతోషంగా ఉంది. ఎందుకంటే వధూవరుల జాతక పరిశీలనలో ఒకే శాస్త్రాభిప్రాయానికి మహా ఉద్ధండ పండితులు వ్రాసిన గ్రంధాలు ఎన్నో ఉన్నా సరియైన శాస్త్రశుద్ధి తెలియక మిడిమిడి జ్ఞానముతో జ్యోతిష్యులు కానివారు కూడా జ్యోతిష్యులుగా చెలామణి అవుతూ, ధనార్జనే ముఖ్య ప్రాతిపదికగా చేసుకొని, సామాన్యులు తమ దగ్గరకు సలహాకోసం వచ్చినప్పుడు తాము ఊహించినది చెప్పి పంపివేస్తున్నారు. అటువంటి కుహానా జ్యోతిష్యుల మాటలు నమ్మి చేసిన వివాహాలు ఎన్నో దాంపత్యాలు విచ్ఛిన్నం కావడం, లేక వైధవ్య దోషం లాంటివి జరుగుతున్నాయి. ఇద్దరు జ్యోతిష్యులు భిన్నాభిప్రాయాలు చెప్పినప్పుడు ప్రజలకు శాస్త్రం మీదే నమ్మకం సడలిపోతుంది. ఇది చాలా బాధాకరమైన విషయం. ప్రతివారు కొంచెమైన ఉత్సాహం చూపించి ఈ పుస్తకం పఠిస్తే ఎంతో సహాయకారిగా ఉండడమే కాక ఎవరినో నమ్మివాళ్ళు చెప్పినదే వేదంగా భావించి వివాహం జరిపే అమాయక ప్రవృత్తికి లోనవరు, సరికదా అనుమాన నివారణ కోసం పండితులను సంప్రదించి ఒక నిర్ణయానికి వచ్చే పరిజ్ఞానం వస్తుందనుటకు ఏమీ సందేహం లేదు.

మలి ముద్రణ 2008 సంవత్సరములో ముద్రించబడింది. మళ్లీ ఈ పుస్తకమే తృతీయ ముద్రణగా ప్రచురించబడుతోంది. ఈ ముద్రణలో పాఠకులు ఎన్నో క్రొత్త క్రొత్త అంశాలు చేర్చమని ఎవరి అనుభవాన్ని బట్టి వారు ఎన్నో సలహాలిచ్చారు. నిజానికి వారి సలహాలు ఎంతో ముఖ్యమైనవి మరియు అమూల్యమైనవి. నేను వారి సలహాలను దృష్టిలో ఉంచుకొని ఈ ముద్రణలో కొన్ని క్రొత్త అధ్యాయాలు చేర్చుతానని శ్రీ వేంకటేశ్వర బుక్ డిపో అధినేత శ్రీ రామకుమార్‌గారితో మనవి చేసినప్పుడు ఆయన నవ్వుతూ “మీరు వ్రాసేదీ, నేను ప్రచురించేది వారికోసమే కదా కాబట్టి తప్పక క్రొత్త అధ్యాయాలు వారు కోరినట్లుగానే వ్రాయండి నేను తప్పకుండా మీరు వ్రాసే క్రొత్త అధ్యాయాలను ముద్రిస్తాను” అని నన్ను ప్రోత్సహించారు. ఆయనలోని ఔన్నత్య భావానికి నా కృతజ్ఞతలు.

ఒక ముఖ్య విషయం ఏమంటే నా భాషా శైలికి ముగ్ధులవుతున్నామని నా సరళభాష అందరిని అలరారిస్తోందని అనేకమంది ఉత్తరాలలో, ఫోన్లో మెచ్చుకోవడం చేస్తున్నారు. వారందరికి మరియొకసారి నా కృతజ్ఞతలు.

మీరు ఈ పుస్తకం చదివి ఏమైనా లోపాలున్నా, లేక ఏమైనా సలహాలు నాకు తెలియబరిస్తే మలి ముద్రణలో సరిచేసుకుంటానని మనఃపూర్వకంగా మనవి చేసుకుంటున్నాను.

**హైదరాబాద్**
**5 -1- 2012**

- రచయిత

# ఒక ముఖ్య సూచన

నాకు చాలా సంతోషకరమైన విషయం ఏమంటే, నేను వ్రాసిన ఈ పుస్తకాన్ని చదివి ఎన్నో వందలమంది ఫోన్ చేసారు. ఇప్పటికీ మొదటి ముద్రణ నుంచి అంటే దశాబ్దం గడిచినా ఇంకా నాకు ఆంధ్రదేశంలో అన్ని ప్రాంతాల నుంచి ముఖ్యంగా వధూవరులు మరియు జ్యోతిష శాస్త్రవేత్తల దగ్గర నుంచి ఫోన్లు వస్తూనే ఉన్నాయి. కొంతమంది చాలా మెచ్చుకుంటూ చేస్తే మరికొందరు వారికి తోచిన సలహాలు ఇస్తూనే ఉన్నారు. ఇలా ఫోన్లు చేసేవారికి నేను ఎప్పుడూ కృతజ్ఞుడనుగానే ఉంటాను. ఎందుకంటే కొందరు ఇచ్చిన సలహాలు ఆచరణీయమైనవి, మరియు జన బాహుళ్యానికి ఉపయోగపడేవి. కాని, అందరి సలహాలు నేను పాటించలేకపోయినా కొన్ని మాత్రం ఎంచుకొని వాటిని ఈ ముద్రణలో మార్పులు, చేర్పులు చేసాను. పండితులైన సోదర జ్యోతిష శాస్త్రవేత్తలు మరియు ఇతర పాఠకులు ఇది గమనించి వారి వారి నవ ఊహలను నాకందిస్తే నేను సరియైన రీతిలో స్పందిస్తానని వినమ్రపూరితంగా మనవి చేసుకుంటున్నాను.

అసలు విషయానికి వస్తే నాకు అమలాపురం, తూర్పుగోదావరి జిల్లా నుంచి ఒక పాఠకుడు, తాను జాతక విశ్లేషణ ఇప్పుడిప్పుడే కొద్దిగా నేర్చుకుంటున్నానని, తమ జిల్లాలో జాతకచక్రం అపసవ్యంగా వేస్తారని, అందువల్ల ప్రతీసారీ నేనిచ్చిన సవ్య చక్రాలను అపసవ్యంగా వేస్తే గాని చక్రాలను చదవలేకుండా ఉన్నానని, అందువల్ల సవ్య చక్రంతో పాటు అపసవ్య చక్రం కూడా వేసి చూపిస్తే అపసవ్య చక్రం చదివేవారికి ఏమీ ఇబ్బంది కలగదని ఈ విషయం తన సలహాగా తీసుకొని పరిశీలించమని అడిగాడు. ఈ విషయం గురించి పెద్దలతో చర్చించి వారి అనుమతి ఆశీర్వాదాలతో పాఠకుడు కోరిన ప్రకారం సవ్యచక్రంతో పాటు ప్రతి చోటా అపసవ్య చక్రం కూడా వేసి చూపించాను. “ఈ విషయం గురించి నేను శ్రీ రామకుమార్‌గార్‌తో ప్రస్తావించినప్పుడు ఆయన దీని వలన ఎన్నో వేలు లేక లక్షలమందికి సౌలభ్యంగా ఉంటుందని భావిస్తున్నప్పుడు మాకు అభ్యంతరం ఏముంటుంది. పైగా పాఠకుల విన్నపం మనం మన్నిస్తున్నామని సంతోషంగా ఉంది” అని నన్ను ప్రోత్సహించారు. వారి ఆమోదంతోనే ఈ మార్పులు చేర్పులు జరిగాయని గమనించ ప్రార్థన. అందుచేత నా పాఠక మహాశయులు, విజ్ఞులైన పండితులు మీ భావార్పణ నాకు ఇ-మెయిల్ ద్వారా అందించవచ్చు మీకు తప్పక సమాధానం వస్తుందని మనవి చేస్తున్నాను.

నన్ను ప్రోత్సహిస్తున్న పాఠకులకు మరోమారు నా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

- రచయిత

## సూచన

ఈ పుస్తక పఠనంలో తమకు ఏదైనా సందేహాలు కలిగితే వాటి నివృత్తి కొరకు మీరు నాకు 040-65151424 నంబరుకు ఫోను చేయండి. మీ సందేహాలకు నేను సరియైన వ్యాఖ్యలు చేసి మీ అనుమానాలకు సరియైన సమాధానాలు ఉచితంగా ఇవ్వగలవాడనని సవినయంగా మనవి చేసుకుంటున్నాను.

ఇంకొక విషయం ఏమంటే మీరు నన్ను ఆహ్వానిస్తే నేను మీ ఊరు వచ్చి మీకు ఉచితంగా వధూవరుల జాతక పరిశీలన ఎలా చేయాలో కనీసం ఒక 25మంది ఉంటే క్షుణ్ణంగా నేర్పుతాను.

"విద్వాన్ సర్వత్ర పూజితే" అన్నారు పెద్దలు. అందుకనే మిమ్మల్ని కూడా పండితోత్తములుగా తీర్చిదిద్దాలనేదే నా కాంక్ష

- రచయిత

# ప్రకాశకుల మనవి

శ్రీ మల్లాది మణి గారు జ్యోతిషశాస్త్రములో మంచి పేరు సంపాదించి అనేక పుస్తకములు వ్రాసినారని తెలిసింది. ఆయన హైదరాబాద్‌లో ఉంటున్నా అసలు విజయవాడ వాస్తవ్యులు అని తెలిసి ఆయనను కలవడానికి మేము హైదరాబాద్ వెళ్ళినప్పుడు ఆయన వ్రాసిన పుస్తకాలు చూసిన మాకు ఆ భాషా శైలి నచ్చింది. ఏ అంశం అయినా సూటిగా వివరించడం ఆయన ప్రత్యేకత అని అర్థం చేసుకున్నాము.

ఆయన 2008లో వ్రాసిన 'కళ్యాణ జాతక విశ్లేషణ' మేమే ప్రచురించినా, దానిని చదివిన తరువాత మాలో కలిగిన భావ విమర్శలు ఆయనకు చెప్పాము. ఆయన విని చాలా సంతోషించి మా సలహా ప్రకారము 17 నుంచి 29 క్రొత్త  అధ్యాయాలు అతి విపులంగా వ్రాసి పాఠకుల సౌలభ్యం కోసం చక్రాలు వేసి చూపించి కొత్త అధ్యాయాలుగా వ్రాసారు. అది చదివిన తరువాత ఈ పుస్తకము మేమే రెండవ ముద్రణాగా ప్రచురించాలనే సంకల్పం కలిగి ఆయనని అడుగగా ఆయన ఇచ్చిన సహకారానికి మాకు చాలా ఆనందదాయకముగా ఉన్నది. ఆయన వ్రాసిన అయిదు పుస్తకాలు మేము ఇంతవరకు ప్రచురించాము. అన్ని పుస్తకాలు బహుళ ప్రజాదరణ పొందాయి. మరిన్ని పుస్తకాలు త్వరలో విడుదలచేస్తాము అని చెప్పడానికి సంతోషిస్తున్నాము.

**- పబ్లిషర్స్**

**11 - 2 - 2008**

# 1. ఉపోద్ఘాతం


కాలం అనేది చాలా విచిత్రమైనది. ఇది నిర్విరామంగా సాగిపోతూనే వుంటుంది. ఈ కాల ప్రవాహవేగాన్ని ఎవరూ ఆపలేరు. కనీసం దీని వేగాన్ని ఎవరూ కొంచెం కూడా తగ్గించలేరు. లేదా వేగం పెంచలేరు. ఈ సాగుతున్నకాలం వల్లనే యుగాలు, సంవత్సరాలు, మాసములు మొదలైనవి ఏర్పడుతూ వుంటాయి. ఆదికాలంలో మానవుడు ఈ కాలప్రవాహాన్ని అర్థం చేసుకోవడానికి తన శాయశక్తులా ప్రయత్నించాడు. ఆ ప్రయత్నంలో కాలచక్రం వల్లనే వాతావరణంలో మార్పులు, రాత్రి పగలు ఏర్పడుతున్నాయని అర్థం చేసుకున్నాడు. ఈ ప్రయత్నంలో మానవుడు సూర్యోదయం సూర్యాస్తమయం నిర్ణీత సమయానికి జరుగుతున్నట్లు గ్రహించాడు. అదేవిధంగా చంద్రుడు క్షీణించడం ఆ తర్వాత చంద్రుడు వృద్ధి అవుతూ పూర్ణచంద్రుడుగా వెలిగిపోవడం కూడా తెలుసుకున్నాడు. సూర్యుని వల్లనే రాత్రి పగలు ఏర్పడుతున్నాయని గమనించాడు. ఆ తర్వాత భూమి గుండ్రంగా వుందని, అది తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరుగుతోందని గ్రహించగలిగాడు. అందువల్లనే ఒక రాత్రి ఒక పగలు కలిపి ఒక దినంగా కాలనిర్ణయం చేశాడు. కాలక్రమేణ ఒక్క భూమి మాత్రమే కాకుండా సూర్యుని చుట్టూ అంతరిక్షంలో అనేక గ్రహాలు పరిభ్రమిస్తున్నాయని కూడా అర్థం చేసుకున్నాడు. కాలనిర్ణయం చేసేటందులకై ఒక పగలు, ఒక రాత్రి ఒక రోజుగాను అట్టి ఏడు రోజులు ఒక వారంగాను నిర్ణయించి కాలాన్ని కొలవటం నేర్చుకున్నాడు. క్రమేపి నాలుగు వారాలు ఒక మాసంగాను, 12 మాసాలు ఒక సంవత్సరంగాను నిర్ణయించాడు. భూమి తన చుట్టూ తాను తిరగడానికి పట్టే కాలం ఒక రోజు; అదేవిధంగా భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ ఒకసారి పరిభ్రమించడానికి ఒక సంవత్సరకాలం పడుతుంది.

మానవుని మేధస్సులో కలిగిన జిజ్ఞాస వల్ల సూర్యుడు నిశ్చలుడని తెలుసుకున్నాడు. సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తున్న గ్రహాలు తమ కక్ష్యలో తాము తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరుగుతున్నాయని కూడా తెలుసుకోగలిగాడు. సూర్యుని చుట్టూ తిరుగుతున్న భూమి మీద నివసిస్తున్న తనమీద సూర్యప్రభావం చాలా వుందని గ్రహించాడు. ఎలాగంటే సూర్యుని యొక్క వేడి, కాంతి మనకు లభిస్తోందని, మరియు సూర్యుడు లేనప్పుడు అవి రెండూ మనకు లభించడం లేదని అర్థం చేసుకున్నాడు. అదేవిధంగా చంద్రుని వల్ల చల్లదనం, ఆహ్లాదకరమైన వెన్నెల మనపై ప్రభావం చూపుతుందని గ్రహించాడు. ఇదేవిధంగా మిగిలిన గ్రహాల ప్రభావం కూడా మానవుల మీద పడుతోందని గ్రహించాడు.

మానవులు తమ గుర్తింపు కోసం ఏ విధంగా అయితే పేర్లు పెట్టుకుంటారో అర్థం చేసుకున్న మానవుడు అదేవిధంగా గుర్తింపు కోసం ఒక్కొక్క గ్రహానికి ఒక్కొక్క పేరు పెట్టాడు. గ్రహాల ప్రభావం మానవుల మీద ఏ విధంగా పడుతోందో దాని ఫలితం ఏమిటో కూడా తెలిపేదే జ్యోతిష్య శాస్త్రం.

గ్రహాలు తమచుట్టూ తాము తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరుగుతాయని మనం చెప్పుకున్నాం. ఈ గ్రహాలన్నీ ఒక నిర్దిష్ట కక్ష్యలో పయనిస్తాయి. అలా పయనించే మార్గాన్ని "రాశిచక్రం" అంటారు. ఈ రాశి చక్రం మొత్తం 360$^0$గా వుంటుంది. ఈ రాశి చక్రాన్ని పన్నెండు భాగాలుగా విభజించి ఒక్కొక్క భాగానికి ఒక్కొక్క పేరు పెట్టారు. ఒక్కొక్క రాశి యొక్క ప్రమాణం 30$^0$ డిగ్రీలు. ఈ క్రింద ఇచ్చిన రాశి చక్రంలో రాశి పేరు, వాటి డిగ్రీలు ఇవ్వబడ్డాయి. జాగ్రత్తగా గమనించండి.

| | | | |
|---|---|---|---|
| 330 360<br>మీనం | 0 30<br>మేషం | 30 60<br>వృషభం | 60 90<br>మిధునం |
| 300 300<br>కుంభం | **రాశి చక్రం<br>వాటి డిగ్రీలు<br>సవ్య చక్రం** | | 90 120<br>కర్కాటకం |
| 270 300<br>మకరం | | | 120 150<br>సింహం |
| 240 270<br>ధనుస్సు | 210 240<br>వృశ్చికం | 180 210<br>తుల | 150 180<br>కన్య |



పైన ఇచ్చిన రాశి చక్రం ప్రకారం ఒక్కొక్క రాశిలో డిగ్రీలు ఈ క్రింది విధంగా ఉంటాయి.

| రాశి పేరు | డిగ్రీలు | రాశి పేరు | డిగ్రీలు | రాశి పేరు | డిగ్రీలు |
|---|---|---|---|---|---|
| మేషం... | 0–30 | సింహం... | 120–150 | ధనుస్సు... | 240–270 |
| వృషభం... | 30–60 | కన్య... | 150–180 | మకరం.. | 270–300 |
| మిధునం... | 60–90 | తుల... | 180–210 | కుంభం... | 300–330 |
| కర్కాటకం... | 90–120 | వృశ్చికం... | 210–240 | మీనం... | 330–360 |

సూర్యుడు తన ప్రయాణంలో ఒక్కొక్క రాశిలో ఒక్కొక్క నెల చొప్పున ఉంటూ పన్నెండు రాశుల చక్రభ్రమణానికి ఒక సంవత్సర కాలం తీసుకుంటాడు. దీనివల్ల పుట్టిన తేదీని బట్టి ఆ శిశువు జన్మరాశి ఏమిటో తెలుసుకోవచ్చు. జాతకచక్రం లేనివారికి సూర్య సంచారాన్ని బట్టి రాశి, తేదీల నిర్ణయం చేయడం జరిగింది. ఈ క్రింది జన్మ తేదీలను బట్టి పుట్టిన శిశువు యొక్క రాశి నిర్ణయం చేయవచ్చు. జాతకచక్రం ఉన్నవారు ఈ సూర్యమాన పట్టి చూడక్కరలేదు.

| నెం. | రాశి పేరు | శిశువు జన్మించిన తేదీలు |
|---|---|---|
| 1. | మేషరాశి | మార్చి 21 నుండి ఏప్రిల్ 20 |
| 2. | వృషభరాశి | ఏప్రిల్ 21 నుండి మే 20 |
| 3. | మిధునరాశి | మే 21 నుండి జూన్ 20 |
| 4. | కర్కాటకరాశి | జూన్ 21 నుండి జూలై 23 |
| 5. | సింహరాశి | జూలై 24 నుండి ఆగస్టు 23 |
| 6. | కన్యారాశి | ఆగస్టు 24 నుండి సెప్టెంబరు 23 |
| 7. | తులారాశి | సెప్టెంబరు 24 నుండి అక్టోబరు 23 |
| 8. | వృశ్చికరాశి | అక్టోబరు 24 నుండి నవంబరు 22 |
| 9. | ధనూరాశి | నవంబరు 23 నుండి డిశంబరు 21 |
| 10. | మకరరాశి | డిశంబరు 22 నుండి జనవరి 20 |
| 11. | కుంభరాశి | జనవరి 21 నుండి ఫిబ్రవరి 19 |
| 12. | మీనరాశి | ఫిబ్రవరి 20 నుండి మార్చి 20 |

ప్రతి గ్రహం సూర్యుని చుట్టూ తిరగడానికి నిర్ణీతమైన సమయం వుంటుంది. అన్ని గ్రహాలకు ఒకే సమయం వుండదు. అంటే ఒక్కొక్క గ్రహానికి పట్టే సమయం వేరువేరుగా ఉంటుంది. ఉదాహరణకు సూర్యుడు రోజుకొక డిగ్రీ చొప్పున పయనిస్తూ $360^0$ డిగ్రీల మొత్తం చక్రభ్రమణం ఒక సంవత్సరంలో పూర్తి చేస్తాడు. అదేవిధంగా చంద్రుడు చక్రం చుట్టి రావడానికి 27 రోజుల 7 గంటల 43 నిముషాల సమయం తీసుకుంటాడు. అంటే ఒక్కొక్కరాశిలో సుమారుగా 2 రోజుల కొన్ని గంటల సమయం వుంటాడు. కుజుడు 45 రోజుల సమయం తీసుకుంటాడు. అలాగే బుధుడు చక్రభ్రమణం చేయడానికి ఒక నెల సుమారుగా తీసుకుంటాడు. గురువు కూడా సుమారుగా 12 సంవత్సరాల సమయం తీసుకుంటాడు. శని 29 సంవత్సరాల ఆరునెలల సమయం తీసుకుంటాడు. అలాగే శుక్రుడు ఒక రాశిలో 30 రోజులు ఉంటాడు.

ఈ పైన చెప్పిన వేగ ప్రమాణం నిర్దిష్టమైనది కాదు. ఎందుకంటే గ్రహాలు తమ వేగాన్ని పెంచడం, తగ్గించడం మరియు కొన్ని సమయాల్లో స్థిరంగా నిలిచిపోవడం కూడా జరుగుతూ వుంటుంది. అలాంటప్పుడు సంచార సమయం ప్రతి గ్రహానికి మారుతూ వుంటుంది. ముఖ్య గమనిక ఏమంటే గ్రహాలు ఒక్కొక్కప్పుడు తిరోగమన దిశలో కూడా పయనిస్తాయి అన్నట్లుగా కనిపిస్తాయి.

అంతరిక్షంలో 12 రాశులున్నాయని అందులో గ్రహాలు సంచరిస్తూ వుంటాయని తెలుసుకున్నాం. ప్రతి రాశికి ఒక తత్వం, ప్రతి గ్రహానికి ఒక స్వభావం వుంటాయి. ఒక గ్రహం ఏ రాశిలో వుంటుందో ఆ రాశి తత్వం ఆ గ్రహం మీద పడుతుంది. అలాగే ఆ గ్రహం కూడా ఏ రాశితో ఉంటుందో దాని స్వభావాన్ని గ్రహిస్తుంది. ఏదైనా ఒక రాశిలో ఒకే సమయంలో ఎన్ని గ్రహాలున్నా అన్ని గ్రహాలు తమ స్వభావాలు మార్చుకుంటాయి. దీనిని సహవాస ఫలితం అనవచ్చు. అయితే సహజ స్వభావం మాత్రం మారదు. మానవుల జీవితాలపై గ్రహాల ఫలితం వాటి స్థానాలను బట్టి ఇతర సంబంధాల వలన మారుతూ వుంటాయి కనుక గ్రహ స్వభావాలను బాగా అర్థం చేసుకుని జాతక ఫలితం చదవాలి. ఒక రాశిలో ఎన్ని గ్రహాలు ఉన్నప్పటికీ అన్ని గ్రహాల స్వభావం విడివిడిగా రాశి తత్వంతో పోల్చి ఒక నిర్దిష్టమైన అంచనా వేసుకుని ఫలితం చెప్పాలి. ఏ విధమైన తొందరపాటు లేకుండా జాగ్రత్తగా పరిశీలించాలి. జాతక పరిశీలన యొక్క రహస్యం ఇదే. ఇంతవరకు మనం రాశులు మరియు గ్రహాలు, వాటి సంచారం గురించి తెలుసుకున్నాం. అలాగే రాశులు, వాటి స్వక్షేత్రాలు ఏమిటో వాటిలో ఉండే నక్షత్రాలు ఏమిటో ఇప్పుడు నేర్చుకుందాం. మీ సౌలభ్యం కోసం ముందు ఈ క్రింద 27 నక్షత్రాల పేర్లు ఇస్తున్నాను.


| | | |
|---|---|---|
| 1. అశ్వని | 10. మఘ | 19. మూల |
| 2. భరణి | 11. పుబ్బ | 20. పూర్వాషాఢ |
| 3. కృత్తిక | 12. ఉత్తర | 21. ఉత్తరాషాఢ |
| 4. రోహిణి | 13. హస్త | 22. శ్రవణం |
| 5. మృగశిర | 14. చిత్త | 23. ధనిష్ట |
| 6. ఆరుద్ర | 15. స్వాతి | 24. శతభిషం |
| 7. పునర్వసు | 16. విశాఖ | 25. పూర్వాభాద్ర |
| 8. పుష్యమి | 17. అనూరాధ | 26. ఉత్తరాభాద్ర |
| 9. అశ్లేష | 18. జ్యేష్ఠ | 27. రేవతి |

ఈ 27 నక్షత్రాల పేర్లను మీరు వరుస క్రమంలో జ్ఞాపకం పెట్టుకోవాలి. ఇవి నోటికి ఎంత బాగా రావాలంటే ఏదైనా ఒక అంకె నుంచి మనం ముందుకు లెక్కపెట్టాలంటే అవలీలగా ఆ అంకె తర్వాత నుంచి లెక్కపెట్టుకుంటూ వెళ్ళిపోతాము. ఉదాహరణకు 23 తర్వాత 24 వస్తుంది. అలానే 25, 26, 27 అలా లెక్కపెట్టుకుంటూ వెళ్ళిపోతాము. అదేవిధంగా నక్షత్రాల పేర్లను కూడా మధ్య నుంచి మొదలుపెట్టినా చివరి వరకు వేగంగా తడుముకోకుండా చెప్పడం చాలా ముఖ్యం. ఇక రెండవది రాశులు 12 అని మనకు తెలుసు. ఈ రాశుల పేర్లు కూడా ఆ రాశి యొక్క అధిపతి పేరుతో నేర్చుకోవాలి. రాశుల పేర్లు, ఆయా రాశుల అధిపతి పేర్లు ఈ క్రింద ఇవ్వబడ్డాయి.

| నెం. | రాశి | | అధిపతి | నెం. | రాశి | | అధిపతి |
|---|---|---|---|---|---|---|---|
| 1. | మేషం | ..... | కుజుడు | 7. | తుల | ..... | శుక్రుడు |
| 2. | వృషభం | ..... | శుక్రుడు | 8. | వృశ్చికం | ..... | కుజుడు |
| 3. | మిధునం | ..... | బుధుడు | 9. | ధనస్సు | ..... | గురువు |
| 4. | కర్కాటకం | ..... | చంద్రుడు | 10. | మకరం | ..... | శని |
| 5. | సింహం | ..... | సూర్యుడు | 11. | కుంభం | ...... | శని |
| 6. | కన్య | ..... | బుధుడు | 12. | మీనం | ...... | గురువు |

ఇప్పుడు ఈ క్రింద రాశులు వాటి అధిపతులు చక్రరూపంగా ఇవ్వబడింది. ఇది మీరు జాగ్రత్తగా మననం చేసుకుంటే రాశి చక్రం, వాటి అధిపతులు మనస్సులో ఉండిపోతాయి. అలా కంఠతా రావడం, చక్రం మీ మనోఃఫలకం మీద నిల్చిపోవడం వల్ల మీకు ముందు ముందు జాతకచక్రం చదవడంలో చాలా తేలికగా వుంటుంది.

| | | | |
|---|---|---|---|
| మీనం<br>గురువు | మేషం<br>కుజుడు | వృషభం<br>శుక్రుడు | మిథునం<br>బుధుడు |
| కుంభం<br>శని | **రాశులు వాటి<br>అధిపతులు<br>సవ్య చక్రం** | | కర్కాటకం<br>చంద్రుడు |
| మకరం<br>శని | | | సింహం<br>సూర్యుడు |
| ధనుస్సు<br>గురువు | వృశ్చికం<br>కుజుడు | తుల<br>శుక్రుడు | కన్య<br>బుధుడు |




ఇప్పుడు ఇక వివాహ నిమిత్తం వధూవరుల జాతకాలు పొంతన కుదిరిందా లేదా అన్న విషయం ఎలా పరిశీలించాలో తెలుసుకుందాం.

వధూవరుల జాతక చక్రాలు పరిశీలించేటప్పుడు ప్రతి ఒక్క విషయం జాగ్రత్తగా, క్షుణ్ణంగా పరిశీలించాలి. అదేమంటే జాతక చక్రం చూసే సమయంలో ఏ మాత్రం

ఏమరుపాటు, అలసత్వం పనికిరాదు. తొందరపాటు అసలు పనికిరాదు. ఏదైనా ఒక విషయం గురించి నిర్ణయం చేసేటప్పుడు ఒకటికి రెండు సార్లు పరిశీలించాలి. ఆ పరిశీలనలో ఏమీ అనుమానం ఉండకూడదు. ఏదైనా రూఢి చేసుకున్న తర్వాత ఒక నిర్ణయానికి రావాలి. ఆ తర్వాతే రెండవ విషయాన్ని పరిశీలించడానికి ఉపక్రమించాలి. ఈ విధంగా ప్రతి అంశం రూఢి చేసుకుంటూ పోతే ఏ పొరపాటు జరగడానికి ఆస్కారం ఉండదు. జాతక చక్రం పరిశీలించేటప్పుడు ఆ చక్రాన్ని పూర్తిగా పరిశీలించాలి గాని మధ్యలో ఆపివేయకూడదు. అంటే సగం ఈ రోజు మిగిలినది రేపో మరునాడో అనుకోకూడదు. మీ నిర్ణయం సరియైనదని నమ్మకం కలిగిన తర్వాతే ఎదుటివారికి చెప్పండి. ఎవరైనా మీ నిర్ణయాలను తప్పుపడితే కోపోద్రేకాలకు లోనుకాకుండా అతి జాగ్రత్తగా జాతకం మరొకసారి వివరంగా పరిశీలించండి. మీరిచ్చిన నిర్ణయం సరియైనది కాదని మరొక పండితుడు చెప్పడం, సహజ సామాన్యం. ఒక వైద్యుడు లేక ఒక న్యాయవాది వేరు వేరు అభిప్రాయాలు ఇస్తున్నట్లుగానే జ్యోతిష్యవేత్తలు కూడా వేరు వేరు అభిప్రాయాలు ఇవ్వవచ్చు. ఎందుకంటే ఒక్కొక్క జ్యోతిష్యుడు ఒక్కొక్క విధానం అవలంబిస్తాడు. ఉదాహరణకు సాయన పద్ధతి. సాయన పద్ధతిలో మీనరాశికి అధిపతి వరుణుడు. అదే నిరయన పద్ధతిలో అదే మీనరాశికి అధిపతి గురుడు. కాబట్టి మీనరాశి జాతకులకు చెప్పే జ్యోతిష్య ఫలితాలలో సహజంగానే మార్పు ఉండవచ్చు. ఇదే విధంగా కె.పి. పద్ధతి, లహరి పద్ధతి, ఇంకా బి.వి. రామన్ ఆలోచనలు వేరు వేరుగా ఉంటాయి. అందువల్ల సహజంగానే ఒకరు చెప్పిన అంశం మరొకరు మరో విధంగా చెప్పవచ్చు. లేక విభేదించవచ్చు. కాబట్టి మన నిర్ణయాన్ని విమర్శించినవారు ఏ పద్ధతి అవలంబిస్తున్నారో తెలుసుకుంటే మనకు ఆ విమర్శ యొక్క ప్రాధాన్యత ఏమిటో తెలిసిపోతుంది.

ఇక్కడ నేను సామాన్యంగా అందరూ పరిశీలించే ముఖ్య విషయాలను ఫలానా పద్ధతి అనే భేదం లేకుండా ప్రస్తావిస్తున్నాను. ముందుగా ఏఏ రాశులలో ఏఏ నక్షత్రాలు వుంటాయో ఆ నక్షత్రాలకు ఎన్ని పాదాలు ఆ రాశులలో వుంటాయో మనం వివరంగా తెలుసుకుందాం. మీరు తెలుసుకోవలసినది ఏమంటే మొత్తం వున్న 27 నక్షత్రాలలో ప్రతి రాశిలో నక్షత్రాలు మూడేసి చొప్పున ఉంటాయి.

ఒక్కొక్క రాశిలో 9 పాదాలు మాత్రమే ఉంటాయి. మీ యొక్క సౌలభ్యం కోసం ఈ క్రింద చక్రం వేసి రాశి పేరు, ఆ రాశిలో ఉండే నక్షత్రాల పేర్లు, ఆ నక్షత్రాలకు వుండే పాదాలు ఇవ్వబడ్డాయి. మీరు జాగ్రత్తగా పరిశీలించి చక్రాన్ని పూర్తి మననం చేసుకోవాలి. పొరపాటున కూడా పాదభేదం, లేక నక్షత్ర భేదం ఉండకూడదు.

ఒక్కొక్క నక్షత్రానికి నాలుగు పాదాలు చొప్పున ఉంటాయి.

| | | | |
|---|---|---|---|
| **మీనం**<br>పూర్వాభాద్ర - 4వ పాదం<br>ఉత్తరాభాద్ర - 1,2,3,4 పాదాలు<br>రేవతి - 1,2,3,4 పాదాలు | **మేషం**<br>అశ్వని 1-2-3-4<br>భరణి 1-2-3-4<br>కృత్తిక 1 | **వృషభం**<br>కృత్తిక 2-3-4<br>రోహిణి 1-2-3-4<br>మృగశిర 1-2 | **మిధునం**<br>మృగశిర 3-4<br>ఆరుద్ర 1-2-3-4<br>పునర్వసు 1-2-3 |
| **కుంభం**<br>ధనిష్ట 3-4<br>శతభిషం 1-2-3-4<br>పూర్వాభాద్ర 1-2-3 | **"సవ్య చక్రం"**<br>**రాశులలో ఉండే నక్షత్రాలు**<br>**వాటి పాదాలు** | | **కర్కాటకం**<br>పునర్వసు 4<br>పుష్యమి1-2-3-4<br>అశ్లేష 1-2-3-4 |
| **మకరం**<br>ఉత్తరాషాఢ 2-3-4<br>శ్రవణం1-2-3-4<br>ధనిష్ట 1-2 | | | **సింహం**<br>మఖ 1-2-3-4<br>పుబ్బ 1-2-3-4<br>ఉత్తర 1 |
| **ధనుస్సు**<br>మూల1-2-3-4<br>పూర్వాషాఢ1-2-3-4<br>ఉత్తరాషాఢ 1 | **వృశ్చికం**<br>విశాఖ 4<br>అనూరాధ1-2-3-4<br>జ్యేష్ఠ 1-2-3-4 | **తుల**<br>చిత్త 3-4<br>స్వాతి 1-2-3-4<br>విశాఖ 1-2-3 | **కన్య**<br>ఉత్తర 2-3-4<br>హస్త 1-2-3-4<br>చిత్త 1-2 |

| | | |
|---|---|---|
| **వృషభం**<br>కృత్తిక 2-3-4<br>రోహిణి 1-2-3-4<br>మృగశిర 1-2<br>**మిథునం**<br>మృగశిర 3-4<br>ఆరుద్ర 1-2-3-4<br>పునర్వసు 1-2-3 | **మేషం**<br>అశ్వని 1-2-3-4<br>భరణి 1-2-3-4<br>కృత్తిక 1 | **మీనం**<br>పూర్వాభాద్ర-4వ పా<br>ఉత్తరాభాద్ర-1,2,3,4<br>రేవతి-1,2,<br>3,4 పా<br>**కుంభం**<br>ధనిష్ట 3-4<br>శతభిషం 1-2-3-4<br>పూర్వాభాద్ర 1-2-3 |
| **కర్కాటకం**<br>పునర్వసు 4<br>పుష్యమి1-2-3-4<br>అశ్లేష 1-2-3-4 | **"అపసవ్యం"**<br>**రాశులలో ఉండే నక్షత్రాలు**<br>**వాటి పాదాలు** | **మకరం**<br>ఉత్తరాషాఢ 2-3-4<br>శ్రవణం1-2-3-4<br>ధనిష్ట 1-2 |
| **సింహం**<br>మఖ 1-2-3-4<br>పుబ్బ 1-2-3-4<br>ఉత్తర 1<br>**కన్య**<br>ఉత్తర 2-3-4<br>హస్త 1-2-3-4<br>చిత్త 1-2 | **తుల**<br>చిత్త 3-4<br>స్వాతి 1-2-3-4<br>విశాఖ 1-2-3 | **ధనుస్సు**<br>మూల1-2-3-4<br>పూర్వాషాఢ1-2-3-4<br>ఉత్తరాషాఢ 1<br>**వృశ్చికం**<br>విశాఖ 4<br>అనూరాధ1-2-3-4<br>జ్యేష్ఠ 1-2-3-4 |

ఈ చక్రాన్ని బట్టి మీరు కుజుడు మొదటి రాశి అయిన మేషానికి మరియు, ఎనిమిదవ రాశి అయిన వృశ్చికానికి అధిపతి అని గమనించి వుంటారు. అదేవిధంగా శుక్రుడు రెండవ రాశి అయిన వృషభానికి మరియు 7వ రాశి అయిన తులారాశికి అధిపతి అని కూడా గమనించి వుంటారు. మిధునరాశికి మరియు కన్యరాశికి అధిపతి బుధుడు అని కూడా పరిశీలించి వుంటారు. కర్కాటక రాశికి చంద్రుడు అధిపతి. అలాగే సింహరాశికి సూర్యుడు అధిపతి. మీనరాశికి మరియు ధనూరాశికి అధిపతి గురువు. మకర, కుంభ రాశులకు శని అధిపతి. ముఖ్యంగా మీరు గమనించవలసినదేమంటే చంద్రుడు మరియు సూర్యుడు తప్ప మిగిలిన గ్రహాలు ఒక్కొక్కరు రెండు రాశులకు అధిపతిగా వుంటారు. తేలికగా జ్ఞాపకం ఉంచుకోవాలంటే పైన ఉన్న రాశ్యాధిపతులే క్రింద ఉన్న రాశులకు కూడా అధిపతిగానే వుంటారు. ఈ క్రింది చక్రం చూడండి. ఈ చక్రం వల్ల మీకు అతి తేలికగా రాశులు, రాశ్యాధిపతులు గుర్తు వుంటాయి.

| | | | |
|---|---|---|---|
| మీనం<br>గురువు | మేషం<br>కుజుడు | వృషభం<br>శుక్రుడు | మిధునం<br>బుధుడు |
| 1 ↕ | 2 ↕ | 3 ↕ | 4 ↕ |
| ధనుస్సు<br>గురువు | వృశ్చికం<br>కుజుడు | తుల<br>శుక్రుడు | కన్య<br>బుధుడు |

1. మీనం – ధనస్సు రాశులకు గురువు అధిపతి
2. మేషం – వృశ్చికం రాశులకు కుజుడు అధిపతి
3. వృషభం – తులా రాశులకు శుక్రుడు అధిపతి
4. మిధునం – కన్య రాశులకు బుధుడు అధిపతి

వధూవరుల జాతక చక్రాలు పరిశీలించేటప్పుడు ముఖ్యంగా కుజ దోషం, తారా బలం, గ్రహమైత్రి గణాలు, షష్టాష్టకాలు, నవపంచకాలు, కాలసర్పదోషం, సప్తమ, అష్టమ భావాలు, వధూవరుల సప్తాసప్తమాలు మొదలైనవి పరిశీలించాలి. వీటన్నిటి గురించి తదుపరి అధ్యాయాలలో జాగ్రత్తగా పరిశీలిద్దాం.

మీ సౌలభ్యం కోసం ఈ అధ్యాయంలోని సారాంశమంతా ఒక చక్రరూపంలో ఇస్తున్నాను. మీరు కనుక ఈ చక్రం మొత్తం తప్పులు లేకుండా మీ మెదడులో నిక్షిప్తం చేసుకుంటే మొదటి అధ్యాయం మీకు దాదాపుగా పూర్తిగా వచ్చినట్లేనని మీరు భావించవచ్చు. ఇప్పుడు చక్రం గమనించండి.

**12. మీనరాశి – గురువు ☆**

1. రవి, చంద్రుడు – కుజుడు, కేతువు
2. బుధుడు, శుక్రుడు
3. శని

| | |
|---|---|
| పూర్వాభాద్ర | – 4వ పాదం |
| ఉత్తరాభాద్ర | – 1,2,3,4 పాదాలు |
| రేవతి | – 1,2,3,4 పాదాలు |

**1. మేషరాశి – కుజుడు ☆**

1. రవి – చంద్రుడు – గురువు, కేతువు
2. బుధుడు, రాహువు
3. శుక్రుడు, శని

| | |
|---|---|
| అశ్వని | – 1,2,3,4, పాదాలు |
| భరణి | – 1,2,3,4 పాదాలు |
| కృత్తిక | – మొదటి పాదం |

**2. వృషభరాశి – శుక్రుడు ☆**

1. శని – బుధ – రాహువు
2. రవి – చంద్రుడు
3. కుజ – గురువు

| | |
|---|---|
| కృత్తిక | – 2,3,4 పాదాలు |
| రోహిణి | – 1,2,3,4 పాదాలు |
| మృగశిర | – 1, 2 పాదాలు |

**3. మిధునరాశి – బుధుడు ☆**

1. రవి – శుక్రుడు
2. చంద్రుడు
3. కుజుడు – గురువు – శని

| | |
|---|---|
| మృగశిర | – 3, 4 పాదాలు |
| ఆరుద్ర | – 1,2,3,4 పాదాలు |
| పునర్వశు | – 1,2,3 పాదాలు |

**11. కుంభరాశి – శని ☆**

1. బుధ – రాహువు – శుక్రుడు
2. రవి – చంద్రుడు – కుజుడు – కేతువు
3. గురువు

| | |
|---|---|
| ధనిష్ట | – 3, 4 పాదాలు |
| శతభిషం | – 1,2,3,4 పాదాలు |
| పూర్వాభాద్ర | – 1,2,3 పాదాలు |

☆ నక్షత్ర గుర్తుపెట్టినవి : మొదటిది రాశి పేరు ప్రక్కన వ్రాసినది ఆ రాశి అధి పేరు, అని గమనించగలరు.

1. మిత్రగ్రహాలు : ఏ రాశిలో ఇచ్చినా ఆ రాశ్యాధిపతికి మిత్రులు
2. శత్రుగ్రహాలు : ఏ రాశిలో ఇచ్చినా ఆ రాశ్యాధిపతికి శత్రువులు
3. సమగ్రహాలు : ఏ రాశిలో ఇచ్చినా ఆ రాశ్యాధిపతికి సములు
4. ఆ రాశిలో ఉండే నక్షత్రాలు వాటి పాదాలు ఒక్కొక్క రాశిలో మూడు నక్షత్రాలు ఉండి మొత్తం అన్ని నక్షత్రాలకు కలిపి 9 పాదాలు ఉంటాయి.

**4. కర్కాటకరాశి–చంద్రుడు ☆**

1. రవి – బుధుడు
2. శత్రువులు లేరు
3. కుజుడు – గురువు – శుక్ర – శని

| | |
|---|---|
| పునర్వశు | – 4వ పాదం |
| పుష్యమి | – 1,2,3,4 పాదాలు |
| ఆశ్లేష | – 1,2,3,4 పాదాలు |

**10. మకరరాశి – శని ☆**

1. బుధ – రాహువు – శుక్రుడు
2. రవి – చంద్రుడు – కుజుడు – కేతువు
3. గురువు

| | |
|---|---|
| ఉత్తరాషాఢ | – 2,3,4 పాదాలు |
| శ్రవణం | – 1,2,3,4 పాదాలు |
| ధనిష్ట | – 1,2 పాదాలు |

**5. సింహరాశి – రవి ☆**

1. చంద్రుడు, కుజుడు, గురువు
2. శుక్ర – శని
3. బుధుడు

| | |
|---|---|
| మఖ | – 4 పాదాలు |
| పుబ్బ | – 4 పాదాలు |
| ఉత్తర | – మొదటి పాదం |

**9. ధనూరాశి – గురువు ☆**

1. రవి, చంద్రుడు – కుజుడు – కేతువు
2. బుధ – శుక్రుడు
3. శని

| | |
|---|---|
| మూల | – 1-2-3-4 పాదాలు |
| పూర్వాషాడ | – 1,2,3,4 పాదాలు |
| ఉత్తరాషాడ | – మొదటి పాదం |

**8. వృశ్చికరాశి – కుజుడు ☆**

1. రవి, చంద్రుడు – గురువు – కేతువు
2. బుధ – రాహువు
3. శుక్రుడు – శని

| | |
|---|---|
| విశాఖ | – 4వ పాదం |
| అనూరాధ | – 1,2,3,4 పాదాలు |
| జ్యేష్ట | – 1,2,3,4 పాదాలు |

**7. తులారాశి – శుక్రుడు ☆**

1. శని – బుధ – రాహువు
2. రవి – చంద్రుడు
3. కుజ – గురువు

| | |
|---|---|
| చిత్త | – 3,4 పాదాలు |
| స్వాతి | – 1,2,3,4 పాదాలు |
| విశాఖ | – 1,2,3 పాదాలు |

**6. కన్యారాశి – బుధుడు ☆**

1. రవి – శుక్రుడు
2. చంద్రుడు
3. గురువు – కుజుడు – శని

| | |
|---|---|
| ఉత్తర | – 2,3,4 పాదాలు |
| హస్త | – 1,2,3,4 పాదాలు |
| చిత్త | – 1, 2 పాదాలు |

# 2. గ్రహమైత్రి

ఇంతకుముందు నేను ఏయే రాశులలో ఏయే అధిపతులు ఉంటారో, ఏయే రాశులలో ఏయే నక్షత్రాలకు ఎన్ని పాదాలు ఉంటాయో సవివరంగా విశదీకరించాను. కాబట్టి గ్రహమైత్రిని పరిశీలించే ముందు రాశ్యాధిపతులు, రాశి నక్షత్రాలు, వాటి పాదాలు జాగ్రత్తగా లెక్కించాలి. లేకపోతే గ్రహమైత్రిలో తేడా వచ్చి మనం జాతక పరిశీలనలో పొరపాటు అంచనాలు వేయడానికి ఆస్కారం వుంది.

వధూవరుల జాతక చక్రం పరిశీలించేటప్పుడు వధువు రాశి, వరుని రాశి వాటి అధిపతులెవరో చూడాలి.

1. ఆ అధిపతులిద్దరూ ఒక్కరే అయితే పొంతన కుదిరినట్లే.
2. ఇద్దరిదీ ఏకరాశి అయితే రాశి పొంతన కుదిరినట్టేనన్న మాట.
3. రాశి వేరై రాశ్యాధిపతులు మిత్రులైతే పొంతన కుదిరినట్లే.
4. వధూవరుల రాశ్యాధిపతులు శత్రువులైతే వివాహం చేయకూడదు.

ఈ క్రింద రాశ్యాధిపతులకు మిత్రులెవరు శత్రువులెవరు సములెవరు అన్నది వ్రాస్తున్నాను.

| నెం. | గ్రహాల పేరు | మిత్రులు | శత్రువులు | సములు |
|---|---|---|---|---|
| 1. | సూర్యుడు | గురువు<br>చంద్రుడు<br>కుజుడు | శని<br>శుక్రుడు | బుధుడు |
| 2. | చంద్రుడు | బుధుడు, రవి | లేరు | కుజుడు, శని<br>శుక్రుడు, గురువు |
| 3. | కుజుడు | రవి, చంద్రుడు<br>గురువు, కేతువు | బుధుడు | శని, శుక్రుడు |
| 4. | బుధుడు | రవి, శుక్రుడు | చంద్రుడు | కుజుడు, గురువు,<br>శని |

| నెం. | గ్రహాల పేరు | మిత్రులు | శత్రువులు | సములు |
|---|---|---|---|---|
| 5. | గురువు | రవి, చంద్రుడు కుజుడు,కేతువు | బుధుడు, శుక్రుడు | శని |
| 6. | శుక్రుడు | బుధుడు, శని | రవి, చంద్రుడు | కుజుడు, గురువు |
| 7. | శని | బుధుడు, శుక్రుడు | చంద్రుడు, రవి, కుజుడు | గురువు |
| 8. | రాహువు | శుక్ర, శని | రవి, చంద్రుడు కుజుడు | బుధుడు, గురువు |
| 9. | కేతువు | రవి, చంద్రుడు కుజుడు | శుక్రుడు, శని | బుధుడు, గురువు |

పై పట్టిక ప్రకారం వధూవరుల రాశ్యాధిపతులు శత్రువులైతే నవాంశ చక్రం పరిశీలించాలి. ఒకవేళ నవాంశ చక్రంలో రాశ్యాధిపతులు మిత్రులైతే ఆ వధూవరులిద్దరికీ గ్రహమైత్రి, మిగిలిన అంశాలు బాగుంటే కుదిరినట్లే.

ఇంకొక ముఖ్యమైన విషయం ఏమంటే ఈ గ్రహమైత్రి అనే అంశం బ్రాహ్మణులకు అతి ముఖ్యమైనది అనే భావన ఎక్కువ ప్రచారంలో వుంది. కాని నేను ఇది అన్ని కులాలవారు పాటించదగ్గదని ఎందుకంటే దాంపత్యంలో బ్రాహ్మణులు కోరుకునే ప్రతి మంచి ఇతర కులాల వారు కూడా పొందాలని, "సర్వేజనా సుఖినోభవన్తు" అనేదే నా అభిలాష. వధూవరుల జాతక చక్రాన్ని పరిశీలించినపుడు గ్రహమైత్రి కుదరని పక్షంలో మిగిలిన విషయాలన్నిటికి పొంతన కుదిరినా జాతకం కుదరలేదని మీరు చెప్పడం శ్రేయస్కరం.

ఇదేవిధంగా వధూవరుల లగ్నాధిపతులకు కూడా మిత్రత్వం వుండాలి. అలా లేని పక్షంలో కనీసం సములుగానైనా వుండాలని మర్చిపోకూడదు.

చంద్రుడు ఏ రాశిలో వుంటాడో ఆ జాతకునికి ఆ రాశ్యాధిపతి జన్మ రాశి అవుతుంది. రాశ్యాధిపతి మరియు లగ్నాధిపతి అనుకూలతలే కాకుండా రాశి క్రమగణనం కూడా ఈ క్రింద ఇచ్చిన విధంగా పరిశీలించాలి. వారి ఇద్దరి రాశులు అనుకూలంగా వుండాలి గాని ప్రతికూలంగా ఉండకూడదు. ఏ రాశికి, ఏ రాశి ప్రతికూలమో ఈ క్రింద ఇస్తున్నాము.


వధువు రాశి నుంచి వరుని రాశి వరకు లెక్కపెట్టినపుడు అంటే కన్య చంద్రస్థానం నుంచి వరుని చంద్రస్థానం వరకు లెక్కపెట్టినప్పుడు. వరుని చంద్రుడు కనుక

1. ఇద్దరికీ ఒకే రాశి ఉంటే శుభం.
2. 2వ గృహంలో ఉంటే వైధవ్యం
3. 3వ గృహంలో ఉంటే దారిద్ర్యం, దుఃఖం, కష్టాలు
4. 4వ గృహంలో ఉంటే దారిద్ర్యపు బాధలు, అప్పులు
5. 5వ గృహంలో ఉంటే వైధవ్యం
6. 6వ గృహంలో ఉంటే సంతాన నష్టం, అంగవైకల్యపు సంతానం
7. 7వ గృహంలో ఉంటే అన్ని విధాల అభివృద్ధి, సంతోషం, సుఖం, దీర్ఘకాల సంసార జీవితం
8. 8వ గృహంలో ఉంటే స్త్రీ సంతానం
9. 9వ గృహంలో ఉంటే ధనధాన్యాలు, సుఖం, దీర్ఘ మాంగల్యం
10. 10వ గృహంలో ఉంటే ధనం, వాహనాలు, పేరుప్రఖ్యాతులు
11. 11వ గృహంలో ఉంటే జీవితం అంతా సంతోషం, తృప్తి
12. 12వ గృహంలో ఉంటే దీర్ఘకాల జీవితం, సంతృప్తి


పైన ఇచ్చిన అంశాలు బట్టి కన్య చంద్రుడు ఉన్న రాశి నుంచి మొదటి ఆరు రాశులలో పురుషుని చంద్రుడు అతని జాతకంలో ఉంటే వారి వివాహం క్షేమం కాదని గ్రహించండి. ఇంకొక విషయం ఏమిటంటే వధూవరుల చంద్రస్థానాల రాశులు ఒకటే అయితే శుభం. అలాగే ఇద్దరి చంద్రస్థానాధిపతులు ఒకరే అయినా దోషరహితం అని గ్రహించాలి.

ఈ క్రింది చక్రాలు 1,2 చూడండి.


ఈ చక్రాలలో వధువు చంద్రుడు మిథునంలోను, వరుని చంద్రుడు మీనంలోను





సవ్య చక్రం–1





అపసవ్య చక్రం–1





సవ్య చక్రం–1





అపసవ్య చక్రం–1





సవ్య చక్రం–2




అపసవ్య చక్రం–2





సవ్య చక్రం–2





అపసవ్య చక్రం–2

మొదటి చక్రంలో వధూ వరుల రాశ్యాధి పతులు ఇద్దరికీ బుధుడే. ఎందు కంటే వారి చంద్రులు ఇద్దరూ మిధునంలోనే ఉన్నారు. అలాగే 2వ చక్రంలో ఇద్దరి రాశులు వేరైనా ఇద్దరి చంద్రులు బుధాధి పత్యంలో ఉన్నారు. ఇలా ఉంటే శుభం అని గ్రహించండి. ఇద్దరికి చంద్రుడు ఏకస్థానంలో ఉంటే ఏకరాశి అవు తుంది. అలాగే ఇద్దరికి వేరే వేరే రాశులలో ఉన్నా, ఆ రెండు రాశులకు ఒకరే అధిపతి అయితే ఏకాధిపత్యం అవుతుంది.


ఇప్పుడు 3,4 చక్రాలు చూడండి.





సవ్య చక్రం–3




అపసవ్య చక్రం–3




సవ్య చక్రం–4




అపసవ్య చక్రం–4

**ఏకాధిపత్యం**

ఉన్నారు. కన్య చంద్రస్థానాల నుంచి వరుని చంద్రస్థానం 4 అయినా వారిద్దరి చంద్ర స్థానాల అధిపతి గురువే కాబట్టి చతుర్ధ స్థానదోషం ఉండదు.

చాలామంది గ్రహమైత్రి బాగుండి 18 కన్నా ఎక్కువ పాయింట్లు ఉంటే వివాహం చెయ్యవచ్చు అంటూంటారు. ఈ మాట సామాన్య ప్రజలు అంటే కొంచెం అర్థం ఉంది. కాని జ్యోతిష్యశాస్త్రంలో నిష్ణాతులు, మంచి పాండిత్యం గలవారు ఈ మాట అనరు. శాస్త్ర విహీనులు అంటున్నారు. అందుకనే నాకు చాలా బాధగా ఉంటుంది. ఎందుకంటే వధూవరుల జాతక పొంతన చూడడానికి తగిన జ్ఞానం లేక పంచాంగములోని పాయింట్లు చూసి చేసుకోమనడం చాలా దోషం. "గ్రహమైత్రి" అంటే ఏమిటో, గ్రహమైత్రిలో ఏమేమి చూడాలో చెప్పలేనివారు కూడా ధనసంపాదనే ధ్యేయంగా, ఆత్మవంచన చేసుకొని ఇతరుల వివాహ జీవితాలను తేలికగా తీసుకుంటూ ఇతరుల దాంపత్య జీవితాలను వారి కర్మకు వదలి వేస్తున్నారనేది అందరికీ తెలిసిన నగ్నసత్యం. ఇటువంటి మిడిమిడి జ్ఞాన జ్యోతిష్యులను మీరు దూరంగా ఉంచడం మేలు. అపరకర్మలు చేసేవారు, కృష్ణయజుర్వేదం చదువుకున్నవారు పురోహితులు. అలాగే పూజలు, వ్రతాలు చేయించేవారు లేక వాస్తుశాస్త్రం

తెలిసినవారు మరియు సిద్ధాంతులు అందరూ జ్యోతిష్యులుగా చెలామణి అవుతూ ధనార్జనలో ఉన్నారు. కాని వీరందరూ జ్యోతిష్యులు కారు. జ్యోతిష్యశాస్త్రాన్ని మాత్రమే పూర్తిగా గురుముఖంగా నేర్చుకున్నవారే జ్యోతిష్యులు. ఎలాగంటే రసాయన శాస్త్రంలో (Chemistry)ఎన్నిరకాల అంశాలు ఉన్నాయో మనకు తెలుసు. ఉదాహరణకు Industrial Chemistry, Organic Chemistry, Inorganic Chemistry and Biochemistry ఎలాగో, గణిత శాస్త్రంలో Calculus, Geometry, Arithmetic Trigonometry, Algebra ఎలాగో అలాగే **పూజారులు పూజారులే. పురోహితులు పురోహితులే. సిద్ధాంతులు సిద్ధాంతులే. వాస్తు నిపుణులు వాస్తు శాస్త్రము మాత్రమే చదివినవారు.** పైన చెప్పినవారందరు జ్యోతిష్యులు కారు. ఒక జ్యోతిష్యుడు ఆబ్ధీకము ఎలా చేయించలేడో అలాగే పురోహితుడు జ్యోతిష్యము చెప్పలేడని మీరు గ్రహించాలి. అందువల్ల వారు చెప్పినట్లు పాయింట్లు – పర్సంటేజ్‌లు లెక్కకు తీసుకుని వివాహాలు నిశ్చయం చేయకండి. ఒక వరుని, వధువు యొక్క జాతకం పూర్తిగా అన్ని కోణాలలో క్షుణ్ణంగా పరిశీలించాలి గాని దగ్గర సూత్రాలతో (Shortcuts) నిర్ణయానికి రాకూడదు. ఈ క్రింది వధువు – వరుని జాతకాలు చూడండి.

## రాశి చక్రం

ఈ రెండు జాతకచక్రాలను విశ్లేషిస్తే ఫలితాలు మీరే చూడండి.

| | | | |
|---|---|---|---|
| | | గు | కే |
| | **వరుడు** | | ల |
| | **జ్యేష్ఠ** | | బు కు |
| రా | చ | శ | శు ర |

| | | |
|---|---|---|
| గు కే | | |
| ల | **వరుడు** **జ్యేష్ఠ** | |
| బు కు ర శు | శ | రా చ |

| | | | |
|---|---|---|---|
| కే | ర బు | కు శు | శ |
| | **వధువు** | | |
| | **మఖ** | | చం |
| | ల | గు | రా |

| | | |
|---|---|---|
| శ కు శు | ర బు | కే |
| | **వధువు** **మఖ** | |
| చం రా | గు | ల |

1. లగ్నాధిపతులు : మిత్రులు
2. రాశ్యాధిపతులు: మిత్రులు
3. తారాబలం : పరమమిత్రతారలు
4. పంచాంగం పాయింట్లు : 34

గ్రహమైత్రి చాలా బాగుంది. పైగా 34 పాయింట్లు వచ్చాయి. కాని ఇద్దరికి వివాహం చేయకూడదు. ఎందుకంటే ఇప్పుడు దోషాలు పరిశీలిద్దాం.

1. వధువుకు సప్తమ స్థానంలో కుజ, శుక్ర సంయోగం
2. వధువు యొక్క శుక్రుడు రెండు పాపగ్రహాల మధ్య బంధింపబడి ఉన్నాడు.
3. సప్తమాధిపతి తన స్వక్షేత్రంలో ఉన్నా కుజ సంయోగంలో ఉన్నాడు. పైగా అతని మీద పుణ్య గ్రహ వీక్షణ కూడా లేదు.
4. కన్య జాతకంలో గురుబలం శూన్యమని గ్రహించాలి.
5. అష్టమాధిపతి పాపగ్రహంతో ఉన్నాడు. (బుధాధిత్యయోగం ఉన్నా యోగించదు)

**వరునికి :**

1. ద్వితీయ కుజుడు
2. రవి, శుక్ర కలయిక వల్ల శుక్ర బలం క్షీణించింది.
3. సప్తమాధిపతి అయిన శని ఉచ్ఛంలో ఉండి లగ్నాన్ని వీక్షిస్తున్నాడు.
4. శుక్రుడు రెండు పాప గ్రహాల మధ్య బంధింపబడి ఉన్నాడు.

పై దోషాల వల్ల దాంపత్య విచ్ఛిన్నం, విడాకులు, సుదీర్ఘ వియోగం, నడివయసులో వైధవ్యం రావడం లాంటివి జరగవచ్చు. కాబట్టి వీరి పొంతన కుదరనట్లే. ఇప్పుడు మీకు మీరే నిర్ణయించుకోండి. పాయింట్లు గ్రహమైత్రి చాలా ? ఇలాంటి చక్రాలు ఎన్నో నా దగ్గరకు వస్తూనే ఉంటాయి. నిర్లక్ష్యంగా కాక అతి శ్రద్ధగా పరిశీలించాలని నా సలహా. ఈ సలహాను గురుమాటగా భావిస్తే మీరు ఎంతోమందికి మేలు చేసినవారు అవుతారు. ఎందుకంటే ఎంతమంది జాతకాలను చూశాను, వారి వద్ద నుంచి ఎంత సంపాదించాను అన్నది జ్యోతిష్యుడు అనుకుంటే మీరు ఎంత మంచి పండితుడికి చూపించాను, ఆయన ఎంత అనుభవంతో పరిశీలిస్తాడు అన్నది మీరు చూసుకోవాలి.

## లగ్నకూటమి

సాధారణంగా పండితులందరూ వధూవరుల ఇద్దరి జాతకములను విశ్లేషించేటప్పుడు వారిద్దరి లగ్నాధిపతులు మిత్రులా లేక శత్రువులా అని తప్పక చూస్తారు. ఒకవేళ మిత్రులయితే మంచిదని, సములయినా ఫరవాలేదని, శత్రువులైతే మంచిది కాదని నిర్ణయిస్తారు.

లగ్న కూటమి అనగా ఆ వధూవరుల లగ్నస్థానాలు కూడా అనుకూలమా, ప్రతికూలమా లేక మధ్యమమా అనేది తప్పక చూడాలి. అంటే లగ్నాధిపతుల మిత్రత్వంతో పాటు లగ్నరాశుల అనుకూలత కూడా ముఖ్యమేనని మనం తెలుసుకోవాలి.

వధువు లగ్నం మీన లగ్నం, వరుని లగ్నం వృశ్చిక లగ్నం అయితే లగ్న కూటమి అనుకూలం.

అలాగే ఇద్దరి యొక్క లగ్న స్థానాల అనుకూలత ఉండాలంటే కన్య లగ్నస్థానం నుంచి వరుని లగ్నస్థానం 3-5-7-9 అయి ఉండాలి. అలా ఉంటే ఆ లగ్నరాశులకు అనుకూలత ఉన్నట్లే. ఇద్దరిదీ ఏకలగ్నం అయినా శుభమని గ్రహించాలి. అలా ఉండటం వల్ల ఆ ఇద్దరి రాశులు కుదిరినట్లే. ఈ లగ్నకూటమి యొక్క అనుకూలత చూడటం వలన వివాహమైన తర్వాత వారి జీవనవిధానాన్ని మనము తెలుసుకొనవచ్చును. మీ సౌలభ్యం కోసం ఈ క్రింది పట్టికను పరిశీలించండి. దీని ద్వారా ఏ లగ్న వధువుకి, ఏ లగ్న వరుడు పొంతన కుదురుతుందో వివరముగా తెలుసుకొనవచ్చు.

| | వధువు లగ్నరాశి | అనుకూల లగ్న రాశులు | మధ్యమం | ప్రతికూలం |
|---|---|---|---|---|
| 1. | మేషం | సింహం, ధనస్సు, మిథునం, కుంభం, మేషం | తుల, వృషభం | కర్కాటకం, మకరం కన్య, మీనం, వృశ్చికం |
| 2. | వృషభం | కన్య, మకరం, వృషభం కర్కాటకం, మీనం | వృశ్చికం మిథునం | సింహం, కుంభం, తుల, ధనస్సు, మేషం |
| 3. | మిథునం | తుల, కుంభం, మిథునం సింహం, మేషం | ధనస్సు, కర్కాటకం | కన్య, మీనం, వృశ్చికం, మకరం, వృషభం |
| 4. | కర్కాటకం | వృశ్చికం, మీనం, కర్కాటకం, కన్య వృషభం | మకరం సింహం | తుల, మేషం, ధనస్సు, కుంభం, మిథునం |

| | వధువు లగ్నరాశి | అనుకూల లగ్న రాశులు | మధ్యమం | ప్రతికూలం |
|---|---|---|---|---|
| 5. | సింహం | ధనస్సు, మేషం, సింహం తుల, మిథునం | కుంభం, కన్య | వృశ్చికం, వృషభం, మకరం, మీనం, కర్కాటకం |
| 6. | కన్య | మకరం, వృషభం, కన్య, వృశ్చికం, కర్కాటకం | మీనం, తుల | ధనస్సు, మిథునం, కుంభం, మేషం, సింహం |
| 7. | తుల | కుంభం, మిథునం, తుల, ధనస్సు, సింహం | మేషం, వృశ్చికం | మకరం, కర్కాటకం, మీనం, వృషభం, కన్య |
| 8. | వృశ్చికం | మీనం, కర్కాటకం, వృశ్చికం, మకరం, కన్య | వృషభం, ధనస్సు | కుంభం, సింహం, మేషం, మిథునం, తుల |
| 9. | ధనస్సు | మేషం, సింహం, ధనస్సు, కుంభం, తుల | మిథునం, మకరం | మీనం, కన్య, వృషభం, కర్కాటకం, వృశ్చికం |
| 10. | మకరం | వృషభం, కన్య, మకరం, మీనం, వృశ్చికం | కర్కాటకం, కుంభం | మేషం, తుల, మిథునం, సింహం, ధనస్సు |
| 11. | కుంభం | మిథునం, తుల, కుంభం, మేషం, ధనస్సు | సింహం, మీనం | వృషభం, వృశ్చికం, కర్కాటకం, కన్య, మకరం |
| 12. | మీనం | కర్కాటకం, వృశ్చికం, మీనం, వృషభం, మకరం | కన్య, మేషం | మిథునం, ధనస్సు, సింహం, తుల,కుంభం |

పై పట్టిక ఎలా తయారుచేయబడిందో దానికి మూలకారణాలేమిటో నేను వివరణ కావాలనే ఇవ్వలేదు. గ్రంథవిస్తరణ భీతిచేత ఈ అంశం విడువబడిందని పాఠకులు గ్రహించి నన్ను మన్నించాలి.

# 3. తారాబలం

మనం "తారాబలం" అనే మాటను అనేక పేపర్లలో, పుస్తకాలలో చూస్తూ ఉంటాము. అది చూడగానే ఆ వారపత్రిక లేక మాసపత్రిక లేక దినపత్రికలలోని ఫలితాలను చదివి మరల మరచిపోతూ వుంటాము. కాని వివాహానికి ముందు మనం చూసే తారాబలం వేరు. అంటే వధువు యొక్క జన్మనక్షత్రంతో వరుని యొక్క జన్మ నక్షత్రం పొంతన ఎలా వుంది అని తెలుసుకోవడం కోసం ఈ తారాబలం ఉపయోగ పడుతుంది. వధూవరుల నక్షత్ర పొంతన కుదరని పక్షంలో వారిద్దరికీ వివాహం శుభప్రదం కాదు. కాబట్టి నక్షత్ర పొంతన కుదిరిన తర్వాతే వివాహం చేయడం అత్యవసరం.

వధూవరుల తారాబలం చూడాలంటే వధువు యొక్క జన్మనక్షత్రం నుంచి వరుని యొక్క జన్మనక్షత్రం వరకూ లెక్కపెట్టాలి. అంటే వధూవరుల జన్మ నక్షత్రాలు రెండూ కూడా కలిపి లెక్కపెట్టాలి. అలా లెక్కపెట్టగా వచ్చిన సంఖ్యను తొమ్మిది చేత భాగాహారించాలి. అలా భాగించగా మిగిలిన శేషం సరిసంఖ్య అయితే శుభం. బేసిసంఖ్య అయితే పొంతన కుదరలేదని అర్థం. బేసిసంఖ్యలలో 3-5-7 మాత్రమే తీసుకోవాలి. 9 సంఖ్య తీసుకోకూడదు. బేసిసంఖ్యల మరియు సరి సంఖ్యల వివరాలు వాటి ఫలితాలు ఈ క్రింద ఇవ్వబడ్డాయి. శేషం సున్నా వస్తే సరిసంఖ్యగానే భావించాలి.

| శేషం | తారపేరు | ఫలితం | పొంతన |
|---|---|---|---|
| 1. | జన్మతార | ఒకరి మరణం సంభవించవచ్చు | మంచిది కాదు |
| 2. | సంపత్తార | ధనం - అభివృద్ధి | మంచిది |
| 3. | విపత్తార | ప్రమాదాలు మొదలైనవి | మంచిది కాదు |
| 4. | క్షేమతార | ప్రేమానురాగాలు | మంచిది |
| 5. | ప్రత్యక్‌తార | కష్టాలు, కలహాలు | మంచిది కాదు |
| 6. | సాధనతార | అభివృద్ధి | మంచిది |
| 7. | నైధున తార | కష్టనష్టాలు | మంచిది కాదు |
| 8. | మిత్రతార | ఇద్దరి మధ్య స్నేహభావం | మంచిది |
| 9. | పరమమిత్రతార | మిక్కిలి అనురాగం | చాలా మంచిది |

ఒక పాఠకుడు చిత్తూరు నుంచి తారాబలం వివాహానికి చూడనవసరం లేదని అది ప్రయాణాలకు మాత్రమని, ఇంకా ఎవరికి తోచిన విధంగా వారు ప్రచారం చేస్తున్నారని, అందువలన దోషం అని చెప్పినా, దానికి పరిహారాలు వ్రాయలేదని, ఈ సారి ముద్రణలో ఈ విషయం చాలా ముఖ్యమేకాకుండా అందరికి ఉపయోగమని అందుకని అన్ని వివరాలు వ్రాయమని ఒక ఇమెయిల్ వచ్చింది. ఆ పాఠకుడు జ్యోతిష్యపండితుడు కాకపోయినా కొంచెం ప్రావీణ్యం ఉందని వ్రాశాడు. ఆ పాఠకునికి నా కృతజ్ఞతలు. ఎందుకంటే తాను అడిగిన ప్రశ్నకు జవాబుగా నేను అతడు అడిగినట్లుగా పరిహారాలే కాకుండా ఇతర విషయాలను కూడా సంక్షిప్తంగా పొందుపరిస్తే ఆ పాఠకుడు అడిగినందుకు సరియైన జవాబు ఇచ్చినందుకు ఆ పాఠకుడికి సంతోషం కలుగుతుంది. మిగిలినవారికి ఎంతో సమాచారం దొరుకుతుంది. ఒక ముఖ్య విషయం ఏమంటే వివాహానికి తారాబలం పరిశీలన అనవసరం అని విశ్లేషించే మహాశయులు, మహోన్నత ఉద్దండ జ్యోతిషశాస్త్ర ఋషి పుంగవులైన పరాశర, కాళిదాసు, వరరుచి జైమిని, ఆర్యభట్టు కంటే గొప్పవారేమీ కాదు. కాబట్టి వారి శాస్త్ర విహీనతకు పసలేని సంస్కార ప్రవచనాల సలహాలను పాటించకండి. వారు చెప్పినదానికి శాస్త్ర ప్రామాణికము చూపించమనండి. శాస్త్ర శుద్ధిలేని, సంభాషణలు, శుష్క ప్రవచనాలు చెప్పమనకండి. చెప్పినా నమ్మకండి. అనుమాన బీజం వేయడం తేలిక. అది తుడిచేయడం చాలా కష్టం. అందుకనే జ్యోతిష చర్చ అందరితో చేయకండి. జ్యోతిషశాస్త్రము చదువు కొన్నవారితోనే చర్చలు చేయండి. ఒకరికి కడుపు నొప్పి వస్తే పదిమందితో చెప్తే పది సలహాలు ఇస్తారు. ఆ సలహాలు అన్నీ పాటిస్తే ఏమౌతుంది? కాంపౌండర్ దగ్గరకు వెళ్లకూడదు. డాక్టరు దగ్గరకే వెళ్లాలని మర్చిపోకండి.

ఇక పాఠకుడు అడిగిన వివరాలకు ఒక విశ్లేషణ ఈ క్రింద ఇస్తున్నాను. మీ యొక్క సౌలభ్యం కోసం అన్ని వివరాలు ఈ క్రింద ఒక పట్టిక రూపంలో ఇస్తున్నాను. ప్రక్క పేజీ చూడండి.

ప్రక్క పేజీలో ఇచ్చిన పట్టికను మీరు పరిశీలించినట్లయితే ఏ అంశం మంచిది కాదని చెప్పబడిందో, ఆ అంశానికి అధిపతి పాపగ్రహమే అయిందని గమనించండి. పాప గ్రహాధిపతులుగా చెప్పబడిన వధూవరుల ఇద్దరి నక్షత్రాల సమ్మేళనము అంటే రెండు పాపగ్రహాల సంయోగం వల్ల ఫలితం ఎక్కువ దోష ఫలితమే వస్తుంది. కాబట్టి వధూవరులిద్దరికి కన్యతార నుంచి వరుని తార వరకు పరిశీలించినపుడు వచ్చే తారా బలాధిపతి పాపగ్రహము కాకుడదు. దీనిలో ఎంతో సత్యముందని గ్రహించండి.

# తారాబల విశ్లేషణ

| తారాబలం | అధిపతి | వాహనము | నక్షత్రం | విశ్లేషణ |
|---|---|---|---|---|
| 1.జన్మతార మంచిదికాదు | సూర్యుడు | నెమలి | తృతీయ పాదం దోషం ఎక్కువ | దేహ నాశనము కలిగించును. అంటే మరణం శాకం దానం చేయాలి. |
| 2.సంపత్తార మంచిది | బుధుడు | గుఱ్ఱము | దోషం లేదు | ధనలాభం సుఖం కలిగించును. దరిద్రబాధ ఉండదు. |
| 3.విపత్తార మంచిదికాదు | రాహువు | మేక | ప్రథమపాదంలో ఎక్కువ దోషం | కలహాలు, అపార్థాలు, కష్టాలు, కన్నీళ్లు, దుఃఖం. బెల్లం దానం చేయాలి. |
| 4.క్షేమతార మంచిది | గురువు | ఏనుగు | దోషంలేదు | మనోధైర్యము క్షేమజీవనం సుఖం, శాంతి ఉంటాయి. |
| 5.ప్రత్యక్తార మంచిదికాదు | కేతువు | కాకి | చతుర్థపాదంలో ఎక్కువ దోషం | మృత్యువు రావచ్చు. జీవనహాని, కార్యహాని అభివృద్ధి ఉండదు. న్యూనతా భావం |
| 6.సాధనతార | చంద్రుడు | నక్క | | సాధనమున పనులు సమకూరు ధరలోన అనేది నిజం చేసుకుంటారు. దంపతులు అన్యోన్యంతో సహకరించుకొని కార్యసాధన చేసుకొని సుఖశాంతులతో జీవిస్తారు. |
| 7.నైధనతార మంచిదికాదు | శని | సింహం | రెండవపాదం ఎక్కువదోషం | శతృహాని ధన నష్టము దుఃఖ జీవితం అకాలమరణం |
| 8.మిత్రతార మంచిది | శుక్రుడు | గరుత్మంతుడు | | ప్రియ సంభాషణ సుఖ సంతోషములు స్త్రీ సౌఖ్యం కళాపోషణ విశేష సుఖము రూపారాధన |
| 9.పరమమిత్రతార | కుజుడు | హంస | | కష్టపడి కార్యసాధన చేసుకుంటారు. సులభంగా ఏదీ రాదు. అందరితో మిత్రత్వం, సుఖ జీవితం |

ఒకవేళ తప్పని పరిస్థితులలో వివాహం చేయాల్సి వచ్చినపుడు దోష పరిహారార్థం కొన్ని విషయాలు మనకు శాస్త్ర రచనలో తెలియపర్చారు కాబట్టి ఆ పరిహారాలు మనం ఇప్పుడు తెలుసుకుందాం.

1. జన్మతార దోషానికి శాక దానము చేయాలి. శాకము అంటే మాంస సంబంధము లేనిది. ప్రకృతి సిద్ధముగా లభించేది అని అర్థం. అందుకనే శాకాహారము మాంసాహారము అంటారు. ప్రకృతి సిద్ధంగా భూమి నుంచి పుట్టినది శాకాహారము. ఒక జంతువును క్రూరంగా తలనరికి దాని కళేబరాన్ని కాల్చి తినడాన్ని మాంసాహారం అంటారు. అందుకనే సాత్వికము, సహజ సిద్ధమైన కూరగాయలు దానం చేయమని శాస్త్రము చెబుతుంది. ఆ శాక దానం చేసేవారికి శోకం ఉండదు. అందుకనే శోక దోష నివారణార్థం శాకం దానం చేయాలి. ప్రకృతిలో ముఖ్యమైన రంగు ఆకుపచ్చ రంగు. ఇది అభివృద్ధికి, దుఃఖ నాశనానికి, సంకేతం. అందువల్ల జన్మతార దోష నివారణార్థం ఆకుపచ్చ కూరలే దానం చేయాలి. అలా చేస్తే పూర్తి పుణ్య ఫలం దానం ద్వారా దొరుకుతుంది. అందువల్ల దోసకాయలు, వంకాయలు, సర్పరూపమైన పొట్లకాయలు, చేదును పంచే కాకరకాయలు దానం చేయకూడదు. అలాగే తమోగుణాన్ని పెంచే విదేశి కూరలు దానం చేయకూడదు. రామములగు పండ్లు రక్తవర్ణము కాబట్టి దానానికి అనర్హము అని గమనించాలి. ఆకుకూరలు దానం చేసినా దానితోపాటు మరొక ఆకుపచ్చ రంగు ఉన్న కాయగూరలు ఇచ్చి తీరాలి.

దానం అంటే ఒక గుప్పెడు లేదా దోశడు నిండా తీసుకుని స్వహస్తాలతో దానం చేయడం అని అర్థం. అంతేకాని ఎన్ని కిలోలు అని లెక్కకాదు. శాస్త్రంలో ఎక్కడా కిలోలు, పౌండ్లు అనే లెక్క ఉండదని తెలుసుకోండి. ముందుగానే పళ్లెంలో పోసి ఉంచిన కాయగూరలను దోశడు తీసుకొని దానం చేయాలి. పళ్లెం అంతా ఎత్తిపోయకూడదు. ఎన్ని దోశళ్లు అనే లెక్కలేదు. దాన గ్రహీత తృప్తి చెందేవరకు దానం చేస్తూనే ఉండాలి. ఎందుకంటే పళ్లెంలో ఒక పావుకిలో గోరుచిక్కుడో లేక దొండకాయలో పోసి పళ్లెంతో మొత్తం వంచేస్తే ఇంక లేదని చెప్పినట్లవుతుంది. దాన గ్రహీత తృప్తి చెందకపోయినా, ఆ సంగతి చెప్పక అసంతృప్తిగానే వెళ్లిపోతాడు. అలా దాన గ్రహీత వెళ్లిపోతే మీరు చేసిన ఆ దానం సంపూర్ణ దానం కాదు. అందువల్ల మీకు ఫలం చేకూరదు అని గ్రహించండి. సగం తృప్తి చెంది వెళ్లాడు కాబట్టి సగం పుణ్యం వస్తుందనో లేక దానం మనకు తోచింది ఇచ్చాము అనే వాదన ఆత్మవంచనకు ప్రతిరూపమే. సగం భోజనం పెట్టి మిమ్మల్ని పొమ్మంటే సగం పుణ్యం కోసం దీవెన ఇస్తారా? లేక తిట్టుకుంటూపోతారా? కాబట్టి లౌక్యంగానో నిక్కుగానో ఆలోచించి చెప్పే మహాశయుల మాటలు నమ్మకండి.

ఈక్రింది ఉదాహరణలు చూడండి. వధూ నక్షత్రం కృత్తిక, వరుని నక్షత్రం పునర్వశు. కాబట్టి కృత్తికా నక్షత్రం నుంచి పునర్వశు వరకు లెక్కపెడితే వచ్చే సంఖ్య 5. ఈ 5ను తొమ్మిది పెట్టి భాగించలేము. కాబట్టి ఆ సంఖ్యను అలాగే యథాతథంగా తీసుకుంటే బేసి సంఖ్య 5 అవుతుంది. 5 అంటే ప్రత్యక్తార. పైన ఇచ్చిన ప్రకారం ప్రత్యక్తార మంచిది కాదు. కాబట్టి వధూవరుల జాతక పొంతన కుదరలేదని అర్థం చేసుకోవాలి. అంటే కృత్తిక నక్షత్ర వధువుకు మరియు పునర్వశు నక్షత్ర వరునకు వివాహం కుదరదు.

**రెండవ ఉదాహరణ :** వధువు నక్షత్రం ఉత్తరాభాద్ర మరియు వరుని నక్షత్రం స్వాతి. వధూ నక్షత్రం నుంచి లెక్కపెడితే వరుని నక్షత్రం "17" అవుతుంది. ఆ పదిహేడు సంఖ్యను తొమ్మిది పెట్టి భాగిస్తే ఎనిమిది శేషం మిగులుతుంది. ఎనిమిది అంటే మిత్ర తార కాబట్టి తారాబలం కుదిరిందని భావించాలి. అంటే ఉత్తరాభాద్ర నక్షత్ర వధువుకు మరియు స్వాతి నక్షత్ర వరునకు వివాహం చేయవచ్చు.

మనకున్న 27 నక్షత్రాలను మూడు భాగాలుగా విభజించుకోవాలి. ఒక్కొక్క భాగంలో తొమ్మిదేసి నక్షత్రాల చొప్పున వస్తాయి. మొదటి భాగానికి జన్మనక్షత్రమని, రెండవ భాగానికి అను జన్మనక్షత్రమని, మూడవభాగానికి త్రిజన్మ నక్షత్రమని పేర్లు. మనం ఈ నక్షత్ర విభజన చేసేటప్పుడు ఎప్పుడూ వధువు నక్షత్రం మొదటి వరుసలో మొదటి నక్షత్రంగా ప్రారంభించాలి. ఆ తర్వాత వరుస క్రమంలో మిగిలిన నక్షత్రాలన్నీ మూడు వరుసలుగా ఒక్కొక్క వరుసకు 9 నక్షత్రాలు వచ్చే విధంగా తీసుకోవాలి. ఈ క్రింది ఉదాహరణ చూడండి. వధువు యొక్క నక్షత్రం అనూరాధ అనుకుందాం.

| సంఖ్య | జన్మ నక్షత్రం | సంఖ్య | అనుజన్మ నక్షత్రం | సంఖ్య | త్రిజన్మ నక్షత్రం |
|---|---|---|---|---|---|
| 1. | అనూరాధ | 10. | ఉత్తరాభాద్ర | 19. | పుష్యమి |
| 2. | జ్యేష్ఠ | 11. | రేవతి | 20. | అశ్లేష |
| 3. | మూల | 12. | అశ్వని | 21. | మఖ |
| 4. | పూర్వాషాఢ | 13. | భరణి | 22. | పుబ్బ |
| 5. | ఉత్తరాషాఢ | 14. | కృత్తిక | 23. | ఉత్తర |
| 6. | శ్రవణం | 15. | రోహిణి | 24. | హస్త |
| 7. | ధనిష్ట | 16. | మృగశిర | 25. | చిత్త |
| 8. | శతభిషం | 17. | ఆరుద్ర | 26. | స్వాతి |
| 9. | పూర్వాభాద్ర | 18. | పునర్వసు | 27. | విశాఖ |

మనం 3–5–7 శేషం వస్తే పనికిరాదని ఇంతకుముందే చెప్పుకున్నాం. కాని ఈ 3–5–7 అను జన్మ నక్షత్ర వరుసలో ఉన్నట్లయితే కొన్ని పాదాలకు సడలింపు వుంది.

ఉదాహరణకు, వధువు నక్షత్రం అనూరాధ అయితే అనూరాధ నుంచి తొమ్మిదేసి నక్షత్రాలు ఒక్కొక్క వరుసలో పై పట్టికలో చూపించిన విధంగా వ్రాసుకోవాలి. తారాబలం మనం చూసినప్పుడు అంటే 3వ తార విపత్తారగాను, 5వ నక్షత్రం ప్రత్యక్తారగాను, 7వ నక్షత్రం నైధునతార అని అవి బేసి సంఖ్యలు కాబట్టి పనికిరావని చెప్పాము. కాని ఆ 3–5–7 నక్షత్రములకు అను జన్మ నక్షత్ర వరుసలో మినహాయింపు ఉంటుంది. కాని జన్మతార, వరుసలో 1వ నక్షత్రానికి మాత్రం మినహాయింపు లేదు. కాబట్టి జన్మ నక్షత్ర వరుసలో వధువు నక్షత్రం అనూరాధ తారతో అశ్విని కుదరదు. ఎందుకంటే వధువు నక్షత్రం నుంచి మామూలుగా లెక్కపెట్టినప్పుడు వరుని నక్షత్రం 12వ నక్షత్రం అవుతుంది. 12ని 9 అంకెతో భాగిస్తే శేషం 3 వస్తుంది. అందువల్ల మామూలుగా బేసి సంఖ్య అయిన 3 పనికిరాదని అనుకున్నా, ఆ నక్షత్రం అను జన్మ వరుసలో వుంది కాబట్టి పనికి వస్తుంది. అయితే మొదటిపాదం తప్ప మిగిలిన పాదాలు 2–3–4 మాత్రమే పనికి వస్తాయి.

అదేవిధంగా వరుని నక్షత్రం కృత్తిక అనుకుందాం. అనూరాధ నుంచి లెక్కపెడితే కృత్తిక 14వ నక్షత్రం అవుతుంది. 14ని 9 చేత భాగిస్తే 5 శేషం వస్తుంది. మామూలుగా అయితే 5వ నక్షత్రం ప్రత్యక్తార అవుతుంది. కాబట్టి పనికిరాదనుకున్నా వరుని నక్షత్రం అను జన్మ నక్షత్ర వరుసలో వుంది కాబట్టి వివాహానికి పనికివస్తుందని గ్రహించాలి. అయితే మొదటి మూడు పాదాలు మాత్రమే పనికివస్తాయి. 4వ పాదమైతే పొంతనకు పనికిరాదు.

ఇప్పుడు వరుని నక్షత్రం మృగశిర అనుకుందాం. అనూరాధ నుంచి లెక్కపెట్టినప్పుడు మృగశిర 16వ నక్షత్రం అవుతుంది. 16ని 9 చేత భాగిస్తే 7 శేషం వస్తుంది. మామూలుగా 7 శేషం వస్తే పనికిరాదనుకున్నా అను జన్మ వరుసలో వుంది కాబట్టి జాతక పొంతన కుదిరిందని గ్రహించాలి. అయితే మూడవ పాదం మాత్రం పనికిరాదని మర్చిపోకూడదు. అంటే 1–2–4 పాదాలు మాత్రమే పనికివస్తాయి.

హస్త నక్షత్ర జాతకురాలికి ముఖ్యంగా మనం పరిశీలించవలసింది ఏమిటంటే ఆ జాతకులకు విపత్తార, ప్రత్యక్తార దోషములు వుండవు. అందువల్ల "ఉత్తర" అనే పేరుతో మొదలయ్యే మూడు నక్షత్రాలు హస్త జాతకురాలికి సరిపోతాయి. ఆ మూడు నక్షత్రాలు ఏమంటే ఉత్తరాషాఢ, ఉత్తరాభాద్ర, ఉత్తరఫల్గుని.

**ఏకనక్షత్రం:** వధూవరులది ఇద్దరిదీ ఒకే నక్షత్రం అయినప్పుడు వారిరువురకు వివాహం చేయవచ్చునా లేదా అనే మీమాంస కలుగుతూ వుంటుంది. మనకున్న 27 నక్షత్రాలలో ఎనిమిది నక్షత్రాలు వధూవరులిద్దరికీ ఒకటే అయితే పనికిరావు. ఆ పనికిరాని ఎనిమిది నక్షత్రాల పేర్లు ఈ క్రింద ఇస్తున్నాను.

1. భరణి 2. అశ్లేష 3. స్వాతి 4. జ్యేష్ఠ 5. మూల 6. ధనిష్ఠ 7. శతభిషం 8. పూర్వాభాద్ర

వధూవరుల ఇద్దరి నక్షత్రాలు ఏక నక్షత్రమైనప్పుడు పనికివచ్చే మిగిలిన 19 నక్షత్రాల పేర్లు ఈ క్రింద ఇస్తున్నాను.

1. అశ్వని 2. కృత్తిక 3. రోహిణి 4. మృగశిర 5. ఆరుద్ర, 6. పునర్వసు, 7. పుష్యమి, 8.మఖ, 9. పుబ్బ, 10. ఉత్తర, 11. హస్త, 12. చిత్త, 13. విశాఖ, 14. అనూరాధ, 15. పూర్వాషాఢ, 16. ఉత్తరాషాఢ, 17. శ్రవణం, 18. ఉత్తరాభాద్ర, 19. రేవతి

ఏకనక్షత్రం మూడు భాగాలుగా రాశి ప్రకారం విడదీయబడుతుంది కాబట్టి మొదటి భాగం పరిశీలిద్దాం : వధూవరుల నక్షత్రాలు ఒకటే అయి వారి నక్షత్ర పాదాలు అన్నీ ఒకే రాశిలో ఉంటే అటువంటి నక్షత్రాలలో రోహిణి, ఆరుద్ర, మఖ, హస్త, విశాఖ, శ్రవణం, రేవతి అన్ని పాదాలు ఒకే రాశిలో ఉంటాయి. కొంతమంది పండితులు వరుని నక్షత్ర పాదానికి తర్వాత పాదం వధువు నక్షత్రానికి ఉండాలన్న నిబంధన విధించారు. ఏక నక్షత్రంలో అన్ని పాదాలు ఒకే రాశిలో ఉన్నప్పుడు పాద భేదంతో పని లేదని మరి కొంతమంది పండితులు అంటారు. వీరితో నేను ఏకీభవిస్తున్నాను. ఉదాహరణకు, 1. వధూవరుల ఏకనక్షత్రాలలోని పాదాలు సమభాగంగా రెండు రాశులలో ఈ క్రింది నక్షత్రాలకు ఉంటాయి. ఇద్దరిది ఒకే పాదమయినా దోషం కాదు.

1. మృగశిర, 2. చిత్త, 3. ధనిష్ట.

ఇలా ఉన్నప్పుడు వరుని నక్షత్ర పాదం ముందు రాశిలోనూ వధువు నక్షత్ర పాదం తర్వాతి రాశిలోనూ ఉండాలి.

2. వధూవరులు ఏకనక్షత్ర పాదాలు మొదటి పాదం మాత్రం ఒక రాశిలోను మిగిలిన మూడు పాదాలు తర్వాత రాశిలోను ఈ క్రింది నక్షత్రాలకు ఉంటాయి.

1. కృత్తిక, 2. ఉత్తర, 3. ఉత్తరాషాఢ.

ఈ విధంగా ఉన్నప్పుడు వరుని నక్షత్రపాదం 2-3-4 అయి వుండాలి.

3. ఏక నక్షత్రం మొదటి మూడు పాదాలు ఒక రాశిలో ఉంటే తర్వాత రాశిలో ఉండే నక్షత్రాలు : 1. పునర్వశు, 2. విశాఖ, 3. పూర్వాభాద్ర. ఈ విధంగా ఉన్నప్పుడు వరుని నక్షత్ర పాదం ఒకటి–రెండు–మూడు అయి వుండకూడదు.

నక్షత్రాలలో ఆఖరి నక్షత్రమైన రేవతి నక్షత్రంలోని అన్ని పాదాలు అత్యంత పుణ్యమైనవని పండితుల అభిప్రాయం. అందువల్ల రేవతి నక్షత్రంతో ఏ నక్షత్రంను పోల్చకూడదు. వరుని నక్షత్రం అశ్విని లేక భరణి అయినా ఆ రెండు రేవతి నక్షత్రంతో పొంతన కుదర్చవచ్చును.

వధూ నక్షత్రములు కృత్తిక, ఆశ్లేష, శతభిషం అయితే వరుని నక్షత్రం భరణి, పుష్యమి, ధనిష్ట కాకూడదు. ఒకే రాశిలో ఉన్నప్పటికీ పొంతన కుదర్చకూడదు.

## మూఢ నమ్మకములు గల నక్షత్రాలు :

1. మూల నక్షత్రంలో పుట్టిన కన్యను కోడలిగా తెచ్చుకుంటే మామగారు చనిపోతారని,
2. ఆశ్లేష నక్షత్రంలో పుట్టిన కన్యను కోడలిగా తెచ్చుకుంటే అత్తగారికి మృత్యువని,
3. జ్యేష్ఠ నక్షత్రంలో పుట్టిన కన్యను కోడలిగా తెచ్చుకుంటే కోడలి యొక్క బావగారు, అంటే ఇంటికి పెద్ద కుమారుడు చనిపోతాడని,
4. విశాఖ నక్షత్రంలో పుట్టిన కన్యను కోడలిగా తెచ్చుకుంటే ఆఖరి మరిది చనిపోతాడని,
5. మఖ నక్షత్రంలో పుట్టిన కన్యను కోడలిగా తెచ్చుకుంటే ఇంట్లో ఎవరైనా చనిపోవచ్చని.... ఇలా చాలా మూఢనమ్మకాలు ప్రతివారి హృదయంలో పాతుకుపోయాయి. మేము అందరూ అనుకున్న ఈ నక్షత్రాలలో పుట్టిన వివాహిత స్త్రీలను అనేకమందిని కలిసి విచారించి చూడగా, ఇవన్నీ పూర్తిగా సత్యానికి దూరమని, అంధవిశ్వాసాలని క్షుణ్ణంగా తెలుసుకున్నాను. ఎందుకంటే మా పరిశీలనలో అశ్లేష నక్షత్రంలో పుట్టిన కన్యకు వివాహమై 33 సం॥ గడిచినా ఆమె అత్తగారు ఈనాటి వరకు పరిపూర్ణ ఆరోగ్యంతో సంతోషంగా పూర్ణాయిష్షుగా జీవిస్తోంది.

ఇదే విధంగా మూల, మఖ, జ్యేష్ఠ... ఇవన్నీ కూడా పరిశీలించి చూసి మేము తెలుసుకున్నదేమంటే ఒక నక్షత్రంలో పుట్టిన కన్య వివాహమైతే, మరో నక్షత్రంలో పుట్టిన

స్త్రీ లేక పురుషుడు కాని ఎట్టి పరిస్థితులలోను మరణించరని రూఢిగా తెలుసుకున్నాను. అందువల్ల జాతక పరిశీలనలో అన్ని విషయాలకు పొంతన కుదిరితే నక్షత్రం పేరు మీద అనవసరంగా భయానికి లోనై విద్య, వినయం, వివేకం, గుణం, సాంప్రదాయం, సంస్కారం, ఉద్యోగం, రూపం గల వధువులను విసర్జించక మీరు ఆ కన్యను కోడలిగా తెచ్చుకోవచ్చు. పంచాంగాలలో వ్రాసేవి నిజమని భ్రాంతిపడి, నిజమని నమ్మినా, ఇలాంటి అంధ విశ్వాసం మరియు అనవసర భయాల వల్ల భవిష్యత్తులో మీరు కూడా ఈ అంధవిశ్వాసాలకు బలి కావచ్చు. ఎలాగంటే మీరు కోరి మంచిదని నమ్మిన నక్షత్రంలో పుట్టిన కన్యను కోడలుగా తెచ్చుకున్నా ఆమెకు కలిగే ఆడ శిశువు ఈ పైన చెప్పిన నక్షత్రాలలో జన్మిస్తే మీరు వివాహం ఆ శిశువుకు భవిష్యత్తులో చేయగలరా? అప్పుడు మీరు సమాజాన్ని మీ పాత మాట మరిచిపోయి శాస్త్రాన్ని నిందించి ప్రయోజనం వుండదు. ఒకరి జన్మ నక్షత్రాల వల్ల మరణాలు మరొకరికి సంభవించవు. నక్షత్రాల వల్ల ఏదైనా జరిగితే మంచి జరుగుతుంది గాని చెడు మాత్రంజరగదని మీరు గ్రహించాలి. పైగా నక్షత్రాల మీద ఏదైనా సంశయం వుంటే అది వివాహం చేసుకున్న భార్యాభర్తలకు వర్తిస్తుంది. కాని వారి తల్లిదండ్రులకు, అక్కచెల్లెళ్లకు లేక అన్నదమ్ములకు వర్తించదు. ముఖ్యంగా మీరు గమనించవలసింది ఏమంటే ఈ చెడు ఫలితాలు వధువుకే ఆపాదించబడ్డాయి. గాని అవే నక్షత్రంలో పుట్టిన వరునికి మాత్రం కాదు. కాబట్టి మీరు ఏ మాత్రము సంకోచం లేకుండా మిగిలిన విషయాలన్నింటికి పొంతన కుదిరితే మూఢనమ్మకాలను వదలి వివాహం చేయవచ్చు. పంచాంగం ఒక శాస్త్రం కాదు. ఎక్కాల పుస్తకాలలో పెద్ద బాలశిక్షలలోవి కూడా పంచాంగంలో ఒక భాగమైపోయాయి.

**సూచన :** ఈ విషయంలో నా అభిప్రాయాలు తప్పని శాస్త్రబద్ధంగా నిరూపణ చేస్తూ మీరు తెలియబరిస్తే వచ్చే ముద్రణలో ఈ అంశాన్ని ప్రచురించి మీకు నా కృతజ్ఞతలు తెలుపుకుంటానని సవినయంగా మనవి చేసుకుంటున్నాను.

ఈ పైన చెప్పిన నక్షత్రాలకు దోషాలు ఆపాదించినా, ఆ దోషాలకు కొన్ని మినహాయింపులు, సడలింపులు కూడా ఉన్నాయని కొందరి దృఢనిశ్చయం.

**1. మూలనక్షత్రం :** ఈ నక్షత్రంలో మొదటి పాదం మాత్రమే హానికరమని రెండు, మూడు, నాలుగు పాదములో పుట్టినవారి వల్ల కాబోయే మామగారికి ఏమీ అశుభం జరగదని కొందరి నమ్మకం. మరికొందరు మూల నక్షత్రంలో పుట్టిన వధువు రాశి వృషభం, సింహం, వృశ్చికం, కుంభం అయితే ఆ కన్య నక్షత్రానికి ఎటువంటి దోషం లేదని కొందరు అంటుంటారు. మరి కొంతమంది పండితులు మూల నక్షత్ర 1-2-3 పాదములలో పుట్టిన వధువును, చిత్త 1-2-3 పాదములలో పుట్టిన వరునికి గాని లేక

ధనిష్ట 1-3-4 పాదములలో గాని లేక కృత్తిక, స్వాతి, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ, రేవతి నక్షత్రాలలో మొదటి పాదములో జన్మించిన వరునికి పొంతన కుదర్చవచ్చునని వారి అభిప్రాయము.

**2. ఆశ్లేష :** ఈ నక్షత్రం పేరు వినగానే చాలామంది అనవసరంగా భయపడతారు. ఎంత భయపడతారంటే వధువును చూడకుండానే కాబోయే అత్తగారు తాను చనిపోతానని చింత పడుతుంది. కొందరు మొదటి పాదం శుభప్రదమని నమ్ముతారు. కాని ఏ పాదమైనా ఆశ్లేష నక్షత్రంలో జన్మించిన కన్య వలన ఎవరికి మరణం సంభవించదు. ఎందుకంటే కాబోయే భర్త జాతకంలో తల్లికి కర్మకాండ చేసే యోగం వుండాలి. అదే కాకుండా మామగారికి భార్యావిహీన దోషం కూడా వుండాలి. అప్పుడు మరణం ఆశ్లేష నక్షత్ర కన్య వలన కాదు కదా? విజ్ఞులు ఆలోచించి అన్ని విధాలా పొంతన కుదిరితే అశ్లేష నక్షత్ర కన్యను కోడలుగా తెచ్చుకోవచ్చు.

జ్యోతిష్య శాస్త్రములో మరణములు, అంటే అల్పాయువులు, మధ్యమాయుర్దాయం కలవారు పూర్ణాయువులు ఎవరు అని వారి ఆయుర్దాయం జాతకరీత్యా ఎలా నిర్ణయించాలో 'జాతక మోక్షప్రదాయిని' అనే నా మరో పుస్తకంలో వివరంగా విశదీకరించియున్నాను. కాబట్టి మరణం అనేది పరుల నక్షత్రం వల్ల మాత్రం రాదని ఘంటాపదంగా చెప్పగలను. మారకత్వము లేని జాతకంలో మరణము ఎన్నటికీ సంభవించదని గ్రహించండి ! ఇది మాత్రం ముమ్మాటికీ సత్యం !! పసలేని వ్రాతలకు భయపడి పస కలిగిన సంబంధం ఒదులుకోకండి.

**3. విశాఖ :** విశాఖ నక్షత్రం మొదటి పాదంలో పుట్టిన కన్యకు మరిది ఉండకూడదని ఒక మూఢనమ్మకం వుంది. ఒకవేళ వుంటే మరిది చనిపోతాడనే భయం వల్ల ఈ మూఢనమ్మకం ప్రచారంలో వుంది. కాని ఇది నిజం కాదు.

**4. జ్యేష్ఠ :** ఈ నక్షత్రంలో పుట్టిన కన్యను కోడలిగా తెచ్చుకుంటే ఆ ఇంటి పెద్ద కుమారుడు మరణిస్తాడని ఒక భయం వుంది. అలా మరణించకపోయినా ఆ కన్య వల్ల అనేక కష్టనష్టాలకు, బాధలకు లోనవుతాడని ఒక నమ్మకం. ఈ పై నక్షత్రములలో జన్మించిన కన్యలను వివాహము చేసుకొన్న దంపతులను విచారించి చూడగా వారి ఇంట ఎటువంటి మరణము, సంభవించలేదని దంపతులు ధృవీకరించారు.

## ఆశ్లేష నక్షత్రం - ఒక సశాస్త్రీయ విశ్లేషణ

చాలా మంది ఆశ్లేష నక్షత్రం అంటే భయపడతారు. ఇంతగా భయపడడానికి కారణం పంచాంగకర్తలేననేది నిర్వివాదాంశం. ఎందుకంటే ప్రతి పంచాంగంలోనూ ప్రతి గ్రంథకర్త "ఆశ్లేష కన్యను కనుక కోడలుగా చేసుకుంటే అత్తగారికి మృత్యువు" అని శాస్త్రమును వక్రంగా ఉటంకించటమే. ఎందుకంటే ఆశ్లేష నక్షత్రంలో పుట్టిన ప్రతి కన్య వల్ల ప్రతి అత్తగారికి మృత్యువు వస్తుంది అనేది సత్యదూరం మరియు నిజం కాదని రూఢిగా చెప్పగలను. నేను ఎంతోమంది ఆశ్లేష నక్షత్రంలో జన్మించిన కన్యలకు వివాహం స్వయంగా జరిపించినాను. కాని వారి అత్తగార్లు అందరూ ఆయురారోగ్యాలతో పూర్ణాయువుగా జీవిస్తున్నాను. పంచాంగపఠనం వల్ల విజ్ఞానం పెరగాలి గాని విచారము మరియు భయాందోళనలు పెరగకూడదు. శాస్త్రప్రకారం చూస్తే అత్తగారికి ఆశ్లేష కన్యవల్ల కొంచెం దుష్ఫలితం ఈ క్రింది సమయాలలో "రావచ్చు" కానీ వస్తాయని ఎక్కడా ఋజువు లేదు. పైగా ధర్మసింధు, నిర్ణయ సింధులో కూడా దోషముని చెప్పలేదు.

ఆశ్లేష నక్షత్రం, విదియ తిథి, ఆదివారం, సూర్యోదయ కాల సమయంలో గాని లేక అసుర సంధ్యాసమయంలో గాని ఉండి లగ్నం మీద పాపవీక్షణ ఉండి సప్తమంలో కుజుడు ఉంటే అత్తగారికి హాని "జరగవచ్చు" అన్నారే గాని, ఆశ్లేషలో జన్మించిన కన్య వివాహ నిషిద్ధం అని ఎక్కడా, ఏ శాస్త్రంలోనూ చెప్పలేదు కాబట్టి మూఢనమ్మకంతో మంచి బుద్ధిమంతురాలు, విద్యావతి, రూపవతి అన్ని సుగుణాలు కల నచ్చిన కన్యను "ఆశ్లేష" అన్న భయంతో సంబంధం విడువకండి ! శాస్త్రవిహీన సలహాలు పాటించకండి!!

### నూతన వధువు నివాస దోషం

వివాహం అయిన ప్రథమ సంవత్సరం అత్తగారింట్లో నవవధువు ఆషాఢమాసం అత్తగారితోను, అధికమాసం వచ్చినప్పుడు భర్తతోను, పుష్యమాసంలో మామగారితోను, చైత్రమాసంలో తండ్రి ఇంట ఉండకూడదు. ఒకవేళ వీరిలో ఎవరైనా మరణించి ఉంటే నవ వధువు నివాసము దోషము కాదు.

# ❖ 4. రజ్జు దోషం

రజ్జుదోషం అంటే వరుని యొక్క ఆయుష్షును నిర్ణయించే అంశం. సాధారణంగా జాతకం చూసేటప్పుడు రజ్జు అనే అంశం తమిళనాడులోను, కేరళలోను చాలా ఎక్కువగా చూస్తారు. కాని మన ఆంధ్రదేశంలో దీనికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడంలేదు. కాని వరుని ఆయుఃప్రమాణం చాలా ముఖ్యం కాబట్టి మనం రజ్జు గురించి కొద్దిగా తెలుసుకుని జాతకం పరిశీలించే సమయంలో ఈ విషయాన్ని కూడా దృష్టిలో ఉంచడం చాలా శ్రేయస్కరం. ఎందుకంటే మిగిలిన అన్ని విషయాలలోను పొందిక కుదిరినా "రజ్జు" కుదరకపోతే ఆ వివాహ జీవితం వైధవ్యం ద్వారా విచ్ఛిన్నం అవుతుంది. కాబట్టి రజ్జు తృప్తికరంగా వుంటేనే వివాహం చేయడం అన్ని విధాలా సమంజసం.

రజ్జును అయిదు విధములుగా విభజించారు. 1. శిరోరజ్జు, 2. కంఠరజ్జు, 3.నాభిరజ్జు, 4. ఊరువురజ్జు, 5. పాదరజ్జు.

1. శిరోరజ్జు అనగా శిరస్సురజ్జు అని అర్థము. శిరోరజ్జు వుంటే భర్త అల్పాయుష్కుడై అతి త్వరగా మరణిస్తాడు. అందువల్ల అతని భార్య వైధవ్యానికి లోనవుతుంది.
2. కంఠరజ్జు : కంఠమనగా గొంతు/మెడ. కంఠరజ్జు వుంటే ఆ వరునికి భార్యావియోగం కలుగుతుంది.
3. నాభిరజ్జు అనగా బొడ్డుప్రేగుకు సంబంధించినది. ఇది కనుక పొందిక లేకపోతే మృతశిశువు జన్మించడం లేక అంగవైకల్యంతో సంతానం కలగడం మొదలగునవి సంభవిస్తాయి.
4. ఊరువురజ్జు : దీని పొందిక కుదరని పక్షంలో వారి దాంపత్య జీవితంలో ధననష్టం కలిగి మానసికంగా వత్తిడి పడతారు. దారిద్ర్యానికి లోనవుతారు.
5. పాదరజ్జు : పాదరజ్జు అంటే మడం క్రింద ఉన్న కాలి భాగంలో రజ్జు ఉంటే పాదరజ్జు అంటారు. ఈ పాదరజ్జు వల్ల ప్రయాణములు విదేశీ యాత్రలు, ప్రయాణాలలో జరిగే ప్రమాదాల గురించి తెలుసుకోవచ్చు.

ఈ పై దానిని బట్టి శిరోరజ్జు, కంఠరజ్జు అతి ప్రధానమైనవని మనకు తెలుస్తోంది. మిగిలిన రజ్జులలో ఉన్న లోపములు అంత తీవ్రమైనవి కాదు కాబట్టి మనము ఆ లోపములకు అంతగా ప్రాధాన్యత ఇవ్వనవసరం లేదు.

రజ్జు దోష నిర్ణయం చేయడానికి మీకు ఈ క్రింద పట్టిక ఇస్తున్నాను. ఈ పట్టిక ప్రకారం మీరు అతి తేలికగా రజ్జు దోషమును పరిశీలించవచ్చు.

| వ.సంఖ్య | రజ్జు పేరు | దోష రజ్జు గల నక్షత్రాలు |
|---|---|---|
| 1. | శిరోరజ్జు | మృగశిర, చిత్త, ధనిష్ట |
| 2. | కంఠరజ్జు | రోహిణి, ఆరుద్ర, హస్త, స్వాతి, శ్రవణం, శతభిషం |
| 3. | నాభిరజ్జు | కృత్తిక, పునర్వశు, ఉత్తర, విశాఖ, ఉ.షా, పూ.భాద్ర |
| 4. | ఊరువురజ్జు | భరణి, పుష్యమి, పుబ్బ, అనూరాధ, పూర్వాషాఢ, ఉత్తరాభాద్ర |
| 5. | పాదరజ్జు | అశ్వని, ఆశ్లేష, మఖ, జ్యేష్ఠ, మూల, రేవతి |

పై పట్టికను మీరు పరిశీలించినట్లయితే మొదటి వరుసలో అంటే శిరో రజ్జులో ఉన్న నక్షత్రాలు మూడు మాత్రమే మిగిలి అన్ని రజ్జులలో ఒక్కొక్కదానిలో ఆరు నక్షత్రాలు ఉన్నాయి. ప్రతి రజ్జుకు ఎదురుగా ఇచ్చిన నక్షత్రాలకు ఆ రజ్జు దోషం ఉంటుంది. ఉదాహరణకు మృగశిర, చిత్త, ధనిష్ట నక్షత్రాలకు శిరోరజ్జు దోషం వుంటుంది. అందువల్ల ఆ నక్షత్రములు కల వధూవరుల వివాహము చేయకూడదు. ముఖ్యంగా దక్షిణదేశ ప్రాంతంలో రజ్జు పరిశీలనకు అత్యంత ప్రాధాన్యత కలదు. ఎందుకంటే వధువు యొక్క మాంగల్యబలం చాలా దృఢంగా ఉండాలని ప్రతివారికి తెలుసు. జాతకచక్ర పరిశీలనలో ముఖ్యమైన అంశాలు అన్నీ కుదిరినా రజ్జు కుదరని పక్షంలో వివాహం నిశ్చయం చేయడం సమంజసం కాదని నా దృఢ విశ్వాసం. అందువల్లనే మన తెలుగువారు రజ్జు అనే అంశాన్ని నిర్లక్ష్యం చేస్తున్నా మీ యొక్క శుభం కోసం ఈ విషయం గురించి చర్చించడం జరిగింది. విజ్ఞతతో దీన్ని గురించి ఆలోచించి ఆ తరువాత వివాహ నిశ్చయం చేస్తారని నేను విశ్వసిస్తున్నాను.

పై పట్టికలో ఒకే రజ్జులో ఉన్న నక్షత్రాలకు పొంతన కుదరదని మీకు విన్నవించినా, దీనిలో కొన్ని సడలింపులు ఉన్నాయని మీకు చెప్పడం నా విధి. అవేమంటే:

1. వధూవరులకు రజ్జు దోషమున్నా ఆ ఇద్దరి నక్షత్రాల రాశ్యాధిపతులు ఒకరే అయితే వివాహం చేయవచ్చు.

2. వధూవరులకు రజ్జు దోషమున్నా వారి రాశ్యాధిపతులు మిత్రులైతే వివాహం చేయవచ్చు.
3. వధూవరులకు రజ్జు దోషమున్నా వారి లగ్నాధిపతులు ఒకరే అయితే వివాహం చేయవచ్చు.
4. వధూవరులకు రజ్జు దోషమున్నా వారి లగ్నాధిపతులు మిత్రులైతే వివాహం చేయవచ్చు.
5. రాశ్యాధిపతుల మీద గాని, లగ్నాధిపతుల మీద గాని మిత్రవీక్షణ వున్నా దోషం ఉన్నప్పుడు వారిరువురికి వివాహం చేయకూడదు.
6. ఏకరజ్జు దోషం చేయకూడదు.

## ఏకకాలంలో ఉపనయన, వివాహం

1. పుత్రిక వివాహనంతరం పుత్రుని వివాహం చేయవచ్చు.
2. పుత్రిక వివాహానంతరం 6 మాసముల వరకు పుత్రునికి ఉపనయనం చేయకూడదు.
3. పుత్రునికి ఉపనయనాంతరం. పుత్రికకు వివాహం చేయవచ్చు. కాని పుత్రునికి, పుత్రికకు ఏకకాలంలో వివాహం చేయకూడదు.
4. పుత్రునికి వివాహం చేసిన తర్వాత 6 మాసములవరకు తమ్మునికి ఉపనయనం చేయకూడదు.
5. ఏకోదరులకు ఒకేసారి ఉపనయనం చేయకూడదు.
6. సంవత్సరము మారిన తర్వాత మాస పట్టింపు లేదు.

ఈ క్రింది శ్లోకం “కాలమృతం” నుంచి ప్రామాణికము

**“ఫాల్గుణే చైత్రమాసేతు, పుత్రోద్వాహోపనయనే**
**అబ్దభేదా త్ప్రకుర్వీత, ఋతుత్రయ విడంబన”**

అనగా ఫాల్గుణమాసంలో ఒకరికి, చైత్రమాసంలో మరొకరికి సంవత్సర భేదమున్నందువల్ల ఉపనయన వివాహాదులు చేయ వచ్చును.

# 5. గణపొంతన

ఈ విశ్వంలో ఉన్న కోట్లాది మానవులను మూడు వర్గాలుగా విభజించారు. ఆ విభజన వారి మనస్తత్వ ప్రకారం జరిగింది. మానవులందరిలోను ప్రతి ఒక్కరు ఈ మూడు వర్గాలలో ఏదో ఒక వర్గానికి చెంది ఉండి తీరవల్సిందే. మొదటి వర్గం సాత్విక గుణం రెండో వర్గం రజో గుణం మూడవది తామస గుణం.

ఇందులో మొదటి వర్గానికి చెందినవారు సచ్ఛీలురు. శాంతి స్వభావులు, పరోపకారులు, ఓర్పు, సహనం కలవారై ఉంటారు.

రెండవ వర్గం రజోగుణానికి చెందినవారు మంచి చెడూ కూడా కలిగి వుంటారు. అంటే వారిది మంచి చెడు కలయిక గల మనస్తత్వం అయి వుంటుంది. వీరు తమంతట తాము ఒకరిని బాధించడం గాని అసూయా ద్వేషాలతో వేధించడం గాని చేయరు. సర్వసాధారణంగా సాత్వికంగానే ఉంటారు. ఎవరికి హాని చేయరు కాని వారిని ఎవరైనా వేధించి మనఃక్లేశం కల్గించినట్లైతే లేక వారిని శారీరకంగా నొప్పించినట్లైతే వీరు తిరిగి అట్టివారితో కఠినంగా వ్యవహరిస్తారు. మూడోవర్గమైన తామసగుణానికి చెందినవారు, అసూయా ద్వేషాలతోను క్రోధంతోను ఎదుటివారిని సాధించి వేధించి సంతుష్టులవుతారు. సాధారణంగా కాఠిన్యం ఎక్కువగా వుంటుంది. సాటి మానవత్వమనే భావన లేక దుర్మార్గం, దౌర్జన్యం, బలాత్కారములు చేయుటకు వెనుకాడరు. మిక్కిలి స్వార్థపరులుగా వుంటారు.

మనం వధూవరుల జాతకం పరిశీలించేటప్పుడు వరుని యొక్క మనస్తత్వం నిర్ణయించడానికి మనకు అత్యుత్తమైన సాధనం అతని జన్మ నక్షత్రము. ఎందుకంటే ఎప్పుడు వధువు నక్షత్రంతో వరుని నక్షత్రం సరిపోతుందా లేదా అని చూడాలి కాని వరుని నక్షత్రంతో వధువు నక్షత్రాన్ని పోల్చకూడదు.

మనకున్నవి 27 నక్షత్రాలు మీకు తెలుసు. ఏ మనిషి ఏ గణానికి చెందినవాడో తెలుసుకోవడానికి ఈ 27 నక్షత్రాలను తెలుసుకోవడానికి ఈ 27 నక్షత్రాలను మూడు భాగాలుగా విభజించారు. మొదటి భాగాన్ని దైవగణం అంటారు. రెండవ భాగాన్ని మనుష్య గణం అంటారు. మూడోభాగాన్ని రాక్షస గణం అంటారు. దైవ గణం నక్షత్రంలో

పుట్టినవారు సాత్విక గుణానికి చెందినవారు. వారికి సాత్విక గుణ లక్షణాలు వుంటాయి. మనుష్య గణ నక్షత్రంతో పుట్టినవారు రజో గుణానికి చెందినవారై ఉంటారు. వారికి రజోగుణ లక్షణాలు వుంటాయి. ఇక మూడవదైన రాక్షసగణ నక్షత్రములో పుట్టినవారు తామస గుణ లక్షణాలు కలిగి వుంటారు.

నక్షత్ర గణ విభజన ఈ క్రింది పట్టికలో చూడండి.

| సంఖ్య | దైవగణం | మనుష్యగణం | రాక్షసగణం |
|---|---|---|---|
| 1. | అశ్వని | భరణి | కృత్తిక |
| 2. | మృగశిర | రోహిణి | ఆశ్లేష |
| 3. | పునర్వసు | ఆరుద్ర | మఖ |
| 4. | పుష్యమి | పుబ్బ | చిత్త |
| 5. | హస్త | ఉత్తర | విశాఖ |
| 6. | స్వాతి | పూర్వాషాఢ | జ్యేష్ఠ |
| 7. | అనూరాధ | ఉత్తరాషాఢ | మూల |
| 8. | శ్రవణం | పూర్వాభాద్ర | ధనిష్ట |
| 9. | రేవతి | ఉత్తరాభాద్ర | శతభిషం |

పై పట్టిక ద్వారా ఏ నక్షత్రం ఏ గణానికి చెందిందో మీకు సులభంగా తెలిసిపోతుంది. ఈ గణ పొంతన చూడడానికి మీ సౌలభ్యం కోసం ఈ క్రింది పట్టిక చూడండి.

| వధువు గణం | వరుని గణాలు | | |
|---|---|---|---|
| | 1. దేవగణం | 2. మనుష్యగణం | 3. రాక్షసగణం |
| 1. దైవగణం | చాలా మంచిది | మంచిది | చెడుపు |
| 2. మనుష్యగణం | మంచిది | చాలా మంచిది | తీవ్రదోషం |
| 3. రాక్షసగణం | చెడుపు | తీవ్రదోషం | చాలామంచిది |

1. వధూవరులిద్దరూ ఒకే గణానికి చెందిన వారైతే వారిద్దరి మధ్య సహకారం, సదవగాహన, ఒకరి మీద ఒకరికి ప్రేమానురాగాలు ఉంటాయి.
2. వధువుది మనుష్య గణమై యుండి వరునికి రాక్షస గణమైతే వారిద్దరి మధ్య బొత్తిగా అవగాహన లేక విరోధ ప్రవృత్తితో కాలం గడుపుతూ వుంటారు. భర్త

భార్యను నిర్లక్ష్యం చేస్తాడు. ఆమెకు విలువ ఇవ్వక తన ఇష్టానుసారం ప్రవర్తిస్తాడు. మానసికంగా భయోత్పాతం కలుగజేస్తాడు. దాంపత్య సుఖం అనుభవించేటప్పుడు భార్యతో మొరటుగా ప్రవర్తిస్తాడు.

3. వధువుది దైవగణం అయివుండి వరునిది రాక్షసగణం అయితే అట్టి వరుడు సంసారం సక్రమ మార్గంలో సాగనీయడు. కయ్యానికి కాలు దువ్వుతూ వుంటాడు. సంసారంలో అసంతృప్తి ఎక్కువగా ఉంటుంది. భార్యాభర్తల పొందిక సమము కాదు. వధూ నక్షత్రం నుంచి వరుడి నక్షత్రం వరకు లెక్కిస్తే 14వ సంఖ్య కంటే ఎక్కువ వస్తే రాక్షస ప్రవృత్తి ఉన్న వరునిలో ఉధృతం తగ్గుతుంది.

ముఖ్యంగా మీరు తెలుసుకోవలసిన విషయం ఏమంటే ఆశ్లేష, చిత్త, విశాఖ, జ్యేష్ట, మూల, శతభిషం – ఈ నక్షత్రాలలో జన్మించిన స్త్రీలకు రాక్షస గణమైనా దోషం లేదు. లగ్నం కాని, రాశి కాని ఇద్దరికీ ఒకటే ఆధిపత్యం అయితే రాక్షస గణ దోషం ఉండదు.

# 6. కుజదోషము


ఇప్పుడు మనం కుజదోషం అంటే ఏమిటో దాని ఫలితం ఎలా ఉంటుందో ఆ దోషానికి నివారణోపాయాలు ఏమిటి అనే విషయాలు గురించి వివరంగా తెలుసుకుందాం. సాధారణంగా ప్రతి జ్యోతిష్యుడు వాడే పదం "కుజదోషం". ఈ పదం విన్న ప్రతివారు భయభ్రాంతులకు లోనవుతారు. దీనికి కారణం పూర్తిగా అవగాహన లేకపోవడమనే చెప్పవచ్చు. కొంతమంది అనేక వేల రూపాయలు ఖర్చు పెట్టి బ్రాహ్మణుల చేత పూజలు చేయిస్తారు. ఈ పూజలు చేయించిన తర్వాత దోష నివారణ జరిగిందని ఆత్మ సంతృప్తి చెందుతారు. కుజపూజ వలన దోషం యొక్క ఉధృతం తగ్గవచ్చేమో గాని దోష నివారణ మాత్రం కాదు.


సాధారణంగా దైవ ప్రార్థనలు లేక పూజా పునస్కారాలు తపస్సులు మొదలైనవి మన హిందూ ధర్మశాస్త్ర ప్రకారం ఎవరికి వారే భక్తి శ్రద్ధలతో చేయడం శాస్త్ర సమ్మతం. అలా స్వయంగా చేయటం వలన పూజ చేసినవారు చక్కటి సత్ఫలితాలు పొందగలరు. మన తరఫున మరొకరు దేవుని ప్రార్థించడం అనే విషయాన్ని మన శాస్త్రంలో ఎక్కడా చెప్పబడలేదు. మహా ఋషులు, భక్త శిఖామణులు వారి వారి పూజలు వారే చేసుకున్నారు గాని ధన ధాన్యాదులు ఇచ్చి భగవంతునికి తమకు మధ్య ఒక మధ్యవర్తిని తమ తరఫున పూజలు చేయడం కోసం నియమించుకోవడం, ఆ మధ్యవర్తి చేసే ప్రార్థనలు భగవంతుడు విని మనని కరుణిస్తాడనుకోవడం భ్రమ అని నా ఉద్దేశ్యం. ఎలాగంటే వినాయక చవితి, శ్రావణ మాస నోములు, సత్యనారాయణస్వామి వ్రతం, సంధ్యావందనం మొదలైనవి మనమే చేసుకుంటున్నాము కదా, అదేవిధంగా వధూవరులిద్దరిలో ఎవరికి కుజదోషం ఉంటే వారే కుజప్రార్థన చేసుకోవడం ధర్మము మరియు శాస్త్ర సమ్మతము కూడా.

నవగ్రహాలలో కుజుడుది మూడవ స్థానం. కుజుడికి అంగారకుడనియు, మంగళుడనియు కూడా పేర్లు కలవు. కుజుని యొక్క వాహనం మేక. కుజుడు మేష, వృశ్చిక రాశులకు అధిపతి. కుజుడుది భారద్వాజస గోత్రం. కుజుడు ఆషాఢ బహుళ చతుర్దశి మంగళవారం మృగశిర నక్షత్రమందు జన్మించాడు. కుజుడు సూర్యునికి దక్షిణ

దిశలో త్రికోణాకారంగా వున్న మండలంలో రక్తవర్ణంలో రుద్ర రూపునిగా ఉంటాడు. కుజుని గురించి స్కందపురాణం లోను, కాశీ ఖండములోను, మహాభారతంలోని భీష్మపర్వంలోనూ విశదంగా విపులీకరించారు.

కుజుడు స్వతహా క్రోధుడు. మిక్కిలి కోప స్వభావం కలవాడు. ఇతడు ఆరోగ్యము శత్రువులతో పోరాటము, భూవనరుల వివాదాలు, ఋణబాధలు, సోదరులతో కలహాలు, భార్యాభర్తల సంబంధాలు మొదలైన వాటికి కారణయోగం కలవాడు. కుజానుగ్రహం లేకుండా దంపతులు శారీరక, మానసిక, ధన, సాంఘిక, సామాజిక సౌఖ్యాలను అనుభవించలేరు. కుజుడు ధైర్యానికి కారకుడు. గ్రహరాజ్యంలో సర్వసైన్యాధిపతి అని పండితులు విశ్లేషించారు. దీనిని బట్టి కుజుడు ఎంత బలవంతుడో మనం తేలికగా ఊహించవచ్చు. వధూవరులలోఎవరికైనా కుజదోషం వున్నదీ లేనిదీ తెలుసుకోవాలంటే ఆ వధూవరుల లగ్నంలోగాని, లేక లగ్నం నుంచి గాని 2వ రాశి, 4వ రాశి, 7వ రాశి, 8వ రాశి, 12వ రాశులలో కుజుడు ఉంటే కుజదోషం ఉన్నట్లు గ్రహించాలి. కుజుడు మకరంలో $28^0$లలో ఉచ్చంలో ఉంటాడు. కర్కాటకంలో $28^0$లలో బలహీనుడు. కుజుడి స్వస్థానమైన మేషరాశిలో సూర్యుడు $19^0$లలో ఉచ్ఛంలో ఉంటాడు. ఈ క్రింది చక్రం చూడండి.





పై చక్రం గమనిస్తే లగ్నం నుంచి లెక్కపెడితే 8వ రాశిలో కుజుడు ఉన్నాడు. అంటే అష్టమంలో కుజుడు అంటారు. కాబట్టి కుజదోషం ఉన్నట్లే ఇదే విధంగా కుజుడు లగ్నంలో ఉన్నా లగ్నం నుంచి రెండవ రాశిలో ఉన్నా, నాలుగవ రాశిలో ఉన్నా, ఏడవ రాశిలో ఉన్నా, 8వ రాశిలో ఉన్నా, 12వ రాశిలో ఉన్నా కుజదోషం ఉన్నట్లే. అందువల్ల

ఈ స్థానాలలో కూడా కుజుని చూపించాను. కుజదోషం లగ్నం నుంచే కాకుండా శుక్రుడు ఉన్న గడి నుంచి కూడా లెక్క పెట్టాలి. ఈ క్రింది చక్రం చూడండి.


| | | | |
|---|---|---|---|
| గు | | చం | రా<br>ల |
| | **శుక్రుని నుంచి** | | |
| శు | **కుజదోషం** | | కు |
| కే | ర | బు | శ |




పై చక్రంలో శుక్రుడు ఉన్న గడి నుంచి 8వ స్థానంలో కుజుడు ఉన్నాడు. అందువల్ల కుజదోషం ఉన్నట్లే. అదేవిధంగా కుజుడు శుక్రునితో కలిసి ఉన్నా లగ్నం నుంచి 2-4-7-8-12 రాశులలో ఏ రాశులలో నైనా ఉన్నా కుజదోషం ఉన్నట్లే.

కుజదోషం చంద్రుని నుంచి కూడా లెక్కపెట్టాలి. ఈ క్రింది చక్రం గమనించండి.

| | | | |
|---|---|---|---|
| | గు | ర<br>బు | కే<br>శు |
| | **చంద్రుని నుంచి** | | |
| ల | **కుజదోషం** | | శ |
| రా | బు | చం | కు |




పైచక్రంలో చంద్రుని నుంచి 12వ రాశిలో కుజుడు ఉన్నాడు. అందువల్ల కుజదోషం ఉన్నట్లు. అదేవిధంగా కుజుడు చంద్రునితో కలిసి ఉన్నా లేక చంద్రుడి నుంచి 2-4-7-8-12 రాశులలో ఏ రాశులలోనైనా ఉంటే కుజదోషం ఉన్నట్లే.

మనం పై విధంగా లెక్కపెట్టి కుజదోషం ఉన్నదని నిర్ణయించినప్పుడు ఆ రాశిలో కుజుడు ఒక్కడే ఉన్నా లేక ఇతర గ్రహాలలో కలిసి ఉన్నా దోషం ఉన్నట్లే అని గ్రహించాలి. కుజునితో పాటు మిగిలిన గ్రహాలు ఒకే రాశిలో ఉన్నా ఆ ఇతర గ్రహాల ప్రభావం వల్ల కుజదోషంలో మార్పు ఉండదు. అదేవిధంగా మనం కుజస్థానం వరకు లెక్కపెట్టేటప్పుడు ఆ మధ్యలో ఖాళీ రాశులు ఉన్నా లేక వేరే గ్రహాలు ఎక్కువ తక్కువలుగా ఉన్నా మనం మామూలుగానే లెక్కపెట్టాలిగాని మన లెక్కలో ఏమీ మార్పు చేయకూడదు.

ఇక కుజదోష ప్రభావం ఏమిటి, ఈ దోషం వల్ల ఏమి కష్టనష్టాలు కలుగుతాయి, ఏ అరిష్టాలు జరుగవచ్చో తెలుసుకుందాం.

ప్రతి జాతకచక్రంలోను "లగ్నం" అని గాని "ల" అని గాని ఉంటుంది. ఎక్కడ "ల" అని ఉంటే అది "లగ్నం" అని అర్థం చేసుకోవాలి. ఉదాహరణకు సింహరాశిలో లగ్నం అని వ్రాసి వుంటే ఆ వధువుది లేక ఆ వరునిది సింహలగ్నం అవుతుంది.

1. జన్మలగ్నంలో కుజుడు ఉంటే ఆ జాతక వధువుకు లేక వరునికి శరీరనష్టం కలుగవచ్చు అంటే ఏ విధంగానైనా అంగవైకల్యం కలగడానికి అవకాశం వుంటుంది.
2. లగ్నం నుంచి ద్వితీయ స్థానంలో వధువుకు కుజుడు ఉంటే కుటుంబ నష్టానికి కుజుడు కారకుడవుతాడు. కుటుంబనష్టం అంటే గర్భస్రావం, మృతశిశువు జన్మించడం, లేదా జన్మించిన శిశువు మరణించడం జరగడానికి ఎక్కువ అవకాశాలుంటాయి. లగ్నం నుంచి వరునికి ద్వితీయ స్థానంలో కుజుడు ఉంటే కుజుడు సంసార జీవితంలో కూడా ఎక్కువ బాధిస్తాడు.
3. లగ్నం నుంచి నాలుగవ స్థానంలో కుజుడు ఉంటే ఆస్తినష్టం, గృహనష్టం, భూనష్టం, స్వగృహం పరులపాలు కావడం లేక వంశపారంపర్యంగా వచ్చిన ఆస్తిని నిలుపుకోలేకపోవడంతో పాటు పొలములు అన్యాక్రాంతమవడం జరగవచ్చు. ప్రకృతి వైపరీత్యాలైన తుఫానులు, భూకంపాలు, వరదలు సంభవించినప్పుడు అందరికంటే వీరు అత్యధిక నష్టం పొందుతారు.
4. లగ్నం నుంచి ఏడవ స్థానంలో కుజుడు ఉంటే ఆ పురుషుడు భార్యను కోల్పోతాడు. లేక దాంపత్య విచ్ఛిన్నం జరగవచ్చు. భార్యాభర్తలు నిరంతర కలహాలతో మానసిక వత్తిడితో బాధపడతారు. పురుషుడు తనకన్నా నీచ స్త్రీతో అక్రమ సంబంధం ఏర్పరచుకుంటాడు. నీచ స్త్రీ అంటే సామాజికంగా అన్ని విధాల విలువలను

కోల్పోయి చెడు సంస్కారం గల స్త్రీ అని అర్థం కాని కులప్రసక్తి కాదు. అదికూడా దాంపత్య విచ్ఛిన్నానికి ఒక కారణం కావచ్చు.

5. లగ్నం నుంచి ఎనిమిదవ స్థానంలో కుజుడు ఉంటే స్త్రీకి వైధవ్యం కలగవచ్చు. వరుడికి అష్టమంలో కుజుడు ఉంటే అనేక వ్యాధి పీడితుడై అల్పాయిషుడుగా మరణిస్తాడు. వధువు జాతకంలో లగ్నం నుంచి అష్టమంలో కుజుడు ఉన్నట్లయితే కుజదోషం ఉధృతంగా ఉన్నట్లు పరిగణించాలి. ఈ కుజ దోషం వల్ల ఈ క్రింద చెప్పబడిన తీవ్ర పరిణామాలు సంభవిస్తాయి.

1. భార్యాభర్తల మధ్య కలహాలు ఒకరిపై ఒకరికి ఏహ్యాభావం కలుగుతుంది.
2. మానసిక వత్తిడికి, ఆందోళనకు లోనవుతారు. దాంపత్యంలో సుఖం ఉండదు.
3. భార్యాభర్తల మధ్య అనురాగం, ఆసక్తి లోపించి ఈర్ష్యా ద్వేషాలు ప్రజ్వరిల్లుతాయి. దాంపత్య విచ్ఛిన్నం కూడా కావచ్చు. ఆ స్త్రీ తన భర్తను వదలి వెళ్లిపోవచ్చు. ఆమె రెండవ వివాహం కూడా చేసుకోవచ్చు.
4. వరునికి సప్తమంలో కుజుడు ఉంటే అతడు పరస్త్రీ సాంగత్యానికి లోనవుతాడు. నీచ స్త్రీ సాంగత్యానికి కూడా వెనుకాడడు. భార్యను శారీరకంగా, మానసికంగా తీవ్రంగా బాధిస్తాడు. దాంపత్యం నిలువకపోవచ్చు.
5. వరుని జాతకంలో 2 మరియు 12 రాశులలో కుజదోషం ఉంటే చాలా తీవ్రతరమని తెలుసుకోవాలి. స్త్రీలకు 4 మరియు 7 రాశులలో కుజుడు ఉంటే కుజదోషం చాలా ఉధృతమని అర్థం చేసుకోవాలి.
6. లగ్నం నుంచి పన్నెండవ స్థానంలో కుజుడు ఉంటే హఠాన్మరణం సంభవించవచ్చు. దానివల్ల వారి సంసారం అల్లకల్లోలమై అనేక బాధలు పొందుతారు.

స్త్రీల జాతకచక్రంలో కుజునితో పాటు చంద్రుడు కాని బుధుడు కాని గురువు కాని శని కాని రాహువు లేక కేతువులు కాని కలిసి ఉన్నా లేక వీరి దృష్టి కుజుడు ఉన్న రాశి మీద ఉన్నా కుజదోషం ఉన్నట్లే. కాని చాలా మంది కుజదోషం లేదని అంటారు. కాని ఇలా కుజుడు వేరు గ్రహంలో కలిసి ఉన్నా లేక వారి దృష్టి కుజుడు ఉన్న రాశి మీద పడినా అప్పుడు ఫలితాలు ఎలా ఉంటాయో మీకు అత్యంత సరళంగా, సామాన్య భాషలో ఈ క్రింద ఇస్తున్నాం. మీరు జాగ్రత్తగా పరిశీలించాలి. ఎందుకంటే కుజునితో ఒకే రాశిలో వేరే గ్రహాలు కలిసి ఉండటం వేరు, వారి దృష్టి వేరు. వేరే గ్రహాలు కుజునితో కలిసి ఉన్నప్పుడు ఆ గ్రహాల దోషాలను కూడా ఆ జాతకుడి మీద కుజుడు ప్రభావితం చేస్తాడు.


1. ఒకే రాశిలో కుజుడు, చంద్రుడు కలిసి ఉన్నట్లయితే ఆ జాతకుడు చంచల స్వభావం, స్థిరత్వం లేకపోడం, స్త్రీ వ్యామోహం, అధిక కామవాంఛ, భార్యతో మనస్తాపాలు మొదలగు లక్షణాలు కలిగి వుంటాడు.
2. ఒకే రాశిలో కుజుడు, బుధుడు కలిసి ఉంటే ఆ జాతకుడు భార్య మీద ఈర్ష్యా అసూయలు పెంచుకుంటాడు. ఆమెను కఠినమైన భాషతో అవమానిస్తూ ఉంటాడు. ఆమె మనస్సును నొప్పించే సంభాషణ చేసి తాను సంతుష్టుడవుతాడు. భార్య అంటే కామం తీర్చే యంత్రంగా భావిస్తాడు గాని, ఆమెను సహజ మానవ వాత్సల్యంతో చూడడు. ఆమెకు విలువ ఇవ్వడు.
3. కుజునితో శని కలిసి ఉంటే రెండు నీచగ్రహాలు కలిసి ఉన్నాయని మర్చిపోకూడదు. కుజుడిలో ఉన్న దోషాలు, శనిలో ఉన్న దోషాలు ఈ రెండు ఆ జాతకుడిని ప్రభావితం చేయడం వలన అతను దాంపత్య జీవితంలో అన్నీ ఉన్నా ఏమీ లేనట్లే బాధపడుతూ ఉంటాడు. ఆ బాధ వల్ల ఉద్రేకానికి లోనై కోపిష్టివాడుగా మారుతారు. కుజ, శని ప్రభావాల వల్ల ఎక్కువ సంపాదనాపరుడు కాలేడు. తాను తెలివిగలవాడనే నమ్మకం కలిగి ఉంటాడు. సంపాదన లేనందువల్ల ఆత్మన్యూనతా భావనకి లోనై అహం పెంచుకుంటాడు. సంసారంలో ముఖ్యంగా తన సుఖం చూసుకుంటాడు. భార్యాభర్తల మధ్య అనురాగం ఉండదు. సంసారంలో కలహాలు ఎక్కువగా ఉంటాయి.
4. కుజుడు రాహువుతో కలిసి ఉంటే వివాహం చాలా ఆలస్యంగా జరుగుతుంది. భార్యాభర్తల వయస్సులో ఎక్కువ తేడా ఉండవచ్చు. చాలావరకు ప్రతిమాటలోను అసత్యమే ఉంటుంది. భార్య అందంగాను, ఆకర్షణీయంగాను ఉంటుంది. కాని ఈ జాతకుడు మాత్రం మోటుగాను, ఎక్కువ వయసుతోను కనబడతాడు. ముఖ్యమైన విషయం ఏమంటే ఇతను అల్పాయిష్కుడుగా ఉండవచ్చు. అందువల్ల భార్య కంటే ముందే చనిపోతాడు. అంటే వధువుకు వైధవ్యం సంప్రాప్తించవచ్చు. కుజరాహువులు కలిసి ఉన్న జాతకాన్ని అత్యంత నిశితంగా అన్ని కోణాల నుంచి పరిశీలించకుండా ఎట్టి పరిస్థితులలోను వివాహం నిర్ణయించరాదు.
5. కుజుడు కేతువుతో కలిసి ఉంటే భార్యాభర్తల మధ్య వయస్సు తేడా ఎక్కువ ఉంటుంది. సంసారమందు అనురక్తి లేకుండా ఉంటారు. అశాస్త్రమైన పూజలు


విలువలేని తాంత్రిక జపాల మీద ఎక్కువ నమ్మకం కలిగి ఉంటాడు. సన్యాసం తీసుకోవడానికి కూడా వెనుకాడడు. లేక భార్యకు విడాకులు ఇవ్వగలడు.

6. ఏ కన్య జాతకంలో ఏ రాశిలో అయినా కుజుడుతో పాటు ఇద్దరు లేక ముగ్గురు నీచ గ్రహాలు ఉంటారో ఆ కన్యకు వివాహం కాదు. ఒకవేళ అయినా బాగా వయస్సు ముదిరిన తర్వాత అవుతుంది.

ఈ పైన చెప్పబడిన దోషాలలో గురుడు కలిసి ఉన్నా లేక ఆ రాశి మీద గురు వీక్షణ ఉన్నా ఉధృతం చాలావరకు తగ్గి బాధల నుంచి ఉపశమనం పొందుతారు. గురువీక్షణ అంటే నీచ గ్రహాలు కుజుడితో కలిసి ఉన్న రాశి నుంచి లెక్కపెడితే 7వ రాశిలో గురువు ఉన్నట్లయితే ఆ నీచగ్రహాల మీద గురు దృష్టి లేక గురు వీక్షణ ఉన్నట్లే. అలాగే గురుస్థానం నుంచి 5వ స్థానంలో గాని, 9వ స్థానంలో గాని కుజుడు ఉంటే కుజదోషం లేనట్లే.

**కుజ వీక్షణ :** ఏ వధువు జాతక చక్రంలో కుజుడు ఉన్న రాశి నుంచి 1-3-5-7-9-11 రాశులలో ఏయే గ్రహాలు ఉన్నాయో ఆయా గ్రహాల లక్షణాలు ఆమె భర్తకు ఉంటాయి. రాహువు, కేతువు గ్రహాలకు మాత్రం 1-2-5-9 రాశులను అపసవ్యంగా (Anti-Clockwise) లెక్కించాలి. వధూవరుల జాతక చక్రంలో కనుక మేషరాశిలో కుజుడు ఉన్నట్లయితే మొదటి రాశి మేషం నుంచి లెక్కిస్తే 5వ రాశి సింహం అవుతుంది. అలాగే సింహం నుంచి లెక్కిస్తే మరల 5వ రాశి అయిన ధనస్సులో రాహువు ఉంటే ఈ మూడు గ్రహాలు ఒకదానిని ఒకటి చూచుకొనుట వలన కుజదోషం ఉన్నట్లు గ్రహించాలి. ఈ క్రింది చక్రం చూడండి.



ఈ చక్రంలో రాహువు నుంచి శని పంచమంలో ఉన్నాడు. అలాగే కుజుడి నుంచి శని పంచమంలో ఉన్నాడు. శని నుంచి రాహువు పంచమంలో ఉన్నాడు. ఈ గ్రహస్థితి ఉంటే కుజదోషం ఉన్నట్లే.

కుజుడు కనుక మేష రాశి, కర్కాటక రాశి, తులా రాశి మరియు మకర రాశులలో ఉంటే దోషం ఉండదని కొంతమంది పండితుల అభిప్రాయం. ఇంతవరకు కుజదోషం వలన కలిగే దుష్ఫలితాల గురించి తెలుసుకున్నాం. ఇప్పుడు ఈ కుజదోషాన్ని నిర్ణయించే సూత్రాలకు ఉన్న మినహాయింపులు సడలింపులు తెలుసుకుందాము.

ఈ మినహాయింపులకు శాస్త్ర ప్రామాణికాలు కొన్ని ఉన్నా ప్రస్తుతం వేరు వేరు పండితులు వేరు వేరు అభిప్రాయాలు వెలిబుచ్చారు. ఏ గురువు దగ్గర శిష్యరికం చేసి శాస్త్రం అభ్యసిస్తారో, ఆ గురువు చెప్పినదే సత్యమని వారు నమ్మడం సహజం. ఎందుకంటే ఈ మినహాయింపులలో అభిప్రాయాలు, నమ్మకాలు వేరువేరుగా ఉన్నాయి కాబట్టి దీనిలో ఇప్పటివరకు ఒక నిర్దుష్టమైన అభిప్రాయం లేదు. అందువల్ల మీరు ఎవరితోనైనా సరే వాదోపవాదాలకు దిగక మీ పద్ధతిలో మీరు జాతకచక్రం పరిశీలించండి. అన్ని అభిప్రాయాలు పండితాభిప్రాయాలే కాబట్టి మూలసూత్రాలు ఒకటే కాబట్టి మౌలికముగా మీ గురువుగారు చెప్పినదే మీకు శిరోధార్యమని మరువవద్దు.

కుజుడు మేష, వృశ్చిక రాశులకధిపతి కాబట్టి కుజుడు మేష వృశ్చిక రాశులలో ఉన్నప్పుడు శుక్రస్థానం నుంచి గాని, చంద్ర స్థానం నుంచి గాని, లేక లగ్నం నుంచి గాని లెక్కపెట్టినప్పుడు కుజుడు 1-2-4-7-8-12 రాశులలో ఉన్నట్లయితే కుజదోషం ఉండదు. అదేవిధంగా కుజుడు ఉన్న రాశి మీద మిత్రరాశుల వీక్షణ ఉన్నా కుజుడు మిత్ర రాశులలో ఉన్నా కుజదోషం ఉండదు.

మకర రాశికి అధిపతి శని. కుజుడు మకరంలో ఉచ్ఛంలో ఉంటే కుజ దోషం ఉండదు. సింహరాశికి అధిపతి సూర్యుడు. కర్కాటక రాశికి అధిపతి చంద్రుడు. కుజుడు లగ్నం నుంచి కర్కాటక రాశిలో కాని, సింహరాశిలో కాని, మకర రాశిలో గాని ఉంటే కుజదోషం ఉండదు. కుజుని యొక్క మిత్రరాశులలో జన్మించిన వారికి కుజదోషం ఉండదు. అలాగే లగ్నం నుంచి కుజుడు మిధున కన్యా రాశులలో ద్వితీయ స్థానంలో ఉంటే మరియు 12వ స్థానంలో వృషభం తులా రాశులలో ఉంటే కుజదోషం ఉండదు. కుజుడు మేష వృశ్చిక రాశులలో 4వ స్థానంలో ఉంటే మరియు సప్తమ స్థానమందు మకర, కర్కాటక రాశులలో ఉంటే కుజదోషం ఉండదు. అదేవిధంగా అష్టమ స్థానంలో ధనస్సు, మీన రాశులో కుజుడు ఉంటే కుజదోషం ఉండదు. ఈ క్రింది నక్షత్రములు మరియు రాశులలో జన్మించిన వారికి కుజదోషం ఉండదు.

| మేషం | కర్కాటకం | సింహం | ధనస్సు | మీనం |
|---|---|---|---|---|
| అశ్విని<br>భరణి<br>కృత్తిక | పునర్వసు<br>పుష్యమి<br>ఆశ్లేష | మఖ<br>పుబ్బ<br>ఉత్తర | మూల<br>పూ.షా<br>ఉ.షా. | పూ.భా–4<br>ఉ.భా.<br>రేవతి |

ఇంతవరకు కుజదోషం అంటే ఏమిటో దాని దుష్ఫలితాలు ఎలా ఉంటాయో తెలుసుకోవడమే కాకుండా ఏయేరాశులలో ఏయే నక్షత్రాలకు కుజదోషం ఉండదో కూడా తెలుసుకున్నాం. అతి ముఖ్యమైన విషయం ఏమంటే కుజదోషం ఉన్న వధువుతో కుజదోషం లేని వరునితో గాని, లేక కుజదోషం ఉన్న వరునికి కుజదోషం లేని వధువుతో గాని ఎట్టి పరిస్థితులలో వివాహం చేయకూడదని తెలియచెప్పాలి. అలా కాకుంటే మనం ఎంతో పాపం చేసినవారం అవుతాము. ఎందువల్ల అంటే వివాహం అనేది నూరేళ్ల పంట. దిన పోరాటం స్త్రీ హృదయానికి మాన్చలేని గాయంగా ఉంటుంది. దాంపత్యం విచ్ఛిన్నం అవచ్చు. కాబట్టి వధూవరులకు ఇద్దరికీ కుజదోషం ఉంటే వివాహం చేయటం సమంజసమే. లేకపోతే ఇద్దరికీ కుజదోషం ఉండకుండా ఉండాలి. అదేకాకుండా ఇద్దరికి కుజదోషంలో సడలింపు లేక మినహాయింపు గాని ఉండినా వివాహం చేయవచ్చు. వధూవరులలో ఒకరికి కుజదోషంలో సడలింపు ఉండి మరొకరికి కుజదోషం అసలు లేకపోయినా వివాహం చేయవచ్చని మా అభిప్రాయం.

జాతకచక్రం చూసేటప్పుడు మొదట కుజదోషం చూసిన తర్వాతే రెండవ అంశానికి వెళ్ళాలి. ఏ మాత్రం అలసత్వం పనికిరాదు. ఒకవేళ కుజదోషం ఉన్నట్లయితే కుజుడిని సంతుష్టిపరచడానికి పూజా జపాలు చేయడం మంచిది. దానివలన కుజదోషంలోని ఉధృతం తగ్గుతుంది. కుజ పూజ వీలైనంతవరకు వధూవరులు తామంతట తామే స్వయంగా చేసుకోవటం ఉత్తమం. ఎందుకంటే మన హిందూ ధర్మప్రకారం భగవంతుడిని ప్రార్థించడమనేది స్వయం కర్మగా ఉండాలి అని, మనకు భగవంతునికి మధ్య వేరే మధ్యవర్తిని నియోగించి ఆ మధ్యవర్తిని మన తరపున దైవ ప్రార్థన, పూజ, తపహోమాలు చేయమని మనం మాత్రం ఏమరుపాటుగా ఉండటం సమంజసం కాదు. ఒక్క క్రైస్తవ మతంలో మాత్రమే "మీ తరపున మేము ప్రార్థిస్తామని" మత ప్రచారం కోసం జనాన్ని ఆకర్షించడం జరుగుతుంది. మహమ్మదీయులు తమ "నమాజు" తామే స్వయంగా చేసుకుంటారు. అలాగే సిక్కులు, జైన మతస్థులు మొదలగువారు కూడా వారి

దైవ ప్రార్థన వారే చేసుకుంటారు. మన పూర్వ పురాణ పురుషులు లేక మహా ఋషిపుంగవులు తమ తపస్సులు వారే స్వయంగా చేసుకునేవారు. కాబట్టి కుజ లేక శని లేక వారి ఏదైనా గ్రహాలను గాని దేవతలను గాని, మనమే భక్తి శ్రద్ధలతో పూజించుకోవాలి. అలా పూజలు చేసే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు ఈ క్రింద విశదీకరిస్తున్నాం. మీరు భక్తి శ్రద్ధలతో మీరే స్వయంగా పూజించి దుష్ఫలితాల నుంచి స్వాంతన పొందటం కాని లేక ఉధృతం తగ్గించుకోవడం గాని చేసుకొనవచ్చు.

1. మొదట పసుపుతో విఘ్నేశ్వరుని చేసి పూజ చేయాలి.
2. కుజ పూజ గాని, శని పూజ గాని ఇంటికి ఈశాన్య దిక్కులోనే చేయాలి.
3. ఈ గ్రహపూజ సూర్యోదయానికి ముందుగాని లేక సూర్యాస్తమయం తరువాత గాని చేయాలి.
4. శని పూజ చేయునప్పుడు మధ్యలో ఆపడం గాని ఇతరులతో మాట్లాడటం గాని చేయరాదు.
5. శని పూజానంతరం వెనక్కి తిరిగి చూడకుండా బయటకు వచ్చి ముఖం, పాదాలు ప్రక్షాళనం చేసుకొనవలెను.
6. సూర్యోదయం ముందు పూజ చేసేటట్లయితే ముందు రోజు రాత్రి భోజన సమయమందున్న తిథి మరునాడు మనం పూజ చేసే సమయంలో కనుక ఉంటే ఆ ముందు రోజు రాత్రి భోజనం చేయరాదు. అదే విధంగా సూర్యాస్తమయం తరువాత పూజ చేసేటట్లయితే ఆ రోజు ఉదయం భోజన సమయమందున్న తిథి సాయంత్రం పూజ చేసే సమయంలో కూడా ఉంటే ఆ దినం భోజనం చేయకూడదు. ఎందుకంటే మన ధర్మశాస్త్ర ప్రకారం పూజానంతరం భోజనమే కాని, పూజకు పూర్వం భోజన పద్ధతి నిషిద్ధం.

# 7. కళత్ర స్థానం

వధూవరుల జాతకం పరిశీలించే మర్మాలు కొన్ని తెలుసుకున్నాము. అలాగే వరునికి కాబోయే భార్య యొక్క గుణగణాలు, రూపురేఖలు, విద్యాసంపత్తు మొదలగునవి పరిశీలించాలంటే వరుని లగ్నం నుంచి లెక్కపెడితే 7వ స్థానాన్ని బట్టి ఆ కాబోయే వధువు యొక్క సహకారం ఎలా ఉంటుందో నిర్ణయించవచ్చు. అలాగే ఏడవ గృహం నుంచి చంద్రుని స్థానం వరకు పరిశీలిస్తే మనకు వధువు యొక్క రంగు, అందం, ఆమెలోని ఆకర్షణ, ఆమెలోని గుణగణాలు, దాంపత్య జీవితంలో ఆమె పాత్ర మనం గ్రహించవచ్చు. 7వ స్థానం ఎప్పుడు కళత్రస్థానం. శుక్రుడు సప్తమంలో కళత్రకారకుడవుతాడు. వివాహ జీవితం గూర్చి పూర్తి అవగాహన కావాలంటే లగ్నస్థానం నుంచి 2-4-7-8-12 గృహాలను పరిశీలించాలి. రెండవ గృహం సంసారం యొక్క నడవడి మరియు దానిలోని ఆనందం గురించి చెప్తుంది. 4వ గృహం సంసారంలో పొందే సదుపాయాలు, ప్రేమానురాగాల గురించి తెలుపుతుంది. 7వ గృహం ద్వారా భార్యాభర్తల అనుకూలత తెలుస్తుంది. అనుకూలత అంటే పురుషుని మగసిరి తెలియపరుస్తుంది. ఎనిమిదవ గృహం ద్వారా మనం పురుషుని ఆయుషు అంటే వధువు యొక్క మాంగల్య బలం తెలుసుకోవచ్చు. 12వ గృహం ద్వారా భార్యాభర్తల శారీరక సుఖం విపులంగా తెలుస్తుంది. వీక్షణ బట్టి మానసికంగా ఎంత దగ్గరయ్యారు, దాని ద్వారా ఎంత శారీరక సుఖం పొందగల్గుతున్నారని అంచనా వేయాలి. కాని కేవలం శారీరక సుఖానికి మాత్రమే ప్రాధాన్యత ఇవ్వకూడదు.

ఇప్పుడు మనం వరుని లగ్నం నుంచి సప్తమ రాశిలో ఏ గ్రహం అధిపతి అయితే సంసార జీవితంలో ఆమె పాత్ర ఏమిటి అనే విషయం విశ్లేషిద్దాం.

1. సప్తమంలో సూర్యుడు అధిపతి అయితే భార్య అనుకూలవతియై విశ్వసనీయతతో అంకిత భావంతో ఉంటుంది. ఆ వధువు ఆ ఇంటికి సరియైన అదృష్టదేవతగా భావించవచ్చు.
2. సప్తమంలో చంద్రుడు అధిపతి అయితే భార్య చాలా అందగత్తెగాను తెలివిగలది గాను సంస్కారవతియై ఉంటుంది.

3. సప్తమంలో కుజుడు అధిపతి అయితే భార్య మిక్కిలి విధేయురాలిగా ఉంటుంది. సంసారాన్ని చాలా జాగ్రత్తగా నడిపిస్తుంది. ఆ ఇంటిలోని మనుష్యులు మనస్తత్వాలకు సరిగా సరిపడేట్టు నడుచుకొంటుంది. ప్రతివారి యొక్క మనస్తత్వం అతి తేలికగా గ్రహించి వారికి అనుకూలమైన విధంగా నడుచుకొంటుంది. సంసారాన్ని నడిపించడంలో ఆ స్త్రీ నావకు చుక్కాని లాంటిదని మనం గ్రహించాలి.
4. సప్తమంలో బుధుడు అధిపతి అయితే భార్య మిక్కిలి విచక్షణా జ్ఞానం కలిగి మతపరంగాను, సాంప్రదాయకంగాను ఉంటుంది. చాలా ఉన్నత భావాలు కలిగి ఉత్తమ గుణాలు కలిగి ఉంటుంది.
5. సప్తమంలో గురుడు అధిపతి అయితే భార్య ఆదర్శప్రాయంగాను, ఉత్తమ భావాలతో సాంప్రదాయబద్ధంగా ఉంటుంది. సంసారానికి పేరు ప్రఖ్యాతులు తీసుకువస్తుంది.
6. సప్తమంలో శుక్రుడు అధిపతి అయితే భార్య అద్వితీయమైన అందం, చక్కటి వర్చస్సు మంచి శరీర సౌష్టవం విజ్ఞానం కలిగి ఉంటుంది. ఆమె చాలా మృదుభాషిణి మరియు విశాల భావాలు కలిగి కల్లాకపటాలు లేకుండా ఉంటుంది. ఆమె సంతానం చాలా సన్మార్గంలో పెరిగి ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారు. ఆమె ఎప్పుడు వయసు పెరిగినట్లు కనిపించక పిన్న వయస్కురాలైన స్త్రీగా కనపడుతుంది.
7. సప్తమంలో శని అధిపతి అయితే భార్య అంకితభావం గలదై అందరితోను స్నేహభావంతో ఉంటుంది. దాంపత్యంలో సామాన్య సంతోషం కొరవడని అనురాగం ఇస్తుంది.

ఈ పైన చెప్పిన అధిపతులు దుర్బలులైతే లేక అస్తంగతులైతే లేక పాప వీక్షణ కనుక ఉంటే పై గుణగణాలు చాలావరకు వ్యతిరేకమవుతాయని మర్చిపోవద్దు.

కళత్రస్థానాధిపతి లగ్నంలో ఉంటే ఆ వధూవరుల జీవితం ఎలా ఉంటుందో కూడా మనం తప్పక చూడాలి. ఎందుకంటే లగ్నం నుంచి సప్తమాధిపతి ఒక్కడే జీవిత నావకు చోదకుడు కాలేదు. అందువల్ల కళత్రస్థానాధిపతి అంటే సప్తమాధిపతి లగ్నంలో ఉంటే వారి దాంపత్య జీవితం ఎలా ఉంటుందో కూడా మనం పరిశీలించి చూడాలి. ఈ విధంగా పరిశీలించిన తర్వాత జాతకం యొక్క పొంతన కుదిరిందా లేదా అని నిర్ణయించుకోవాలి.

ఇప్పుడు మీకు కళత్రస్థానాధిపతి లగ్నంలో ఉంటే జీవితాలు ఎలా ఉంటాయో ఈ క్రింద ఇస్తున్నాము.

1. కళత్రస్థానాధిపతి లగ్నంలో ఉంటే అతని భార్య మంచి కుటుంబంలో జన్మించి ఉంటుంది. ఆమె అదృష్టాన్ని తీసుకువస్తుంది. అత్తమామల సహాయసహకారాలు ఆ వరునికి ఎక్కువగా ఉంటాయి. విదేశాలకు కూడా వెళ్లే అవకాశం ఉంది. ఆ వరుడు చాలా అందంగా ఆకర్షణీయంగా ఉంటాడు. స్త్రీ వాంఛ అధికం. భార్యకు తెలియకుండా స్త్రీ సౌఖ్యం బయట పొందవచ్చు.
2. కళత్రస్థానాధిపతి రెండవ గృహంలో ఆ వధువు మంచి ధనిక కుటుంబానికి చెందినదై ఉంటుంది. ఆమెకు స్వయం సంపాదన యోగం కూడా ఉంటుంది. ఆ సంపాదన ఎక్కువగా ఉండవచ్చు. ఆమె తల్లిదండ్రుల నుంచి నగలు, నాణ్యాలు, ధనధాన్యాలు తెస్తుంది. ఇవేకాకుండా ఐహిక సంతోషాలకు కావలసిన సకల సామగ్రి ఆమె ద్వారా అతనికి లభిస్తాయి.
3. సప్తమాధిపతి 3వ గృహంలో ఉంటే ఆ వదువు ఎక్కువ కట్నకానుకలు లాంఛనాల ద్వారా వివాహ సమయంలో భర్తకు ధన సహాయం కలుగజేస్తుంది. ఉన్న ధనాన్ని అతి జాగ్రత్తగా తన ప్రజ్ఞాపాటవాలతో వృద్ధిచేసి సంసారంలో ధన లోపం లేకుండా భర్తకు ఎంతో సహాయకరంగా ఉంటుంది.
4. సప్తమాధిపతి 4వ గృహంలో ఉంటే ఆ వధువు సంసార విద్యలో ఆరితేరినదై ఎంతో విచక్షణా జ్ఞానం కలిగి సంసారంలో శాంతి సౌఖ్యాలను నింపుతూ అందరిలోను ఐకమత్యం పెంపొందిస్తుంది.
5. సప్తమాధిపతి 5వ గృహంలో ఉంటే ఆ వధువు చిన్న వయస్సులోనే బంధుమిత్రుల ఇష్టాలకు వ్యతిరేకంగా ఆ వరుని ప్రేమించి వివాహం చేసుకుంటుంది. ఆ వధువు వల్ల వరుడు అన్ని విధాల సుఖసంతోషాలు అనుభవిస్తాడు. ఎందుకంటే ఆ వధువు మంచి విద్య, గుణం, సంస్కారం కలదై ఉంటుంది. కాని కొంతమంది పండితులు ఈ వివాహాన్ని చెడుగా భావించి సంతానహీనులగుదురని అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ భార్యాభర్తల ప్రేమానురాగాలలో లోపం ఉందని చెప్పలేదు.
6. సప్తమాధిపతి 6వ గృహంలో ఉంటే ఆ వధువు వ్యాధిగ్రస్తురాలై ఉంటుంది. దానివల్ల భార్యాభర్తల బంధం అనుకూలంగా ఉండదు. సంసార జీవితంలో సంతృప్తి ఉండదు. దీనివల్ల ఆ భర్త మనసు చలించవచ్చు. ఆ రూపంగా ఆమె బంధువులతో శతృత్వం కూడా కలుగుతుంది. మానసిక మరియు ధనలోపభావాలు ఎక్కువగా ఉంటాయి.

7. సప్తమాధిపతి సప్తమంలోనే ఉంటే ఆ వరుడు తన మేనత్త కుమార్తెనే వివాహం చేసుకుంటాడు. అలా కాని పక్షంలో అత్యంత సమీప బంధువులలోని కన్యనైనా వివాహమాడుతాడు. ఆమె మంచి సాంప్రదాయ కుటుంబం నుంచి వచ్చినా, భర్తతో విభేదించి పుట్టింటిలోనే ఉండిపోవడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయి.
8. సప్తమాధిపతి 8వ గృహంలో ఉంటే కళత్రదోషం చాలా ఎక్కువ. ఆమె వివాహమైన కొద్ది కాలానికే మరణించవచ్చు. ఒకవేళ మరణించకపోయినా ఆ వధువు మూర్ఖురాలై సంసారం చేజేతులా విచ్ఛిన్నం చేసుకుంటుంది.
9. సప్తమాధిపతి 9వ గృహంలో ఉంటే ఆ వధువుకు సరియైన వయసులో వివాహమయి చాలా సుఖసంతోషాలతో జీవనం సాగిస్తుంది. ధనధాన్యములతో తులతూగుతారు. ఆమె మానసిక ప్రవృత్తి మన పెద్దలు చెప్పిన సామెత “కార్యేషు దాసి, కరణేషు మంత్రి, భోజ్యేషు మాతా, శయనేషు రంభ, చరణేషు దాసి” అనే సూత్రాన్ని పూర్తిగా నిజం చేయగలదు.
10. సప్తమ స్థానాధిపతి 10వ గృహంలో ఉంటే ఆ వధూవరుల ఇద్దరి వృత్తి ఒకటే అయి బాగా ఎక్కువ ధనాన్ని ఆర్జిస్తారు. భర్తకు చాలా ధనాన్ని సమకూర్చినా ఆమె మనస్తత్వము నడవడిక పట్ల భర్త అనుమానపీడితుడిగా ఉంటాడు. అందువల్ల ధనభోగమున్నా సంసార భోగం ఉండదు.
11. సప్తమాధిపతి 11వ గృహంలో ఉంటే వధువుకు లేత వయసులోనే వివాహం జరుగును. అన్ని విధాల అభివృద్ధి ఉంటుంది. భర్త యొక్క జయానికి మార్గదర్శికి కాగలదు.
12. సప్తమాధిపతి 12లో ఉంటే ఆ వధువు చక్కటి స్ఫురద్రూపం కలిగి తెలివిగలదిగా ఉంటుంది. కాని ధనానికి విలువ ఇవ్వక విపరీతంగా ఖర్చు పెట్టే మనస్తత్వం గలదై అలా ఖర్చు పెట్టడం వల్ల ఆ సంసారంలో ధనలోపం వల్ల వచ్చే కష్టాలకు కారణభూతురాలవుతుంది. అందువల్ల భార్యాభర్తల మధ్య ఎక్కువ కలహాలుంటాయి. కాని దాంపత్యం సవ్యంగానే సాగిపోతుంది.

మీకు పైన ఇచ్చిన అంశాలన్నీ యధాతథంగా విశ్లేషించక సప్తమమందు ఉండే గ్రహాల ఉచ్ఛనీచాలను కూడా డిగ్రీలలో పరిశీలించడం మరియు సప్తమ గృహం మీద ఉండే ఇతర గ్రహాల వీక్షణ అదేవిధంగా సప్తమ గృహంలో కలిసి ఉండే గ్రహాలు స్థితి కూడా గమనించాలి.

ఇంతవరకు సప్తమంలో ఏ గ్రహాధిపతి ఉంటే ఫలితం ఎలా ఉంటుందో లేక లగ్నాధిపతి సప్తమంలోఉంటే ఫలితం ఎలా ఉంటుందో నేర్చుకున్నారు. సప్తమ గృహంలో ఎవరూ లేకపోతే అది శుభమేనని భావించాలి.

ఇప్పుడు సప్తమంలో ఉన్న గ్రహాల మీద మిగిలిన గ్రహాల వీక్షణ ఎలా ఉంటే ఆ ఫలితాలు సంభవిస్తాయో తెలుసుకుందాం. సప్తమ భావ పరిశీలన కూడా ముఖ్యమైనదని మనం మరచిపోకూడదు. ఎందువల్లనంటే అటువంటి భావవీక్షణ వల్ల సప్తమం బలహీనపడుతుందో లేక బలం పుంజుకుంటుందో తెలుసుకోవడానికి భావ పరిశీలన ముఖ్యం.

ఈ క్రింద ఇచ్చిన అంశాలు చూస్తే మీకు ఈ విషయం పూర్తిగా బోధపడుతుంది.


1. లగ్నాధిపతి సప్తమంలో ఉంటే అక్కగారి కుమార్తెను చేసుకోవడానికి ఎక్కువ అవకాశాలు ఉంటాయి. జీవితం ఆనందమయంగా గడిచిపోతుంది. వధువు తల్లిదండ్రుల ద్వారా అనేక సహాయాలు అందుతాయి.
2. ద్వితీయాధిపతి సప్తమంలో ఉంటే స్త్రీ వాంఛ అధికంగా అంటుంది. అక్రమ సంబంధాలు కూడా ఉంటాయి. సాధారణంగా వైద్యవృత్తికి సంబంధించిన వృత్తిలో ఉంటాడు. ఈయన వలన భార్య, తల్లికి చెడ్డ పేరు రావచ్చు.
3. తృతీయాధిపతి సప్తమంలో ఉంటే చాలా స్వార్థపరుడుగా ఉంటాడు. భార్య నుంచి సుఖం హక్కులాగా పొందుతాడు. ఈ విషయంలో ఆమెను ఎక్కువగా బాధిస్తాడు. ఆ వధువు తన ఇష్టాల ప్రమేయం లేకుండానే నిస్సహాయంగా లొంగిపోతుంది. ఎక్కువగా తన స్వసుఖం చూసుకుంటాడు. అతను తన బాధ్యతల పట్ల నిర్లక్ష్యంగా ఉంటాడు.
4. చతుర్థాధిపతి సప్తమంలో ఉంటే మేనత్త కుమార్తెను చేసుకోవడానికి ఎక్కువ అవకాశాలుంటాయి. ఆదర్శ దాంపత్యం ఉంటుంది. ఒకరి మీద ఒకరికి సహకారం, సానుభూతి వుంటాయి. దాంపత్య జీవితం సుఖమయంగా ఉంటుంది.
5. పంచమాధిపతి సప్తమంలో ఉంటే ఆ వధువు భక్తపరాయణురాలు. ధార్మికత, సద్గుణ సంపన్నురాలు, సాంప్రదాయాన్ని గౌరవించేదిగాను ఉంటుంది. ఆమె పుత్రులు ఉన్నత స్థానానికి వస్తారు. విదేశాలలో ఉంటారు కాని వీక్షణ బలహీనంగా ఉంటే సంతానం ఉండదు. పైగా దుఃఖంతో బాధతో మానసికంగా కృశించి పరాయిదేశంలోనే మరణించవచ్చు లేక జన్మస్థానం నుంచి అతి దూర ప్రాంతంలో మరణించవచ్చు.


6. షష్ఠమాధిపతి సప్తమంలో ఉంటే మేనమామ కుమార్తెను గాని లేక మేనత్త కూతురుని గాని చేసుకోవచ్చు. జీవితం సంతోషంగా గడుపుతారు. భావ వీక్షణ బలహీనంగా ఉంటే కలహాల వల్ల పౌరుషాలు పెరిగి దాంపత్యం విడిపోవచ్చు.
7. సప్తమాధిపతి సప్తమంలోనే ఉంటే ఆ వధువు అన్ని విధాల అదృష్టాన్ని తీసుకువస్తుంది. వరుడు ఇల్లరికం పోయి అష్టైశ్వర్యాలు అనుభవిస్తూ పేరు ప్రతిష్ఠలు సంపాదిస్తాడు.
8. అష్టమాధిపతి సప్తమంలో ఉంటే భార్య జీవితకాలప్రమాణం చాలా తక్కువగా ఉంటుంది. వివాహమైన కొద్ది కాలానికే ఆమె మరణించవచ్చు. ఆ వరుడు మరల వివాహం చేసుకుంటాడు. ఆ వధువు చాలా బీదస్థితి నుంచి వస్తుంది. సగటు జీవితం గడుపుతారు.
9. నవాధిపతి సప్తమంలో ఉంటే ఆ వధువు వల్ల వరునికి అదృష్టం కలిసి వస్తుంది. ఆమె చాలా మెతక మనిషై ఉంటుంది. మిక్కిలి విధేయురాలు పోణిమి (ఓర్పు) పొందికతో ఉండి భర్తకు అన్ని విధాలా సహకారం అందిస్తుంది.
10. దశమాధిపతి సప్తమంలో ఉంటే ఆ వధువు ధనిక కుటుంబము నుంచి వస్తుంది. ఆమె మూలంగా ధనం బాగా వస్తుంది. అలా కాని పక్షంలో ఆమె సంపాదన అధికంగా ఉంటుంది. స్వతంత్ర భావాలుకలదై కార్యదీక్ష పట్టుదల కలదై ఉంటుంది.
11. ఏకాదశాధిపతి సప్తమంలో ఉంటే వధువు వల్ల వరునికి లాభం కలిసి వస్తుంది. అతని జీవితంలో శుభప్రదమైన మార్పులు కలుగుతాయి. ధనధాన్యాలతో తులతూగుతూ ఉంటారు. దాంపత్యం సుఖసంతోషాలతో కూడి ఉంటుంది. సంతానం విద్యాధికులై ఉన్నత స్థితిలో ఉంటారు మరియు వారు తల్లిదండ్రులను వార్థక్యంలో ప్రేమగా చూసుకుంటారు.
12. ద్వాదశాధిపతి సప్తమంలో ఉంటే ఆ వరుడు లోభి, నీచమనస్కుడు. స్త్రీ లోలుడుగా ఉంటాడు. అనేక దుర్వ్యసనాలకు బానిస అవుతాడు. భార్యాపిల్లల మీద ఏమాత్రమూ లక్ష్యముండదు. సుఖరోగాలతో బాధపడి కృశించి మరణిస్తాడు. అతని వల్ల అతని సంతానం కూడా రోగగ్రస్తులు అవడం వలన వంశక్షయం కావచ్చు.

ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సినదేమంటే సప్తమాధిపతి బలహీనంగా ఉన్నా భావ వీక్షణ బలంగా ఉంటే అది మేలు జాతకమని భావించవచ్చు.


# ❖ 8. ద్విద్వాదశాలు


"ద్వి" అంటే రెండవ స్థానం. అలాగే "ద్వాదశః" అంటే 12వ స్థానం. జాతక చక్ర పరిశీలనలో ఈ రెండు అంశాల పరిశీలనలను కలిపి "ద్విద్వాదశాలు" అంటారు. వధువు రాశిస్థానం నుంచి వరుని రాశిస్థానం రెండవ స్థానంలో ఉండకూడదు. ఉదాహరణకు మేషరాశిలో వధువు చంద్రుడు ఉంటే వృషభరాశిలో వరుని చంద్రుడు వుండకూడదు. ఎందుకంటే మేషం నుంచి లెక్కపెడితే వరుని రాశి 2వది వృషభ రాశి అవుతుంది. ఆ విధంగా ఆ రెండు రాశులు ప్రక్కనే ఉండటం వలన ద్విరాశులు అయ్యాయి. ఇది నిషిద్ధం. అలాగే వధువు చంద్రుడు కర్కాటకంలో ఉండి వరుని చంద్రుడు మిధునంలో ఉందా వధువు రాశి నుంచి వరుని రాశి "ద్వాదశం" అంటే 12వ రాశి అవుతుంది. దీనినే ద్విద్వాదశాలు అంటారు. ఈ ద్విద్వాదశాలు పనికిరావు. ద్విద్వాదశాలు ఉంటే ఎటువంటి పరిస్థితులలో కూడా జాతక పొంతన లేదని వివరించి చెప్పాలి. మిగిలిన అంశాలన్నీ కుదిరినా వివాహం చేయరాదు. ఈ క్రింది చక్రాలు పరిశీలించండి. ముఖ్య విషయం ఏమంటే ఇద్దరి లగ్నాధిపతులు మిత్రులైతే ఈ దోషం ఉండదు. ఒకవేళ శత్రువులైతే నవాంశ చక్రంలో ఇద్దరి లగ్నాధిపతులు మిత్రులైతే అభ్యంతరము ఉండదు.




ఇలా లగ్నాలు ప్రక్కప్రక్కనే ఉన్నా ఆ లగ్నాధిపతులు మిత్రులైతే శుభ ద్విద్వాదశములు అవుతాయి. కాబట్టి పొంతన కుదిరిందని భావించాలి.









# 9. నవ పంచకాలు

నవము అంటే తొమ్మిది. పంచకము అంటే అయిదు. వధువు లగ్నం నుంచి వరుని లగ్నం 5వ గృహంలో ఉండకూడదు. అదేవిధంగా వరుని చంద్రుడి నుంచి లెక్కపెట్టినా వధువు చంద్రులు 5–9లలో ఉండకూడదని కొందరి అభిప్రాయం. కాని సాధారణంగా మనం ఏ అంశాన్ని అయినా వధువు జాతకంతో వరుని జాతకం సరిపోలుస్తాము. కాబట్టి ఈ అంశంలో వరుని జాతకం నుంచి వధువు జాతకాన్ని సరిపోల్చడం సమంజసం కాదు. ఈ దోషాన్ని నవపంచకాలు అంటారు. ఈ క్రింది చక్రాన్ని చూడండి. రాశి చక్రంలో ఈ విధంగా దోషం ఉంటే నవాంశచక్రం చూడండి. నవాంశలో దోషం లేకపోతే వివాహం చేసుకోవచ్చు.







# ❖ 10. షష్టాష్టకాలు


షష్టము అంటే ఆరు. అష్టకము అంటే ఎనిమిది. వధువు చంద్రుడి నుంచి ఆరవ స్థానంలో వరుని చంద్రుడు ఉంటే ఆ వివాహం చేయకూడదని పండితాభిప్రాయం. అదేవిధంగా వరుడు చంద్రుడి నుంచి వధువు చంద్రుడు 8వ స్థానంలో ఉండవచ్చు. దీన్ని షష్టాష్టకాలు అంటారు. శుభ షష్టాష్టకాలు అయితే వివాహం చేసుకోవచ్చు. శుభషష్టాష్టకాలు అనగా వధూవరుల ఇద్దరి లగ్నాధిపతులు మిత్రులైతే అది కూడా వీక్షణ భావం బలంగా ఉంటే వారికి వివాహం చేయవచ్చును. వధూవరుల రాశ్యాధిపతులను కూడా పరిశీలించాలి. రాశ్యాధిపతి అంటే జాతకచక్రంలో చంద్రుడు ఏ రాశిలో ఉంటే ఆ రాశి యొక్క అధిపతి ఆ జాతకునికి రాశ్యాధిపతి అవుతాడు. ఆ రాశ్యాధిపతులు కూడా షష్టాష్టకాలైతే "అనగా" వధువు చంద్రస్థానం నుంచి వరుని చంద్ర స్థానం ఆరు కాకూడదు. కాని వీరిద్దరి రాశ్యాధిపతులు మిత్రులైతే వివాహం చేయవచ్చును. కాని కొందరు పండితులు షష్టాష్టకాలలో వారిరువురి లగ్నాధిపతి మరియు రాశ్యాధిపతి మిత్రులైనా పాప గ్రహ వీక్షణ ఉంటే వారికి దాంపత్యంలో సహకార లోపాలు ఉంటాయని భావిస్తారు. ఈ క్రింది చక్రాలు పరిశీలించండి. రాశి చక్రంలో ఇరువురికి కుదరనప్పుడు నవాంశ చక్రం పరిశీలించి నవాంశ చక్రంలో దోషం లేకపోతే వధూవరుల పొంతన కుదిరినట్లుగానే భావించాలి.




పై చక్రంలో వధువు చంద్రస్థానాధిపతి కుజుడు వరుని చంద్రస్థానాధిపతి బుధుడు. వీరిద్దరూ శత్రువులు కాబట్టి వివాహం పొంతన కుదరదు.

ఈక్రింది చక్రంలో వధువు రాశ్యాధిపతి శని (మకర రాశి) వరుడు రాశ్యాధిపతి సూర్యుడు (సింహరాశి) శని, సూర్యుడు శత్రువులు అయినా వివాహ పొంతన కుదురుతుంది. ఎందుకంటే చంద్రస్థానంనుంచి వరుని చంద్ర స్థానం వరకు లెక్కపెట్టి





నప్పుడు షష్టమ స్థానం కాకూడదుగా అష్టమస్థానం అయితే దోషం కాదు. కాని ఇద్దరి అధిపతులు శత్రువులు కాబట్టి నవాంశ చక్రంలో చూడాలి.

మీరు గమనించవలసినది ఏమంటే సరియైన శాస్త్ర పరిజ్ఞానం లేనందువల్ల వధువు నుంచి వరునకు, అలాగే వరుని నుంచి వధువుకు "అటు నుంచి ఇటు, మరియు ఇటు నుంచి అటు చూస్తాం" అంటారు. అది తప్పు. జాతక పొంతనలో ఏ అంశమైన వధువు నుంచి వరునకే చూడాలి గాని వరుని నుంచి వధువుకు మాత్రం కాదని తెలుసుకోంది. ముఖ్యంగా తారా బల నిర్ణయ విషయంలో కూడా "అటు ఇటు" అంటూ చూస్తారు. అది తప్పు అని గ్రహించాలి. అటునుంచి ఇటు, ఇటునుంచి అటు అంటే వారి ఉద్దేశ్యం పిల్ల తరుపు నుంచి మరియు పిల్లవాని తరుపు నుంచి అని. కాని అది సరి కాదు. ఎందుకంటే ఒక్క మిత్రతార మరియు పరమమిత్రతారలోనే తప్ప ఇక ఏ ఫలితానికైనా "అటు ఇటు" కుదరదని తెలుసుకోండి. కాబట్టి ఎప్పుడూ వధువు నుంచి వరుని నక్షత్రం వరకు లెక్కించాలి అని మర్చిపోకండి.


# 11. కాల సర్పదోషం

చాలామంది ఈ పేరు వినగానే ఏమిటో అని భయానికి లోనవుతారు. ఎందుకంటే ఆ పేరు నిజంగా వినడానికి భయంగానే ఉంది. కాని అంత భయపడవలసిన అవసరం లేదు. రాహు కేతువులకు పూజ చేసుకుంటే దోష నివారణ అవుతుంది. ఈ పూజ రామేశ్వరం, కాళహస్తి లేక విజయవాడ కనకదుర్గ ఆలయంలో మాత్రమే చేయడానికి రాహు కేతువుల మందిరాలు ఉన్నాయి. హైదరాబాదు దగ్గర ఉన్న వర్గల్ అనే క్షేత్రంలో ఉందని ఇటీవలే తెలిసింది. కాబట్టి అక్కడే చేసుకోవాలి. రాహువు కేతువులిద్దరూ అతి భయంకరమైన కాల సర్పాలని, అవి సూర్యుడిని మరియు చంద్రుడిని కూడా మ్రింగివేస్తాయని మన పూర్వుల ప్రాచీన నమ్మకం. అలా మ్రింగిన తర్వాత సూర్యచంద్ర దర్శనాలు మనకు కావు కాబట్టి ఆ సమయాన్ని సూర్య గ్రహణం లేక చంద్ర గ్రహణం అంటాము. ఆ తర్వాత రాహుకేతువులు సూర్యుని వేడిని, చంద్రుని అతిశీతలాన్ని భరించలేక అవి కక్కివేస్తాయని అప్పుడు గ్రహణం విడిచిందని ఒకప్పుడు మన పూర్వీకులు నమ్మేవారు. కాని సాంకేతికపరంగా ఇది సత్య దూరమని తెలుసుకున్న తర్వాత ఆ కథ మరుగున పడిపోయింది. వధూవరులలో ఎవరి జాతకచక్రంలోనైనా $180^0$లలో ఉన్న రాహుకేతువుల మధ్య అన్ని గ్రహాలు ఉంటే లేక రాహుకేతువుల మధ్య వేరొక వైపు అన్ని గృహాలు ఖాళీగా ఉంటే ఆ జాతకునికి లేక జాతకురాలికి కాల సర్ప దోషం ఉందని నిర్ణయించాలి.

ఒక ముఖ్యమైన విషయం ఏమంటే, జాతక చక్రంలో లగ్నం 12 రాశులలో ఏ రాశిలోనైనా రాహు కేతువులు వారి స్థానాల్లో ఉన్నపుడు వారు విడిగా ఉన్నా లేక ఇతర గ్రహాలతో కలిసి ఉన్నా దోషం ఉన్నట్లే అంటే ఇతర గ్రహాల కలయిక వల్ల కాల సర్పదోషంలో మార్పు ఉండదు. లగ్నం అనేది గ్రహం కాదు. కాబట్టి లగ్నం ఎక్కడ ఉన్నా అంటే రాహు కేతువుల మధ్య ఉన్నా లేక కేతు రాహువుల మధ్య ఉన్నా కాల సర్పదోషంతో సంబంధం ఉండదని గ్రహించాలి. ఈ క్రింది చక్రాలలో లగ్నాలు ఎక్కడ ఉన్నాయో చూసి అన్నిటిలోను దోషం ఉన్నట్లు గ్రహించండి.






ఏ జాతక చక్రంలో అయినా సరే రాహుకేతువులు అపసవ్యంగా చక్రభ్రమణం చేస్తారు. అందుకని సవ్య చక్రంలో అపసవ్యంగాను, అపసవ్య చక్రంలో సవ్యంగాను చూడాలి.



పైన చూపిన చక్రం బట్టి మీరు తెలుసుకోవలసినదేమంటే అన్ని గ్రహాలు రాహుకేతువులు మధ్య బంధించబడి ఉన్నప్పుడే కాల సర్పదోషం ఉంటుంది. కాని అన్ని గ్రహాలు కేతు రాహువుల మధ్య ఉన్నా దోషం కాదని మీరు మర్చిపోకూడదు.

కాల సర్పదోషం ఉధృతం నివారించి దుష్ఫలితాల నుంచి కాపాడుకోవాలనుకుంటే అట్టివారు ఆరు ముఖాలు గల రుద్రాక్షను మెడలో ధరిస్తే రాహు కేతువుల వల్ల హాని ఉండదు. రుద్రాక్ష శివుని రూపం కాబట్టి రాహు కేతువులు బలహీనులై హాని చేయలేరని మహాఋషుల ఉవాచ. రుద్రాక్షను కుడిచేతికి గాని లేక మెడలో గాని ధరించాలి. మొలత్రాడులో గాని, యజ్ఞోపవీతంలో గాని ధరించకూడదని గ్రహించండి.




కాల సర్పదోషంలో అనేక రకాలు ఉన్నాయి. అన్ని రకాలలోను ఒకే ఫలితం ఎప్పుడూ ఉండదు. కాని సర్పయోగం ఏ స్థానం నుంచి ప్రారంభమయినది, ఆ ప్రారంభ రాశిలో ఏయే గ్రహాలు ఉన్నాయి అనేది కూడా ముఖ్యం. ఇంకొక విషయమేమంటే ఈ దోషం లగ్న స్థానం నుంచి ప్రారంభమయిందా? లేక రాశి స్థానం నుంచి ప్రారంభమయిందా? అనే విషయం కూడా గమనించాలి. రాహువు యొక్క ఉచ్ఛస్థానం మిధునరాశి. అక్కడి నుంచి సప్తమమైన ధనూరాశిలో దుర్బలులౌతాడు. ఉచ్ఛస్థానం నుంచి ప్రారంభమైన కాల సర్పదోషం మరియు చంద్ర స్థానం నుంచి ప్రారంభమైన దోషం చాలా ఉధృతమని గ్రహించాలి. రవితో కలిసిన గురు, శుక్రులు ఏ విధముగా దుర్బలులౌతారో అదే విధముగా రాహువుతో కలిసిన తన ఇతరులు శక్తిని కోల్పోతారు. రాహువు శని ఫలితములను, కేతువు కుజ ఫలితమును ఇస్తారు. ఈ దోషము వలన ఆ వ్యక్తి తన జీవితంలో అనేక సమస్యలు ఎదుర్కొంటాడు. తాను తలపెట్టిన ఏ కార్యక్రమానికైనా ఎక్కువగా ఆటంకాలు కలుగుతాయి. ముఖ్యంగా ఈ దోషం వల్ల శారీరక రుగ్మతలు, మానసిక వత్తిడి, ఆర్థికపరమగు ఆందోళన ఎక్కువగా ఉంటాయి. వివాహం ఆలస్యమవుతుంది. వివాహమైనా కూడా గర్భస్రావాలు, మృత శిశుజననాలు, సంతానలోపం ఉంటాయి. వైవాహిక జీవితంలో వియోగం రావచ్చు. ఈ దోషం ఉధృతంగా ఉంటే భార్యాభర్తల మధ్య ఎక్కువగా కలహాలు ఉంటాయి. ఈ కాల సర్పయోగ దోష నివారణార్థం రాహు, కేతువులకు శాంతి చేసుకున్న తర్వాతే వివాహము చేసుకోవాలి. ఈ కాల సర్ప దోషము మొత్తము దాదాపుగా 300 రకాలు ఉన్నాయి. అవి అన్నీ ఇచ్చుట చర్చించుట అనావశ్యము కాబట్టి ఈ అంశము వదలివేయడమైనది.

# 12. సప్తాసప్తమాలు లేక సమసప్తమాలు

వధువు లగ్న స్థానం నుంచి లెక్కపెడితే ఏడవ గృహంలో వరుని లగ్నం ఉంటే దానికి సప్తాసప్తమాలు లేక సమసప్తమాలు అంటారు. ఎందుకంటే వధువు లగ్నం నుంచే లెక్కపెడితే 7వ గృహంలో వరుని లగ్నం ఉన్నప్పుడు వరుని లగ్నం నుంచి లెక్కపెడితే వధువు లగ్నం కూడా 7వ స్థానంలోనే ఉంటుంది. వధూలగ్నం నుంచి 7వ గృహం ; వరుని లగ్నం నుంచి ఏడవ గృహం ఎటు చూసినా వేరొకరి లగ్నం వస్తుంది కాబట్టి. అంటే "7" రెండు సార్లు వస్తుంది కాబట్టి "సప్తమం + సప్తమం" అంటే సప్తాసప్తమాలు అంటారు. ఇది చాలా అనుకూలమైన జాతకమని మనం తెలుసుకోవాలి. ఒకరి జాతకంలోని లగ్నం నుంచి గాని రవి చంద్రుల నుంచి గాని రెండవ జాతకంలోని లగ్నం లేక రవిచంద్రులు $180^0$లలో ఉంటే అంటే సప్తమంలో ఉంటే అది చాలా ఉత్తమమైన కలయిక అని గ్రహించాలి. గురుడు, శుక్రుడు, బుధుడు సప్తాసప్తమాలలో ఉంటే వారి జీవితం సామాన్యంగా మధ్యరకంగా ఉంటుంది. శని, కుజుడు, రాహుకేతువులు సమసప్తమాలలో ఉంటే అంటే $180^0$లలో ఉంటే ఆ జాతకం కుదరలేదని గ్రహించాలి.

1. నెంబరు ఒకటి : వధూవరుల ఇద్దరి లగ్నాలు మేష తుల రాశులలో ఒకరి నుంచి ఒకరికి సప్తమంలో ఉన్నాయి.
2. వధూవరుల రవిచంద్రులు : ఇద్దరి రవి-చంద్రుడు వృషభంలో వృశ్చికంలో ఒకరి నుంచి ఒకరికి సప్తమంలో ఉన్నాయి.
3. వధూవరుల శని/ కుజుడు/ రాహువు లేక కేతువు ఇద్దరిని ఒకరి నుంచి ఒకరికి సప్తమంలో ఉన్నాయి.

| | | | |
|---|---|---|---|
| వరుని లగ్నం మీనరాశిలో గు / శు / బు 4 | వధువు లగ్నం మేషంలో 1 | వధువు లగ్నం వృషభంలో సూర్యుడు చంద్రుడు 2 | వరుని లగ్నం మిథునంలో శ / కు / రా / కే 3 |
| | **సప్తాసప్తమాల** | | |
| | **చక్రం** | | |
| వధువు లగ్నం ధనస్సులో శని / కుజు / రాహు / కేతు 3 | వరుని లగ్నం వృశ్చికంలో సూర్యుడు చంద్రుడు 2 | వరుని లగ్నం తులరాశిలో 1 | వధువు లగ్నం కన్యలో గు / శు / బు 4 |



4. వధూవరుల గురుడు, శుక్రుడు, బుధుడు కన్య మీన రాశులలో ఇద్దరికి ఒకరికి ఒకరి సప్తమంలో ఉన్నాయి.
5. మీరు గమనించవలసినదేమంటే వధూవరుల జాతకాలలో సమసప్తమాలు ఉన్నా అవి శత్రుక్షేత్రాలయితే సమసప్తమాలు శుభఫలితం ఇవ్వదని గ్రహించండి. లగ్నాలే కాకుండా రాశి స్థానాలు సమసప్తమాలు అయితే కూడా శుభమే. మీ సౌలభ్యం కోసం సమసప్తమాల పట్టిక ఇక్కడ ఇస్తున్నాను. జాగ్రత్తగా మననం చేసుకోండి.

## సమసప్తమాల పట్టిక

| | | | |
|---|---|---|---|
| 1. | మేషం | తుల | సములు |
| 2. | వృషభం | వృశ్చికం | సములు |
| 3. | మిధునం | ధనస్సు | సములు |
| 4. | కర్కాటకం | మకరం | సములు |
| 5. | సింహం | కుంభం | శత్రువులు |
| 6. | కన్యా | మీనం | సములు |
| 7. | తుల | మేషం | సములు |
| 8. | వృశ్చికం | వృషభం | సములు |
| 9. | ధనస్సు | మిధునం | శత్రువులు |
| 10. | మకరం | కర్కాటకం | శత్రువులు |
| 11. | కుంభం | సింహం | శత్రువులు |
| 12. | మీనం | కన్యా | శత్రువులు |

ఈ సమసప్తమాలలో ఎవ్వరూ మిత్రులుగా లేరు. అయితే సములుగానో లేక శత్రువులుగానో ఉన్నారు. కాబట్టి సమసప్తమాల మిత్రత్వం ఉంది అని చాలామంది అంటుంటారు అది నిజం కాదని తెలుసుకోండి.

# ❖ 13. పంచమ భావం

ఈ ప్రపంచంలో ఏ భార్యాభర్తలైనా సరే మాకు సంతానం వద్దు అనే వారుండరని అనడంలో ఏమి అతిశయోక్తి లేదు. అందరు కూడా సంతానము కావాలనే కోరుకొంటారు. ఎందుకంటే సంతాన లేమి వల్ల వారి దాంపత్య జీవితం నిస్సారమవుతుందనే, మరియు దుర్భరమైన అభద్రతా భావం వారికి వుంటుంది. ముఖ్యముగా వృద్ధాప్య సమయంలో ఎవరికైనా సంతాన సహాయత కావలసి వస్తుంది ఆ సంతానం వల్ల కలిగే సహాయంలో అత్యంత ప్రేమ వాత్సల్యములు తొణికిసలాడుతూ ఉంటాయి. ఆ అనుభవం ప్రతివారు ఎవరికివారు స్వయంగా అనుభవించి ఆ ఆనందాన్ని అనుభవపూర్వకంగా ఆస్వాదించాలే కానీ ఎంత కవి అయినా పూర్తిగా చెప్పలేడు.

సంతానంలేని స్త్రీని మిగిలిన సంతానం కలిగిన స్త్రీలందరూ గొడ్రాలుగా అపహాస్యం చేస్తారే తప్ప సాటి స్త్రీ అని సానుభూతి చూపరు. పైగా కొన్ని వ్రతాలు మరియు పూజలలో ఆమెను అనర్హురాలుగా స్త్రీలే విచక్షణా జ్ఞానం లేకుండా దూరంగా ఉంచుతారు అనే విషయం మన అందరికీ తెలుసు. ఇది నిజంగా అవమానకరం మరియు చాలా బాధాకరం. ఆచారం పేరుతో సాటిస్త్రీని మరొక స్త్రీ అవమానించడం ఎంత హేయం? మీరే ఆలోచించండి. సంతానం లేని వారి దాంపత్య జీవితం మోడువారిన జీవితం లాగా వుంటుంది. అందుకని సంతానం లేని ఆ దంపతులు సంతాన సాఫల్యం పొందటానికి ఎన్నో పూజలు, మరెన్నో వ్రతాలు కూడా ఆశగా భక్తిశ్రద్ధలతో చేస్తారు. కలిసిన ప్రతి స్వామిజీలను, బాబాలను సంతానం కొరకు వేడుకొంటారు. అయినా కొందరికి సంతానం కలుగదు. ఈ పుస్తకం ప్రచురిస్తున్న సమయంలో చాలామంది పాఠకులు సంతానం గురించి వివరంగా ఒక అధ్యాయం వ్రాయమని ఎన్నో ఊళ్ళనుండి ఫోన్లు చేశారు. వారి యొక్క వాంఛ సమర్ధనీయం కాబట్టి ఈ అధ్యాయంలో సంతానం గురించి ప్రత్యేకంగా వ్రాయదలచుకొన్నాను. ఎందుకంటే దాంపత్య జీవితంలోని పరమార్ధానికి పరాకాష్ఠ శుభసంతాన సాఫల్యమే. నేను జాతకపొంతన పరిశీలించినపుడు చాలామంది సంతానం గూర్చి వారు చర్చించడం రోజూ జరుగుతూ వుంటుంది. అందువల్ల ఈ అధ్యాయం పాఠకులందరి సౌలభ్యం కోసం వ్రాస్తున్నాను. ఈ అధ్యాయం మీకు చాలా ఉపయుక్తంగా వుంటుందని విశ్వాసం.


సంతానం గురించి తెలుసుకొనేందుకు మనం ఎప్పుడూ లగ్నస్థానం నుంచి పంచమ రాశిస్థానాన్ని పరిశీలించాలి. సవ్య చక్రంలో అయితే సవ్యంగాను, అపసవ్య చక్రంలో అపసవ్యంగానే చూడాలి అని మరువకూడదు. మౌలికంగా పంచమస్థానం అనేక విషయాలు అంటే భార్య ద్వారా సంక్రమించే ఆస్థిపాస్థులు, గ్రంధరచన శక్తి, వివేకము, లోకజ్ఞానము మరియు ప్రతిభ, మరియు సంగీత వాయిద్య పరికరాలు, పాండిత్యశక్తి ఇత్యాదులు గురించి చెపుతున్నా, మనం పంచమస్థాన పరిశీలనతో సంతాన వివరాలు తెలుసుకొనవచ్చు. అందుకనే పంచమస్థానం సంతాన స్థానమని, కొంతమంది వ్యవహరిస్తున్నా, అది ఒక సంతానం గురించే చెందుతుందని అనుకోకూడదు.


మనం జాతక పరిశీలన చేయునపుడు విధిగా పంచమభావాన్ని జాగ్రత్తగా విశ్లేషించాలి. ఎందుకంటే మిగిలిన అంశములు జాతకచక్రంలో అన్నీ బాగున్నా, పంచమస్థాన విషయంలో ఎపుడూ రాజీపడకూడదు. ఎందుకంటే ప్రతిరోజూ ఎంతోమంది సంతానయోగం ఉన్నదా, లేదా అని తప్త హృదయాలతో ప్రశ్నిస్తూ ఉంటారు. అలా ప్రశ్నించే వారి ముఖాలలో కనపడే మానసికక్షోభ ఎలాంటిదో నేను ప్రతిరోజు గమనిస్తూనే ఉంటాను. అందువల్ల ఈ అధ్యాయం మీరు తేలికగా తీసుకొనక క్షుణ్ణంగా అభ్యసించమని నా మనవి.

ఎందుకంటే జ్యోతిష్యుల అలసత్వం వల్ల నైతేనేమి, అరకొర జ్ఞానంతో అయితేనేమి ఏ పొరపాటు చేసినా, మరొకరి జీవితం దుఃఖమయం కాకూడదు.

ఎవరికైనా సరే శాస్త్ర రీత్యా పుత్రకారకుడు గురువే అని మనం తెలుసుకోవాలి. అందువల్ల ఆ గురువు యొక్క స్థానం, సంయోగం, స్థితి తెలుసుకుంటే కొంతవరకు మనం పుత్ర సంతానం గురించి చెప్పవచ్చు. ఒక ముఖ్యమైన గమనించవలసిన విషయం ఏమంటే "కారకో భావనాశాయ" అనే లోకోక్తి ఉంది. కాబట్టి పంచమ గురువును క్షేత్రస్థితి, వీక్షణస్థితిని కూడా గమనించాలి. ఇప్పుడు మనం జాతకచక్రాలను కొన్ని వేసి విశ్లేషిద్దాము. మీరు జాగ్రత్తగా అభ్యసించండి.


1. పంచమస్థానంలో గ్రహాధిపతియైన రవి మరియు పుత్రకారకుడైన గురువుల సంయోగం వుంటే దాని మీద పాపవీక్షణ లేకుండా ఆ ఇద్దరి గ్రహాలు బలవంతులైతే ఆ జాతకులకు ఎక్కువ పురుష సంతానం వుంటుంది. ఇక్కడ ఇద్దరు బలవంతులైతే అంటే వారిలో ఒకరైనా ఉచ్ఛస్థితిలో వుండి రెండవవారికి శతృక్షేత్రం కాకుండా ఉండాలి. అలా వున్నప్పుడు పురుష సంతానం ఎక్కువ అని మనం తెలుసుకోవచ్చును. చక్రం-1 చూడండి.





ఈ చక్రంలో ఈ జాతకులది ధనుర్లగ్నం అయింది. లగ్నస్థానం నుంచి లెక్క పెట్టినప్పుడు పంచమస్థానం మేషరాశి అయింది. ఈ పంచమ స్థానంలో పుత్ర కారకుడైన గురువు తన మిత్ర క్షేత్రంలోనే ఉన్నాడు. అలాగే గురువుతో కలిసి వున్న రవి కూడా మిత్రక్షేత్రంలోనే ఉన్నాడు. అంటే రవి మిత్రక్షేత్రంలో ఉండటమే కాక ఉచ్ఛస్థితిలో ఉన్నాడని గమనించండి. ఎందుకంటే రవికి మేషరాశి ఉచ్ఛస్థానమని మనకు తెలుసు. పైగా ఈ రెండు గ్రహాల మీద పాపవీక్షణ లేదని గ్రహించండి. ఇలాంటి గ్రహస్థితి వల్ల ఈ జాతకునకు పుత్ర సంతానం ఉంటుందని మనం నిర్ధారణ చేసుకొనవచ్చును.

ఇప్పుడు చక్రం-2 గమనించండి.









2. ఈ రెండవ చక్రంలో రవి, గురువు కలిసి లగ్నం నుంచి పంచమ స్థానమైన కర్కాటకరాశిలో ఉన్నారు. ఈ రెండు గ్రహాలు తమ మిత్రక్షేత్రంలో ఉన్నాయి. పైగా గురువు మిత్రక్షేత్రంలో ఉండటమే కాక ఉచ్ఛ స్థితిలో ఉన్నాడు. గురువు, చంద్రులు

మిత్రులు. అలాగే రవి చంద్రులు కూడా మిత్రులే. కర్కాటకరాశి గురువు మరియు రవి ఇద్దరకు మిత్రక్షేత్రమే. కానీ శతృక్షేత్రం కాదు. పైగా ఈ క్షేత్రం మీద పాపవీక్షణ లేదు. ఇలాంటి గ్రహస్థితి ఉన్నపుడు మనం ఈ జాతకులకు పుత్రసంతానం ఉంటుందని రూఢీగా చెప్పవచ్చు.

ఎవరి జాతకచక్రంలోనైనా నవమస్థానంలో గురువు వుండి, లగ్నస్థానంలో కానీ, లేక ద్వితీయస్థానంలో కానీ శుభగ్రహములు ఉండి, ఆ శుభగ్రహముల మీద పాపవీక్షణ లేకుండా ఉంటే ఆ జాతకులకు జ్యేష్ఠ సంతానం పుత్రసంతానమే అవుతుంది. మీరు గమనించవలసినది ఏమంటే ఈ స్థానముల మీద పాపవీక్షణ లేకుండా వున్నా ఆ స్థానములు పాపకర్తవి కాకుండా వుంటే ఆ శిశువుకు రాజయోగము వుంటుందని మనం గ్రహించవచ్చు.

3. ఈ మూడవ చక్రం చూడండి. ఈ జాతకునకు లగ్నము కర్కాటకమైనది.









ఈ రాశికి అధిపతియైన చంద్రుడు తన స్వక్షేత్రంలో వున్నాడు. కాబట్టి నవమాధిపతియైన గురువు కూడా చంద్రునిలాగే బలంగా వున్నాడు. అంటే లగ్న ద్వితీయ, నవమస్థానాలతో పుణ్యగ్రహాలు వున్నాయి. ఈ గ్రహస్థితి వల్ల మంచియోగప్రదమైన పుత్రుడు కలుగుతాడు అని తెలియవలెను.

4. ఎవరి జాతకంలోనైనా పంచమస్థానాధిపతి, మరియు గురువు కనుక ఏదేని పురుష గ్రహముతో కలిసి ఈ ముగ్గురి కలియక ఏదేని పురుషరాశిలో వుంటే, అంటే మీన, మేష, సింహ, వృశ్చిక, ధనువు రాశులలో ఉన్నట్లైతే ప్రప్రథమంగా పురుషసంతానమే కలుగుతుంది.

ఈ నాల్గవ చక్రం పరిశీలించండి.









ఈ జాతకునకు లగ్నస్థానం మీనరాశి అయినది. ఈ లగ్న స్థానం నుంచి పంచమస్థానం కర్కాటకరాశి అయినది.

కర్కాటకరాశికి అధిపతి చంద్రుడు అంటే చంద్రుడు పంచమ స్థానాధిపతియైనాడు.

ఈ పంచమాధిపతి మరియు గురువు కలిసి మరొక పురుష గ్రహంతో కలిసి పురుషరాశిలో వున్నాడు. ఇలాంటి గ్రహస్థితిఉన్నప్పుడు ఆ జాతకునకు ప్రధమ సంతానం పుత్రసంతానమే కలుగుతుంది. ఒకవేళ వధూ, వరుల ఇద్దరికి తమ తమ పంచమ స్థానాల మీద పాపవీక్షణ వున్నా, లేక రెండు పాపగ్రహాలు వున్నా, లేక పంచమస్థానంలోని గ్రహాలు ఏ ఒక్కరి జాతకులలోనైనా భంగపడితే లేక ఇద్దరికి తమ తమ పంచమస్థానాలలో రాహువున్నా అసలు సంతానమే కలుగకపోవచ్చు.


5. ఏ స్త్రీ జాతకులలోనైనా రవి, మరియు గురువు, ధనుస్సులో కానీ, లేక మిధునంలో కానీ ఉండి ఆ రవి గురువుల మీద బుధుని ఒక్క వీక్షణ వుంటే ఆ స్త్రీకి కవల పిల్లలు కలుగవచ్చు. చక్రం నెం 5 చూడండి.









ఈ చక్రంలో ధనురాశిలో రవి, గురువు వున్నారు. ఆ రవి గురువుల మీద మిధునరాశి నుంచి సప్తమ బుధవీక్షణ గమనించండి. అలాగే మిధునరాశిలో రవి గురువులు ఉన్నారని గమనించండి. ఆ రవి, గురువులమీద, ధనుర్ రాశి నుంచి బుధుని సప్తమ వీక్షణ వుంది. మీరు ముఖ్యముగా తెలుసుకోవలసిన విషయం ఏమంటే మీనరాశిలోనూ, మరియు మిధునరాశిలోను, గురువుల మీద బుధునియొక్క సప్తమ వీక్షణ చూపించడానికి బుధుడిని రవి, గురువులతో కలిసి వున్నట్లుగా చూపించడమైనది. కానీ, గురువు, రవి బుధులు సంయోగము మీనరాశిలో కానీ, మిధున రాశిలో కానీ ఉండాలని నిబంధన కాదని పాఠకులు గ్రహించాలి.

6. ఏ జాతకులకైనా రాశిలోనూ, మరియు నవాంశలో కూడా గురువు శని స్థానంలో ఉండి ఆ గురువుమీద పాపవీక్షణ ఉంటే ముఖ్యంగా రాహువీక్షణ ఉన్నా లేక రాహుతో గురువు కలిసి ఉన్నా అట్టి జాతకులకు సంతానము ఉండదు. ముఖ్యముగా గమనించాల్సిన విషయం ఏమంటే గురువు శని స్థానాలయిన మకర, కుంభాలలో ఉన్నపుడు, ఆ గురువు మీద ఏ పాపగ్రహవీక్షణ రాశిలో ఉందో అదే వీక్షణ నవాంశలో కూడా ఉండి తీరాలని గ్రహించండి. ఈ క్రింది చక్రం – 6 పరిశీలించండి.




ఈ చక్రంలో గురువు కుంభరాశిలో ఉన్నాడు. ఈ గురువు మీద కుజుని చతుర్ధ విశేష పాపవీక్షణ ఉంది. కాబట్టి సంతానం ఉండకపోవచ్చు.


ఎందుకంటే ఏ గ్రహానికైనా స్వస్థాన వీక్షణ బలంగా ఉంటుంది. ఇక్కడ స్వస్థాన వీక్షణే కాక విశేష వీక్షణ బలం కూడా ఉంది.

ఉచ్ఛస్థితిలో ఉన్న కుజసంయోగం ఉండటమే కాక ఈ గురువు మీద పాప గ్రహమైన రాహువు యొక్క సప్తమ వీక్షణ కూడా ఉంది కాబట్టి ఈ జాతకులకు సంతానం ఉండదని రూఢిగా చెప్పవచ్చు.


7. ఎవరి జాతకంలో అయినా లగ్నాధిపతి మరియు పంచమాధిపతి కలిసి పంచమ స్థానంలో ఉండి ఆ పంచమ రాశి స్థానం మీద శుక్రవీక్షణ ఉంటే ఆ స్త్రీకి స్త్రీ సంతానమే ఎక్కువగా ఉంటుంది. ఒకవేళ ఈ పంచమ స్థానం మీద పాపవీక్షణ పుత్ర సంతానం ఉండదు.


ఈ క్రింది చక్రం నెం.7 మరియు 7A పరిశీలించండి.





చక్రం – 7లో లగ్నాధిపతి శని అయ్యాడు. పంచమాధిపతి బుధుడయ్యాడు. వీరిద్దరు కలిసి పంచమస్థానమైన మిధునంలో ఉన్నారు. ఈ పంచమ స్థానం మీద ధనూరాశి నుంచి శుక్ర వీక్షణ ఉందని గ్రహించండి. ఇలా గ్రహస్థితి ఉంటే ఆ స్త్రీకి ఎక్కువ స్త్రీ సంతానమే ఉంటుంది. కాని పుత్ర సంతానం ఉండదని మనం అనుకోకూడదు.





ఈ పై చక్రంలో లగ్నాధిపతి గురువు అయ్యాడు. పంచమాధిపతి చంద్రుడయ్యాడు. వీరిద్దరు కలిసి పంచమస్థానమైన కర్కాటక రాశిలో ఉన్నారు. ఈ పంచమ స్థానం మీద మకర రాశి నుంచి శుక్రుని వీక్షణ ఉందని గ్రహించండి. పైగా గురు, చంద్రుల మీద, అంటే పంచమ స్థానం మీద, కుజుని పాపగ్రహ వీక్షణ ఉంది. కాబట్టి పుత్ర సంతానం ఉండదని మనం గ్రహించాలి.


8. ఏ స్త్రీ జాతకంలోనైనా లగ్న స్థానం నుంచి నవమ స్థానంలో గురువు ఉండి, ఆ గురు స్థానం నుంచి లెక్కపెట్టినపుడు ఏ స్థానం పంచమ స్థానం అయిందో ఆ స్థానంలో రవి, ఆ రవి స్థానం నుంచి లెక్కపెట్టినపుడు ఏ స్థానం సప్తమమయిందో ఆ స్థానంలో కుజుడు ఉంటే పుత్ర సంతానం తప్పక కలుగుతుంది. అంటే లగ్న స్థానంలో రవి సప్తమ స్థానంలో కుజుడు నవమస్థానంలో గురువు ఉండాలనేది నియమం. ఒక విషయం ఏమంటే ఈ గ్రహస్థితి తప్పక ఉండాలనేది నియమం. కాని, గ్రహాలు ఫలానా రాశిలోనే ఉండాలని గాని, ఎవరి వీక్షణలో ఉన్నారని గాని, లేక ఎవరితో కలిసి ఉన్నాడనే నిబంధన ఏమీ లేదు. ఈ చక్రం 8 చూడండి.




ఈ జాతకచక్రంలో లగ్నం మీన లగ్నం అయింది. లగ్నం నుంచి నవమ స్థానంలో గురువు ఉన్నాడు. ఆ గురు స్థానం నుంచి పంచమ స్థానంలో రవి ఉన్నాడు. ఆ రవి స్థానం నుంచి, సప్తమ స్థానంలో కుజుడు ఉన్నాడని గమనించండి. అంటే లగ్న రవి సప్తమ కుజ, నవమ గురు ఉండాలి అనేది నియమం. మిగిలిన రాశులలోని గ్రహస్థితి గాని వారి వీక్షణ, స్థితి సంయోగాలు గాని లేక శూన్య స్థానాలు గాని పరిగణనలోకి తీసుకొనకూడదు.

9. ఏ స్త్రీ జాతకంలోనైనా పంచమస్థానంలో పాపగ్రహం ఒకటి గాని లేక అంతకంటే ఎక్కువ ఉండి, శుభవీక్షణ ఉంటే స్త్రీ సంతానం కలుగుతుంది. ఒకవేళ శుభవీక్షణ లేక పాపగ్రహాల సహజవీక్షణ గాని లేక విశేష వీక్షణలు ఉంటే అసలు సంతానమే ఉండదని గ్రహించాలి. ఒకవేళ బుధుని స్వస్థాన వీక్షణ ఉంటే ఆ కలిగే సంతానం, స్త్రీ సంతానమయితే గొడ్రాలుగానో, పురుష సంతానమయితే నపుంసకులుగానో జన్మిస్తారు. ఈ క్రింది చక్రం పరిశీలించండి. లగ్నం నుంచి పంచమంలో పాపగ్రహాలు ఉన్నా పంచమ గురు వీక్షణ ఉంది.









మీయొక్క విజ్ఞానానికి, అభ్యాసానికి కొన్ని ఉదాహరణలు సంతానం గురించి ప్రస్తావించాను. కాని ఇవే కాక మీరు ప్రసిద్ధమైన గ్రంధరాజములు చదివి ఇంకా ఎన్నో విషయాలు నేర్చుకోమని నా పాఠకులకు ఒక సలహా ఇస్తున్నాను.

10. ఎవరి జాతకంలోనైనా సరే గురువు మరియు లగ్నాధిపతి కలిసి ఏ కేంద్రస్థానములో కానీ, లేక ఏ కోణ స్థానంలో కానీ వుంటే, అనగా లగ్న స్థానంలో కానీ, చతుర్థస్థానంలో కానీ, పంచమస్థానంలో కానీ, సప్తమ స్థానమందు కానీ, నవమ స్థానమందు కానీ, మరియు దశమ స్థానమందు కానీ ఉంటే అట్టి జాతకులకు పుత్ర సంతానం తప్పక కలుగుతుంది. పైగా ఆ పుత్రసంతానం ద్వారా సుఖ సౌఖ్యాలు పొందుతారు. ఈ అంశమునకు ఉదా. చక్రము వేయుట అవసరము లేదు. ఎందుకంటే ఇలాంటి చిన్న విషయములకు మీకు తగినంత శాస్త్రపరిజ్ఞానము వుంటుందని భావించి చక్రము వేయుట వదలివేసినాను. ముందు ముందు కూడా సరళమైన అంశములకు చక్రము వేసి చూపించుట అంత ఆవశ్యము కాదు అని మీరు గమనించగలరు.

ఎవరి జాతకములోనైనా సరే లగ్నస్థానము నుండి మేష సింహం, వృశ్చిక మరియు మీనరాశులు లగ్నస్థానము నుంచి పంచమ స్థానమై ఆ స్థానములో గురు, కుజులు కలిసి వున్నా, లేక కుజుడు మాత్రమే ఉండగా వీక్షణ వున్న అట్టి జాతకులకు పుత్ర సంతానం ఉంటుంది.

11. ఎవరి జాతకంలోనైనా సరే చంద్రుడు వున్న స్థానం నుంచి పంచమ స్థానంలో గురువున్నా, గురుస్థానం నుండి పంచమస్థానంలో శని ఉన్నా, అలాగే శని స్థానం నుంచి పంచమ స్థానంలో రాహువు ఉన్నా, ఆ జాతకులకు పుత్ర సంతానం ఉంటుంది అని గ్రహించాలి. ఈ క్రింది చక్రం గమనించండి.



మీరు ముఖ్యంగా పై చక్రముల నుంచి గమనించవలసినది ఏమంటే గ్రహస్థితి గణనలో లగ్నంతో సంబంధం లేని రాశి స్థానం నుంచి గ్రహస్థితిని విశ్లేషించు కోవాలని మీరు అర్థం చేసుకోవాలి.

ఎవరి జాతకంలోనైనా సింహిరాశిలో శని ఉండి సప్తమ, అష్టమ మరియు వ్యయ స్థానంలో గురువు కనుక దుర్బలుడు అయితే ఆ జాతకునకు దత్తపుత్రుడు వుంటాడని మనం అర్థం చేసుకోసుకోవాలి.


ఏ స్త్రీ జాతకంలోనైనా పంచమ, నవమ అధిపతులకు పరస్పర వీక్షణ ఉంటే ఆ స్త్రీకి సంతానం ఉండదు. అంటే లగ్నం నుంచి పంచమాధిపతి మరియు నవమాధిపతి సమసప్తమాలైతే పరస్పర వీక్షణ తప్పదు అని మీరు గ్రహించాలి. ఈ క్రింది చక్రం గమనించండి.


| | | | |
|---|---|---|---|
| లగ్నం | రా | | చంద్ర |
| గురు | | | శని |
| | | | బు |
| కుజ | | కే | రవి శుక్ర |

| | | |
|---|---|---|
| చంద్ర | రా | లగ్నం గురు |
| శని | | |
| బు రవి శుక్ర | కే | కుజ |

ఈ చక్రంలో లగ్నం మీన లగ్నము అయినది. లగ్నం నుంచి పంచమస్థానం కర్కాటక స్థానమయినది. ఈ కర్కాటకరాశ్యాధిపతి అయిన చంద్రుడు మిధునరాశిలో వున్నాడు. అలాగే లగ్నం నుంచి నవమస్థానం వృశ్చికమయినది. ఈ వృశ్చిక రాశ్యాధిపతి అయిన కుజుడు ధనూరాశిలో ఉన్నాడు. ఈ గ్రహస్థితి వల్ల పంచమ నవమాధిపతులకు సహజసప్తమ వీక్షణం ఉంది కాబట్టి సంతానం ఉండదు.


12. ఏ పురుష జాతకంలోనైనా పంచమాధిపతి స్త్రీ గ్రహం, మరియు నపుంసక గ్రహాలలో కలిసి బుధక్షేత్రములైన మిధునరాశిలో కానీ లేక కన్యారాశిలో కానీ వుంటే ఆ జాతకునకు పురుష సామర్థ్యము ఉండదని గ్రహించాలి. ఈ జాతకచక్రం గమనించండి.





ఈ చక్రంలో లగ్నం వృశ్చికలగ్నం అయింది. ఈ లగ్న స్థానం నుంచి పంచమాధిపతి అయిన గురువు స్త్రీ గ్రహమైన శుక్రునితోను మరియు నపుంసక గ్రహాలైన శనితోను కలిసి బుధక్షేత్రమైన మిధునరాశిలో ఉన్నారు. కాబట్టి ఈ గ్రహస్థితి ఉంటే ఆ పురుషుడు నపుంసకుడని గ్రహించాలి. పంచమస్థానంలో గురువు రాహువు కలిసి ఉంటే వారికి పుత్ర సంతానం ఉండదు. వధూవరులలో యిద్దరి పంచమ స్థానాలలో రాహువు వుంటే ప్రధమ గర్భం విచ్ఛిన్నమవుతుంది. సంతాన దోషంవల్ల అంగవైకల్యం గాని లేక బుద్ధి శూన్యం గల సంతానం కలుగుతుంది. ఆ రాహువు మీద పాప వీక్షణ కనుక యిద్దరికి ఉంటే సంతానం అసలు ఉండదని గ్రహించాలి.


13. పంచమస్థానాధిపతి, లగ్నస్థానాధిపతి పురుష గ్రహములు అయి ఉండి ఆ పంచమ స్థానంలో పురుష గ్రహమే ఉండి దానిమీద పురుష గ్రహవీక్షణ కనుక ఉన్నట్లయితే వారికి కల్గిన పుత్రుడు మహారాజుతో సరితూగే భోగభాగ్యాలు అనుభవిస్తాడు. ఉన్నత విద్య, శాస్త్ర పాండిత్యం ఆదర్శవంతమైన దాంపత్య జీవితం కలిగి ఐశ్వర్యవంతుడుగా జీవిస్తాడు. ఈ క్రింది చక్రం గమనించండి.




ఈ జాతక చక్రంలో లగ్నం వృశ్చిక లగ్నమైనది వృశ్చిక లగ్నాధిపతి కుజుడు. ఈ లగ్నస్థానం నుంచి పంచమ స్థానం మీనరాశి అయింది. మీనరాశి అధిపతి గురువు. ఈ పంచమ స్థానం నుండి లెక్కపెడితే సప్తమ స్థానం కన్యారాశి అయినది. ఈ కన్యరాశిలో రవి ఉన్నాడు. మీరు రవి అర్థం చేసుకోవాలసినది ఏమంటే లగ్నాధిపతి పురుషుడు పంచమాధిపతి పురుషుడు మరియు పంచమస్థానం మీద పురుష గ్రహమైన రవి వీక్షణమున్నది. ఇటువంటి గ్రహస్థితి కలిగి ఉన్నప్పుడు ఆ తల్లిదండ్రులకు పుత్ర సౌఖ్యం ఉంటుంది.

14. పంచమ స్థానము మకరంగాని లేక కుంభం గాని అయి ఉండి ఆ స్థానంలో శని ఉంటే ఆ స్త్రీకి మృతశిశువు జన్మిస్తుంది లేక జన్మించిన పక్షం లోపల ఆ శిశువు మరణిస్తుంది. ఒకవేళ గురువీక్షణ ఉంటే స్త్రీ సంతానం కలిగి ఆ శిశువు జీవించవచ్చు. ఏ స్త్రీ జాతక చక్రంలోనైనా సరే పంచమ స్థానంలో లగ్నాధిపతి మరియు తృతీయాధిపతి యిద్దరు రాహుతో కలిసి ఉంటే ఆ స్త్రీకి కవలపిల్లలు కలుగవచ్చు. ఆ పంచమ స్థానంమీద గురు వీక్షణ ఉన్న పంచమాధిపతి గురువు అయి ఉన్న ఆ కవల పిల్లలు యిద్దరు మగపిల్లలేనని గ్రహించాలి. ఈ క్రింది చక్రం గమనించండి.





ఈ చక్రంలో లగ్నం వృశ్చికం అయింది వృశ్చిక లగ్నాధిపతి కుజుడు పురుష గ్రహం. ఈ వృశ్చిక రాశి నుండి పంచమస్థానం మీన లగ్నమైంది. లగ్నాధిపతియైన గురువు యొక్క పురుష విశేష వీక్షణ లగ్నంమీద ఉంది అని గ్రహించండి. ఇందువల్ల కవల పిల్లలు కల్గుతారని మనం అర్థం చేసుకోవాలి.


15. ఏ జాతకమందైన సరే లగ్న స్థానంలో రాహువు ఉండి దశమ స్థానంలో లగ్నాధిపతి పాపగ్రహాలతో కలిగి ఉండి కాని లేక జాతక చక్రంలో ఏ రాశిలో అయినా నాలుగు పాప గ్రహాలు కలిగిఉంటే ఆ స్త్రీకి ఇద్దరు కవలలు ఆడపిల్లలే జన్మిస్తారు. ఈ క్రింద చక్రమును గమనించండి.

| | | | |
|---|---|---|---|
| లగ్నం<br>రాహువు | | | చం<br>ర,శు,బు |
| | | | |
| | | | |
| | గు<br>కు<br>శ | | కే |




ఈ చక్రంలో లగ్నస్థానంలో రాహువు ఉండి దశమంలో పాపగ్రహాలుండి లగ్నం నుండి చతుర్థంలో నాలుగు పాపగ్రహాలుండడం వల్ల ఆ స్త్రీకి కవల పిల్లలు కలుగుతారు. ఒక ముఖ్య విషయం ఏమంటే లగ్నం నుండి చతుర్థంలో గ్రహాలు అక్కడ నుంచి మళ్లి చతుర్థంలో శుక్రగ్రహం అక్కడ నుంచి మరల చతుర్థంలో మూడు గ్రహాలు అంటే లగ్నం నుంచి చతుర్థ, సప్తమ, దశమ స్థానాల్లో ఉన్న గ్రహాలు ఉన్నాయని గమనించండి. ఏ జాతక చక్రంలోనైనా లగ్నాధిపతి తృతీయ స్థానంలో ఉండి తృతీయాధిపతి లగ్నంలో ఉండి వీరిద్దరి మీద పాపగ్రహ వీక్షణ ముంటే ఆ జాతకుడు కవల పిల్లల్లో ఒకరు మరణించవచ్చు. ఈ క్రింది చక్రం గమనించండి.

| | | | |
|---|---|---|---|
| లగ్నం<br>శుక్రుడు | రవి<br>బుధుడు | గురువు | రాహువు |
| | | | చంద్రుడు |
| శ | | | |
| కే | కు | | |



# 14. లగ్న సప్తమ, అష్టమ భావాలు

మనం ఈ అధ్యాయంలో లగ్నాధిపతి, సప్తమాధిపతి మరియు అష్టమాధిపతి జాతక చక్రంలో ఏయే స్థానాల్లో ఉండటం మంచిదో కాదో; ఒకవేళ ఉండకూడదని స్థానాల్లో ఉన్నప్పుడు ఆ భావాధిపతులు ఏయే ఫలితాన్నిస్తారో ఈ క్రింద మీకు సూక్ష్మరీతిలో ఇస్తున్నాను. వధూవరుల వివాహపొంతనకై ఎంతవరకు ఈ భావాలు పరిశీలిస్తే చాలో – అంతవరకు మాత్రమే ఫలితాలు ఇవ్వడం జరిగింది. ఇంకా లగ్న సప్తమ, అష్టమ స్థానాల్లోగాని, వేరే ఏ స్థానాల్లోనైనా ఉన్న గ్రహాలు, ఏ ఫలితాన్నిస్తాయో మీరు విపులంగా తెలుసుకోదలచుకొంటే నేను వ్రాసిన "జాతక సుధాసారం" అనే పుస్తకంలో పూర్తిగా వివరించబడినది.

వధూవరులలో వారి జాతకాలలో లగ్నాధిపతి షష్టమ, అష్టమ మరియు ద్వాదశాధిపతులు ఏయే స్థానాల్లో ఉండకూడదో దానివలన ఫలితాలు ఏమిటో క్రింద గమనించండి.

1. ఎవరి జాతకంలోనైనా సరే లగ్నాధిపతి లగ్న స్థానం నుంచి 6వ రాశిలో ఉంటే ఆ జాతకునికి ఎక్కువ అనారోగ్యం, మరియు శారీరక రుగ్మతతో బాధపడతారు. ఆ స్థానం మీద పాపవీక్షణ ఉంటే దీర్ఘకాల వ్యాధులకు లోనగుదురు. దాంపత్య జీవితంలో కావలసినంత శారీరక సుఖం ఇవ్వలేరు/పొందలేరు.
2. లగ్నాధిపతి లగ్న స్థానం నుంచి 8వ రాశిలో ఉంటే వీరు కూడా అనారోగ్యంతో బాధపడ్తారు. అదేకాక మొండి వాదులాట, మూర్ఖ ప్రవర్తన, వితండ వాదాలతో భార్యను హింసిస్తారు. కామవాంఛ మరీ ఎక్కువగా ఉంటుంది.
3. లగ్నాధిపతి లగ్నం నుంచి 12వ స్థానంలో ఉంటే వీరి చేతిలోని ధనం హారతి కర్పూరంలా హరించుకుపోతుంది. ధనం యొక్క విలువ తెలియక వృధా ఖర్చులు చేసి దారిద్ర్యంతో బాధపడ్తారు. నిరంతరం ఏదో ఒక రుగ్మతకు లోనవుతూ ఉంటారు. ఎక్కువగా కోపతాపాలకు లోనయి, వివేకశూన్యులై, ఆవేశంగా ప్రవర్తిస్తారు.

దాంపత్య జీవితంలోని సుఖాన్ని చవిచూడలేరు. జీవిత భాగస్వామిని అసంతృప్తికి లోను చేస్తారు.

ఇంతవరకు మనం లగ్నాధిపతి ఫలితాలు వివాహ పొంతన కోసం చర్చించుకున్నాం. ఇప్పుడు మనం సప్తమాధిపతి ఏయే భావాల్లో ఉంటే ఏ ఫలితం ఉంటుందో నేర్చుకుందాం.

ఎవరి జాతకంలో అయినా సరే సప్తమాధిపతి లగ్నస్థానంలో గాని, ద్వితీయ స్థానంలో గాని, షష్ఠమ స్థానంలో గాని లేక అష్టమ స్థానంలో గాని వుంటే వారి జాతక ఫలితాలు ఎలా ఉంటాయో వారికి జాతకరీత్యా ఆ స్థానాల గ్రహస్థితి వల్ల ఫలితాలు ఎలా ఉంటాయో ఈ క్రింద చూడండి.

1. సప్తమాధిపతి లగ్నంలో ఉంటే వారికి మంచి అందం, ఆకర్షణీయమైన ముఖాకృతి వుంటుంది. కాని వీరు సచ్ఛీలురుగా ఉండరు. పరస్త్రీ / పర పురుష సంపర్కానికి అవకాశం ఎక్కువ. నిజం కన్నా ఎక్కువ అసత్యమే పలుకుతారు. స్త్రీ, పురుష సంబంధాలలోని పవిత్రతను వీరు పాటించరు. దాంపత్య విరోధం కూడా ఉంటుంది.
2. సప్తమాధిపతి ద్వితీయ స్థానంలో ఉంటే వారికి వివాహేతర సంబంధాలు ఉంటాయి. వివాహానికి పూర్వమున్న అక్రమసంబంధం వివాహమైన తర్వాత కూడా కొనసాగవచ్చు. భార్యాభర్తల మధ్య అసూయ, ద్వేషాలుంటాయి. పురుషుడికైతే భార్య వల్ల ధనం, సంపత్తు లభిస్తుంది. స్త్రీ అయితే కలవారి కోడలు అవుతుంది. అతి మధురమైన దాంపత్య జీవితం ఉండక, సామాన్యమైన రాగ, ద్వేషాలతో జీవితం సాగిస్తారు.
3. సప్తమాధిపతి 6వ స్థానంలో ఉంటే వారి దాంపత్య జీవితంలో ఆప్యాయత, అన్యోన్యం ఉండదు. జీవిత భాగస్వాములిద్దరూ ఒకరికొకరు తమ స్వలాభం చూచుకుంటారు. ఒకరిమీద ఒకరికి ద్వేషభావం ఉంటుంది. వారిద్దరి మధ్య శారీరక సౌఖ్యం లోపిస్తుంది. బహుశా ఒకరు దీర్ఘకాల వ్యాధితో బాధపడవచ్చు.
4. సప్తమాధిపతి అష్టమ స్థానంలో ఉంటే భార్యా భర్తల మధ్య ఉండవలసిన ప్రేమానురాగాలు ఉండవు. దాంపత్య జీవితంలో మాధుర్యం చవిచూడలేకపోతున్నందువల్ల పర సంపర్కానికి పాల్పడతారు. ఒక్కొక్కప్పుడు నీచ కులం వారితో కూడా అక్రమ సంబంధాలు ఏర్పరచుకొంటారు.

ఇప్పుడు మనం అష్టమ భావం గురించి సూక్ష్మంగా తెలుసుకొందాం.

1. అష్టమాధిపతి కనుక లగ్నస్థానంలో ఉంటే వారికి మంచి ఆరోగ్యం ఉండదు.

జీవితమంతా ఏదో ఒక రుగ్మతతో బాధపడుతూ వుంటారు. దీర్ఘకాల రోగులుగా జీవిస్తారు. ఒక్కొక్కప్పుడు అసాధ్యమైన మొండివ్యాధుల బారినపడి శారీరకంగా బాధపడతారు.

2. అష్టమాధిపతి ద్వితీయ స్థానంలో ఉంటే వారికి ధనాభావం ఎక్కువ ఉంటుంది. సరియైన సంపాదన, సంపత్తు ఉండవు. దారిద్ర్యబాధ అనుభవిస్తారు. సుఖమయ జీవితం ఉండదు.

   బంధుమిత్రులతో శతృత్వం కొనితెచ్చుకుంటారు. ఆయుఃపరిమాణం చాలా తక్కువగా ఉంటుంది. బహుశా నడివయసులో మరణం సంభవించవచ్చు.

3. అష్టమాధిపతి చతుర్ధ స్థానంలో ఉంటే వారికి స్థిరాస్తి, భూవసతి, స్వగృహయోగం తక్కువ. ధనాభావం వల్ల సామాన్య, మధ్యతరగతి జీవితం గడుపుతారు. ధనలోపం జీవితమంతా ఉంటుంది. తల్లిదండ్రులను గౌరవించక వారిని చిన్నచూపు చూసి, మానసికంగా బాధిస్తారు. బంధు, మిత్ర వర్గాలతో మంచి సఖ్యత ఉండదు. చెడ్డవారుగా ముద్ర వేయబడతారు. వారివద్ద నుంచి సహాయసహకారాలు ఏమీ పొందలేరు.

4. అష్టమాధిపతి సప్తమ స్థానంలో ఉంటే వారి దాంపత్యంలో సహకారం లోపిస్తుంది. వారి మధ్య వివాదాలు, మనస్పర్ధలు ఉంటాయి. నిలకడయైన సంపాదన లేక స్థిర వృత్తి ఉండదు.

5. అష్టమాధిపతి నవమ స్థానంలో ఉంటే వారికి ధర్మాధర్మ విచక్షణా జ్ఞానం లోపించి, స్వార్ధమే ప్రధానంగా ఎంచుకొని అధర్మ జీవితం సాగిస్తారు. తమ సాంప్రదాయం, సంస్కృతిని గౌరవించక వాటి మీద తేలికభావంతో ఉంటారు. దైవభక్తి గాని, పాపభీతి గాని అస్సలుండవు. ముఖంలో ఏ విధమైన ఆకర్షణ లేక చూడటానికి వికారంగా ఉండి జుగుప్సాకరమైన మాటలతో జీవితం కొనసాగిస్తారు.

ఈ పైన చెప్పినవన్నీ వధూవరుల వివాహ పొంతన చూసేటప్పుడు వారి పొంతన కుదిరినదీ, లేనిదీ అన్న విషయం నిర్ణయించే ముందు గమనించి ఓ నిర్ణయానికి రావాలి. అంతేగాని తొందరపడి ఏ నిర్ణయం చేయరాదు.

ఒక ముఖ్య విషయం ఏమంటే స్థాన ప్రాశస్త్యం, శుభ గ్రహ సంయోగం మరియు గ్రహవీక్షణ చూడటం మరిచిపోకండి.

# 15. వివాహాలు ఎందుకు ఆలస్యము అవుతాయి / ఆగిపోతాయి?

"మా అమ్మాయికి వివాహం కుదిరిందండి" అని సంతోషంగా చెప్పిన తర్వాత మళ్ళీ వాళ్ళే కొంతకాలం తర్వాత "లేదండీ, ఆ సంబంధం తప్పిపోయింది. అన్నీ బాగున్నాయి కదా అని ఎంతో ఆశపడ్డాము. అన్ని విధాల కుదిరిన సంబంధం కాస్త తప్పిపోయింది" అంటూ బాధగా చెప్పటం కూడా మనం అప్పుడప్పుడు వింటూనే ఉంటాము. అది విన్నప్పుడు మనకు కూడా "అయ్యో పాపం" అనిపించడం సహజం. ఇలా ఎందుకు జరుగుతోందో ఇప్పుడు మనం జాతకరీత్యా పరిశీలిద్దాం.


జాతక చక్రం పరిశీలించేటప్పుడు ఏ ఒక్క అంశమూ లేక రెండు అంశాలు మాత్రమే సరిపడలేదు కాని "మిగిలినవన్నీ చక్కగా కుదిరాయి, అన్నీ చాలా బాగున్నాయి" అని మీ అంతట మీరు సరిపుచ్చుకుని వివాహం త్వరగా చేయాలనే తాపత్రయంలో తొందరపడి ఒక నిర్ణయానికి రాకూడదు. ఒక్క చిన్న పొరపాటు వల్ల ఒక్కొక్కప్పుడు ఒక పెద్ద హాని కూడా జరుగవచ్చు. జాతకంలో ఏది ముఖ్యం, ఏది అముఖ్యం అనేది ఏమీ ఉండదు. అన్నీ ముఖ్యమేనని మనం ఎప్పుడూ గుర్తుంచుకోవాలి. మీరు ఏదైనా ఒక పదార్థం వండుతున్నప్పుడు కావలసిన అన్ని దినుసులు మీరు తప్పకుండా వాడుతారు కాని ఉప్పు లేకపోతే ఫరవాలేదు అలాగే వేరొకటి ఏదైనా లేకపోతే ఫరవాలేదు అని అనుకోరు. అన్నీ ఉంటేనే అది రుచిగా ఉంటుందని మీకు తెలుసు. అలాగే జాతకంలో కూడా అన్నింటికి పొంతన కుదరాలని మర్చిపోకూడదు. కుదిరిన వివాహం తప్పిపోవడానికి గల కారణాలు ఈ క్రింది ఇస్తున్నాము.


1. లగ్నాధిపతి, రాశ్యాధిపతి ఇద్దరిది 6-8-12లలో ఒకే స్థానంలో కలిసి ఉన్నా, లేక విడివిడిగా ఉన్నా వారికి వివాహం జరుగదు.
2. లగ్నం మీద గాని చంద్రుని మీద గాని పాపగ్రహ దృష్టి ఉంటే ఆ వివాహం జరుగదు.
3. కుజుడు శని కలిసి సప్తమంలో ఉండి, చంద్రుడు శుక్రుడు కలిసి వేరే గృహంలో ఉన్నా లేక సప్తమంలోనే ఉన్నా కూడా వారికి వివాహం జరుగదు.
4. రవి, శని సప్తమంలో కలిసి ఉంటే ఆ వివాహం జరగడానికి అవకాశాలు చాలా తక్కువ.

5. చంద్రుడు, కుజుడు, బుధుడు వీరు ముగ్గురు ఏ గృహంలో అయినా కలిసి ఉంటే ఆ వివాహం ఎటువంటి పరిస్థితులలోనూ జరుగదు.
6. శని సూర్యుని పుత్రుడు. అయినా కూడా వారిద్దరూ శత్రువులే. అందువల్ల వారిద్దరూ కలిసి ఏ గృహంలో అయినా ఉంటే లేక వారి వీక్షణా ఒకరిపై ఒకరికి ఉంటే ఆ వివాహం జరుగదు. అంటే రవి శనులు సమస్తములు కాకూడదు.
7. శుక్ర స్థానం నుంచి సప్తమంలో కుజుడు శని ఉంటే వారి వివాహం జరుగదు.
8. చంద్రుడు, శుక్రుడు ఇద్దరూ కలిసి సప్తమంలో ఉంటే ఆ వివాహం జరగడానికి అవకాశాలు తక్కువ. ఒకవేళ వివాహం జరిగినా పుత్ర సంతానం ఉండదు లేక సంతానం వల్ల అనేక బాధలు కలుగుతాయి.
9. కుజుడు, శని, రాహువు వీరు ముగ్గురు కలిసి సప్తమంలో ఉంటే పైన చెప్పిన ఫలితాలే కలుగుతాయి.
10. సూర్యుడు, చంద్రుడు, గురువు, శుక్రుడు, కుజుడు వీరందరూ కలిసి ఏ గృహంలో ఉన్నా ఆ జాతకునకు వివాహం జరుగదు. ఒకవేళ వివాహం నిర్ణయించినా వారిద్దరు వివాహపూర్వమే శారీరకంగా కలిసి ఆ తర్వాత వివాహం జరుగకుండా విడిపోతారు.
11. సప్తమాధిపతి బలంగా లేకపోతే సూర్యుడు లగ్నంలో సప్తమంలో శని ఉంటే లేక సప్తమంలో సూర్యుడు ఉండి లగ్నంలో శని ఉంటే వివాహం జరగడం అనుమానమే.
12. సూర్యుడి నుంచి సప్తమంలో శని ఉంటే వారిద్దరూ శత్రువులు కాబట్టి ఒకరినొకరు తీక్షణంగా చూసుకుంటూ ఉంటారు. ఒకవేళ శని కనుక లగ్నాన్ని చూస్తూ ఉంటే అంటే సూర్యుడు ఉన్న గృహం లగ్నం అయితే ఆ వివాహం జరగడానికి అవకాశాలు చాలా తక్కువ.
13. సప్తమాధిపతిని శని వీక్షిస్తూ ఉంటే ఆ వివాహం తప్పిపోతుంది.
14. లగ్నం నుంచి ద్వితీయంలో రవిగాని 12వ రాశిలో శని ఉంటే వివాహం కాదు. ఎందుకంటే శని కోణ దృష్టి వల్ల రవి దుర్బలుడవుతాడు.
15. సప్తమ గృహం సూర్యుడు శని మధ్యలో ఉంటే వివాహం కాకపోవచ్చు. ఒకవేళ అయినా వారిద్దరూ శారీరక సుఖం అనుభవించరు.
16. రవి, శని, సప్తమాధిపతి కలిసి ఉంటే వివాహం జరుగదు.
17. చంద్రుడు, శని సప్తమంలో ఉంటే వివాహం జరుగదు.


ఈ పైన చెప్పినవి కొన్ని దృష్టాంతాలు మాత్రమే. నేను ముఖ్యమని అనుకున్నవి మాత్రమే ఉటంకించాను కాబట్టి కనీసం పైన చెప్పిన అంశాలని చూసి అప్పుడు జాతక ఫలితం చెప్పాలి.


18. ఏ జాతకచక్రంలోనైనా చతుర్ధ, సప్తమ, అష్టమ మరియు ద్వాదశ రాశులలో పాపగ్రహాలు ఉంటే ఆ జాతకులకు వివాహం కాదు. ఈ క్రింది చక్రం గమనించండి.




19. ఏ జాతక చక్రంలోనైనా శుక్రుడు శత్రుక్షేత్రంలో ఉండి, ఆ శుక్రుడికి ద్విద్వాదశ స్థానాలలో పాపగ్రహాలు ఉండి, పాపవీక్షణ ఉంటే ఆ జాతకులకు వివాహం కాదు. శుక్రుడితో పైన చెప్పిన గ్రహస్థితిలో పాపగ్రహంతో శుక్రుడు కలిసి ఉన్నా వివాహం కాదు. ఈ క్రింది చక్రం గమనించండి.



ఇంతవరకు మీరు శాస్త్రరీత్యా వివాహం ఆలస్యం ఎందుకవుతుందో గ్రహస్థితి బట్టే తెలుసుకున్నారు. కాని ఒక్క గ్రహస్థితేకాక సామాజిక స్పృహ వైఫల్యం కూడా ఒక కారణమే. ఎందుకంటే వివాహం అనేది ఏకపక్ష నిర్ణయం కాదు. ఇద్దరి కుటుంబాలలో కనీసం పక్షం అరడజను మంది మనస్ఫూర్తిగా ఒప్పుకొని తీరాలి. అలాకాని పక్షంలో ఆ వివాహం జరగదు. రెండవ విషయం ఏమంటే వివాహవ్యవస్థలోని పవిత్రత పటిష్టతలకు తిలోదకాలిచ్చి, పస, ప్రాముఖ్యంలేని భావ దరిద్రంతో వ్యాపార సరళిలో ఆలోచనలు చేసి లాభాలాభాలు బేరీజు వేసుకోవటం ఎక్కువ అయిపోయింది. ఈ జాడ్యం ఊరూరాపాకి రాష్ట్రమంతా కలుషితమయిపోయింది. బాధాకరమైన విషయం ఏమంటే తల్లిదండ్రులు వారి పిల్లలమీద ధృతరాష్ట్ర ప్రేమ కురిపించడమేకాక సంబంధం వచ్చినప్పుడు వారిలోని లోపాలను కాగడాతో శోధించి ఆ సంబంధం వదలివేయడం జరుగుతోంది! అలాగే తమలో ఉన్న లోపాలను మర్చిపోవడం లేక మరుగుపర్చడం కూడా జరుగుతోంది.

అలా కాకుండా అందరూ సాంప్రదాయ, సంస్కారాలతో, ధర్మాపధాన ఆలోచిస్తే ఎన్నో వేల సంబంధాలు కుదరడానికి సరియైన సమయంలో వధూవరులిద్దరు తమ తల్లిదండ్రులతో కాస్త సహకరిస్తూ తమ తల్లిదండ్రులకు తమ అన్నీ బాగున్నపుడు అంగీకారాన్ని తెలియచెప్పడం బదులు, వధూవరులిద్దరు వారికి కాబోయే భాగస్వామికి ఏమేమి ఉండాలో ఒక నిర్ణయ పట్టిక వ్రాసి ఇవ్వడం, అలాంటి లక్షణాలున్న వ్యక్తులకోసం తల్లిదండ్రులు ఊరూరూ గాలించడం, ఆ గాలింపులో ఎక్కడో ఒకరు దొరికినపుడు ఆ సంబంధాన్ని తమ పిల్లలకు చూపించడం చేస్తున్నారు. అలా గాలించి తెచ్చినా కూడా ఆ వచ్చినవారికి, వీళ్ల సంబంధం నచ్చకపోవచ్చు. ఎందుకంటే వధూవరుల మనోప్రవృత్తి ఇద్దరివి వేరేవేరుగానే ఉంటాయి. వరుడు వధువును చూసి నచ్చలేదని వెళ్ళిపోతే మళ్లీ తల్లిదండ్రులు వేట ప్రారంభించాల్సిందే. కొంతమంది సంవత్సరాల తరబడి, వందల సంఖ్యలో సంబంధాలు చూసినా కుదరకపోవడానికి ముఖ్యకారణాలలో ఇదొకటి. మీకు ఒక్కడే అబ్బాయి, లేక మాకు ఒక్కర్తే కూతురు వాళ్లు అడిగినట్లు చేయాలికదండీ అంటారే తప్ప వాస్తవికతలోని సత్యాన్ని గ్రహించడంలేదు. ఎందుకంటే మేము ఈ వయస్సులో సంవత్సరాల తరబడి వందలమంది తలుపుతట్టి మా అమ్మాయిని చేసుకోండనో, లేక మీ అమ్మాయిని మాకివ్వండనో ప్రతిదినం లజ్జారహితంగా అర్థించడం ఎంతదైన్యం? దేనికైనా ఒక హద్దు ఉండాలనే విషయాన్ని మరచిపోయి అందని పండును ఆశించడంవల్ల వాళ్లపిల్లలు ఏం నష్టపోతున్నారో తల్లిదండ్రులుగాని, వారి ఉన్నత విద్యాభ్యాసము చేసి ఉన్నతశ్రేణి ఉద్యోగం చేస్తున్నవారుగాని ఆలోచించడంలేదు. వారు ఎలా ఆలోచిస్తున్నారో వారు ఏం నష్టపోతున్నారో మనం విశ్లేషించుకుందాం.

ఈ రోజులలో కనీసం 30 సం॥లు 32 సంవత్సరాలు వస్తేగాని అబ్బాయి వివాహం చేసుకోవడం లేదు. అలాగే అమ్మాయిలు కూడా కనీసం 28 సంవత్సరాలు నిండకుండా వివాహం చేసుకోవడానికి ఒప్పుకోవడంలేదు. ఎందుకంటే ప్రతివారు "కెరీర్" అనే ఉన్మాదవ్యాధితో మనోవ్యాకులత చెందుతున్నారు. వారి ఉద్దేశ్యంలో కెరీర్ అంటే ఉన్నతోద్యోగం లక్షల సంపాదన లేక విదేశయానం. అంతేకాని వేరే ఏమీకాదు కావాలంటే నేటి యువతలో ఎందరినైనా అడిగి చూడండి మౌలికంగా ఇదే వారి మనోవాంఛ అని మీరు తప్పకుండా గ్రహిస్తారు. అంటే యవత ఉద్దేశ్యంలో పదవి, ధనం ఉంటే చాలు. ఇవే ఆనంద జీవితానికి సోపానాలు అని వారు బుర్రకథ చేప్తూంటే తల్లిదండ్రులు కూడా వంత పాట పాడుతున్నారే తప్ప నిజాన్ని చెప్పగలిగే స్థితిలో లేరు. ఎందుకంటే నూటికి 90% మధ్య తరగతి కుటుంబీకులుగా హైదరాబాదులో జీవించి, ఈ రోజు వారి సంతానం ఉన్నత విద్యాభ్యాసం, ఉన్నతశ్రేణి ఉద్యోగం చేస్తూంటే తమ సంతానం చూసి పొంగి పోవడమో లేక గర్వాహంకారాలకు నీరు పోసి పెంచుకోవడం చేస్తున్నారు. ఇది ముమ్మాటికి నిజం. లక్షలమందిలో మా అమ్మాయి కూడా ఒకర్తి లేక లక్షలమందిలో అబ్బాయి ఒకడు. ఏం గొప్ప అనుకునే తల్లిదండ్రులు ఈ రోజు లేరు. ఎందుకంటే ప్రతి అమ్మాయీ బీ "టెక్కే" ప్రతి అమ్మాయి 25,000 రూపాయలు సంపాదిస్తుంది. అందరితోపాటు నా కూతురు ఒకటి, ఏం గొప్పకాదనే నిజం తల్లిదండ్రులు తెలుసుకోవాలి.

నిజానికి కెరీర్ అంటే చాలామంది తల్లిదండ్రులే సరియైన నిర్వచనం ఇవ్వలేకపోతున్నారు. ఎందుకంటే వారు చేసిన ఉద్యోగం 35 సంవత్సరాలలో కెరీర్ అనే పదం వాళ్లు వాడలేదు. వాళ్లు ఏ ఉద్యోగంలో చేరారో అదే డిపార్టుమెంటులో రిటైరయ్యేవరకు ఉద్యోగం చేసారు. వారికి ఉద్యోగాలు మారడం, విదేశయానం తెలియదు సరికదా వారికి ఊహకు కూడా అందని విషయం.

## కాలామృతము

1. రంగు (Girl wants more - Boy wants equal 33 % girls) 2. ఎత్తు 3. చదువు 4. ఉద్యోగం 5. శాఖ 6. అంతర్‌శాఖ 7. ప్రాంతం 8. సంపాదన 9. తండ్రిలేదు 10. బావమరిది లేదు 11. ఒకడే కొడుకు 12. ఇద్దరూ ఆడపిల్లలే 13. స్టేటస్ 14. కట్నాలు 15. కానుకలు 16. లాంఛనాలు 17. హైటెక్ 18. పెద్ద కోడలు వయస్సు

19. పెద్ద అల్లుడి వయస్సు 20. జాతకాలు 21. పెద్ద అల్లుడు ఇంజనీరు 22. పెద్ద కోడలు బిటెక్ 23. పెద్దమ్మాయి అమెరికా 24. మా ఇంట్లో అందరూ ఇంజనీర్లే / డాక్టర్లే 26. పెళ్లి హైదరాబాద్‌లోనే చేయాలి 27. ముందు మేము చూస్తాం. మా ఇష్టమే మావాడికి ముఖ్యం 28. ఫోటో మా అబ్బాయిది లేదు వాడికి టైమ్ లేదు 29. మేం మొగ పెళ్ళివారం. మేం ఫోన్ చేయం. 30. తండ్రి / తల్లి పద్ధతి / బంధువు మాకు నచ్చలేదు.

### ఆలస్యానికి కారణాలు :

1. చదువు 2. ఎత్తు 3. రంగు 4. శాఖ 5. ప్రాంతం 6. కుటుంబ హోదా 7. జీతం ఎక్కువ అడగడం / తండ్రి జీతం ఎంత? 8. తల్లి దండ్రీ ఉండాలి 9. పెద్ద కొడుకు బాధ్యత 10. బావమరిది ఉండాలి 11. జాతకం మా బ్రాహ్మడే చూడాలి 12. కోడలు / అల్లుడు వయో భేదం 13. పెద్దమ్మాయిది అమెరికా 14. ఫలానా నక్షత్రం వద్దు 15. ఉద్యోగం పెళ్లినాటికి ఉండాలి 16. బంధువుల ప్రమేయం 17. మంచి ఫోటో ఇవ్వకపోవడం (అమెరికా) 18. టెలిఫోను అడ్రసు మారితే చెప్పకపోవడం 19. సంబంధాలు ఇతరులకు చెప్పకపోవడం 20. మొదలు తల్లిదండ్రులు చూసి నచ్చలేదని నిర్ణయించడం.

## వేధానక్షత్రములు

**శ్లో॥ దస్రాదీని శివాదిబాని పితృభాదీని క్రమాద్వ్యుత్క్రమాః।**
**జ్యేష్ఠాది శ్రవణాది రేవతిముఖం చత్వారి చత్వారిచ ।**
**దంపత్యోశ్చ గణద్వయే జననభే త్వేకైకకభం వైరకృ**
**చ్ఛిత్రాచంద్రవసూడునాం పరిణయే వేదాఖ్య వర్గస్త్వయమ్ ॥**

**తాత్పర్యం :** అశ్వని – జ్యేష్ఠ, భరణి – అనురాధ, కృత్తిక – విశాఖ, రోహిణి – స్వాతి, అర్ద్రా – శ్రవణ, పునర్వసు – ఉత్తరాషాఢ, ఆశ్రేష – మూల, మఘ – రేవతి, పుబ్బ – ఉత్తరాభాద్ర, హస్తా – శతభిషములు, ద్విపాద నక్షత్రములగు చిత్ర, మృగశిర, ధనిష్ఠా నక్షత్రములు వేధాయుగ్మములు, దంపతుల జన్మనక్షత్రముల జంట, వేధాయుగ్మము కారాదు. వేధాయుగ్మము (వేధా నక్షత్రము) లయినచో కలహము కలుగును.

# 16. నక్షత్ర స్వభావం

మనకున్నవి 27 నక్షత్రాలని తెలుసుకున్నాం. ఏ మానవుడైనా తాను పుట్టిన సమయంలో ఉన్న నక్షత్రం ఈ 27 నక్షత్రాలలోనే ఉంటుంది. ఒక్కొక్క నక్షత్రంలో 4 పాదాలుంటాయి. కనుక ఒకే నక్షత్రంలో పుట్టినా, వారి వారి జీవిత సరళి వారి స్వభావం నిర్ణయించడానికి వారు పుట్టిన పాదానికి ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. ఒకే నక్షత్రంలో పుట్టిన అందరు మానవులూ ఒకే విధంగా ఉండరు. వారి రూపం, గుణం, విద్వత్తు, సంపత్తు, సాత్విక, రజో, తామస గుణాలు మారుతూ ఉంటాయి. అందువల్ల మీకు ఏ నక్షత్రంలో జన్మించిన ఏ వ్యక్తి యొక్క స్వభావం ఎలా ఉంటుందో మౌలికంగా విశదీకరిస్తున్నాము. పాదభేదం చేత కొన్ని అంశాలు మాత్రమే ఆ వ్యక్తికి వర్తించవచ్చు. అంటే మేము తెలియజెప్పిన అన్ని అంశాలూ ప్రతి ఒక్కరికీ వర్తిస్తాయనుకోవడం పొరపాటు. ఈ నక్షత్ర స్వభావం తెలుసుకోవడం వల్ల మీకు అతని / ఆమెలోని నిజ గుణాలు తెలుసుకోవచ్చు. వాటిలో కొన్ని ఎక్కువ తక్కువలు కూడా ఉండవచ్చు. కాని అసలు గుణం మారదని గ్రహించాలి.

***ఇంకొక ముఖ్య సూచన ఏమంటే ఏ వధువుకు ఏ నక్షత్రం కుదురుతుందో ఆ నక్షత్రాలు ప్రతి నక్షత్రంతోను ఇవ్వడం జరిగింది. కాబట్టి మీరు మరల పంచాంగం చూసుకునే అవసరం లేదు. అంటే 18 లేక అంతకంటే ఎక్కువ పాయింట్లు ఉన్న నక్షత్రాలు మాత్రమే సూచనగా పంచాంగం ప్రకారం ఇవ్వబడ్డాయి. అంతేకాని ఈ నక్షత్రాలు వధువు మరియు వరుని జాతకాలు గాని తారాబలంగాని కుదురుతుందని కాదు. ఈ విషయం మీరు తప్పక గమనించాలి.***

**అశ్వని :** ఇది నక్షత్రాలలో మొదటిది. మేషరాశిలో ఉంటుంది. ఈ నక్షత్రం 4 పాదాలూ ఈ మేషరాశిలోనే ఉంటాయి. ఈ నక్షత్రానికి అధిపతి కేతువు. ఇది దేవగణానికి చెందిన నక్షత్రం. ఈ నక్షత్రం కృష్ణ వర్ణంలో, మూడు నక్షత్రాలు కలిపి అశ్వరూపంలో కనిపిస్తుంది. ద్రోణాచార్యుని పుత్రుడైన అశ్వద్ధామ ఈ నక్షత్రంలో జన్మించాడు. ఈ నక్షత్ర జాతకులు కెంపు, పగడం ధరించడం లాభదాయకం.

అశ్వనీ నక్షత్ర జాతకులకు ఆయుర్దాయం ఎక్కువ. దీర్ఘకాలం జీవిస్తారు. అలంకారప్రియులు. అందంగాను, ప్రేమపాత్రులుగాను ఉంటారు. అందరితోనూ

స్నేహభావంతో ఉండి అందరి సహాయసహకారాలు పొందుతారు. వీరు దుర్జన సాంగత్యం, దురలవాట్లకు త్వరగా లోనవుతారు. వీరికి చపలచిత్తం ఎక్కువ. లోభులు సాధారణంగా చిన్న రూపం కలిగి ఉంటారు. నయనాలు విశాలంగాను, గుండ్రంగాను ఉంటాయి. పురుషులైతే స్త్రీ వ్యసనం ఉంటుంది. మొండి ధైర్యం, పట్టుదల ఎక్కువ. అందువల్ల కష్టాలకు ఓర్చి శ్రమించి ఉన్నత స్థానానికి చేరుకుంటారు. కొంతమందికి చేవాటుతనం (చౌర్య లక్షణం) అలవాటుగా ఉంటుంది.

2వ పాదంలో జన్మించినవారు చక్కటి రంగు, మంచి రూపం, తేజస్సుతో ఉంటారు. ధర్మాధర్మ విచక్షణా జ్ఞానం కలిగి ఉంటారు. దాన గుణం ఉంటుంది.

3వ పాదంలో జన్మించిన వారి మీద బుధ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. బుధుడు అంటే బృహస్పతి. బుద్ధికి, జ్ఞానానికి యోగకారకుడు. అందువల్ల వీరు యుక్తి, సమయస్ఫూర్తి, వాక్చాతుర్యం కలిగి మంచి వక్తగా ఉంటారు. తర్కంలోను, శాస్త్రంలోను ఆరితేరి ఉంటారు. బోధనా పటిమను కలిగి ఇతరులకు మార్గదర్శకులుగా ఉంటారు.

4వ పాదంలో జన్మించిన వా0రిపై కుజ, చంద్ర ప్రభావం ఎక్కువగా ఉంటుంది. వీరికి దేశాభిమానం, జన్మస్థల ప్రేమ ఎక్కువగా ఉంటుంది. అందువల్ల దేశరక్షణ చేసే సైన్యంలో ఉద్యోగం చేస్తారు. దేశం కోసం ఏ త్యాగానికైనా సిద్ధపడతారు. పెద్దల ఎడల గౌరవం, మంచి నడవడి కలిగి ఉంటారు. కేతు ప్రభావం వల్ల జ్ఞానాభివృద్ధి కలిగి మోక్షసాధన పొందుతారు. దైవ శాస్త్రాలలో అంటే వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులు జ్యోతిశ్శాస్త్రం వంటి వాటిలో ప్రావీణ్యం సంపాదిస్తారు లేక కొంతమంది ఇంద్రజాల, భూతవైద్యం, తాంత్రిక పూజలలో ప్రావీణ్యులవుతారు. సాంప్రదాయాలను తమ కులానికి విరుద్ధమైన విద్యలు కూడా నేర్వవచ్చు. కాని విద్యలను మానవాళి సేవకే వినియోగిస్తారు. స్త్రీలకు ఆకర్షణీయంగా ఉండి, వారి హృదయంలో గౌరవాభిమానాలు సంపాదిస్తారు.

అశ్వనీ నక్షత్ర జాతకులు కేతు మహర్దశతో జీవితం ప్రారంభిస్తారు. ఆ దశ ప్రమాణం ఏడు సంవత్సరాలు.

ఈ వధువుకు సరిపడే నక్షత్రాలు: భరణి / కృత్తిక1-2 / రోహిణి / మృగశిర 2-3/ పునర్వసు 3-4 / పుష్యమి / ఆశ్లేష / మఖ / పుబ్బ / ఉత్తర 1 / చిత్త 3 / స్వాతి/ విశాఖ 3-4/ అనూరాధ / పూర్వాషాఢ / ఉత్తరాషాఢ1-2 / శ్రవణం / ధనిష్ఠ 2-3 / ఉత్తరాభాద్ర 1 / రేవతి.

**భరణి :** ఇది నక్షత్రాలలో రెండవది. ఈ నక్షత్ర 4 పాదాలూ మేషరాశిలో ఉంటాయి. ఈ నక్షత్రానికి అధిపతి శుక్రుడు. ఇది మనుష్య గణానికి చెందిన నక్షత్రం. ఈ నక్షత్రం శ్వేత వర్ణంలో 3 నక్షత్రాలు కలిపి త్రికోణాకారంలో ఉంటుంది. రారాజు దుర్యోధనుడు ఈ నక్షత్రంలో జన్మించాడు.

ఈ నక్షత్ర జాతకులకు ఏ పాదంలో పుట్టినా భోగభాగ్యాలకు, ధన సంపదలకు లోటు ఉండదు. మంచి సత్ప్రవర్తనతో కళాభిరుచి కలిగి వుంటారు. పూర్ణాయుష్కులుగా జీవిస్తారు. నుదురు పెద్దదిగా, వెడల్పుగా ఉంటుంది. చక్కటి తలకట్టు ఉంటుంది. పట్టుకుచ్చులాంటి ఒత్తయిన జుట్టు ఉంటుంది. భోజన మరియు నిద్రాప్రియులు.

మొదటి పాదంలో జన్మించిన వారు కళాకారులై, కీర్తి గౌరవాలను పొందుతారు. ధన సంపాదన బాగుంటుంది. సభా గౌరవం పొందుతారు. వీరిలో అహం ఎక్కువ. ఆస్తిపాస్తులు సంపాదిస్తారు. వాహన యోగం కలిగి ఉంటారు.

రెండవ పాదంలో జన్మించిన వారు విచక్షణా జ్ఞానం కలిగి దూరాలోచనతో జీవితాన్ని చక్కగా మలచుకుంటారు. ధన విలువ తెలుసుకుని జాగ్రత్తగా ఖర్చు చేస్తారు. పొదుపుగా ఉంటారు.

మూడవ పాదంలో జన్మించినవారు కళారంగంలో ఉన్నత శిఖరాలకు ఎదుగుతారు. నగలు, నాణ్యాలు, పట్టువస్త్రాలు, ఇంకా అలంకారాల మీద మక్కువ ఎక్కువ. స్నేహాభిలాషులు, ధైర్య సాహసాలు కలవారు. యుక్తిపరులు. అందరితోనూ స్నేహం చేసి వారి యొక్క మనస్సులకు దగ్గరగా వెళ్ళినట్లుగా కనిపిస్తారు కాని నిజానికి వారు మనస్సులో ఎవరినీ నమ్మరు.

నాల్గవ పాదంలో జన్మించిన వారు మూర్ఖులు, క్రోధులు, బుద్ధిహీనులుగా ఉంటారు. క్రూరమైన ప్రతీకార వాంఛ, కాఠిన్యం, దౌర్జన్యం ఎక్కువగా ఉంటాయి. క్రోధం వల్ల కష్టాలు, దౌర్జన్యం వల్ల శారీరక బాధలు, ప్రతీకార వాంఛ వల్ల శత్రువుల చేత అవమానం పొందుతారు.

**ఈ వధువుకు సరిపడే నక్షత్రాలు :** అశ్వని / భరణి / కృత్తిక 1-2 / రోహిణి / ఆరుద్ర /పునర్వసు 3-4 / ఆశ్లేష / మఖ / పుబ్బ / ఉత్తర 1-2 / హస్త1 / స్వాతి / విశాఖ 3-4 /అనూరాధ / జ్యేష్ఠ / మూల / పూర్వాషాఢ / ధనిష్ట2-3 / శతభిషం / పూర్వాభాద్ర 3-4 /ఉత్తరాభాద్ర 1 / రేవతి.

**కృత్తిక :** ఇది నక్షత్రాలలో మూడవది. ఈ నక్షత్రంలోని మొదటిపాదం మేషరాశిలోను మిగిలిన మూడు పాదాలు వృషభరాశిలోనూ ఉంటాయి. కృత్తికా నక్షత్రానికి అధిపతి శుక్రుడు. ఇది సూర్య నక్షత్రం రాక్షస గణానికి చెందినది. పురుషులకు ముఖవర్చస్సు, తెలివితేటలు, కీర్తి, మంచి వాక్చతురత, సభాగౌరవం, సుఖసంపదలు ఉంటాయి. సాటి మానవ ప్రేమ చాలా ఎక్కువగా ఉంటుంది. బంధుప్రీతి, స్నేహాభిలాష ఎక్కువ. దాన గుణం ఉంటుంది. 1వ పాదంలో జన్మించిన వారికి శాస్త్ర విజ్ఞానం, ధర్మశీలత, రోషం, పౌరుషం ఉంటాయి. 2వ పాదంలో జన్మించినవారు స్వార్థపరులు. కార్య సాధనపై తొందర, నీచ సమూహంతో మిత్రత్వం స్త్రీ వాంఛ కలిగి ఉంటారు. స్త్రీ వాంఛ ఉన్నా ధర్మం తప్పరు. పర స్త్రీ లోలత్వం ఉండదు. 3వ పాదంలో జన్మించిన వారికి తీవ్ర కోపం, దుస్సాహసం, లోభం, మందబుద్ధి, మిత్రులను ఆకర్షించడంలో నేర్పు, వాక్చాతుర్యం ఉంటాయి. 4వ పాదంలో జన్మించిన వారు ఉన్నత విద్య అభ్యసిస్తారు. వినయవిధేయతలు, ధర్మగుణం కలిగి ఉంటారు. అమితమైన జాలి గుండె ఉంటుంది. పరోపకారం, దానశీలత శాస్త్ర జ్ఞానం ఉంటాయి. ఆరోగ్యం బాగుంటుంది. సూర్యదశలో జీవితం ఆరంభమవుతుంది.

**ఈ వధువుకు సరిపడే నక్షత్రాలు :** అశ్విని / భరణి / కృత్తిక / మృగశిర 3 / ఆరుద్ర / పునర్వసు 3-4 / పుష్యమి / ఆశ్లేష / మఖ / పుబ్బ / ఉత్తర 1 / చిత్త 2-3 / విశాఖ / అనూరాధ / జ్యేష్ఠ / మూల / పూర్వాషాఢ / ధనిష్ఠ 2-3 / శతభిషం / పూర్వాభాద్ర 3-4 / ఉత్తరాభాద్ర.

**వృషభరాశిలో ఉన్న కృత్తికకు సరిపడే నక్షత్రాలు :** రోహిణి / మృగశిర 3 / ఆరుద్ర / పునర్వసు 3-4 / ఆశ్లేష / మఖ / పుబ్బ / ఉత్తర 1-2 / హస్త 1 / చిత్త 2-3 / విశాఖ 4 / అనూరాధ / జ్యేష్ఠ / మూల / ధనిష్ట 2-3 / శతభిషం / పూర్వాభాద్ర 3-4 / ఉత్తరాభాద్ర 1.

**రోహిణి :** నక్షత్రాలలో ఇది నాలుగవది. ఈ నక్షత్రంలోని అన్ని పాదాలు వృషభరాశిలోనే ఉంటాయి. రాశ్యాధిపతి శుక్రుడు. మనుష్య గణానికి చెందిన నక్షత్రం. 5 తారలు కలిసి వృషభాకారంలో కనిపిస్తూ ఉంటుంది. ఈ నక్షత్రంలో జన్మించినవారు అందంగా ఉంటారు. కోలముఖం, చిన్న నుదురు మాటలలో నేర్పరితనం, స్థిరబుద్ధి, ధనార్జన ఉంటాయి. పొడుగుగా ఉంటారు. కడుపులో మాట బైటికి చెప్పరు. గట్టిగా వాదించలేరు. పెద్దగా మాట్లాడలేరు. 1వ పాదంలో జన్మించినవారు కోపాన్ని

దిగమ్రింగుకోగలరు. అనవసరంగా మాట్లాడరు. పరిశీలనా శక్తి ఎక్కువ. అవసరం వచ్చినప్పుడల్లా ధైర్యంగా నిలబడినా సాధారణంగా కొంచెం భయస్తులు. 2వ పాదంలో జన్మించినవారు పుష్టిగల శరీరంతో భారీగా ఉంటారు. బంధు ప్రీతి, భోజన ప్రియత్వం ఉంటుంది. అభివృద్ధిలోకి వస్తారు. ధనం ఖర్చు పెట్టరు. కోపాన్ని దిగమింగుకొనే శక్తి ఎక్కువ.

3వ పాదంలో జన్మించినవారు విద్యాధికులౌతారు. తమ విద్యలో పాండిత్యం ఎక్కువ సంపాదిస్తారు. కళాభిరుచి ఉంటుంది. చతురులు, యుక్తిపరులు, సంగీత, సాహిత్యాలు, నటన, శిల్పకళ, చిత్రకళలయందు అభిమానం ఎక్కువ. 4వ పాదంలో జన్మించిన వారు అందం, ఆకర్షణతో ఉంటారు. జనాకర్షణ శక్తి ఉంటుంది. మాట నేర్పు, చతురత యుక్తి ఉంటాయి. సంపన్నులవుతారు.

**ఈ వధువుకు సరిపడే నక్షత్రాలు :** అశ్వని / భరణి / కృత్తిక 2 / రోహిణి / మృగశిర 2-3 / ఆరుద్ర / పునర్వసు 3-4 /పుష్యమి / పుబ్బ / ఉత్తర 1-2 / హస్త 1 / చిత్త 2-3 /అనూరాధ / జ్యేష్ఠ / పూర్వాషాఢ / శ్రవణం / ధనిష్ఠ 2-3/ శతభిషం / పూర్వాభాద్ర 3-4 /ఉత్తరాభాద్ర / రేవతి.

**మృగశిర :** ఇది నక్షత్రాలలో ఐదవది. ఈ నక్షత్రంలోని మొదటి రెండు పాదాలు వృషభరాశిలో ఉంటాయి. వృషభరాశికి అధిపతి శుక్రుడు. మృగశిర నక్షత్రంలో మూడు, నాలుగు పాదాలు మిధున రాశిలో ఉంటాయి. మృగశిరా నక్షత్రానికి అధిపతి కుజుడు. పూర్తి దశ 7 సం॥లు. 50-51 సం॥లలో భార్య లేక పుత్రుడు మరణించవచ్చు. తెలుపు రంగులో మూడు నక్షత్రాలు కలిగి దండాకారంగా కనపడుతుంది. నపుంసక లింగం. ఏ శుభకార్యానికైనా మృగశిర మంచిది. ఈ నక్షత్రంలో జన్మించినవారు చాలా ధైర్యస్థులు. అభిమానవంతులు, తల్లి ప్రేమ ఎక్కువ. త్వరగా ఒక నిర్ణయం తీసుకోలేరు. పని చేయడం అంటే ఉత్సాహం చూపిస్తారు. అభిమానం ఎక్కువ. శత్రువుల మీద పగ తీర్చుకోవాలనే వాంఛ ఎక్కువ. ధన సంపాదన ఉన్నా సంస్కారం, కొంచెం తక్కువ స్వార్థపరత్వం పాలు ఎక్కువ. 2వ పాదంలో జన్మించిన వారు యుక్తిపరులు. కార్యసాధనలో మంచి ఫలితం కోరుతారు. అందుకు బాగా శ్రమిస్తారు. తొందర స్వభావం లేక నిదానంగా ఆలోచించి ఏ నిర్ణయమైనా తీసుకుంటారు. 3వ పాదంలో జన్మించిన వారు మంచి ఆకర్షణతో అందంగా ఉంటారు. కళాతృష్ణ కలిగి ఉంటారు. మేలు చేసిన వారికి కృతజ్ఞతగా ఉంటారు.

ముఖం చిరునవ్వుతో ప్రసన్నంగా ఉంటుంది. పరోపకారులు స్నేహస్వభావం గలవారై ఉంటారు. మాట సరళంగా మృదువుగా ఉంటుంది. 4వ పాదంలో జన్మించినవారు దురలవాట్లకు ఆకర్షితులవుతారు. అహం ఎక్కువ. కోప స్వభావులు. పౌరుషం ఎక్కువ. శతృపగ ఉంటుంది. శీలం నమ్మదగినది కాదు.

**ఈ నక్షత్ర మొదటి రెండవ పాదం వధువుకు సరిపడే నక్షత్రాలు :** అశ్విని / మృగశిర 2 / ఆరుదద్ర / పునర్వసు 3-4 / పుష్యమి /పుబ్బ / ఉత్తర 1-2 / హస్త 1 / చిత్త 1-2 / అనూరాధ / జ్యేష్ఠ / పూర్వాషాఢ / శ్రవణం / ధనిష్ఠ 2-3 / శతభిషం / పూర్వాభాద్ర 3-4 / రేవతి.

**మృగశిర 3,4 పాదాలకు సరిపడే నక్షత్రాలు :** అశ్విని / భరణి / కృత్తిక 1-2 / రోహిణి / మృగశిర / ఆరుద్ర / పునర్వసు 3-4 / మఖ / పుబ్బ / ఉత్తర 1-2 / హస్త 1 / చిత్త 2 / స్వాతి / విశాఖ 3 / జ్యేష్ఠ / మూల / పూర్వాషాఢ / ఉత్తరాషాఢ / శ్రవణం / ధనిష్ట / శతభిషం / పూర్వాభాద్ర / రేవతి.

**ఆరుద్ర :** ఈ నక్షత్రం నక్షత్రాలలో ఆరవది. ఆరుద్ర నక్షత్రంలోని నాలుగు పాదాలు మిధునరాశిలోనే ఉంటాయి. ఈ నక్షత్రానికి అధిపతి రాహువు. రాశ్యాధిపతి బుధుడు. ఈ నక్షత్రం మనుష్యగణానికి చెందినది. స్త్రీలింగం ఈ నక్షత్రంలో జన్మించినవారు లలితకళలలో ప్రావీణ్యం సంపాదిస్తారు. నటులుగా, రచయితలుగా, గాయకులుగా వృద్ధిలోకి వస్తారు. సమయానికి విలువనిస్తారు. వీరికి ఆయువు ఎక్కువ. అహంకారం, గర్వం ఉంటాయి. వీరు అవకాశవాదులు. చేసిన మేలు మరచిపోయి తమ స్వార్థం చూసుకుంటారు. అక్రమ సంపాదనకు వెనుకాడరు. మనిషిలో కాఠిన్యం ఉంటుంది. 1వ పాదంలో జన్మిస్తే అందం, ప్రసన్న ముఖం, గొప్ప మేధా సంపద, సత్ప్రవర్తన కలిగి ఉంటారు. 2వ పాదంలో జన్మించిన వారికి దర్పం, అహంకారం, కోపం, పగ ఉంటాయి. ఏదో ఒక వ్యాధితో బాధపడుతూ ఉంటారు. అక్రమ మార్గాల ద్వారా సంపాదించడానికి వెనుకాడరు. కాఠిన్య హృదయం, లోభితనం ఎక్కువ. పట్టుదల, పౌరుషం ఎక్కువ. 3వ పాదంలో జన్మించినవారు కళాకారులౌతారు. దుర్వ్యసనాలకు బానిసలౌతారు. అన్యాయ సంపాదన ఎక్కువ. ధనం ఖర్చు పెట్టరు. విమర్శకులౌతారు. సత్సాంగత్యంలో నమ్మకం ఉండదు. 4వ పాదంలో జన్మించినవారు దైవచింతన, సచ్ఛీలత ధర్మచింతన, దైవభక్తి కలిగి ఉంటారు. కళానైపుణ్యం ఉంటుంది. శత్రుద్వేషం ఉంటుంది.

**ఈ వధువుకు సరిపడే నక్షత్రాలు :** అశ్విని / భరణి / కృత్తిక / రోహిణి / మృగశిర 2–3 / ఆరుద్ర / పునర్వసు / పుష్యమి / మఖ / పుబ్బ / ఉత్తర 1–2 / హస్త 1 / చిత్త 2 / స్వాతి / విశాఖ 3 / పూర్వాషాఢ / ఉత్తరాషాఢ / శ్రవణం / ధనిష్ఠ 3 / శతభిషం / పూర్వాభాద్ర 4 / ఉత్తరాభాద్ర 1 / రేవతి.

**పునర్వసు :** నక్షత్రాలలో ఇది ఏడవది. మొదటి మూడు పాదాలు మిధునరాశిలో ఉంటాయి. మిధునరాశికి అధిపతి బుధుడు. 4వ పాదం కర్కాటక రాశిలో ఉంటుంది. ఈ రాశి అధిపతి చంద్రుడు. పునర్వసు నక్షత్రానికి అధిపతి గురుడు. ఈ నక్షత్రం దైవ గణానికి చెందినది. కామధేనువు జన్మించిన నక్షత్రం కనుక శుభ నక్షత్రం. పునర్వసు నక్షత్రంలో పుట్టినవారు అందరూ పాదభేదం లేకుండా సచ్ఛీలురై పరోపకారం, న్యాయాన్యాయ విచక్షణ, విజ్ఞానులై మంచి గుణాలు గలవారై ఉంటారు. యుక్తిపరులు జనాకర్షణ కలిగి ఉంటారు. 1వ పాదంలో జన్మించినవారు అనారోగ్యంతో ఉంటారు. అభిమాన రోష, పౌరుషాలు ఎక్కువ. మిక్కిలి ధైర్యసాహసాలు ఉంటాయి. కష్టాలను లెక్కించక పట్టుదలతో తమ పని సాధిస్తారు. అనవసర తర్కంలో తలదూర్చి వితండవాదం చేసి ఓడిపోయి బాధపడుతూ ఉంటారు. 2వ పాదములో జన్మించిన వారు అలంకారప్రియులు. ఊహాశక్తి చాలా ఉంటుంది. కళా ప్రియత్వం, భోజనాభిలాష ఉంటుంది. 3వ పాదంలో జన్మించినవారు కళాకారులుగా ఉంటారు. సాహిత్య కవితలను వ్రాస్తారు. దీర్ఘాయువు కలిగి సాధు ప్రవర్తనతో ఉంటారు. కార్యాచరణ సామర్థ్యం ఎక్కువగా ఉంటుంది. 4వ పాదంలో పుట్టినవారు తాము ఎక్కువగా పనిచేయరు. కాని ఇతరులచేత పని చేయిస్తారు. అందంగా, దృఢంగా ఆకర్షణగా ఉంటారు. స్నేహ సహకార గుణం ఉంటుంది. ఏ రంగంలో అయినా అందరినీ ఆకర్షించి జనసంబంధాలలో మెరుగ్గా ఉండి జీవితంలో రాణించగలరు.

**పునర్వసు 1,2, 3 పాదాలకు సరిపడే నక్షత్రాలు :** అశ్విని / భరణి / కృత్తిక 1–3 / రోహిణి / మృగశిర 2/ పునర్వసు 1–2 / ఆశ్లేష / పుబ్బ / ఉత్తర 3 / హస్త 1 / చిత్త 2 / స్వాతి / విశాఖ 1–3 / అనూరాధ / పూర్వాషాఢ / ఉత్తరాషాఢ 1–3 / శ్రవణం / ధనిష్ఠ / శతభిషం / పూర్వాభాద్ర / ఉత్తరాభాద్ర / రేవతి.

**4వ పాదానికి సరిపడే నక్షత్రాలు :** అశ్విని / భరణి / కృత్తిక / రోహిణి / మృగశిర / ఆరుద్ర / పునర్వసు 3 / పుష్యమి / మఖ / పుబ్బ / ఉత్తర 1–2 / హస్త 1 /

చిత్త 2-3 / విశాఖ 1-2-3 / అనూరాధ / పూర్వాషాఢ / ఉత్తరాషాఢ 1-2 / శ్రవణం / ధనిష్ఠ / పూర్వాభాద్ర 1 / ఉత్తరాభాద్ర 1 / రేవతి.

**పుష్యమి :** ఈ నక్షత్రంలోని అన్ని పాదాలు కర్కాటకరాశిలో ఉంటాయి. రాశ్యాధిపతి చంద్రుడు. ఈ నక్షత్రం దేవగణానికి చెందినది. మూడు తారలలో బండి ఆకారంలో కనిపిస్తుంది. 1వ పాదంలో జన్మించినవారు మొరటు మనుషులు అయి బలంగా ఉంటారు. వారికి నాజూకుతనం అంటే తెలియనట్లు ప్రతి మాటా, చేత కూడా మోటుగానే ఉంటాయి. 2వ పాదంలో జన్మిస్తే సభాగౌరవం పొందుతారు. నాయక లక్షణాలు ఉంటాయి. ఎక్కువ కాముకత్వం కలిగి స్త్రీ వ్యసనం కలిగి పరస్త్రీలను కూడుతూ ఉంటారు. 3వ పాదంలో జన్మించినవారు దయాదాక్షిణ్యాలు కలిగి మంచివారుగా చెలామణి అవుతారు. ఉత్తమ గుణాలతో పాటు సూక్ష్మబుద్ధి కలిగి ఉంటారు. 4వ పాదంలో జన్మించినవారు నీచ ఆలోచనలు, దురాలోచనలతో జీవితంలో కష్టాలు పడతారు. చోరవృత్తి పరుల ఆస్తిపాస్తులను, ద్రవాన్ని అపహరించడానికి వెనుకాడరు. ఏ పాదంలో పుట్టినా కాముకత, స్త్రీ వ్యసనం, దృఢ శరీరం తప్పక ఉంటాయి. శుచి శుభ్రత కలిగి వివేకంతో జీవిస్తారు. ఆత్మాభిమానం ఎక్కువ. ఉపకారబుద్ధి ఉండి దీర్ఘాయువు కలిగి ఉంటారు.

**ఈ వధువుకు సరిపడే నక్షత్రాలు :** అశ్విని / భరణి / కృత్తిక 1-3 / రోహిణి / ఆరుద్ర / పునర్వసు 1-3 / పుష్యమి / ఆశ్లేష / మఖ / ఉత్తర 1-3 / హస్త / స్వాతి / విశాఖ 1-3 / అనూరాధ / జ్యేష్ఠ / ఉత్తరాషాఢ 1-3 / శ్రవణం / ధనిష్ఠ 2 / పూర్వాభాద్ర 1 / ఉత్తరాభాద్ర 1 / రేవతి.

**ఆశ్లేష :** ఈ నక్షత్రంలోని 4 పాదాలూ కర్కాటక రాశిలో ఉంటాయి. రాశి అధిపతి చంద్రుడు. ఈ నక్షత్రాధిపతి బుధుడు. ఇది రాక్షసగణానికి చెందిన నక్షత్రం. పాండవాగ్రజుడైన ధర్మరాజు ఈ నక్షత్రంలో జన్మించాడు. అనేక తారలలో ఎర్ర సింధూరంలా, సర్పాకారంలో ఈ నక్షత్రం కనిపిస్తుంది. మొదటి పాదంలో జన్మించిన వారు సచ్ఛీలురు. నిర్మల హృదయం గలవారు, ధర్మ గుణం, సత్యశీలం, వివేకంతో ఉండి మంచి దేహదారుఢ్యం కలిగి సంపన్నంగా జీవిస్తారు. 2వ పాదంలో జన్మించినవారు కుటిలురు. దురాలోచన గలవారు. దుర్మార్గ ప్రవృత్తి, కఠిన బుద్ధి కలిగి నీచ సంపాదన మీద ఆధారపడతారు. 3వ పాదంలో జన్మిస్తే కపటం, అల్పబుద్ధి, కోపం, సోమరితనం, మొండిపట్టు కలిగి, తిండిపోతులుగా ఉంటారు. 4వ పాదంలో జన్మించిన వారికి

స్వార్థపరత్వం, లోభగుణం కూడా ఎక్కువే. ధనాశ విపరీతంగా ఉంటుంది. చోర ప్రవృత్తి వల్ల ధనాపహరణ చేయడానికి వెనుకాడరు. ఉద్యోగం చేసి జీవిస్తారు. ఆశ్లేష నక్షత్రంలో జన్మించినవారు ఎవరైనా సరే మాటలో మంచి నేర్పరులు. ముఖంలో మంచి చిరునవ్వు, కడుపులోని ఆలోచనలను బహిర్గతం చేయనీయరు. వీరు ఆఖరి క్షణంలో సహాయం చేయక తప్పుకుంటారు. కాని ప్రసన్నముఖం, చిరునవ్వు, అందం మాట నేర్పరితనం వల్ల అందరివద్దా మంచి పేరు సంపాదిస్తారు. అవకాశం లభిస్తే పరసంపర్కానికి వెనుకాడరు. శరీర సౌఖ్యాల మీద ఆశ ఎక్కువ.

**ఈ నక్షత్ర వధువుకు సరిపడే నక్షత్రాలు :** అశ్వని / భరణి / కృత్తిక 1-2 / మృగశిర 2 / పునర్వసు / పుష్యమి / ఆశ్లేష / ఉత్తర 1-2 / హస్త 1వ పాదం / చిత్త 2-3 / అనూరాధ / జ్యేష్ఠ / మూల / ధనిష్ఠ - 2 / శతభిషం /పూర్వాభాద్ర 4/ఉత్తరాభాద్ర- 1.

**మఖ :** ఈ నక్షత్రంలోని 4 పాదాలూ సింహరాశిలో ఉంటాయి. రాశ్యాధిపతి సూర్యుడు. నక్షత్రాధిపతి కేతువు. ఈ నక్షత్రం 5 తారలతో నల్లరంగులో ఉంటుంది. రాక్షస గణానికి చెందినది. పాండవ మధ్యముడు అర్జునుడు ఈ నక్షత్రంలో జన్మించాడు. కేతు మహాదశలో జీవితం ప్రారంభమవుతుంది. మఖలో పుట్టిన స్త్రీలకు గౌరవం, సుఖం, సంపద పుష్కలంగా లభిస్తాయి. వీరు దైవభక్తి గలవారై పెద్దల ఎడ గౌరవాభిమానాలతో ఉంటారు. మఖలో పుట్టిన పురుషుడు తండ్రిని మించిన తనయుడవుతాడు. ముఖంలో వర్చస్సు, తేజస్సు ఉంటాయి. వాక్చాతుర్యం తర్కబలం బాగా ఉంటాయి. గురుభక్తి, దైవభక్తి ఉంటాయి. అందరికీ సహాయ సహకారాలందిస్తారు. కార్యనిపుణత ఉంటుంది. కళాభిరుచి ఉంటుంది. మొదటి పాదంలో జన్మిస్తే శరీరదారుఢ్యంతో, ఉత్సాహంగా ఉంటారు. మంచి పేరు ప్రతిష్టలు సంపాదిస్తారు. 2వ పాదంలో జన్మిస్తే న్యాయసంపాదన, త్యాగశీలత కలిగి విలాసజీవితం గడుపుతారు. అలంకారప్రియులు. భోగలాలసులు. అయినా శీలం తప్పరు. 3వ పాదంలో జన్మిస్తే స్వాభిమానం, కళానైపుణ్యం, యుక్తాయుక్త విచక్షణా జ్ఞానం, మంచి నడవడిక కలిగి ఉంటారు. ఎక్కువ ఆరోగ్యవంతులు కారు. 4వ పాదం పురుషుడైతే సన్యాసం స్వీకరించవచ్చు.

**ఈ నక్షత్ర వధువుకు సరిపడే నక్షత్రాలు :** అశ్వని / భరణి / కృత్తిక 1-2 / మృగశిర 2-3 / ఆరుద్ర / పునర్వసు 3 / పుష్యమి / మఖ / పుబ్బ / ఉత్తర 1 / చిత్త 2-3

/ విశాఖ 3–4 / అనూరాధ / జ్యేష్ఠమూల / పూర్వాషాఢ / ధనిష్ట 3 / శతభిషం / పూర్వాభాద్ర 3–4 / ఉత్తరాభాద్ర – 1.

**పుబ్బ:** ఈ నక్షత్రంలోని 4 పాదాలూ సింహరాశిలో ఉంటాయి. రాశ్యాధిపతి సూర్యుడు. నక్షత్రాధిపతి శుక్రుడు. ఈ నక్షత్రం మనుష్య గణానికి చెందినది. ఈ నక్షత్రంలో పుట్టిన వారు కళలలో నేర్పరులు. యుక్తాయుక్త విచక్షణా జ్ఞానం కలిగినవారు. ఆభరణాలు, అలంకారాల మీద మోజు కలవారు. మంచి రూపం, జనాకర్షణ వుంటుంది. విరివిగా డబ్బు ఖర్చు చేస్తారు. మాతృప్రేమకు దూరమవుతారు. పుబ్బ స్త్రీలకు మంచి సంపద, మంచి సంతానం, మంచి గుణం వుంటాయి. కళాహృదయం వుంటుంది. 1వ పాదంలో పుట్టినవారు వ్యాపారంలో నైపుణ్యం కలిగి ఉంటారు. దానశీలత ఉంటుంది. ధన సంపాదన బాగా ఉంటుంది. 2వ పాదంలో జన్మిస్తే ఉత్సాహం, పేరుప్రతిష్ఠలు, కీర్తి, సంపద లభిస్తాయి. అతి శుభ్రం పాటిస్తారు. శుచిగా ఉంటారు. అయితే పుంసకత్వం తక్కువ. అలా అని నపుంసకులు కారు. కాని, వీరికి అతికాముకత, స్త్రీ వాంఛలాంటివి ఉండవు. 3వ పాదంలో జన్మిస్తే భార్య, సంతానం మీద అమిత ప్రేమతో ఉంటారు. వారి సంతోషానికై శ్రమిస్తారు. మంచి సంతతి, గౌరవ ప్రతిష్టలు ఉంటాయి. భార్య మీద అత్యంత ప్రేమానురాగాలు చూపుతారు. ఆమెతో స్నేహతత్వంతో ఉండి మిత్రుడిలాగా చూసుకుంటాడు. 4వ పాదంలో పుట్టినవారు కష్టాలకు లోనై అధిక సంతానంతో ధనార్జన చాలక మిక్కిలి తక్కువ స్థితిలో జీవిస్తారు.

**ఈ నక్షత్ర వధువుకు సరిపడే నక్షత్రాలు :** అశ్వని / భరణి / కృత్తిక 1–2 / రోహిణి / మృగశిర 2–3 / ఆరుద్ర / పునర్వసు 3–4 / మఖ / పుబ్బ / ఉత్తర 1–2 / హస్త / స్వాతి / విశాఖ 3–4 / అనూరాధ / జ్యేష్ఠ / మూల / పూర్వాషాఢ / ఉత్తరాషాఢ 1–2 / శ్రవణం / శతభిషం / పూర్వాభాద్ర 3–4 / రేవతి.

**ఉత్తర :** ఈ నక్షత్రంలోని మొదటి పాదం సింహరాశిలో ఉంటుంది. రాశ్యాధిపతి సూర్యుడు. మిగిలిన 3 పాదాలూ కన్యారాశిలో ఉంటాయి. కన్యారాశి అధిపతి బుధుడు. ఈ నక్షత్రం మనుష్య గణానికి చెందినది. 2 నక్షత్రాలతో కలిపి ఎర్రగా, దండాకారంలో ఉంటుంది. నక్షత్రాధిపతి సూర్యుడు. మొదటిపాదంలో జన్మిస్తే కవులు, రచయితలు అవుతారు. కావ్యాలు, ప్రబంధాల మీద అభిరుచి ఉంటుంది. బంధుప్రియులవుతారు. సచ్ఛీలురు, ధైర్యం గలవారుగా ఉంటారు. 2వ పాదంలో జన్మించిన వారు లోభులు,

చపలత్వం, అనారోగ్యం కలిగి దారిద్ర్యంతో బాధపడతారు. సోమరితనం, దూరదృష్టి, ప్రపంచజ్ఞానం, శాంతస్వభావం ఉన్నా జీవితంలో పైకిరారు. 3వ పాదంలో జన్మించినవారు స్నేహాభిలాషులు, హాస్యప్రియత్వం కలిగి ఉంటారు. గర్వం ఎక్కువగా ఉంటుంది. దర్పం, డాంబికం ఎక్కువ. అహంకారం అధికం. గర్వం కలిగి ఒక్కొక్కప్పుడు మానవత్వం మరిచిపోతారు. అలంకార ప్రియులు. 4వ పాదంలో జన్మించినవారు పుత్రసంతానం కలిగి, విద్య, వినయంతో మంచిపేరు తెచ్చుకుంటారు. చేసిన మేలు మరువరు. దైవభీతి, ఆధ్యాత్మికచింతన కలిగి హాస్యప్రియత్వం ఉంటుంది.

**ఈ నక్షత్ర వధువుకు సరిపడే నక్షత్రాలు :** ఉత్తర, భరణి, కృత్తిక 1-2, రోహిణి, మృగశిర 2-3, ఆరుద్ర, పునర్వసు 3, పుష్యమి, ఆశ్లేష, మఖ, పుబ్బ, ఉత్తర 1-2, చిత్త-3, విశాఖ 3-4, అనూరాధ, జ్యేష్ఠ, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1-2, శ్రవణం, ధనిష్ట 3, ఉత్తరాభాద్ర -1, రేవతి.

**ఉత్తర 2,3,4 - అంటే కన్యారాశిలో జన్మించిన వధువుకు సరిపడే నక్షత్రాలు:** భరణి, కృత్తిక-2, రోహిణి, మృగశిర 2-3, ఆరుద్ర, పునర్వసు 3-4, పుష్యమి, ఆశ్లేష, మఖ, పుబ్బ, ఉత్తర 1-2/ హస్త, చిత్త 2, స్వాతి, విశాఖ-4, అనూరాధ, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1-2, శ్రవణం, పూర్వాభాద్ర 4, ఉత్తరాభాద్ర, రేవతి.

**హస్త :** ఈ నక్షత్రం 4 పాదాలూ కన్యారాశిలో ఉంటాయి. రాశ్యాధిపతి బుధుడు. నక్షత్రాధిపతి చంద్రుడు. కుశలవులు ఈ నక్షత్రంలో జన్మించారు. ఇది దేవగణానికి చెందిన నక్షత్రం. ఈ నక్షత్రం పుంలింగం. 5 నక్షత్రాలు కలిసి నల్లని చేయిలాగా ఉంటుంది. హస్తలో జన్మించిన స్త్రీలు మంచి అందం కలిగి, మంచి ప్రవర్తన కలిగి సంపద, సుఖాలతో ఆనంద జీవితం గడుపుతారు. గౌరవప్రదంగా జీవిస్తారు. ఏ పాదంలో పుట్టినా సరే, పురుషులకు విద్య, భక్తి, సంపద, కళానైపుణ్యం, గౌరవం, ఉపకార గుణం మహిళలను ఆకర్షించే శక్తి ఉంటాయి. మొదటి పాదంలో జన్మించినవారు దేహదారుఢ్యం, అహంభావం, గర్వం కలిగి ఉంటారు. స్త్రీ వ్యసనం ఉంటుంది. ఆ విధంగా వారి మీద శీలసంశయం కలగవచ్చు. 2వ పాదంలో జన్మించినవారు మెత్తటి స్వభావం, మాటలో మృదుత్వం, కళాభిమానం ఉంటాయి. మాతృప్రేమ లోపిస్తుంది. మంచి నడవడిక, మంచి పేరు ఉంటాయి. 3వ పాదంలో జన్మించిన వారికి పితృప్రేమ లోపిస్తుంది. విలాసపరులవుతారు. జీవితంలో స్త్రీ సౌఖ్యానికి ప్రాముఖ్యం ఇస్తారు. వ్యసనపరులుగా ఉంటారు. 4వ పాదంలో

జన్మించినవారు మృదుస్వభావులు, సహనశీలత్వం కలిగి ఉంటారు. మంచి శరీర కాంతి, అందం, ఆకర్షణ కలిగి ఉంటారు. సమయానికి విలువ నిస్తారు. ఉపకార గుణం కలిగి ఉంటారు.

**ఈ నక్షత్ర వధువుకు సరిపడే నక్షత్రాలు :** భరణి, రోహిణి, మృగశిర 2-3, ఆరుద్ర, పునర్వసు 3-4, పుష్యమి, ఆశ్లేష, మఖ, పుబ్బ, ఉత్తర 2, హస్త 1, చిత్త 2-3, స్వాతి, విశాఖ 3-4, అనూరాధ, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1-2, శ్రవణం, ధనిష్ట 2-3, పూర్వాభాద్ర 3-4, ఉత్తరాభాద్ర, రేవతి.

**చిత్త :** ఈ నక్షత్రంలోని మొదటి రెండు పాదాలు కన్యారాశిలో ఉంటాయి. రాశ్యాధిపతి బుధుడు. మిగిలిన రెండు పాదాలు తులా రాశిలో ఉంటాయి. రాశ్యాధిపతి శుక్రుడు. ఈ నక్షత్రం శ్వేతవర్ణంలో గుండ్రంగా ఉంటుంది. రాక్షసగణానికి చెందిన నక్షత్రం. ఈ నక్షత్రానికి అధిపతి కుజుడు. కుజదశతో జీవితం ప్రారంభమవుతుంది. ఈ నక్షత్రంలో జన్మించిన స్త్రీలకు మంచి అందం, నగలు నాణ్యాలు, ధనసంపద ఉంటాయి. తల్లిదండ్రులు ప్రేమాభిరాగాలు, ఆదరణ సహాయం ఉంటాయి. దాంపత్యజీవితం ఆనందంగా సాగిపోతుంది. చిత్తానక్షత్ర పురుషులు అలంకార ప్రియులు. అందరికీ కావలసిన వారుగా ఉంటారు. స్త్రీలను త్వరగా ఆకర్షిస్తారు. భోగలాలసులు, విలాసవంతమైనజీవితం గడుపుతారు. ధన సంపత్తులు బాగుంటాయి. భోగ జీవితం ఉంటుంది. మంచి స్ఫురద్రూపం ఉంటుంది. 1వ పాదంలో జన్మించినవారు మంచివారు, ఉన్నత విద్య, సాధుశీలత, కార్యదీక్ష, మంచి మాటకారులుగా ఉంటారు. 2వ పాదంలో జన్మించినవారు స్త్రీలోలురుగా ఉంటారు. ధనం బాగా ఆర్జిస్తారు. స్వయం సంపాదనలోఉంటారు. ఉద్యోగం చేయరు. సంతానం కలుగకపోవచ్చు. 3వ పాదంలో జన్మించినవారికి కళాభిరుచి ఎక్కువగా ఉంటుంది. ఉన్నత విద్య అభ్యసిస్తారు. మంచి వ్యవహార దక్షత, విజ్ఞానం ఉంటాయి. విద్యాధికులను గౌరవించడం సన్మానించడం వీరికి చాలా ఇష్టంగా ఉంటుంది. పట్టుదలతో పనులు సాగిస్తారు. మంచి పేరు ప్రతిష్ఠలు తెచ్చుకుంటారు. 4వ పాదంలో జన్మిస్తే భీరువులుగా ఉంటారు. చపలచిత్తం ఎక్కువ. కార్యసాధన లోపిస్తుంది. ఓర్పు, సహనం ఉండదు. అసూయాద్వేషాలు ఎక్కువ. కృతఘ్నులుగా ఉంటారు. చౌర్య శీలం ఉంటుంది. పనికిరాని సాహసం, పనికిరాని సౌందర్యారాధన ఉంటాయి.

**కన్యారాశి నక్షత్ర వధువుకు సరిపడే నక్షత్రాలు, అంటే చిత్త 1-2 పాదాలకు**

**సరిపడేవి:** కృత్తిక 1–2, రోహిణి, మృగశిర 3, ఆరుద్ర, పునర్వసు 3–4, ఆశ్లేష, మఖ, ఉత్తర, హస్త–1, చిత్త - 2,3 స్వాతి, విశాఖ 3–4, మూల, ఉత్తరాషాఢ 1–2, శ్రవణం, ధనిష్ట, శతభిషం, పూర్వాభాద్ర 3–4, రేవతి.

**చిత్త :** 3–4 పాదాలకు సరిపడేవి – తులారాశి నక్షత్ర వరుడు.

**స్వాతి :** ఈ నక్షత్రంలోని అన్ని పాదాలు తులారాశిలో ఉంటాయి. రాశ్యాధిపతి శుక్రుడు. ఈ నక్షత్రం మంచి ఎర్ర మందార రంగులో గుండ్రంగా కన్పిస్తుంది. నక్షత్రాధిపతి రాహువు. రాహు మహాదశతో జీవితం ప్రారంభమవుతుంది. రాహు మహాదశ 18 సంవత్సరాలు. ఈ నక్షత్రంలో పుట్టిన పురుషులు మంచి సచ్ఛీలురు, విశాల హృదయం కలవారు. జనానికి మరియు బంధువర్గానికి మిత్రులకు అందరకు ఇష్టులవుతారు. పేరు ప్రఖ్యాతులు గడిస్తారు. ధైర్యవంతులు, కార్యసాధకులు అవుతారు. మనిషియందు మృదుత్వం, నెమ్మది, ఓర్పు, సహనం ఉంటాయి. భోగభాగ్యాలు అనుభవిస్తారు. మొదటిపాదంలో జన్మించినవారు మాటయందు చతురులు. మంచి వక్తృత్వం, సభాగౌరవం ఉంటాయి. ధైర్యవంతులు, జనాకర్షణ ఉంటుంది. ఎక్కువ స్నేహితులు ఉంటారు. 2వ పాదంలో జన్మించిన వారు చాలా గుంభనగల వ్యక్తులు. కడుపులోని మాట పైకి రాదు. స్వామి మీద మూఢభక్తి ఉంటుంది. రహస్య కార్యక్రమాలలో నిపుణులవుతారు. సంపాదన బాగా ఉంటుంది. లోభులుగా ఉంటారు. 3వ పాదంలో జన్మించినవారు ధనవంతులౌతారు. అభిమానం, రోషం ఎక్కువ. పెద్దల యెడ గౌరవం, మంచి నడవడి ఉంటాయి. ఈ నక్షత్రంలో పుట్టిన స్త్రీలకు మంచి సంతానం ఉంటుంది. వారు బాగా అభివృద్ధిలోకి వస్తారు. భర్త యెడల విశ్వాసపాత్రులు. దాంపత్యం బాగుంటుంది. స్త్రీలు కళాకారులు అవుతారు. రచయితలు అవుతారు.

**ఈ నక్షత్రంలో జన్మించిన వధువుకు సరిపడే నక్షత్రాలు :** అశ్వని, భరణి, కృత్తిక 1, మృగశిర 2–3, ఆరుద్ర, పునర్వసు 3–4, పుష్యమి, పుబ్బ, ఉత్తర 2, హస్త 1, చిత్త 2–3, స్వాతి, విశాఖ 3, అనూరాధ, జ్యేష్ఠ, మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1–2, శ్రవణం, ధనిష్ట 3, శతభిషం, పూర్వాభాద్ర 3–4, ఉత్తరాభాద్ర.

**విశాఖ :** ఈ నక్షత్రంలోని మొదటి మూడు పాదాలు తులారాశిలో ఉంటాయి. రాశ్యాధిపతి శుక్రుడు. చక్రం ఆకారంలో గుండ్రంగా ఉంటుంది. 4వ పాదం వృశ్చిక రాశిలో ఉంటుంది.

రాశ్యాధిపతి కుజుడు. నక్షత్రాధిపతి గురుడు. రాక్షసగణానికి చెందినది. జాతకుల జీవితం గురుమహాదశతో ప్రారంభం అవుతుంది. దశప్రమాణం 16 సంవత్సరాలు. ఈ నక్షత్రంలో పుట్టిన పురుషులు సూక్ష్మబుద్ధి కలిగి, వివేకం ఉన్నా అసూయాద్వేషాలతో నిండి ఉంటారు. పొదుపు ఎక్కువ డబ్బు ఖర్చు పెట్టరు. కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడటం వీరి నైజం, బంధు ప్రేమ ఎక్కువగా ఉంటుంది. డాంబికం ఎక్కువ. మంచి సంపత్తు ఉంటుంది. విశాఖ మహిళలకు ఓర్పు, సహనం, తక్కువ. మూర్ఖపు పట్టుదల, ఎదురు మనుష్యులను నిర్లక్ష్యం చేయడం వీరి మానసిక ప్రవృత్తి. కలహప్రియులు. వితండవాదం, మూర్ఖపు పట్టుదల ఎక్కువ. విశేషంగా ప్రయాణాలు చేస్తారు. దేశ విదేశాలలో సంచరిస్తారు. గర్వం, దర్పం, డాంబికం ఎక్కువ. అవసరమైతే ఏడుస్తూ యాగి చేసి గయ్యాళితనం చూపడానికి వెనుకాడరు. విశాఖ స్త్రీలకు తమ సంతానం మీద పిచ్చి ప్రేమ ఉంటుంది. గర్వం ఎక్కువ.

1వ పాదంలో జన్మించిన వారికి మంచి ధైర్యం, సంపాదన, ప్రేమ, వ్యాపార నైపుణ్యం, ప్రేమాభిమానాలు ఉంటాయి. యుక్తిపరులు, లోభులు, అసూయాద్వేషాలు ఉంటాయి. దయ, కాఠిన్యం సమానంగా ఉంటాయి. సంపాదన బాగుంటుంది. స్త్రీలు అందంగా, నాజూకుగా ఉంటారు. 2వ పాదంలో జన్మించిన వారికి అందమైన భార్య లభిస్తుంది. న్యాయాన్యాయ విచక్షణ, ఇంగిత జ్ఞానం ఉంటాయి. 3వ పాదంలో జన్మిస్తే మాటకారితనం, కలుపుగోలుతనం ఉంటుంది. కళాభినైపుణ్యం ఉంటుంది. నిర్మలమైన మనస్సు కలిగి ప్రేమగా ఉంటారు. ఆకారంలో కొంచెం పొట్టిగా ఉంటారు. 4వ పాదంలో పుట్టినవారు మంచి మాటకారులై ఉంటారు. మంచి మనస్సు, కళాభిరుచి కలిగి ఉంటారు. సచ్ఛీలురుగా ఉంటారు.

**విశాఖ వధువుకు సరిపడే నక్షత్రాలు :** అశ్విని, భరణి, కృత్తిక 1, మృగశిర 2–3, ఆరుద్ర, పునర్వసు 3–4, పుష్యమి, ఆశ్లేష, మఖ, పుబ్బ 2, ఉత్తర 1–2, హస్త 1, చిత్త 2–3, స్వాతి, విశాఖ 3–4, జ్యేష్ఠ, మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 2, శ్రవణం, ధనిష్ట 2–3, శతభిషం, పూర్వాభాద్ర 3. విశాఖ - 4వ పాదం వధువుకు సరిపడే నక్షత్రాలు.

**అనూరాధ :** ఈ నక్షత్రాధిపతి శని. అందువల్ల శని మహాదశతో జీవితం ప్రారంభం అవుతుంది. రాశ్యాధిపతి కుజుడు. శని జీవిత ప్రమాణం 19 సంవత్సరాలు.

అనూరాధ నక్షత్రంలో అన్ని పాదాలు వృశ్చికరాశిలో ఉంటాయి. దేవ గణానికి చెందిన నక్షత్రం. పురుష లింగం. మూడు తారలతో శ్వేతరంగులో మెరుస్తూ ఉంటుంది. ఈ నక్షత్రంలో జన్మించిన స్త్రీల హాస్యప్రియులు, స్నేహశీలులు. దానగుణం, దైవభక్తి కలిగి ఉంటారు. సంసారం అంటే భర్త, సంతానం అంటే చాలా ప్రేమగా ఉంటారు. వీరికి అహం ఎక్కువ. ఎవరినీ లక్ష్యపెట్టరు. అలా అని అగౌరవంగా ప్రవర్తించరు. సంపన్నులుగా ఉంటారు. ధన సంపాదన ఉంటుంది. సామాన్య రూపమే గానీ అందం, ఆకర్షణ ఉండదు. అనూరాధ నక్షత్రంలో పుట్టిన పురుషులు మంచి రూపం, ఆరోగ్యం కలిగి ఉంటారు. పరుల మాట వినరు. తాము నమ్మినదే నిజమని దృఢ విశ్వాసంతో ఉంటారు. మహిళల స్నేహం వీరికి అత్యంత ఇష్టం. ధన వ్యామోహం ఎక్కువగా ఉంటుంది. కాని సామాన్య ధన సంపాదనతో వీరు తృప్తి చెందక సంపాదించలేక మధనపడుతూ వుంటారు. వినయం, మంచి నడవడి, సత్యశీలత, నీతి నియమాలు పాటిస్తారు. మంచి సలహాలిచ్చే మంత్రిత్వతత్వం ఉంటుంది. లోభులుగా ఉంటారు.

రెండవ పాదంలో పుట్టినవారు సంగీత సాహిత్యాల శిల్పకళలో ఆసక్తి వుంటుంది. ధన వ్యామోహం చాలా ఉంటుంది. మూడవ పాదంలో జన్మించినవారు మంచి తేజస్సు, కళానైపుణ్యం కలిగి వుంటారు. విద్యాధికులుగా ఉంటారు. కానీ మనిషిలో స్వార్థం ఎక్కువ. 4వ పాదంలో జన్మించినవారు వ్యాపార సంపాదనల్లో కష్టనష్టాలు పొందుతారు. మూర్ఖమైన పట్టుదల ఎక్కువ. జీవితంలో ఏమీ సాధించలేరు. అన్ని విషయాల్లో నిర్ణయాలు లోపభూయిష్టంగా ఉంటాయి.

**ఈ వధువుకు సరిపడే నక్షత్రాలు :** అశ్వని, కృత్తిక 1-2, రోహిణి, పునర్వసు 3-4, పుష్యమి, ఆశ్లేష, మఖ, పుబ్బ, ఉత్తర 1-2, హస్త, స్వాతి, విశాఖ 4, అనూరాధ, జ్యేష్ఠ, ఉత్తరాషాఢ 2, శ్రవణం, శతభిషం, పూర్వాభాద్ర 3-4, ఉత్తరాభాద్ర, రేవతి.

**జ్యేష్ఠ :** ఈ నక్షత్రంలోని అన్ని పాదాలు వృశ్చికరాశిలో ఉంటాయి. రాశ్యాధిపతి బుధుడు. జ్యేష్ఠా నక్షత్రం రక్తవర్ణంలో ఛత్రాకారంలో కనిపిస్తుంది. ఈ నక్షత్ర జాతకులకు స్నేహగుణం ఉన్నా శత్రువులు అధికం, పుత్ర సంతతి ఉంటుంది. స్త్రీ లోలురుగా ఉంటారు. మొదటి పాదంలో జన్మించిన వారు ఉన్నత విద్య అభ్యసిస్తారు. హాస్యప్రియులు, చమత్కారులు. తాము గొప్పవారనే భావన ఎక్కువగా ఉంటుంది. 2వ పాదంలో జన్మించిన వారికి కోపం, ఉక్రోషం ఎక్కువ. ఇతరులను ఆకర్షించగలరు. కాని వారికి సహాయం

చేయరు. ఆరోగ్యం అంతగా ఉండకపోవచ్చు. 3వ పాదంలో జన్మించినవారు కంటిజబ్బులతో, నేత్రవ్యాధులతో బాధపడతారు. తగుమాత్రపు సంపాదన ఉంటుంది. ప్రమాదాలలో అంగవైకల్యం కలగవచ్చు. 4వ పాదంలో జన్మించినవారు మంచి నడవడి, మంచి జ్ఞానం కలిగి ఉంటారు. మిత్రులతో ఎక్కువ కాలం గడుపుతారు. దైవచింతన, భక్తి బాగా ఉంటుంది. జ్యేష్ఠనక్షత్రంలో పుట్టిన స్త్రీకి సంతతి, సౌభాగ్యం లభిస్తాయి. కాని జీవితంలో అనేక ఒత్తిడులకు ఆ స్త్రీలు లోనవుతారు.

**జ్యేష్ఠ నక్షత్ర వధువుకు సరిపడే నక్షత్రాలు :** భరణి, కృత్తిక 1-2, రోహిణి, మృగశిర 2, పుష్యమి, ఆశ్లేష, మఖ, పుబ్బ, చిత్త 2-3, స్వాతి, విశాఖ 3-4.

**మూల:** మూలా నక్షత్రంలోని అన్ని పాదాలు ధనూరాశిలో ఉంటాయి. రాశ్యాధిపతి గురువు. నక్షత్రాధిపతి కేతువు. అందువల్ల కేతు మహాదశతో జీవితం ప్రారంభం అవుతుంది. పూర్తి ప్రమాణం 7 సంవత్సరాలు. మూలా నక్షత్ర జాతకులు స్వామి భక్తి పరాయణులు. ఎదుటివారి మనస్తత్వం చక్కగా చదువగలరు. రహస్యాలను పసిగట్టగలరు. భోజనప్రియులు, తర్క ప్రియులు. మూర్ఖవాదన చేస్తారు. ఎంతటి కష్టాలనైనా భరించే శక్తి వీరికి ఉంటుంది. బంధుపోషకులౌతారు. ధర్మానుబద్ధంగా నడుచుకుంటారు. చౌర్యంలో నేర్పు, ఉన్నత విద్య అభ్యసిస్తారు. సుఖసంతోషాలు మహిళలకు తక్కువ.

**మూలా నక్షత్ర వధువుకు సరిపడే నక్షత్రాలు :** భరణి, కృత్తిక 1-2, మృగశిర 2-3, పుష్యమి, ఆశ్లేష, మఖ, పుబ్బ, చిత్త 2-3, విశాఖ 3-4, మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1-2, ధనిష్ట 2-3, శతభిషం, పూర్వాభాద్ర 4, ఉత్తరాభాద్ర 1, రేవతి.

**పూర్వాషాఢ :** ఈ నక్షత్రంలోని అన్ని పాదాలు ధనూరాశిలో ఉంటాయి. రాశ్యాధిపతి గురుడు. నక్షత్రాధిపతి శుక్రుడు. శుక్రదశతో జీవితం ప్రారంభం అవుతుంది. శుక్రదశ ప్రమాణం 20 సంవత్సరాలు. పూర్వాషాఢ నక్షత్రంలో పుట్టినవారు సత్ప్రవర్తన గలవారు, వినయం, దానగుణం, ప్రసన్నముఖం, మంచి ఠీవి, దూరదృష్టి, సత్యవాక్కు సంపన్నులతో మిత్రత్వం, కార్యదక్షత, మాతృభక్తి, మంచిపేరు గలవారై ఉంటారు. సంపద సగటుగా ఉంటుంది. ధనానికి లోటుపడరు. 1వ పాదంలో జన్మించినవారు ధైర్యం గలవారుగా ఉంటారు. కార్యదీక్ష, పట్టుదల ఉంటాయి. జీవితంలోని సుఖాన్ని అనుభవించడం చేతగాక సగటు జీవితంతో సరిపుచ్చుకుంటారు. 2వ పాదంలో జన్మించినవారు యుక్తిపరులు, వాక్చాతుర్యం, చతురత ఉంటాయి. విషయ గ్రహణం,

జ్ఞానం ఉంటుంది. 3వ పాదంలో జన్మించినవారు మంచి ధనవంతులుగా జీవిస్తారు. శుచి,శుభ్రతగా ఉంటారు. అలంకారప్రియత్వం ఉంటుంది. స్నేహితులకు సహాయకారులుగా ఉంటారు. విలాసజీవితం అంటే ఇష్టం. దూరదృష్టి లేక ధనం వెచ్చిస్తారు. 4వ పాదంలో పుట్టినవారికి దుర్మార్గం, కపటం ఎక్కువ. ప్రతి చిన్న విషయంతో కూడా కుటిలనీతితో ప్రవర్తిస్తారు. నమ్మదగ్గ వ్యక్తులు కారు. ద్వేషం, కోపం, అసూయ ఎక్కువగా ఉంటుంది. ఓర్పు, సహనం తక్కువ. పాపకార్యాలు చేయడానికి సంకోచించరు.

**పూర్వాషాఢ నక్షత్ర వధువులకు సరిపడే నక్షత్రాలు :** అశ్వని, భరణి, కృత్తిక 1, రోహిణి, మృగశిర 2-3, ఆరుద్ర, పునర్వసు 3-4, ఆశ్లేష, మఖ, పుబ్బ, ఉత్తర 1-2, హస్త 1, స్వాతి, విశాఖ 3, అనూరాధ, జ్యేష్ఠ, మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ1-2, శ్రవణం, శతభిషం, పూర్వాభాద్ర 3-4, ఉత్తరాభాద్ర 1, రేవతి.

**ఉత్తరాషాఢ :** నక్షత్రంలోని మొదటి పాదం ధనూరాశిలో ఉంటుంది. రాశ్యాధిపతి గురుడు. మిగిలిన 3 పాదాలు మకరరాశిలో ఉంటాయి. రాశ్యాధిపతి శని. నక్షత్రాధిపతి రవి. రవి మహాదశతో జీవితం ప్రారంభం అవుతుంది. దశ జీవిత ప్రమాణం 6 సంవత్సరాలు. ఈ నక్షత్రంలో పుట్టినవారు సాధారణంగా వినయంగా ఉంటారు. స్నేహాభిలాషులు. మిత్రులు ఎక్కువగా ఉంటారు. అందరికీ ప్రేమపాత్రులుగా ఉంటారు. చేసిన మేలు మరువరు. ఈ నక్షత్రంలో పుట్టిన స్త్రీ సంపన్నురాలిగా ఉంటుంది. భర్త ప్రేమానురాగాలను అతిగా అనుభవిస్తుంది. భర్తతో సహకరించి జీవితంలోని మాధుర్యం చవిచూస్తుంది. భర్తని వశం చేసుకొని అతనికి కావలసిన సుఖసంతోషాలను అందిస్తుంది. తాను అనుభవిస్తుంది.

**ఈ నక్షత్రంలో మొదటి పాదంలో పుట్టిన కన్యకు సరిపడే నక్షత్రాలు :** భరణి, కృత్తిక 1-2, మృగశిర 2-3, పుష్యమి, ఆశ్లేష, మఖ, పుబ్బ, చిత్త 2-3, స్వాతి, విశాఖ 3-4, మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1-2, శ్రవణం, శతభిషం, పూర్వాభాద్ర 3-4, ఉత్తరాభాద్ర 1, రేవతి. 2, 3, 4 పాదాలలో పుట్టిన కన్యకు సరిపడే నక్షత్రాలు.

**శ్రవణం:** శ్రవణా నక్షత్రంలోని అన్ని పాదాలు మకరరాశిలో ఉంటాయి. రాశ్యాధిపతి శని. నక్షత్రాధిపతి చంద్రుడు. చంద్ర మహాదశతో జీవితం ప్రారంభం అవుతుంది. చంద్ర దశ ప్రమాణం 10 సంవత్సరాలు. శ్రవణా నక్షత్ర జాతకులు బాల్యంలో అనారోగ్యంతో బాధపడతారు. వయసు 35 వరకు ఏదో రుగ్మత ఉండవచ్చు. 28 నుంచి 30 వరకు

ఆసమృత్యు భయం ఉంటుంది. శ్రవణా నక్షత్రంలో జన్మించిన వారికి అనుకూలవతియైన భార్య లభిస్తుంది. విద్యావివేకాలు, జ్ఞానం కలిగి మాట నేర్పు, సమయస్ఫూర్తి గల కన్యను భార్యగా పొందుతారు. ఈ నక్షత్ర జాతకులకు స్త్రీ వ్యామోహం ఎక్కువ. విద్య, సంపాదన వంశపారంపర్యంగా వచ్చే సంపద ఉంటుంది. అలంకారప్రియులు. సుగంధ ద్రవ్యాలపై మోజు ఉంటాయి. బంధుమిత్రులకు ఉపకారం చేస్తారు. పరదేశయానం నిశ్చయంగా ఉంటుంది.

**శ్రవణా నక్షత్ర వధువులకు సరిపడే నక్షత్రాలు :** అశ్వని, భరణి, రోహిణి, మృగశిర 2-3, ఆరుద్ర, పునర్వసు 3-4, పుష్యమి, మఖ, పుబ్బ, ఉత్తర 1-2, హస్త 1, చిత్త 2-3, స్వాతి, అనూరాధ, జ్యేష్ఠ, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 2, శ్రవణం, ధనిష్ట 2-3, శతభిషం, పూర్వాభాద్ర 3-4, ఉత్తరాభాద్ర 1, రేవతి.

**ధనిష్ట :** ఈ నక్షత్రంలోని మొదటి రెండు పాదాలు మకరరాశిలో ఉంటాయి. రాశ్యాధిపతి శని. మిగిలిన రెండు పాదాలు కుంభరాశితో ఉంటాయి. కుంభరాశ్యాధిపతి కూడా శనిగ్రహమే. నక్షత్రాధిపతి కుజుడు. కుజమహాదశ ప్రమాణం 7 సంవత్సరాలు. ధనిష్ట జాతకులు చాలా దాతృత్వగుణం కలిగి ఉంటారు. ప్రతివారికి సహాయసహకారాలు అందిస్తారు. ధనాశ ఎక్కువ. కళాభిరుచి బాగా ఉంటుంది. సంగీత సాహిత్యాలలో ఎక్కువ అభిరుచి చూపిస్తారు. కోపం ఎక్కువ, రోష పౌరుషాలు ఉంటాయి. శ్రమించి పనిచేసే తత్వం ఉంటుంది. ప్రతి విషయంలో స్పష్టంగా, ఖచ్చితంగా వ్యవహరిస్తారు. ధనిష్టలో పుట్టిన మహిళలకు దయ, కరుణ, ఉపకారగుణం, శాస్త్రాభిమానం ఉంటుంది.

**1-2 ధనిష్ట నక్షత్ర వధువులకు సరిపడే నక్షత్రాలు :** అశ్వని, కృత్తిక 1-2, రోహిణి, ఆరుద్ర, పునర్వసు 3-4, పుష్యమి, ఆశ్లేష, మఖ, హస్త 1, చిత్త 3, స్వాతి, విశాఖ 3-4, జ్యేష్ఠ, మూల, ఉత్తరాషాఢ 2, శ్రవణం, ధనిష్ట 3, శతభిషం, పూర్వాభాద్ర 3-4, రేవతి.

ధనిష్ట 3,4 పాదాలలో జన్మించినవారు యుద్ధ విద్యలో నేర్పరులు. క్రీడారంగంలో ప్రావీణ్యులై ఉంటారు. కార్యనిర్వహణా సామర్థ్యం ఎక్కువగా ఉంటుంది. దుర్వ్యసనాలకు త్వరగా ఆకర్షితులవుతారు. ధనిష్టలో జన్మించిన స్త్రీలకు దయ, కరుణ, సహనం, ఓర్పు ఎక్కువగా ఉంటాయి. సాటి స్త్రీలకు సహాయసహకారాలందిస్తారు. ఆమె వల్ల భర్తకు సుఖ సంతోషాలుంటాయి. పెద్దల యెడల వినయ విధేయతలతో మసలుకుంటుంది.

సాంప్రదాయబద్ధంగా ఉంటుంది. దైవచింతన, పూజలయందు ఉత్సాహం చూపుతుంది.

**3,4 పాదాలకు సరిపడే నక్షత్రాలు :** అశ్వని, కృత్తిక 1-2, మృగశిర 2, ఆరుద్ర, ఆశ్లేష, మఖ, ఉత్తర 1-2, హస్త 1, చిత్త 2-3, స్వాతి, విశాఖ 3-4, జ్యేష్ఠ, మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 2, శ్రవణం, ధనిష్ట 2-3, శతభిషం, పూర్వాభాద్ర 3-4.

**శతభిషం :** ఈ నక్షత్రంలో అన్ని పాదాలు కుంభరాశిలో ఉంటాయి. రాశ్యాధిపతి శని. నక్షత్రాధిపతి రాహువు. ఈ నక్షత్రం 3 తారలతో కలిసి ఒంటె ఆకారంలో రక్త వర్ణంలో కనిపిస్తుంది. ఈ నక్షత్రంలో పుట్టినవారికి రాహు మహాదశతో జీవితం ప్రారంభమవుతుంది. ఈ రాహు మహాదశ ప్రమాణం 16 సంవత్సరములు.

ఈ నక్షత్ర జాతకులకు బంధుప్రీతి ఎక్కువ. వారికి సహాయసహకారాలు అందిస్తారు. క్షమాగుణం ఎక్కువగా ఉంటుంది. ఓర్పు, సహనం ఎక్కువ. శాంతస్వభావులు. వ్యవహార దక్షత ఎక్కువ. మంచి ధైర్యము కలవారు. వాక్చాతుర్యం, గడసరి మాటతనం ఎక్కువ. దానశీలత ఉంటుంది. పుత్ర సంతానము ఉంటుంది. భార్యతో ప్రేమానురాగాలతో సుఖమైన దాంపత్య జీవితం గడుపుతారు. తర్కంలో వీరికి వీరే సాటి. పెద్ద కొటారి ముక్కు, దీర్ఘ బాహువులు ఉంటాయి. మంచి ఆయుష్మంతులవుతారు. మొదటి పాదంలో పుట్టినవారు నిజాయితీ, వినయం, పెద్దల యెడ గౌరవము, ఉపకారం గుణం, స్థిర అభిప్రాయాలు కలిగి ఉంటారు. స్నేహానికి ఎక్కువ విలువనిస్తారు. వీరికి స్నేహితుల అండదండలు ఉంటాయి. 2వ పాదములో పుట్టినవారు పిరికివారుగా ఉంటారు. ముందు జాగ్రత్త చాలా ఎక్కువ. స్వార్థపరులు మరియు లోభులుగా ఉంటారు.

3వ పాదములో జన్మించినవారు దానగుణము, స్థిరబుద్ధి, కళాభిరుచి, ఉన్నతవిద్య, స్నేహితుల ఆకర్షణ ఉండును. 4వ పాదములో పుట్టినవారు దైవచింతన, శాంతస్వభావము, స్వయం నమ్మకం, అభిమానం కలిగి ఉంటారు. దూరదృష్టి ఎక్కువ.

**శతభిషంతో జన్మించిన వధువుకు సరిపడే నక్షత్రాలు :** భరణి, కృత్తిక 1-2, రోహిణి, మృగశిర 2, ఆశ్లేష, మఖ, పుబ్బ, చిత్త 2-3, స్వాతి, విశాఖ 3-4, అనూరాధ, జ్యేష్ట, మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1-2, శ్రవణం, ధనిష్ట 2-3, శతభిషం, పూర్వాభాద్ర 3, ఉత్తరాభాద్ర 1.

**పూర్వాభాద్ర:** ఈ నక్షత్రంలో మొదటి 3 పాదాలు కుంభరాశిలో ఉంటాయి. రాశ్యాధిపతి శని. ఈ నక్షత్రాధిపతి గురుడు 4వ పాదం మీన రాశిలో ఉంటుంది.

రాశ్యాధిపతి గురుడు. నక్షత్రాధిపతి కూడా గురుడే. రెండు నక్షత్రాలు కలిగి ఖడ్గం ఆకారములో నలుపు రంగులో ఉంటుంది. ఈ నక్షత్ర జాతకులకు గురు మహాదశతో జీవితం ఆరంభమగును. ఈ మహాదశ ప్రమాణము 16 సంవత్సరములు. ఈ నక్షత్ర జాతకులకు జాలి ఎక్కువ. త్యాగశీలత, దాన గుణము వుంటుంది. వినయం, జ్ఞానం, స్నేహశీలత ఉంటాయి. మృదుభాషితులుగా ఉంటారు. ఉన్నతాశయాలు కలిగి ఉంటారు. గొప్ప కార్యాలు జీవితంలో చెయ్యవచ్చును. వీరు చాలా పొడవుగా ఉంటారు. మాటలలో స్పష్టత ఎక్కువ. మొదటిపాదంలో పుట్టినవారికి కార్యదక్షత, విచక్షణాజ్ఞానం, ధైర్యసాహసాలు వుంటాయి. ప్రతి విషయములో తొందరపాటు ఎక్కువ. 2వ పాదంలో జన్మించిన వారికి అనుకూల దాంపత్యము, ధన సంపాదన, మానవ సేవ, సుఖసంపదలు వుంటాయి. వైద్యవృత్తితో జీవిస్తారు. 3వ పాదంలో జన్మించినవారు తండ్రికి మిక్కిలి ఇష్టులు అవుతారు. పితృ ప్రేమ బాగా పొందుతారు. మంచి ప్రతిభావంతులుగా ఉంటారు. ఉన్నతవిద్య అభ్యసించి ధన సంపత్తులతో, సుఖ సంతోషాలతో జీవిస్తారు. 4వ పాదములో జన్మించినవారికి మాతృభక్తి ఎక్కువ. భార్య ద్వారా మంచి మన్నన, ప్రేమ పొందుతారు. దాంపత్య జీవితం ఆనందమయంగా గడుపుతారు.

**పూర్వాభాద్ర మొదటి 3 పాదాలలో జన్మించిన వధువుకు సరిపడే నక్షత్రాలు:** అశ్వని, భరణి, కృత్తిక 1-2, రోహిణి, మృగశిర 2-3, పుష్యమి, మఖ, పుబ్బ, ఉత్తర 1, హస్త 1, చిత్త 2-3, స్వాతి, విశాఖ 3-4, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1-2, శ్రవణం, ధనిష్ట 2-3, శతభిషం, పూర్వాభాద్ర 3-4, ఉత్తరాభాద్ర 1, రేవతి.

**పూర్వాభాద్ర 4 పాదంలో జన్మించిన వధువుకు సరిపడే నక్షత్రాలు :** భరణి, కృత్తిక 2, రోహిణి, మృగశిర 3, పుష్యమి, మఖ, పుబ్బ, ఉత్తర 1, హస్త 1-2, చిత్త 3, స్వాతి, విశాఖ 3-4, మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1-2, శ్రవణం, ధనిష్ట 2-3, శతభిషం, పూర్వాభాద్ర 3-4, ఉత్తరాభాద్ర 1, రేవతి.

**ఉత్తరాభాద్ర :** ఈ నక్షత్రంలో అన్ని పాదాలూ మీనరాశిలో ఉంటాయి. రాశ్యాధిపతి గురుడు. నక్షత్రాధిపతి శని. ఈ నక్షత్ర జాతకులకు శని మహర్దశతో జీవితం ప్రారంభమవుతుంది. శని మహాదశ పూర్తి ప్రమాణం 14 సంవత్సరములు. 2 తారలతో కలిసి దండాకారంలో నల్లటి రూపు కలిగి ఉంటుంది. ఈ నక్షత్ర జాతకులు ఏ పాదంలో పుట్టినా సరే, ధైర్యం, నిజాయితీ, నెమ్మది గల మనస్తత్వం కలిగి, సమయాసమయాలను పాటించకుండా ఉంటారు. ఏమంత ఆరోగ్యం ఉండదు. ఉన్నత విద్యను అభ్యసించి, వృద్ధిలోకి వస్తారు. కార్యదీక్ష, జీవితాశయం ఉంటాయి. మొదటిపాదంలో జన్మించినవారు కోపిష్టివారుగా ఉంటారు. చంచల స్వభావం ఎక్కువ. వీరు సన్నగా, నాజూకుగా ఉంటారు.

కోపోద్రేకం వలన మిత్రులను కోల్పోతారు. బంధుమిత్రుల ప్రేమను పొందలేరు. 2, 3వ పాదంలో జన్మించినవారికి మంచి విద్య, విచక్షణా జ్ఞానం, యుక్తి, మంచి శ్రవణ శక్తి ఉంటాయి. వినయం, సచ్ఛీలత కలిగి ఉంటారు. 4వ పాదంలో జన్మించినవారు మంచి స్నేహశీలురు. నాజూకుతనం, మంచి నడవడిక, నెమ్మది కలిగి ఉంటారు. కొంచెం అనారోగ్యంతో బాధపడతారు.

**ఈ నక్షత్రంలో జన్మించిన వధువుకు సరిపడే నక్షత్రాలు :** అశ్వని, కృత్తిక 1-2, రోహిణి, మృగశిర 2-3, ఆరుద్ర, పునర్వసు 3-4, పుష్యమి, ఆశ్లేష, పుబ్బ, హస్త, చిత్త 2, స్వాతి, విశాఖ 4, అనూరాధ, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1-2, శ్రవణం, ధనిష్ట 2, పూర్వాభాద్ర 4, ఉత్తరాభాద్ర 1, రేవతి.

**రేవతి :** ఈ నక్షత్రం 4 పాదాలూ మీనరాశిలో ఉంటాయి. "మీనం మధురం రేవతి మధురాతి మధురం" అని ఒక నానుడి ఉన్నది. ఈ నక్షత్రం 3 తారలతో కలిసి రక్త వర్ణంలో మీనాకారంలో కనిపిస్తుంది. ఈ రాశ్యాధిపతి గురుడు. ఈ నక్షత్రాధిపతి బుధుడు. ఇద్దరూ శుభప్రదాలే. ఈ జాతకుల మీద గురు వాత్సల్య ప్రభావం ఎక్కువ ఉంటుంది. అందువల్ల విద్యలో మంచి రాణింపు ఉంటుంది. ఉన్నత విద్య అభ్యసిస్తారు. నక్షత్రాధిపతి బుధుడైనందువల్ల మంచి గ్రహణశక్తి, లౌకిక జ్ఞానం, శాస్త్రాభిమానం, విద్యయందు ఉత్సాహం ఉంటాయి. ఏ పాదంలో పుట్టినా సరే, మంచి రూపం, తేజస్సు, జనాకర్షణ, అందం కలిగి వుంటారు. ఈ నక్షత్రంలో జన్మించిన మహిళలు దయ, నీతి, దైవచింతన కలిగి ఉంటారు. స్వయంగా ఆలోచించే శక్తి చాలా ఎక్కువగా ఉంటుంది. ప్రతివారికి సహాయసహకారాలు అందించినా, పిరికిగాను, చొరవ లేకుండాను ఉంటారు. మొదటి పాదంలో జన్మించినవారు నీతిమంతులు. శాస్త్రవేత్తలు, తత్త్వజ్ఞాన పండితులు అవుతారు. 2వ పాదంలో జన్మించిన పురుషులు జూదరులు, స్త్రీ వాంఛాపరులు, కుటిలురు, ద్రోహచింతన గలవారుగా ఉంటారు. 3వ పాదంలో జన్మించిన పురుషులు బుద్ధిమాంద్యం, చేతకాని పౌరుషం, కోపం ఎక్కువ. పైగా సోమరులుగా ఉంటారు. 4వ పాదంలో జన్మించినవారు పండితులు, వేదాంత కోవిదులు, నీతిమంతులు, ధైర్యం గలవారు, తత్త్వజ్ఞానం కలవారు, యజ్ఞ యాగాదులు చేస్తారు.

**ఈ నక్షత్రంలో జన్మించిన వధువుకు సరిపడే నక్షత్రాలు :** అశ్వని, భరణి, మృగశిర 2-3, ఆరుద్ర, పునర్వసు 3-4, పుష్యమి, పుబ్బ, ఉత్తర 1-2, హస్త, చిత్త 2, అనూరాధ, జ్యేష్ట, మూల, ఉత్తరాషాఢ 1-2, శ్రవణం, ధనిష్ట, పూర్వాభాద్ర 3-4, ఉత్తరాభాద్ర 1, రేవతి.

# 17. పంచాంగంలోని 18 పాయింట్లు

ప్రతివారు పంచాంగంలో వధూవరుల నక్షత్రాలను బట్టి ఎన్ని పాయింట్లు వచ్చాయో చూసుకుంటూ ఉంటారు. 18 పాయింట్లు గాని అంతకంటే ఎక్కువ వస్తే జాతకంలో ఒక అంశం కుదిరిందని భావిస్తారు. కాని ఆ పాయింట్లు ఎలా ఉత్పన్నమౌతాయో వారికి తెలియదు. అసలు మొత్తం పాయింట్లు 36గా నిర్ణయించారు. కానీ వాటిలో కనీసం 50 శాతం కనుక వస్తే అంటే 36 పాయింట్లలో సగం 18 పాయింట్లు కనుక వస్తే ఫరవాలేదని పండితాభిప్రాయం. ఈ పాయింట్ల వివరణ ఈ క్రింద చూడండి. మీరు తేలికగా అన్ని అంశాలు గుర్తుంచుకోవాలంటే "వవతా యోగ్రగరానా" అని గుర్తుంచుకోండి. అప్పుడు మీకు క్రింద ఇచ్చిన అన్ని అంశాలు గుర్తు ఉంటాయి.

| | |
|---|---|
| వర్ణం | 1 |
| వశ్యం | 2 |
| తారాబలం | 3 |
| యోని | 4 |
| గ్రహమైత్రి | 5 |
| గణాలు | 6 |
| రాశి | 7 |
| నాడి | 8 |
| మొత్తం | 36 |

అన్నీ కలిపితే 36 మార్కులు అని గ్రహించండి. ఇక్కడ ఇచ్చినవి సీరియల్ నెంబర్లు కావు. కాని అవి ప్రతి అంశానికి పండితులిచ్చిన మార్కులు.

పై అంశాలలో ఏ నాలుగైనా తప్పక ఉండాలని అలా కలిసినప్పుడు వాటి మొత్తం 18గాని అంతకంటే ఎక్కువ గాని ఉండాలనేది నియమం. ఒకవేళ మూడు అంశాలు

కలిపి 18 వచ్చినా పనికిరాదు. ఎందుకంటే 4 అంశాలు కలవాలి కాబట్టి చాలా మంది పంచాంగంలో పాయింట్లు చూపి 18 కన్నా ఎక్కువ ఉన్నాయి అనే ఆలోచనలో జాతకాలు కుదిరాయనుకుంటారు. ఈ నిర్ణయం చాలా తప్పు. ఎందుకనగా పైన ఇచ్చిన అంశాలు 8 మాత్రమే ఉన్నాయి. ఈ 8 అంశాలలో అతి ముఖ్యమైనవి వైధవ్య దోషం, ద్వికళత్రాయోగం, సంతాననష్టం, అకాలమృత్యువు, దీర్ఘవ్యాధులు లాంటివి తెలుసుకొనడానికి అవకాశం లేదు. పైగా ఏదైనా దోషమున్నను దాని పరిహారమయినది, లేనిది తెలుసుకొనేందుకు వీలులేదు. ఇది చాలా లోపభూయిష్టం. ఎందుకనగా ఉదాహరణకు 18 పాయింట్లలో 8 పాయింట్లు నాడికి ఇచ్చారు. అనగా వధూవరులది ఇద్దరిది ఏకనాడి అయితే 8 మార్కులు పోతాయి. అంటే మిగిలినవన్నీ కుదిరినను వారికొచ్చే పాయింట్లు 10 మాత్రమే. అందువలన జాతకాలు కుదరలేదని నిర్ణయించరాదు. కాని శాస్త్రప్రకారము ఉత్తర, శతభిషం, పూర్వాభాద్ర, పునర్వసు, ఆరుద్ర, మూల, అశ్వని నక్షత్రములలో దంపతుల నక్షత్రమున్నపుడు ఏకనాడి దోషముండదు. అంటే ఇద్దరికి జాతక పొంతన కుదిరినను మనం సంబంధం కుదరలేదని వదలివేస్తాము. అలాగే ఒక వధువుకు సప్తమ స్థానంలో కుజ, శుక్ర సంయోగం ఉండి ఆ సంయోగం మీద లగ్నం నుంచి పాపవీక్షణ ఉంటే ఆమె దాంపత్య జీవితం భగ్నమవుతుంది. ఈ విషయం 18 పాయింట్లలో కనపడదు. మరియొకటి ఏమనగా పంచమస్థానంలో శని ఉండి పాపవీక్షణ ఉన్నచో ఆ జాతకురాలికి సంతాననష్టం, మృతశిశువు జననం లేక గర్భస్రావాలు జరుగుతాయి. ఇలాంటి ముఖ్య విషయాలు చూడకుండా పాయింట్లు బాగానే ఉన్నాయి అని గ్రహమైత్రి బాగుందని వివాహ నిర్ణయం చేయరాదు. వధూవరులకు 34 పాయింట్లు వచ్చి గ్రహమైత్రి కుదిరిందని, తప్పక చేసుకోమని శాస్త్రవిహీనులిచ్చిన సలహాలను నమ్మి వివాహం చేసిన తల్లిదండ్రులు ఇప్పుడు ఎంతో పశ్చాత్తాపపడుతున్నారు. ఎందుకంటే అట్టి వివాహం చేసిన వారిలో విడాకులు, మరణాలు, సంతానశూన్యత మొదలైన దుష్ఫలితాలు ఏర్పడ్డాయి. కాబట్టి జాతక చక్రాల పొంతన విషయంలో మార్కులు, పర్సంటేజులు ముఖ్యం కాదని, చక్కటి పండితోత్తములను సంప్రదించాలని తెలుసుకోవాలి. పాయింట్లు, పర్సంటేజులు వివాహ పొంతనకు శాస్త్రసమ్మతం కాదు అని గ్రహించండి. 99% కుదిరనా 1% వైధవ్య దోషం ఉన్నా మనం వివాహ పొంతన కుదరలేదనే చెప్పాలి. ఇది మర్చిపోకండి !

# 18. విదేశీయానం

కంప్యూటర్ అనే పదాన్ని ప్రతిరోజూ విద్యార్థులు గాని లేక వారి తల్లిదండ్రులు గాని రోజుకు ఎన్నిసార్లు ఉచ్చరిస్తారో చెప్పగలిగినవారు ఎవరూ లేరు. బహుశ దైవ నామ ఉచ్చారణ కంటే "కంప్యూటర్" నామ జపం ఎక్కువ అయిపోయింది. త్రేతాయుగం, ద్వాపరయుగం, కలియుగం లాగా ఇప్పుడొక కొత్తయుగం ప్రారంభమయింది. అదే కంప్యూటర్ యుగం. ఈ కంప్యూటర్ యుగంలో విచిత్రమేమిటంటే కొందరికి మాతృభాష, మాతృదేశం అంటే చాలా చిన్నచూపు. మరికొందరికి మాతృభాషలో మాట్లాడాలన్నా లేక మనదేశ విశిష్టత చెప్పాలన్నా ఇష్టం ఉండదు. పైగా తెలుగు భాషా ప్రవీణులన్నా లేక మాతృదేశ భక్తుడు అన్నా ఎగతాళి, హేళన ఎక్కువగా వారి మనసుల్లో ఉంటాయి. దీనికి ప్రథమ కారణం తల్లిదండ్రుల పెంపక లోపం. రెండవది "ధనం మూలం ఇదం జగత్" అనే నానుడే నిజమని నమ్మే యువత. దీని ప్రభావం ఎంతవరకు వ్యాపించిందంటే ఎవరింట్లో అయినా ఒక్క పిల్లగాని, పిల్లవాడు గాని కంప్యూటర్ ఇంజనీరు కాకపోయినా లేక అమెరికాలో గానీ, లేక మరేదైనా విదేశం వెళ్ళకపోయినా వారు సమాజంలో చిన్న తరగతి కుటుంబాలుగా లెక్కగట్టి వారి బంధుమిత్రులు వారికి దూరమవుతున్నారు. ఇది కలి ప్రభావమని తెలిసినా మనం దానిని సరిచేయలేము.

ఇదివరలో జ్యోతిష్య శాస్త్రజ్ఞులు ఎవరైనా విదేశ జీవనం గడుపుతూ ఉంటే వారు జాతకరీత్యా ఇలా ఫలితాలు చెప్పేవారు. "ఈ జాతకుడికి మంచి విద్య ఉన్నా, మాతృదేశం వదలి దేశాంతర జీవనం సాగిస్తాడు. తల్లిదండ్రుల ప్రేమ కోల్పోయి, అక్కచెల్లెళ్ల, అన్నదమ్ములకు దూరమై, బంధుమిత్రులను దూరం చేసికొని ఒంటరి జీవితం అనాథగా గడుపుతాడు. పరదేశస్తుల మోచేతి క్రింద నీళ్లు త్రాగుతూ వారి సేవలో ఉంటాడు. పండగలు, వేడుకల వంటి సాంప్రదాయ ఆనందాలకు దూరమై మానసిక వేదన పొందుతాడు". ఇది విని ఆ రోజులలో తల్లిదండ్రులు దుఃఖపడేవారు. ఇప్పుడు జ్యోతిష్య శాస్త్రజ్ఞులు అలా చెప్తే ఎవరైనా నిజం ఒప్పుకోరు. పైగా శాస్త్రజ్ఞుడిని మూర్ఖుడిగా చిత్రించుకుంటారు. అందువల్ల కాల ప్రభావం వల్ల ఫలితాలు ఎలా ఉంటాయో చెప్పే సరళి భాష మారింది గాని ఫలితం మాత్రం అదే అన్న సంగతి ఒక్క శాస్త్రజ్ఞుడికే తెలుసు.

అందువల్ల శాస్త్రజ్ఞుడు విదేశంలో జీవిస్తున్న జాతకుని గురించి ఫలితాలు ఇప్పుడు ఇలా చెప్తాడు. "ఈ జాతకుడికి మంచి విద్య ఉంటుంది. ఖండఖండాంతరాలు దర్శిస్తాడు. విదేశాలలో నివసిస్తూ మంచి ధనం సంపాదిస్తాడు. విద్యావతి, రూపవతి అయిన కన్యను వివాహం చేసుకొని ఆమెకు కూడా విదేశవాస యోగ్యత కల్పిస్తాడు. ఆమెకు అక్కడ ధనసంపాదన ఉంటుంది. అన్ని విధాలా ఆధునిక మరియు విలాసజీవితం గడుపుతూ ఆనందిస్తారు". ఇది విని తల్లిదండ్రులు అత్యంత సంతోషపడుతున్నారు. ఈ రెంటి ఫలితాల యొక్క భాష వేరైనా మొదటి ఫలం నిజం అని మన అందరకీ తెలుసు. అయినా ప్రస్తుత కాలంలో ప్రతివారు విదేశయానం, విదేశ నివాసమే కాక విదేశ పౌరసత్వం కూడా కోరుకొంటూ, అక్కడే స్థిరపడుతూంటే తల్లిదండ్రులు తాత్కాలికంగా సంతోషిస్తున్నారే గాని, దూరాలోచన చేయడం లేదు. ఇప్పుడు ప్రతివారు కోరుకుంటున్నట్లు, వారికి కావలసినట్లుగా ఏ జాతకులకైనా విదేశయానం, విదేశ సంపాదన, విదేశంలో స్థిరత్వం ఉన్నదో లేదో, ఎలా చూడాలో ఈ క్రింద ఇస్తున్నాం. ఈ అధ్యాయంలో విదేశయానం ఉందో లేదో చెప్తున్నా. అక్కడ వారి జీవనస్థితి, ధనధాన్య వాహన భోగాలు గురించి మాత్రం కాదని మరియు ఆ జాతకుడు తిరిగి మాతృదేశానికి వస్తాడా రాడా అనేది కాదని గ్రహించుకోవాలి.

1. ఏ జాతకులకైనా లగ్నంలో శుభగ్రహాలు ఉండి, అలాగే నవమ స్థానంలో మూడు శుభ గ్రహాలు ఉండి, లగ్న నవమ స్థానాల మీద పాప గ్రహ వీక్షణ లేకుండా ఉంటే వారికి విదేశ యాత్ర ఫలితం ఉంటుంది.
2. ఏ జాతకులకైనా నవమ స్థానాధిపతి ద్వాదశ స్థానంలో ఉన్నా, లేక ద్వాదశ స్థానాధిపతి నవమంలో ఉన్నా విదేశయానం ఉంటుంది. ఒకవేళ నవమ స్థానాధిపతి ద్వాదశంలో ఉండి ద్వాదశాధిపతి నవమ స్థానంలో ఉంటే ఆ జాతకుడు విదేశాలలోనే స్థిరపడిపోతాడు.
3. ఏ జాతకులకైనా అష్టమ స్థానంలో ఉన్న గ్రహాలు బలంగా ఉండి అంటే, పాపగ్రహ కలయిక గాని, లేక పాప గ్రహం. వీక్షణ లేకుండా గాని ఉండి ఆ అష్టమ స్థానంలో ఉన్న శుభ గ్రహాలలో ఏ ఒక్క గ్రహానికైనా ఆ అష్టమ స్థానం స్వస్థానమైతే విదేశయానం ఉంటుంది.
4. ఏ జాతకునికైనా సరే లగ్నాధిపతి మేషంలో గాని, కర్కాటకంలో గాని, తులా రాశిలో గాని, మకరంలో గాని ఉండి ఆ రాశి అధిపతులు తమ స్వస్థానంలో

ఉన్నప్పుడు, అంటే ఆ జాతకుడిది మేష లగ్నమై కుజుదు మేషంలోనే ఉంటే, కర్కాటక లగ్నమై చంద్రుడు కర్కాటకంలోనే ఉంటే, తులా లగ్నమై శుక్రుడు తులారాశిలో ఉంటే, మకర లగ్నమై శని మకరంలో ఉంటే వారి మీద శుభ గ్రహ వీక్షణ ఉంటే విదేశ ప్రయాణాలు చేస్తారు.

5. ఏ జాతకులకైనా సరే ద్వితీయ స్థానాధిపతి మరియు ద్వాదశ స్థానాధిపతి మేష, కర్కాటక, తుల, మకర రాశులలోఉన్నా లేక ద్వితీయ మరియు ఏక దశాంశ స్థానంలో కుజ, చంద్ర, శుక్ర, శని గ్రహాలు ఉన్నా విదేశ ప్రయాణం చేస్తారు.
6. ఏ జాతకులకైనా రాశ్యాధిపతి మేష, కర్కాటక, తుల, మకర రాశుల యందుండి నవమ స్థానంలో గాని, ద్వాదశ స్థానంలో గాని కుజ, చంద్ర, శుక్ర, శని గ్రహాలలో ఎవరు ఉన్నా విదేశయానం చేస్తారు.
7. ఏ జాతకులకైనా ద్వితీయ స్థానంలో గురువు లగ్నాధిపతి నవమ స్థానంలో, మరియు ద్వితీయాధిపతి ద్వాదశ స్థానంలోనూ ఉంటే విదేశం వెడతారు.
8. ఏ జాతకులకైనా సరే లగ్నం కనుక వృషభం, సింహం, వృశ్చికం, కుంభంలో ఏదైనా ఒకటి అయివుండి, వారి లగ్నాధిపతి స్వస్థానంలో ఉండి, శుభగ్రహ వీక్షణ ఉన్నా లేక లగ్నాధిపతి శుభగ్రహాలతో కలిసి వున్నా విదేశంలో ఎక్కువ కాలం నివసిస్తారు. బహుశః తిరిగిరాక అక్కడే స్థిరపడిపోతారు.
9. లగ్నంలో రవిచంద్ర సంయోగం ఉన్నా లేక అదే మాదిరి 9-10-12 స్థానాల్లో ఉన్నా విదేశం వెడతారు.
10. లగ్నంలో గాని లేక 9-10-12 స్థానాల్లో శుభగ్రహములు ఉండి అవి బలంగా ఉంటే విదేశాలకు వెడతారు.


పైన చెప్పినవి కొన్నిసూక్ష్మ పారదర్శకమే కాని పూర్తిగా శాస్త్ర మథింపు కాదని మీరు గ్రహించాలి. ఇంకొక ముఖ్య విషయం ఏమంటే విదేశయానం అంటే తప్పకుండా సముద్రాన్ని దాటి వెళ్లాలనేది శాస్త్ర నిర్వచనం. ఆంధ్రదేశం నుంచి బంగ్లాదేశ్ లేక పాకిస్తాన్ వెళ్ళినా అది విదేశయానం కాదని మీరు తెలుసుకోవాలి. అలాగే ఆంధ్రదేశం నుంచి సిలోన్ వెళ్ళినా, లేక మద్రాస్ నుంచి రంగూన్ వెళ్ళినా విదేశ యాత్ర అని మీరు గ్రహించాలి.

నేను ముఖ్యంగా చెప్పదలచుకున్నదేమంటే “ఏ దేశమేగినా ఎందు కాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని” అనేది మాత్రం ఎట్టి పరిస్థితులలోను మరువవద్దు.

# 19. ద్వికళత్ర దోషం


ఇంతవరకు మనం వివాహ నిమిత్తం వధూవరుల పొంతన కుదిరిందా లేదా అని తెలుసుకోవడానికి అనేక అంశాలు నేర్చుకున్నాం. ఇప్పుడు జాతక పరిశీలనలో ముఖ్యమైన అంశం ఏమంటే వరునికి ద్వికళత్ర దోషం ఉందా అనే విషయం కూడా జాగ్రత్తగా పరిశీలించాలి. చాలామంది ఈ విషయం గూర్చి అంతగా ఆలోచించరు. కాని ఇది కూడా తప్పక చూడాల్సివస్తుంది కాబట్టి మీ యొక్క సౌలభ్యం కోసం ఈ క్రింద ద్వికళత్రదోషమున్న వారిని ఎలా జాతకరీత్యా గుర్తించాలో ఉటంకిస్తున్నాం. జాతకరీత్యా అన్ని అంశాలు బాగున్నా ఈ దోషం స్పష్టంగా కనిపిస్తూ ఉంటే వివాహ పొంతన కుదరదనే ఫలితం చెప్పాలి. ఈ విషయంలో ఏ మాత్రం ఏమఱుపాటు ఉండకూడదని నొక్కి వక్కాణిస్తున్నాను.


1. ఏ జాతకుడి చక్రంలోనైనా సరే సప్తమాధిపతి ఏ రాశిలో ఉన్నా సరే కేవలం పాప గ్రహాలతో కలిసి ఉండటం, మరియు సప్తమాధిపతి మీద పాపగ్రహ వీక్షణ కనుక బలంగా ఉంటే ఆ జాతకుడికి రెండవ వివాహం జరుగుతుంది.




ఈ చక్రంలో లగ్నస్థానం నుంచి సప్తమ స్థానం కన్య అయింది. కన్యారాశికి అధిపతి బుధుడు. ఆ బుధుడి మీద మిధునరాశి నుంచి సప్తమ కుజవీక్షణ మరియు తులారాశి నుంచి తృతీయ శని వీక్షణ వల్ల దోషం అని గ్రహించాలి.


2. లగ్నస్థానం నుంచి షష్టమాధిపతి సప్తమంలో ఉండి పాపగ్రహాలతో కలిసి ఉన్నా, మరియు పాపగ్రహ వీక్షణ ఉన్నా రెండవ వివాహం ఆ జాతకుడికి ఉంటుంది. ఈ చక్రంలో లగ్నస్థానం నుంచి షష్టమ స్థానం సింహరాశి అయింది. సింహరాశికి అధిపతి రవి. ఆ రవి శనితో కలిసి ఉన్నాడు. పైగా రవి శనుల మీద కుజుని యొక్క అష్టమ వీక్షణ వల్ల దోషం అని గ్రహించండి.





3. వరుని జాతకంలో సప్తమ స్థానంలో బుధ, శని సంయోగం కాని లేక కుజ శుక్ర సంయోగం గాని ఉంటే ఆ వరుని ద్వితీయ కళ్యాణం ఉంటుంది.




ఈ చక్రంలో లగ్న స్థానం నుంచి సప్తమ స్థానం కన్యారాశి అయింది. కన్యారాశిలో ఉన్న రెండు గ్రహాలు, పాప గ్రహాలే అలాగే లగ్నం నుంచి సప్తమ స్థానంలో కుజ శుక్ర సంయోగం ఉన్నా దోషమనే గ్రహించండి.


4. లగ్నాధిపతి, సప్తమాధిపతి మరియు శుక్రుడు కలిసి ద్విస్వభావ రాశులలో ఉంటే ఆ జాతకుడికి రెండవ వివాహ జరుగుతుంది. ద్విస్వభావ రాశులు అంటే మీనరాశి, మిధునరాశి, కన్యారాశి, ధనూరాశి అని మీరు గ్రహించాలి. ఈ నాలుగు రాశులలో పైన చెప్పిన గ్రహస్థితి ఏ జాతకుని చక్రంలో ఉంటుందో ఆ జాతకునికి రెండవ భార్య ఉంటుందని మనం తెలుసుకోవాలి.





ఈ చక్రంలో లగ్నస్థానం నుంచి సప్తమరాశి అయిన కన్యారాశి ద్విస్వభావ రాశి అయింది. ఆ రాశిలో గురు, బుధ, శుక్ర సమ్మేళనం పాపభూయిష్టం కనుక దోషమని గ్రహించండి.


5. అష్టమాధిపతి లగ్నంలో ఉండి, సప్తమాధిపతి షష్టమంలో ఉన్నా లేక పాపగ్రహ సంయోగం గాని, లేక వారి వీక్షణ అష్టమ షష్టమాధిపతుల మీద ఉంటే ద్వికళత్ర దోషం ఉన్నట్లేనని భావించాలి.





ఈ చక్రంలో లగ్న స్థానం నుంచి అష్టమ స్థానం తులారాశి అయింది. ఆ తులారాశి అధిపతి శుక్రుడు. ఈ శుక్రుడు లగ్నస్థానంలో ఉన్నాడు. షష్టమ స్థానం సింహ రాశి అయింది. ఈ సింహరాశిలో సప్తమాధిపతియైన బుధుడు పాపగ్రహమైన కుజుడుతో కలిసివున్నాడు. పైగా శని తృతీయ వీక్షణ వల్ల దోషం అని గ్రహించండి.


6. ఏ వరుని జాతకంలోనైనా ద్వితీయాధిపతి షష్టమస్థానంలో ఉండి పాపగ్రహ కలయిక లేక వీక్షణ ఉన్నా ఆ వరునికి ద్వితీయ కళత్ర దోషం ఉంటుంది.





ఈ చక్రంలో లగ్నస్థానం నుంచి ద్వితీయ స్థానం మేషరాశి అయింది. మేషరాశికి అధిపతి కుజుడు. ఈ కుజుడు షష్టమ స్థానంలో ఉన్నాడు. కుజుడు పాపియే కాక పాపగ్రహంతో కలిసి ఉన్నాడు. పైగా పాపగ్రహ వీక్షణ శని తృతీయదృష్టి వల్ల ఉంది. అందువల్ల దోషం అని గ్రహించండి.


7. మూడు పాపగ్రహాల సంయోగం ఎవరి జాతకంలోనైనా సప్తమ స్థానంలో ఉంటే రెండవ వివాహం ఉంటుంది.





ఈ చక్రంలో లగ్నంనుంచి సప్తమ స్థానం కన్యారాశి అయింది. ఈ రాశిలో కుజ, శని, రవి కలయిక పాపగ్రహ సంయోగం కళత్రస్థానం అయిన సప్తమంలో ఉంది కాబట్టి దోషం అని గ్రహించండి.

8. ద్వితీయాధిపతి దుర్బలుడైనా, అస్తంగతుడైనా (అస్తంగతుడు అంటే సూర్యుని కలయిక అని అర్థం) లేక ద్వితీయంలో అన్నీ పాపగ్రహాలే ఉన్నా లేక ద్వితీయ స్థానం మీద పాపగ్రహ వీక్షణ ఉన్నా ద్వితీయ కళ్యాణం ఆ జాతకుడికి ఉండవచ్చు.









ఎ) ఈ చక్రంలో లగ్నస్థానం నుంచి ద్వితీయ స్థానం మేషరాశి అయింది. ఈ మేషరాశి అధిపతి కుజుడు. ఈ కుజుడు తులారాశిలో ఉండటం వల్ల దుర్బలుడైనాడు. అందువల్ల దోషం అని గ్రహించండి.

బి) ద్వితీయాధిపతి కుజుడు రవితో కలిసి వున్నాడు. అందువల్ల అస్తంగతుడయ్యాడు. అందువల్ల దోషం అని గ్రహించండి.

సి) ద్వితీయ స్థానంలో పాపగ్రహాల కలయిక వల్ల దోషం అని గ్రహించండి. ఎందుకంటే ద్వితీయ స్థానం కుటుంబ స్థానం. ఆ కుటుంబ స్థానంలో పాపగ్రహ కూటమి వల్ల దోషం అని గ్రహించండి. అలాగే ద్వితీయస్థానం మీద కుజరాహువుల పాపవీక్షణ వల్ల కూడా దోషం అని గ్రహించండి.


9. సప్తమాధిపతి శని గ్రహం అయి, ఆ శని కుజుడితో కలిసి ఉన్నా ద్వికళత్ర దోషం ఉన్నట్లే.





ఈ చక్రంలో లగ్నస్థానం నుంచి సప్తమ స్థానం కుంభరాశి అయింది. ఈ రాశిలో సప్తమాధిపతి అయిన శని కుజుడుతో కలిసి ఉన్నాడు కాబట్టి దోషం అని గ్రహించండి.


10. ఏ వరుని జాతకంలోనైనా శని ఉన్న స్థానంనుంచి దశమస్థానం కనుక లగ్నస్థానం నుంచి సప్తమ స్థానమయితే ద్వికళత్ర దోషం ఉంటుందని భావించాలి.




ఈ చక్రం జాగ్రత్తగా పరిశీలించి అర్థం చేసుకోండి. ఈ చక్రంలో శని ఉన్న స్థానం నుంచి దశమ స్థానం మీనరాశి అయింది. ఆ మీనరాశి లగ్నస్థానం నుంచి అంటే కన్యారాశి నుంచి సప్తమం అయింది. ఇలా ఉంటే దోషం అని గ్రహించండి.


11. కుజుడు ఉన్న స్థానం నుంచి చతుర్థస్థానం కనుక లగ్న స్థానమయి ఆ కుజుని మీద పాపగ్రహ వీక్షణ ఉంటే కూడా రెండవ భార్య అతనికి వస్తుంది.





ఈ చక్రంలో కుజస్థానం నుంచి చతురస్థానం కన్యారాశి అయి అది లగ్నస్థానం అయింది. కుజుని మీద శని వీక్షణ, లగ్నం మీద రాహువు వీక్షణ వల్ల దోషం వుందని గ్రహించండి.


12. సప్తమ స్థానంలో శని చంద్రుల యోగం ఉండి, ఆ సప్తమం మీద పాప గ్రహ వీక్షణ ఉంటే, రెండవ భార్య అతని జీవితంలోకి ప్రవేశిస్తుంది.





ఈ చక్రంలో లగ్నం నుంచి సప్తమస్థానంలో శని చంద్రుల సంయోగం వుంది. పైగా సప్తమ శని చంద్రుల మీద కుజుని యొక్క చతుర్థ వీక్షణ వల్ల దోషం అని గ్రహించండి.

13. ద్వితీయాధిపతి బుధుడు అయివుండి, షష్టమ స్థానంలో చంద్రకేతువులుంటే కూడా ద్వికళ్యాణం అవుతుంది.




ఈ చక్రంలో లగ్నస్థానం నుంచి ద్వితీయం మిధునరాశి అయింది. ద్వితీయాధిపతి బుధుడుగా ఉండి షష్టమ స్థానంలో చంద్రకేతువుల కలయిక ఉంది. పైగా తృతీయ శని వీక్షణ మరియు సప్తమ కుజవీక్షణ వల్ల దోషం అని గ్రహించండి.

14. ద్వితీయ స్థానంలో రాహువు వుండి, సప్తమంలో కుజుడు ఉండి శుక్రుడు మీద పాప వీక్షణ ఉన్నా, పాప గ్రహంతో కలిసి ఉన్నా ద్వికళత్రా యోగం ఉంటుంది.

15. సప్తమ స్థానంలో గురుచంద్రులు కలిసి ఉంటే వారిమీద కుజుని గాని లేక శని వీక్షణ ఉన్నా రెండవ భార్య దోషం ఉంటుంది. ద్వితీయ శని సప్తమ రాహువువల్ల ద్వికళత్ర దోషం వస్తుంది.

16. కన్యా లగ్న జాతకులకు మీన రాశిలో కుజుడు ఉంటే వారికి ద్వితీయ వివాహం జరుగుతుంది.

17. లగ్నాధిపతి తృతీయ, షష్టమ స్థానాలలో ఉంటే ఆ జాతకునికి ద్వికళత్ర దోషం ఉన్నట్లే.


18. లగ్న, ద్వితీయ, సప్తమ, అష్టమ స్థానాల్లో ఏ స్థానంలో అయినా కుజ శుక్ర చంద్రులు కలసి ఉండే ద్వికళత్ర దోషం అని గ్రహించాలి.


పైన ఇచ్చినవే కాక ఇంకా చాలా విధాలుగా రెండవ వివాహం గుర్తించవచ్చు. స్థలాభావం వల్ల అతి ముఖ్యమైనవి. ఈ పైన ఇవ్వబడ్డాయని తెలుసుకోండి. ఈ పైన చెప్పిన గ్రహ కూటమి వధూవరుల ఎవరి జాతకంలో ఉన్నా అది దోషమేనని గ్రహించాలి. దీనికి ప్రత్యేక పూజలు లేక పరిహార జపమంత్రాలు ఏమీ లేవు అని కూడా మీరు గ్రహించాలి. ఇంకొక విషయం గమనించవలసినదేమంటే కొంతమంది జాతకులకు రెండవ వివాహం లేకున్నా అక్రమ సంబంధాలు, వ్యభిచార గుణాలు ఉండవచ్చని తెలుసుకోవాలి.

# 20. వైధవ్య ప్రారబ్ధం

దాంపత్య జీవితంలో ఏ స్త్రీ కైనా మరువలేని అతి దుఃఖం కలిగించేది భర్త యొక్క మరణం. భర్త మరణంతో ఆమె జీవితం చుక్కాని లేని నావ తుఫానులో ఎలా పయనిస్తుందో ఆమె జీవన పయనం కూడా అంతేననే భావన కలుగుతుంది. మాంగల్యశుద్ధి లేని కన్యను ఎవరూ వివాహానికి ఇష్టపడరు. అందువల్ల జాతక పరిశీలనలో ఈ విషయానికి అత్యంత ప్రాముఖ్యతనిచ్చి జాగ్రత్తగా పరిశీలించాలి. ఈ పరిశీలనలో ఏ విధమైన అలసత్వం గాని, ఏమరుపాటుగాని పనికిరాదు. సర్వసాధారణంగా ఒక వధువు, ఫలానా వరుని చేసుకోవాలా వద్దా అని నిర్ణయించేది తల్లిదండ్రుల కాదు. అలా నిర్ణయించేది జ్యోతిష్య శాస్త్రవేత్త మాత్రమే. అంటే జ్యోతిష్యుడు వీరిద్దరికీ వివాహం చేయండి అంటే వివాహం చేస్తున్నారు, వద్దు అంటే మానివేస్తున్నారు. వధూవరుల తల్లిదండ్రులు అంత పెద్ద బాధ్యత మనమీద నమ్మకంతో ఉంచినపుడు రాగద్వేషాలు, ధనకాంక్ష లేకుండా సత్యవాక్యమే శాస్త్రరీత్యా పలకాలి గాని మన ఊహకు అందినట్లుగా, లేక శాస్త్రవిరుద్ధంగా చెప్పకూడదు. అలాచేస్తే మరొకరి పూర్ణజీవితాన్ని బుగ్గిపాలు చేసినట్లు అవుతుంది. కాబట్టి పూర్తి శాస్త్రప్రావీణ్యం లేకుండా మిడిమిడి జ్ఞానంతో, ధనాభావంతో ఫలితాలు చెప్పే కుహనా జ్యోతిష్యులకు పాపం చేయవద్దని, పరుల జీవితాలతో ఆటలాడటం పవిత్రమైన జ్యోతిష్య శాస్త్రానికే మచ్చ తెస్తుందని మర్చిపోవద్దని మరీ మరీ మనవిచేసుకుంటున్నాం.


ఏ స్త్రీకైనా వైధవ్యం రావడానికి కారణాలు ఏమైనా, అవి జాతకచక్రంలో ఎలా గుర్తించాలో ఇప్పుడు నేర్చుకుందాం.




1) ఏ కన్యకైనాసరే లగ్న స్థానం నుంచి లెక్కపెట్టినప్పుడు సప్తమ స్థానాధిపతి మరియు అష్టమ స్థానాధిపతి కలిసి కేంద్ర స్థానాలలో ఉండి పాపగ్రహ వీక్షణ ఉంటే కన్యకు ప్రారబ్ధ కర్మ వల్ల వైధవ్యం సంప్రాప్తమౌతుంది. ఒకటవ చక్రంలో కన్యది మీన లగ్నం. ఈ లగ్నం స్థానం నుంచి సప్తమ స్థానం కన్యారాశి అయింది. ఈ రాశికి అధిపతి బుధుడు. ఇప్పుడు లగ్నస్థానం నుంచి అష్టమ స్థానం వరకు లెక్కపెడితే అది తులారాశి అయింది. తులారాశి అధిపతి శుక్రుడు. సప్తమస్థానాధిపతి అయిన బుధుడు, అష్టమస్థానాధిపతి అయిన శుక్రుల సంయోగం మిధునంలో ఉంది. ఆ మిధునరాశి మీద ధనూరాశి నుంచి సప్తమ అంటే చతుర్థంలో శని పాపవీక్షణ ఉండటం వల్లను మరియు వృశ్చికరాశి నుంచి అష్టమ కుజ వీక్షణ అయినందువల్లను బలమైన పాపగ్రహ వీక్షణ బుధ శుక్రుల మీద ఉందని గ్రహించాలి. అందువల్ల వైధవ్యం వస్తుంది.


2) ఏ కన్యకైనా సరే లగ్నస్థానం నుంచి సప్తమ స్థానాధిపతి శనితో కలిసి పాపగ్రహమైన కుజుడి యొక్క వీక్షణ ఉండటం వల్ల కూడా వైధవ్యదోషం ఉంటుంది. ఈ ప్రక్కన ఇచ్చిన 2వ చక్రం చూడండి.





ఈ చక్రంలో సప్తమాధిపతియైన బుధుడు శనితో కలిసి ధనూరాశిలో ఉన్నాడు. మిధునరాశి నుంచి కుజుని యొక్క సప్తమ వీక్షణ ఉండటం వల్ల సప్తమాధిపతియైన బుధుడు పాపగ్రహంతో సంధించడం వల్ల వైధవ్యం వస్తుందని గ్రహించాలి.


3) ఏ కన్యకైనా సరే లగ్నస్థానం నుంచి అష్టమ స్థానంలో కుజరాహువుల కలిసివుంటే ఆ కలయిక వివాహరీత్యా దోషభూయిష్టమని, అదేకాకుండా ఆ అష్టమ స్థానంలో ఉన్న కుజరాహువుల మీద కనుక పాపగ్రహ వీక్షణ ఉంటే వైధవ్యం తప్పక వస్తుందని గ్రహించాలి.





ఈ ప్రక్కన ఇచ్చిన 3వ చక్రం చూడండి. అష్టమ స్థానం అయిన తులారాశిలో కుజరాహువు సంయోగమే కాక, ఈ కుజరాహువుల మీద పాపగ్రహములైన రవి యొక్క సప్తమ వీక్షణ మరియు శని యొక్క తృతీయ వీక్షణ వల్ల వైధవ్యం వస్తుంది.

4) ఏ కన్య జాతకంలోనైనా సరే అష్టమాధిపతి మరియు కుజుడు వీరిద్దరు సప్తమాధిపతితో కలిసి ఉన్నా, పాపగ్రహ వీక్షణ ఉన్నా లేకున్నా వైధవ్య దోషం ఉన్నట్లేనని భావించాలి. ఒకవేళ పాపగ్రహ వీక్షణ బలంగా ఉండి, ఒక పాపగ్రహం ఉన్నా వైధవ్యం ఎట్టి పరిస్థితులలోను తప్పదు. అది కూడా వివాహం జరిగిన కొద్దికాలంలో రావచ్చు. ఇంకొక విషయమేమిటంటే భర్త ప్రమాదమునకు లోనై హఠాన్మరణము కూడా పొందవచ్చు. ఈ క్రింద ఇచ్చిన 4వ చక్రం చూడండి.








ఈ చక్రంలో లగ్నస్థానం నుంచి సప్తమ స్థానం కన్య అయింది. అలాగే అష్టమస్థానం తుల అయింది. సప్తమాధిపతియైన బుధుడు, అష్టమాధిపతియైన శుక్రుడు వీరిద్దరూ కుజునితో కలిసి ద్వితీయంలో ఉన్నందువల్ల దోషం ఉధృతం అని గ్రహించాలి.

5) ఏ కన్యకైనాసరే లగ్నస్థానం నుంచి అష్టమస్థానంలో చంద్రరాహువులు సంయోగం ఉండి, పాపవీక్షణ ఉన్నా లేకున్నా వైధవ్య ప్రారబ్ధం ఆ కన్యకు ఉంటుందని అర్థం చేసుకోవాలి.


ఈ 5వ చక్రం చూడండి.





ఈ చక్రంలో అష్టమస్థానంలో చంద్రుడు మరియు రాహువు కలిసి ఉన్నారు. ఇది విధి వైపరీత్యాన్ని ఉధృతం చేసి కన్య యొక్క మాంగల్యాన్ని హరించి వేస్తారు. అందువల్ల ప్రారబ్ధ వైధవ్యం తప్పక కలుగుతుంది.

6) ఏ కన్యకైనా సరే లగ్నం నుంచి అష్టమస్థానంలో శని, కుజ, రాహువు కలయిక వల్ల అంటే వీరే కాక ఏ విధంగానైనా మూడు పాపగ్రహాలు ఉంటే దోషమని భావించాలి. ఈ 6వ చక్రం చూడండి.








ఈ చక్రంలో లగ్నస్థానం నుంచి అష్టమమైన తులారాశిలో మూడు పాపగ్రహాల కలయిక వల్ల దోషం అని గ్రహించాలి. పైగా మేషం నుంచి పాపగ్రహమైన రవి వీక్షణ వల్ల దోషం ఉధృతమని తెలుసుకోవాలి.

7) ఏ కన్యకైనా లగ్నస్థానం నుంచి నవమాధిపతి, గురువు వీరిద్దరు రవితో కలిసి ఉండటం లేక లగ్నస్థానం నుంచి షష్టమ, అష్టమ, ద్వాదశ స్థానాల్లో ఉండటం జరిగితే నవమ స్థానమందున్న పాపగ్రహ దశలో వైధవ్యం కలుగుతుంది. ఈ ప్రక్కన ఇచ్చిన 7వ చక్రం చూడండి.

ఈ చక్రంలో లగ్నస్థానం నుంచి నవమాధిపతియైన కుజుడు మరియు గురువు వీరిద్దరు కలిసి రవితో ఉండటం వల్ల గురువు అస్తంగతుడైనాడు. కుజ రవి రెండు పాప









గ్రహాలు ఏకమై దుష్ఫలితాలు ఇస్తారు. ఇప్పుడు 8వ చక్రం చూడండి. ఈ చక్రంలో లగ్నస్థానం నుంచి షష్టమ స్థానంలో గాని, అష్టమస్థానంలో గాని ద్వాదశ స్థానంలో గాని ఉంటే నవమ స్థానంలో ఉన్న పాపగ్రహమైన శని దశలో వైధవ్యం తప్పక కలుగుతుంది.


8) ఏ స్త్రీ జాతకంలోనైనా లగ్నస్థానంలో కుజుడు ఉండి ద్వితీయ, సప్తమ స్థానాలలో శని గాని లేక కేతువు గాని లేక ఈ ఇద్దరూ కలిసిఉన్నా గాని చిన్నతనంలోనే ఆ స్త్రీకి వైధవ్యం సంప్రాప్తిస్తుంది.


9) ఏ స్త్రీ జాతకంలో అష్టమ స్థానంలో శని ఉండి ద్వితీయ, సప్తమ స్థానాలలో కుజుడు ఉంటే ఆ స్త్రీకి వైధవ్యం కలుగుతుంది.




ఏ జాతకంలోనైనా సరే, స్త్రీకి శుక్రుడు పాపగ్రహాల మధ్య బంధించపడి ఉండి, వారి లగ్నం నుంచి లెక్క పెట్టినపుడు సప్తమ, అష్టమ, ద్వాదశ స్థానాల్లో పాపగ్రహాలు ఉంటే వారు తమ జీవిత భాగస్వామిని కోల్పోతారు ఈ క్రింది చక్రం చూడండి.




పై చక్రంలో మీరు పరిశీలిస్తే లగ్నం మీన లగ్నమయినది. ద్వితీయ స్థానంలో శని ఉండగా చతుర్థస్థానంలో రవి ఉన్నాడు. శని రవులు ఇద్దరూ పాపగ్రహాలు ఈ ఇద్దరి మధ్య శుక్రుడు బంధించబడి ఉన్నాడు. శుక్రుడు తన స్వస్థానంలో ఉన్నాడు కాబట్టి దోషం కాదనే వాదన సరికాదు. ఎవరైనా తన స్వగృహంలోనే బంధించబడి ఉంటే అది బంధనమే అటువంటి బంధన దోషమే అవుతుంది. స్వాతంత్ర్యంలేని కారాగార శిక్షే అనుకోవాలి. ఆ బంధనావస్థలో శుక్రుడు ఏమి చేయలేని నిస్సహాయస్థితిలో ఉంటాడు


కాబట్టి శుక్రుడు యోగించడు. పైగా, సప్తమ, అష్టమ, ద్వాదశ స్థానాలలో సప్తమ స్థానం భాగస్వామి అష్టమస్థానం ఆయుస్థానం. కాబట్టి ఆ రెండు స్థానాలలో పాపగ్రహమే ఉండటంవల్ల దోష ఫలితము తీవ్రమని భావించాలి. ఎందుకంటే ఎవరి జాతకంలోనైనా సప్తమాష్టమి స్థానాలు పాప భూయిష్టమై దానికి తోడు వివాహయోగ కారకుడైన శుక్రుడు కూడా భంగపడినపుడు, మనం గ్రహించవలసినది ఏమంటే వివాహకారకుడు భంగమైనాడు. వివాహస్థానం కూడా పాపగ్రహ పంకిలమై ఉంది. పైగా ఆయుఃస్థానం కూడా వక్ర గురువు వల్ల నష్టపోయింది. అందువల్ల భాగస్వామిని కోల్పోతారు అని మనం అర్థం చేసుకోవాలి.


ఈ అధ్యాయంలో ముఖ్యంగా తెలుసుకోవలసినది ఏమంటే కొన్ని సమయాలలో గ్రహాల యొక్క తాత్కాలిక, నైసర్గిక మిత్ర శతృత్వాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. అదీకాకుండా మిగిలిన స్థానాలలో ఉన్న రాశి బలాబలాలు కూడా సరిచూడాలి. వధూవరుల జాతకపొంతన చూసేటప్పుడు వైధవ్యదోషం ఉన్న కన్యని, అశ్వని, కృత్తిక, ఆశ్లేష, పుబ్బ, ఉత్తర, మఖ, మూల మరియు శతభిషం నక్షత్రాలు వరునికి ఉంటే చాలా మంచిది. ఎందుకంటే ఈ నక్షత్రాలలో జన్మించినవారికి పరిపూర్ణమైన ఆయుర్దాయం ఉంటుందని శాస్త్ర ఉవాచ. వారి వివాహసమయంలో ఏ గ్రహాల వల్ల, ఏ లగ్నం వారికి మారకత్వము ఎప్పుడు కలుగుతుందో తెలుసుకోవాలంటే నేను వ్రాసిన "జాతక మోక్షప్రదాయిని" చూడండి. వధూవరులు ఇద్దరిచేత వారి వారి నక్షత్రాలకు వివాహసమయంలో శాంతి చేయించాలి. ఇది అతి ముఖ్యమైన విషయం కాబట్టి ఈ అంశాన్ని మరచిపోకూడదని మరొకసారి పాఠకులను హెచ్చరిస్తున్నాం. అలా పూజ చేయడం వల్ల పరిపూర్తిగా దోషం పోకపోయినా ఉధృతం తగ్గి దీర్ఘకాలవ్యాధి లాంటివి కలగవచ్చు. అందువల్ల మాంగల్యశోభ భగ్నం కాదని పాఠకులు గ్రహించాలి. ఇంకొక విషయం ఏమంటే ఈ పైన ఉటంకించిన దోషాలు వధువుకు ఉంటే భర్తకు భార్యావియోగం ఆమె మరణం వల్ల కలుగుతుందనీ, వరునికి ఉంటే ఆమెకు వైధవ్యం భర్త అల్పాయిషువు అయినందువల్ల అని అర్థం చేసుకొని ఫలితం చెప్పాలి.

# 21. దాంపత్య మారకత్వం


దాంపత్యము అంటే భార్యాభర్తలు కలిసి జీవించడం అని అందరికీ తెలుసు. అలా కలిసి ఆనందంగా జీవిస్తుంటే దాన్ని సుఖసంసారం అని కూడా అంటారు. కాని అలాంటి సుఖంగా పయనిస్తున్న వారి జీవనవాహినిలో హఠాత్తుగా భార్యాభర్తలలో ఒకరు మరణిస్తే, మృదువుగా పయనిస్తున్న పడవ సుడిగుండంలో పడి మునిగిపోతే ఏమౌతుందో అలాగే వారి దాంపత్య జీవితం కూడా ఛిన్నాభిన్నమైపోతుంది. ఇది చాలా బాధాకరమైన విషయం. ఎవ్వరూ ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి బ్రతికివున్న వారికి కలుగుతుంది. కష్టమో, సుఖమో కలిసివుంటే ఆ ఆనందం వేరు, ఆ ధైర్యం వేరు. చుక్కాని లేని నావలాగా జీవితం కాకూడదు. అందుకనే అకాల మృత్యువు అంటే ఎటూ కాని వయసులో భార్యగాని లేక భర్త గాని మరణం మరీ దుఃఖదాయకం. నడివయసులో జీవిత భాగస్వామి మరణిస్తే మిగిలినవారు పిల్లలను పెంచలేరు. పునర్వివాహం చేసుకోలేరు. అటువంటి పరిస్థితి కలుగకుండా ఉండాలంటే జ్యోతిష్యశాస్త్ర రీత్యా వధూవరుల జాతకాలను ఎలా పరిశీలించాలో మనం ఇప్పుడు నేర్చుకుందాము.


1. ఎవరి జాతకంలోనైనా సరే సప్తమాధిపతి మరియు సప్తమరాశి ఈ రెండూ పాపగ్రహాల మధ్య చిక్కుకుని ఉండకూడదు. అలా ఉంటే వారిజీవితంలో భాగస్వామిని నడివయసులో కోల్పోతారు. కాని సప్తమరాశిలో ఏదైనా పుణ్యగ్రహం ఉన్నా, లేక అత్యంత








సప్తమాధిపతి పుణ్యగ్రహంతో కలిసి వున్నా, లేక సప్తమ రాశి మీదగాని సప్తమాధిపతి మీద గాని శుభవీక్షణ ఉంటే దుష్ఫలితం ఉండదని భావించాలి. ఈ క్రింది చక్రాలు చూడండి.









ఒకటవ చక్రంలో లగ్నస్థానం నుంచి సప్తమ స్థానం కన్యారాశి అయింది. ఆ కన్యారాశిలో చంద్రుడు ఉన్నా, షష్టమ అష్టమ రాశులలో పాపగ్రహాలు ఉండటం వల్ల సప్తమ రాశిలోని చంద్రుడు రెండు పాపగ్రహాల మధ్య ఉండటం వల్ల దోషభూయిష్టమయింది. అలాగే సప్తమాధిపతి కూడా  రెండు పాపగ్రహాల మధ్య బంధించబడి ఉండకూడదు. అంటే 1బి చక్రంలో సప్తమ స్థానంలో చంద్రుని బదులు సప్తమాధిపతి అయిన బుధుడు ఉన్నాడు. బుధుడు తన స్వస్థానంలో ఉన్నా దుష్ఫలితమే కలుగుతుంది. ఇంకొక విషయం ఏమంటే శుక్రుడు కూడా రెండు పాపగ్రహాల మధ్య బంధించబడి ఉండకూడదు. 1సి చక్రం చూడండి. పైన చెప్పిన వాటికి తోడు ఆ సప్తమం మీద పాపగ్రహ వీక్షణ ఉంటే దోషం

ఉద్ధృతం అని మనం అర్థం చేసుకోవాలి. 3వ చక్రంలో రవి వీక్షణ లగ్నస్థానం నుంచి సప్తమస్థానం మీద ఉంది.

2. శని లగ్నస్థానంలో గాని, చతుర్థ, సప్తమ, అష్టమ మరియు ద్వాదశ స్థానాలలో శుభగ్రహ వీక్షణం లేక సంయోగం లేకుండా ఉండడం మంచిది కాదు.


3. రాహువు సప్తమస్థానంలో ఉండి సప్తమాధిపతి రవితో కలిసి వుండి వారిమీద శని వీక్షణ ఉంటే మృత్యుప్రదమని గ్రహించాలి. ఈ క్రింది చక్రం చూడండి.





ఈ చక్రంలో లగ్నస్థానమైన మీన రాశి నుంచి సప్తమ స్థానమైన కన్యారాశిలో పాపగ్రహమైన రాహువు ఉన్నాడు. సప్తమస్థానాధిపతి అయిన బుధుడు రవితో కలిసి లగ్న చతుర్థంలో ఉన్నాడు. బుధుడు స్వక్షేత్రంలో ఉన్నా అతని మీద ధనూరాశి నుంచి శని యొక్క సప్తమ వీక్షణ వల్ల దోషం కలిగింది. ఈ గ్రహస్థితి మంచిది కాదు.


4. సప్తమాధిపతి మరియు అష్టమాధిపతి కలిసి అష్టమస్థానంలో ఉండి వారిమీద పాపగ్రహ వీక్షణ ఉంటే దోషమని మనం తెలుసుకోవాలి. ఈ క్రింది చక్రం చూడండి.




ఈ చక్రంలో సప్తమాధిపతి అయిన బుధుడు, అష్టమాధిపతి అయిన శుక్రుడు వీరిద్దరూ కలిసి అష్టమస్థానంలో ఉన్నారు. వారి మీద శని యొక్క తృతీయ వీక్షణ సింహరాశి శత్రుస్థానం నుంచి ఉందని గమనించండి. ఇది చాలా దోషం.


5. సప్తమ స్థానాధిపతి పాపగ్రహమై ఉండి కుజ శనులతో సంయోగంతో అష్టమ స్థానంలో ఉండకూడదు. పాపగ్రహ వీక్షణ ఉన్నా లేకున్నా దుష్ఫలితం తప్పదు. ఈ క్రింది చక్రం చూడండి.





ఈ చక్రంలో లగ్నస్థానం నుంచి సప్తమ స్థానాధిపతి రవి. రవి పాపగ్రహం. ఈ పాప గ్రహం మిగిలిన పాప గ్రహాలైన శని, కుజులతో కలిసి అష్టమ స్థానంలో ఉన్నారు. మూడు పాపగ్రహాలు అష్టమ స్థానంలో బలంగా ఉండటం వల్ల అకాలమృత్యువు వల్ల ఈ జాతకుడు మరణిస్తాడు.


6. లగ్నస్థానం కన్యారాశి అయి ఆ స్థానంలో రవి ఉండి సప్తమస్థానమైన మీనరాశిలో శని ఉండకూడదు. అదేకాక శని ఇతర పాపగ్రహంతో కలిసి ఉన్నా లేక రాహువు వీక్షణ ఉన్నా దోషం ఉధృతం అని మనం అర్థం చేసుకోవాలి. ఈ క్రింది చక్రం చూడండి.




ఈ చక్రంలో లగ్నంలో రవి ఉన్నాడు. లగ్న సప్తమంలో శని ఉన్నాడు. నవమ రాహు వీక్షణ మరియు లగ్నం మీద నవమ కేతు వీక్షణ ఉందని మీరు గమనించండి. ఇలాంటి గ్రహస్థితి చాలా దోషం.


7. శుక్రుడు ఏ జాతకంలోనైనా సరే ఏ స్థానంలోనైనా సరే ఇద్దరు పాపగ్రహాలతో కలిసి ఉండి, పాపగ్రహ వీక్షణ ఉంటే శుక్రహీనత్వం వల్ల దాంపత్య విచ్ఛిన్నం బహుశా మరణం వల్లే అవచ్చు. ఈ క్రింది చక్రం చూడండి.





ఈ చక్రంలో శుక్రుడు మిత్రస్థానంలో ఉన్నా రవి శని గ్రహాల సంయోగం వల్లను, పైగా కుజుని యొక్క సప్తమ వీక్షణ వల్లను శుక్రబలం పూర్తిగా భంగపడింది కాబట్టి ఈ గ్రహస్థితి ఉధృతంగా దోషమని భావించాలి.

8. శుక్రుడు వివాహకారకత్వము కలవాడైనా రెండు పాపగ్రహాల మధ్య సప్తమ స్థానంలో బంధించబడి ఉండి అతనిమీద కుజుని యొక్క చతుర్ధ, సప్తమ లేక అష్టమ వీక్షణ ఉంటే అది పూర్తిగా దోషం అని మనం తెలుసుకోవాలి. ఎందుకంటే శుక్రబలం నశిస్తుంది. పాపగ్రహాలు దుష్ఫలితాలు సునాయాసంగా ఇవ్వగలుగుతాయి. కుజుని యొక్క చతుర్ధ వీక్షణ వల్ల విడాకులు సప్తమ వీక్షణ వల్ల దాంపత్యంలో శతృత్వం, కలహాలు, ద్వితీయ వివాహ దోషం ఉంటుంది. అష్టమ వీక్షణ వల్ల మరణం కలుగుతుంది. ఈ క్రింది చక్రం చూడండి.









ఈ చక్రంలో శుక్రుడు రెండు పాపగ్రహాలైన రవి, శని రాశుల మధ్య బంధించబడి ఉన్నాడు. శని మిత్రుడైనా పాపగ్రహమని మర్చిపోకూడదు. పైగా సప్తమ కుజ వీక్షణ వల్ల దోషం చాలా ఉధృతం అని గ్రహించాలి.


9. రవి శుక్రుల యొక్క సంయోగం ఏకరాశిలో ఎప్పుడూ నిషిద్ధమే. గ్రహాధిపతి అయిన రవి యందు శుక్రుడు దుర్బలుడవుతాడు. అలాంటి రవితో శుక్రుడు ఎవరి జాతకంలోనైనా పంచమ, సప్తమ మరియు నవమ స్థానాల్లో ఉంటే దోషమని భావించాలి.


10. పంచమ స్థానంలో క్షీణ చంద్రుడు ఉండి సప్తమ, ద్వాదశ స్థానాల్లో పాపగ్రహాలు ఉంటే అది దోషంగానే భావించాలి. ఒకవేళ అష్టమస్థానం మీద పాపగ్రహ వీక్షణ ఉంటే దోషం మరీ ఎక్కువ. ఈ క్రింది చక్రం చూడండి. ఈ చక్రంలో లగ్న కుజుని అష్టమ వీక్షణ తుల శుక్రుని మీద సప్తమ వీక్షణ సప్తమ బుధుని మీద ఉండటమే కాక పైన చెప్పిన పంచమ క్షీణ చంద్రుడు సప్తమ పాపగ్రహం, ద్వాదశ శని వల్ల మరణం తథ్యమని భావించాలి.




11. మీరు జాతకచక్రం పరిశీలించేటప్పుడు ఏ జాతకంలోనైనా ఏ రాశిలోనైనా సరే చంద్ర శుక్ర సంయోగం ఉండి ఆ సంయోగ స్థాన రాశి నుంచి సప్తమ రాశిలో కనుక కుజుడు మరియు శని కనుక కలిసి వుంటే మారకత్వం ఉంటుందని గ్రహించాలి. ఈ క్రింది చక్రం చూడండి.





ఈ చక్రంలో చంద్ర శుక్రులు మీనరాశిలో ఉన్నారు. అక్కడ నుంచి సప్తమ స్థానమైన కన్యారాశిలో శని కుజులు ఉన్నారు. అంటే శుక్రుని మీద కుజ మరియు శని, రెండు పాపగ్రహాల వీక్షణ ఉండటం వల్ల మారకత్వ దోషం ఉందని మనం గ్రహించాలి.

12. పంచమాధిపతి సప్తమంలో ఉండి, సప్తమాధిపతి పంచమంలో ఉండి వారిమీద అంటే సప్తమాధిపతి మరియు పంచమాధిపతి మీద పాపగ్రహ వీక్షణ ఉంటే అట్టివారు జీవిత భాగస్వామిని కోల్పోతారు. ఈ క్రింది చక్రం చూడండి.




ఈ చక్రంలో పంచమాధిపతి అయిన చంద్రుడు సప్తమ స్థానంలో ఉన్నాడు. అలాగే సప్తమాధిపతి అయిన బుధుడు పంచమస్థానంలో ఉన్నాడు. పంచమంలో ఉన్న బుధుని మీద శని యొక్క దశమ వీక్షణ మరియు సప్తమంలో ఉన్న చంద్రుని మీద చతుర్థ కుజ వీక్షణ ఉంది. అందువల్ల భాగస్వామిని కోల్పోతారు.

13. అష్టమాధిపతి సప్తమంలోను మరియు సప్తమాధిపతి అష్టమంలోను ఉండి ద్వితీయ స్థానంలో పాపగ్రహాలు ఉన్నా లేక పాపగ్రహ వీక్షణ ఉన్నా, అటువంటి వారికి కళత్ర మరణం వస్తుంది. స్త్రీకి అయితే వైధవ్య దోషం ఉన్నట్లుగా భావించాలి. ఈ క్రింది చక్రం చూడండి.

| | | | |
|---|---|---|---|
| లగ్నం | రవి రాహు | | కుజ |
| శని | 13 | | |
| | | | |
| | | బు | శు |






ఈ చక్రంలో లగ్నం నుంచి సప్తమాధిపతి బుధుడు, అష్టమాధిపతి శుక్రుడు. వీరిద్దరు ఒకరి స్థానంలో మరొకరు ఉన్నారు. అంటే సప్తమాధిపతి అష్టమంలోను, అష్టమాధిపతి సప్తమంలోను ఉన్నారు. కాగా సప్తమ శుక్రుని మీద చతుర్థ కుజ వీక్షణ వల్ల ద్వితీయ స్థానం మీద శని యొక్క తృతీయ వీక్షణ వల్ల జాతకంలో దోషం కలిగింది అని గ్రహించాలి.

14. వృషభలగ్నం వారికి సప్తమ స్థానం వృశ్చికం అవుతుంది. ఆ వృశ్చిక స్థానంలో శుక్రుడు ఉన్నా, లేక వృశ్చిక లగ్నం వారికి సప్తమ స్థానం వృషభం అవుతుంది. ఆ వృషభ స్థానంలో బుధుడు ఉన్నా మారకత్వం కలుగుతుంది.

15. ఇక ఈ క్రింద గ్రహస్థితి జాగ్రత్తగా పరిశీలించి ఇవి కూడా అశుభఫలితాలే కలుగచేస్తాయని మీరు తెలుసుకోవాలి.


కర్కాటక లగ్నం వారికి గురువు మకరంలో ఉండి పాపగ్రహవీక్షణ లగ్న, సప్తమాల రెండింటి మీద గాని లేక ఏ ఒక్కటి మీద గాని ఉండకూడదు. గురువు మకరంలో పాపగ్రహంతో కలిసి ఉన్నా కూడ దోషమే అని గ్రహించాలి.





ఈ చక్రం చూడండి. లగ్నం మీద కుజుని యొక్క చతుర్ధ వీక్షణ, సప్తమ మకర గురువు మీద వృశ్చికం నుంచి శని తృతీయ వీక్షణ. ఇలా గ్రహస్థితి ఉన్నప్పుడు లగ్నం మీద గురువీక్షణ ఉందని రాజీ పడకూడదు.


16. కన్యాలగ్నం వారికి సప్తమంలో అంటే మీన రాశిలో శని ఉండకూడదు. అలాగే కుజుడు కూడా ఉండకూడదు. సప్తమ స్థానంలో శని కుజ సంయోగం కూడా ఉండకూడదు. ఈ క్రింది చక్రం చూడండి.




లగ్నం మీద శని మరియు కుజ వీరిద్దరి సప్తమ పాపవీక్షణ. లగ్నానికి సప్తమ స్థానంలో కుజ శని సంయోగం. అంటే లగ్నం మరియు కుజ శనులు సమ సప్తమాలు కాబట్టి దోషం అని మనం అర్థం చేసుకోవాలి.

17. సప్తమాధిపతి శతృస్థానంలో ఉండి దానిమీద పాపగ్రహ వీక్షణ ఉండి ఆ సప్తమాధిపతి కనుక రెండు పాపగ్రహాల మధ్య బంధింపబడి ఉంటే అది దోషమని మనం తెలుసుకోవాలి. ఈ క్రింది చక్రం చూడండి.




ఈ చక్రంలో సప్తమాధిపతి అయిన బుధుడు శతృక్షేత్రమైన కర్కాటకంలో ఉన్నాడు. పైగా సప్తమాధిపతి శని మరియు రవి మధ్య బంధింపబడి ఉన్నాడు. అదేకాకుండా సప్తమాధిపతి మీద కుజుని యొక్క చతుర్ధ వీక్షణ ఉంది అని గమనించండి. ఇది చాలా ఉధృతమైన దోషం అని మనం భావించాలి.

18. ఇవే కాకుండా ద్వితీయ సప్తమ స్థానాలలో పాపగ్రహాలు ఉండి వాటిమీద పాపగ్రహ వీక్షణ ఉంటే, సప్తమాష్టమాలలో పాపగ్రహాలు ఉండి వాటిమీద పాపగ్రహ వీక్షణ ఉంటే,

19. సప్తమ స్థానంలో చంద్ర శనులు కలిసి ఉండి, దాని మీద పాపగ్రహ వీక్షణ ఉన్నా దోషమే.


ఈ పైన చెప్పిన దోషాలు అన్నీ ఒకే ఫలితాన్ని ఇస్తాయని భావించరాదు. ఒక్కొక్కరి జాతకంలో ఒక్కొక్క విధంగా గ్రహస్థితి ఉంటుంది. కాబట్టి జాతకం మొత్తం క్షుణ్ణంగా పరిశీలించి తీరాలి. దీర్ఘకాల వ్యాధి బారినపడినా, లేక సుదీర్ఘ కాలవియోగం కల్గినా, ఏదైనా అంగవైకల్యం వల్ల విషణ్ణుడైనా కూడా వాటిని దోషాలుగానే భావించాలి. పైన చెప్పిన చక్రాల వల్ల మారకత్వం కాకపోయినా ఇలాంటి దోషాలు కూడా రావచ్చని మీరు అర్థం చేసుకోవాలి.


# 22. దీర్ఘకాల మాంగల్యం

ఏ స్త్రీకైనా అత్యంత ప్రియమైనది దీర్ఘకాల సుఖ మాంగల్య జీవితం. తన భర్త పూర్ణాయుష్కుడిగా జీవించాలని కోరుకుంటుంది. ముఖ్యంగా మన భారతావనిలో ఏ స్త్రీకైనా తన జీవితంలో అతి దుఃఖకరమైనది భర్త యొక్క అకాలమరణం. భర్తలేని జీవితం ఆ స్త్రీకి నిస్సారమై ఎడారి జీవితం అవుతుంది. సంఘంలో గౌరవ మర్యాదలు తగ్గిపోతాయి. దాంపత్యంలో పురుష సౌఖ్యముండక భగ్నజీవితం గడుపుతుంది. సంతానాన్ని పెంచి పెద్దచేయడానికి కావలసిన సహకార సంపత్తులు తనవారి నుంచి కూడా పూర్తిగా లభించవు. జీవితం అంధకారమయి తెగిన గాలిపటంలా జీవనం సాగిస్తారు. పున్నమి జీవితం ఒక్కసారిగా అమావాస్య అయిపోతుంది. అందువల్ల ప్రపంచంలో ఏ స్త్రీకి అయినా కావలసినది అత్యంత సుఖప్రదాయకమైన మరియు సంతోషకరమైన దీర్ఘకాల మాంగల్య జీవితం. ఇది ఉంటే ఆ స్త్రీకి అంతకంటే గొప్ప వరం ఇంకొకటి ఉండదు. ఎన్ని ఉన్నా మాంగల్య హీనత్వం స్త్రీని మానసికంగా కృంగదీస్తుంది. అందుకనే ఇందిరాగాంధీని గాని లేక ఆమె కోడళ్ళయిన మేనక, సోనియాలను హిందూ స్త్రీలు విధివంచితులుగానే చూశారు గాని ఆమె సంపద, పదవిని చూసి వారు అత్యంత ఆనంద జీవితం గడిపారని ఏ స్త్రీ కూడా అనుకోదు. ఎందుకంటే దీర్ఘ మాంగల్య జీవితం కంటే ఎక్కువైనది ఏదీ ఉండదని ప్రతి స్త్రీకి తెలుసు. ధనం, విద్య, సంపద, అందం కలిగి విదేశ ధనార్జన ఉన్న స్త్రీలు అయినా సరే భర్తతో విభేదించి దాంపత్య విచ్ఛిన్నం చేసుకొని ఒంటరి జీవితం గడుపుతున్న స్త్రీలను సమాజం నేటికీ గౌరవించకపోగా అట్టి స్త్రీలను దౌర్భాగ్య, గర్వాహంకారులుగా చెప్పుకుంటారనేది ముమ్మాటికి నిజం. ఇంకొక ముఖ్య విషయం ఏమంటే వైధవ్య స్త్రీని విధివంచితురాలిగా తలచి సానుభూతి చూపిస్తారు గాని, గర్వాహంకారాలతో విడాకులు తీసుకున్న స్త్రీని ఏ హిందూ స్త్రీ హర్షించదు కదా, పైగా అట్టి స్త్రీని చిన్న చూపు చూస్తుంది. అందువల్ల మంచి దీర్ఘాయుష్మంతుడైన భర్తను చేపట్టాలని ఏ స్త్రీ అయినా ఆశిస్తుంది. అందువల్ల వివాహ నిమిత్తం జాతక పరిశీలన చేసేటప్పుడు ఆ వధువు యొక్క మాంగల్యం ఎలా ఉందని పరిశీలించడం అత్యంత ముఖ్యాంశం.

కాని, ఈ రోజులలో గ్రహమైత్రి ఉండి, పంచాంగ మార్కులు బాగుంటే చాలనే మిడిమిడి జ్ఞానంతోనో లేక శాస్త్ర పరిజ్ఞాన పరిపూర్ణత లేకో చెప్పటం జరుగుతుంది. అది నమ్మటం మూర్ఖత్వానికి పరాకాష్ట మరియు చేతులారా ఒక్కొక్కప్పుడు తమ సంతాన భగ్న జీవితానికి నాంది కూడా పలికినట్లు అవుతుందని మర్చిపోకూడదు. వధూవరుల జాతక విశ్లేషణలో చిట్కాలు, పర్సంటేజులు, మార్కులు, దోష పరిహార పూజలు ఇవన్నీ అజ్ఞానమే కాక శాస్త్రవిరుద్ధం కూడా. ఒక జ్యోతిష్యుడు 90 పర్సెంటు పొంతన బాగుంది 34 మార్కులు ఉన్నాయి చేసుకోమని సలహా ఇవ్వడమే కాక గ్రహమైత్రి బాగుందని కూడా చెప్పాడు. వివాహం జరిగిన సంవత్సరంలోపే ఆ వధువు వితంతువయింది. తల్లిదండ్రులు ఆ జ్యోతిష్యుని ప్రశ్నిస్తే "నూటికి నూరు పర్సెంటు కుదరలేదు కదా తొంభయి మాత్రమే కుదిరిందని చెప్పాను. మిగిలిన ఆ పది పర్సెంట్ ఈ లోపం ఉంది. మనమేం చేయగలం. విధిని ఎవరైనా దాటగలరా" అంటూ వారి మాటను దాటవేసి తప్పించుకున్నాడు. ఇలాంటి జ్యోతిష్యుల వల్ల ఉపకారం కంటే అపకారమే అని మర్చిపోకండి. ఎందుకంటే ధనార్జన ముఖ్యమైన ఈ జ్యోతిష్యులకు వారి వాక్కు ఫలించదని మీరు తెలుసుకోండి. ఇక వధువు యొక్క మాంగల్యబలం ఎలా పరిశీలించాలో ఈ క్రింద చర్చిద్దాం.


1. ఏ జాతకంలోనైనా, ఏ స్త్రీకైనా సప్తమాధిపతి, లగ్నాధిపతి కలిసి లగ్నస్థానంలో ఉండి వారి మీద శుక్ర సప్తమ వీక్షణ ఉంటే ఆ స్త్రీకి అతి సౌభాగ్య, శోభాయమాన సంతోష దీర్ఘకాల మాంగల్య జీవితం ఉంటుంది. దాంపత్యం సాఫీగా, ఏమీ పొరపొచ్చాలు లేకుండా జీవితంలో దేనికి అంటే ధనం, ధాన్యం, ఆరోగ్యం, మంచి సంతానం ఉంటుంది. ఈ క్రింది చక్రం చూడండి.




ఈ చక్రంలో కన్యది మీనలగ్నం. మీన లగ్నాధిపతి గురువు. లగ్నాధిపతి అయిన గురువు లగ్నస్థానంలో ఉన్నాడు. అలాగే సప్తమాధిపతి బుధుడు. ఆ బుధుడు లగ్నస్థానంలో ఉన్నాడు. అంటే లగ్నాధిపతి సప్తమాధిపతి ఇద్దరూ లగ్నస్థానంలోనే ఉన్నారు. అదే విధంగా శుక్రుడు కన్యారాశిలో ఉంటే లగ్నం మీద తన సప్తమ వీక్షణ ఉంది.


2. ఏ జాతక చక్రంలోనైనా వధువుకు సప్తమాధిపతి పుణ్యగ్రహమై ఉండి అలాగే లగ్నాధిపతి కూడా పుణ్యగ్రహమై వారిద్దరూ తమ తమ ఉచ్ఛ రాశులలో గాని లేక మిత్ర క్షేత్రాలలో గాని ఉంటే ఆ కన్య మంచి ఆయుష్మంతుడగు వరుని భార్య అవుతుంది. ఈ క్రింది చక్రం చూడండి.






ఈ చక్రంలో వధువుది కన్యలగ్నం కాగా లగ్నాధిపతి అయిన బుధుడు తన మిత్ర క్షేత్రాధిపతి అయిన శుక్రుని యొక్క వృషభరాశిలో ఉన్నాడు. అలాగే వధువు సప్తమస్థానం మీన రాశి అయింది. మీనరాశి అధిపతి అయిన గురువు తన మిత్ర క్షేత్రాధిపతి అయిన రవి యొక్క సింహరాశిలో ఉన్నాడు. ఇలా ఉన్నప్పుడు వీరిలో ఎవరిమీద అయినా మిత్ర లేక పుణ్య వీక్షణ ఉంటే మరింత ఉన్నతమైన జాతకమని గ్రహించాలి.


3. ఏ స్త్రీ జాతకంలోనైనా లగ్నాధిపతి లగ్నస్థానంలోనే ఉండి, సప్తమాధిపతి కూడా లగ్నస్థానంలోనే ఉంటే పాపగ్రహ, పుణ్యగ్రహ సంయోగం అనేది లేక, అంటే లగ్న, సప్తమాధిపతులిద్దరూ పాపగ్రహాలైనా కూడా ఆ స్త్రీకి దీర్ఘకాల మాంగల్యయోగం ఉన్నట్లే భావించాలి. ఒకవేళ ఆ ఇద్దరికీ అది శత్రు క్షేత్రమైతే పుణ్యగ్రహ వీక్షణ ఉంటే చాలు. లేక వధూవరుల ఇద్దరిలో ఎవరైనా ఒక్కరికి సప్తమాధిపతికి ఉచ్ఛస్థానమైనా శుభఫలితమే ఉంటుందని మనం నిర్ణయించాలి. ఈ క్రింది చక్రాలు చూడండి.









ఈ చక్రంలో లగ్నస్థానం మీనం అయింది. మీనరాశి అధిపతి మీనరాశిలో ఉన్నాడు. అలాగే మీనరాశికి సప్తమస్థానం కన్యారాశి అయింది. కన్యారాశి అధిపతి బుధుడు. సప్తమ రాశ్యాధిపతి అయిన బుధుడు లగ్నస్థానం అయిన మీనంలో ఉన్నాడు. అంటే లగ్నస్థానంలో లగ్నస్థానాధిపతిలో కలిసి సప్తమాధిపతి కూడా ఉండడం వల్ల ఈ జాతకురాలు భర్తతో కలకాలం జీవిస్తుంది.





ఇప్పుడు ఈ చక్రం పరిశీలించండి. ఈ జాతకురాలికి లగ్నం సింహరాశి అయింది. అక్కడ నుంచి సప్తమ స్థానం కుంభరాశి అయింది. కుంభరాశి అధిపతి శని. లగ్న సప్తమాధిపతులు ఇద్దరూ పాపగ్రహాలు అయినా ఆ స్త్రీ పతి విహీనురాలు కాదు.





ఈ చక్రంలో ఈ జాతకురాలిది లగ్నం కర్కాటకం అయింది. కర్కాటకాధిపతి చంద్రుడు. కర్కాటకానికి సప్తమ స్థానం మకరరాశి. మకర రాశ్యాధిపతి శని. ఈ శని తన స్వస్థానంలో ఉన్నాడు. అందువల్ల ఏమీ దుష్ఫలితం ఉండదు. అంటే లగ్న సప్తమాధిపతులు శని స్థానంలో ఉన్నప్పటికీ శనికి స్వస్థానం వల్ల దుష్ఫలితం ఇవ్వదని గ్రహించాలి.

4. ఏ స్త్రీ జాతకంలోనైనా లగ్నాధిపతి ఉచ్ఛస్థానంలో ఉండి, ఆ స్థానంలో సప్తమాధిపతి కూడా ఉండి, ఆ లగ్న సప్తమాధిపతుల మీద గురువు యొక్క పంచమ, సప్తమ లేక నవమ వీక్షణ గాని లేక చంద్రుని యొక్క సప్తమ వీక్షణ గాని లేక ఇద్దరి వీక్షణలు ఒకే రాశి నుంచి గాని లేక వేర్వేరు రాశుల నుంచి గాని ఉన్నట్లయితే ఆ వధువుకు దీర్ఘకాల మాంగల్య యోగం ఉంటుందని మనం గ్రహించాలి. ఈ క్రింది చక్రం చూడండి.









ఈ చక్రంలో వధువు లగ్నస్థానం ధనస్సు అయింది. ధనూరాశి అధిపతి గురువు. ఆ గురువు తనకు ఉచ్ఛ స్థానమైన కర్కాటక రాశిలో ఉన్నాడు. లగ్నస్థానానికి సప్తమం

మిధునం అయింది. ఆ మిధునాధిపతి అయిన బుధుడు లగ్నాధిపతితో కలిసి ఉన్నాడు. మరియు లగ్న సప్తమాధిపతుల మీద సప్తమ చంద్ర వీక్షణ వల్ల ఆ స్త్రీకి దీర్ఘ మాంగల్య సౌభాగ్యం ఉంటుంది.


5. ఏ స్త్రీ జాతకంలోనైనా సరే, లగ్నాధిపతి ఉచ్ఛస్థానంలో ఉండి, ఆ జాతక సప్తమాధిపతి వీక్షణ ఆ కన్య సప్తమస్థానం మీద గానీ లేక సప్తమాధిపతి మీద గాని ఉంటే ఆ స్త్రీకి అత్యంత సౌభాగ్య మాంగల్యం ఉంటుందని మనం గ్రహించాలి. ఈ క్రింది చక్రం పరిశీలించండి.





ఈ చక్రంలో లగ్నస్థానం సింహరాశి. సింహరాశ్యాధిపతి రవి. అట్టి రవి తన ఉచ్ఛస్థానమైన మేషరాశిలో ఉన్నాడు. అలాగే సప్తమస్థానం కుంభరాశి. కుంభరాశ్యాధిపతి శని. అట్టి శని లగ్నస్థానం నుంచి సప్తమాన్ని వీక్షిస్తున్నాడు. అలాగే గురువు తన స్వస్థానమైన ధనూరాశి నుంచి పంచమ వీక్షణతో రవిని, నవమ వీక్షణతో లగ్నాన్నే కాక సప్తమాధిపతియైన శనిని కూడా వీక్షిస్తున్నాడు. అంటే లగ్న సప్తమాధిపతుల మీద గురువీక్షణే కాక లగ్నాధిపతి ఉచ్ఛస్థానంలో ఉన్నాడు. ఇక్కడ సప్తమాధిపతి అయిన శని శతృస్థానంలో ఉన్నా గురువీక్షణ వల్ల దోషరహితమని మనం అర్థం చేసుకోవాలి.


6. ఏ స్త్రీ జాతకంలోనైనా సరే కేంద్రాధిపతులు పుణ్యగ్రహాలై, సప్తమ స్థానాధిపతి మిత్రస్థానంల ఉన్నా లేక ఉచ్ఛస్థానంలో ఉన్నా ఆ స్త్రీకి దీర్ఘకాల మాంగల్య యోగం ఉంటుందని మనం గ్రహించాలి. ఈ క్రింది చక్రం చూడండి.





ఈ చక్రంలో లగ్నస్థానం మీనరాశి అయింది. కేంద్రస్థానాలైన చతుర్థ మిధునంలో శుక్రుడు, సప్తమ కన్యలో బుధుడు, దశమ స్థానమైన ధనస్సులో గురువు ఉన్నారు. ఈ విధంగా గ్రహస్థితి ఉన్నప్పుడు ఆ స్త్రీకి దీర్ఘకాల సౌభాగ్యం ఉంటుంది.

7. ఏ స్త్రీ జాతకంలోనైనా సరే లగ్నాధిపతి గాని సప్తమాధిపతి గాని మిత్రక్షేత్రంలో ఉన్నా గాని లేక తన స్వక్షేత్రంలో ఉన్నా లేక మూల త్రికోణ కేంద్రాలైన తృతీయ, పంచమ, నవమ స్థానాలో ఉన్నా ఆ స్త్రీ భర్త పూర్ణాయువుగా జీవిస్తాడు. ఈ క్రింది చక్రం చూడండి.




ఈ చక్రంలో లగ్నాధిపతి అయిన గురువు ఏయే స్థానంలో ఉన్నాడో గ్రహించండి. చక్రంలో చూపినట్లుగా గురువు ఏ ఒక్క స్థానంలో ఉన్నా కూడా ఆ స్థానం మూల త్రికోణ స్థానాలే కాబట్టి శుభదాయకమని గ్రహించాలి.

# 23. నాడీ దోషం

నాడి అంటే మనకు తెలుసు. నాడీ పరీక్ష ధన్వంతరులు, వైద్యులు పరిశీలించి దాని ప్రకారం శరీర ఆరోగ్య విషయం గ్రహిస్తారు. నాడి వల్ల శ్లేష్మ, వాత, పిత్త, వేడి, ఉష్ణ శరీరమా అనేది గ్రహించగలుగుతాము. వధూవరుల ఇద్దరిదీ ఏక శరీర తత్వము కాకూడదనేది నాడి నిర్ణయం. శరీరాన్ని మూడు భాగాలుగా విభజించారు. మొదటిది ఆదినాడి. దీనివల్ల మానవ మేధోసంపత్తి, ప్రతీకారవాంఛ, ఆలోచనా విధానం, కోపం, ఆవేశం, ధీరత్వం తెలుపుతుంది. వధూవరుల నక్షత్రాలను బట్టి వారు ఏ నాడికి చెందినవారో తెలుసుకున్నారు. అందువల్ల ఆదినాడి తత్వం గల వధూవరులు వివాహం చేసుకొనకూడదని నిర్ణయించారు. అలాగే మధ్యనాడి. శరీర మధ్య భాగంలో ఉన్న రుగ్మతలు, సంతానం, ఊపిరితిత్తులు, గుండెలలో ఉన్న రుగ్మతలు ఏ నక్షత్రాలలో జన్మించిన వారికి ఉంటాయో నిర్ణయించి వధూవరులిద్దరూ మధ్యనాడికి చెందినవారైతే వివాహం చేయకూడదని నిర్ణయించారు. అలాగే అంత్యనాడి వల్ల మర్మావయవాలు, కామవాంఛ, నపుంసకత్వము, శరీర ఉష్ణోగ్రత స్థితి కొన్ని నక్షత్రాల వల్ల తెలుసుకొని ఆ నక్షత్రాల వధూవరులుంటే అట్టి వారి వివాహాలు నిషేధించారు.

నాడీ దోషం ఎంతో విశిష్టమైనది, విడువరానిది, రాజీపడకూడనిది అని పాఠకులు గ్రహించాలి. వధూవరులు ఇద్దరిదీ ఏకనాడి అయితే వారి వివాహం ఎట్టి పరిస్థితులలోను చేసుకొనకూడదు.

ఈ క్రింది పట్టిక చూస్తే నాడీ దోషం మీకు తెలుస్తుంది. ఏకనాడిలో వధూవరులు వివాహం చేసుకుంటే వారి దాంపత్య జీవితంలో సంతోషం, సుఖం హరించుకుపోతుంది. అనర్థ సంతానం కలుగుతుంది. దీర్ఘకాల వ్యాధుల బారిన పడతారు. మానసిక వేదన, వ్యధ అనుభవిస్తారు. కొన్నిసార్లు వధూవరులలో ఒకరు మరణించవచ్చు.

| ఆదినాడి | మధ్యనాడి | అంత్యనాడి |
|---|---|---|
| అశ్వని | భరణి | కృత్తిక |
| ఆరుద్ర | మృగశిర | రోహిణి |
| పునర్వసు | పుష్యమి | ఆశ్లేష |
| ఉత్తర | పుబ్బ | మఖ |
| హస్త | చిత్త | స్వాతి |
| జ్యేష్ఠ | అనూరాధ | విశాఖ |
| మూల | పూర్వాషాఢ | ఉత్తరాషాఢ |
| శతభిషం | ధనిష్ట | శ్రవణం |
| పూర్వాభాద్ర | ఉత్తరాభాద్ర | రేవతి |

ఒక విషయం ఏమంటే నాడీ దోషమున్నంత మాత్రాన అన్నీ అంశాలు చక్కగా పొంతన కుదిరిన పక్షంలో దోషమున్నది కదా అని ఆ సంబంధము ఒదిలి వేయకూడదు. ఎందుకంటే నాడీ దోషములో కూడా దైవజ్ఞులు కొన్ని పరిహారములున్నాయని ఆ విధంగా వధూవరుల ఇద్దరి జాతకాలలో పరిహారం ఉంటే నిర్భయంగా వివాహము జరిపించ వచ్చని మీరు తెలుసుకోండి. మీ సౌకర్యం కొరకు ఈ క్రింది పరిహారాలు ఇవ్వబడ్డాయి.

**1. ఆదినాడి దోషం**

**శ్లో॥** ఉత్తరా శతతారచ పూర్వాభాద్ర, పునర్వశూ।

రౌద్ర మూలాశ్వని సప్త ఏకనాడి న దోషబాక్॥

**తా॥** ఉత్తర, శతభిషం, పూర్వాభాద్ర, పునర్వశు, ఆరుద్ర, మూల, అశ్వని ఈ నక్షత్రములలో వధూవరుల ఇద్దరి నక్షత్రములున్నా కూడా దోషం ఉండదు.

**2. మధ్య నాడి దోషం**

**శ్లో॥** తోయానురాధ వసుపుష్య చిత్తా:భగేందుభేదస్ర నరస్య సప్త।

మధ్యైకనాడీ నహినాడిదోషా అరుంధతీమేవయధా వశిష్ఠః॥

**తా॥** పూర్వాషాఢ, అనూరాధ, ధనిష్ట, పుష్యమి, చిత్త, పుబ్బ, మృగశిర ఈ నక్షత్రములలో వధూవరుల ఇద్దరి నక్షత్రములున్నా దోషం ఉండదు.

**3. అంత్య నాడి దోషం**

**శ్లో॥** వహ్నిర్విశాఖ సర్పాచ శ్రవణేచ మాఘూ తధా।
ఉత్తరాషాఢ, రోహిణ్యాం అంత్యనాడి న దోషబాక్॥

**తా॥** కృత్తిక, విశాఖ, ఆశ్లేష, శ్రవణం, మఖ, ఉత్తరాషాఢ, రోహిణి నక్షత్రములలో వధూవరుల ఇద్దరి నక్షత్రములున్నను దోషం ఉండదు.

పండిత పామరులు ఈ శాస్త్ర సత్యములోని అంశాన్ని గమనించి తదనుగుణంగా నిర్ణయం చేయగలరు.

# 24. నిషిద్ధ వివాహాలు

స్త్రీ పురుషుల మధ్య యవ్వన దశలో శారీరక మరియు మనోవాంఛాది తృప్తికి హైందవ మత సాంప్రదాయం నిర్ణయించిన పుణ్యక్రతువుని వివాహం అంటారు. మన భారతదేశంలో వివాహం అనేది పవిత్రమైన మరియు జీవన ప్రవంతికి పుట్టినిల్లు. భార్య, భర్తల మధ్య ఉన్న విడదీయలేని సంబంధ అనురాగాన్యోన్య జీవితానికి కేవలం శారీరక సుఖములకే గాక వంశాభివృద్ధికి, పితౄణ ఋణవిముక్తికి ఏకైక సాధనమే కాక ధర్మార్థ, కామ, మోక్షములకు వివాహ ప్రక్రియ ఒక చక్కటి మార్గదర్శి. వివాహము వలన వధువుకు పితృ గోత్ర నివృత్తి మరియు భర్తృ గోత్ర ప్రాప్తి లభిస్తుంది. మిగిలిన ఏ మతాలలోను ఈ గోత్ర మార్పిడి కనబడదు. వివాహ జీవితంలో దంపతులు ధర్మనిరతిని పాటిస్తూ సంతానముతో సుఖప్రదమైన మరియు ఆనందకరమైన జీవితం గడపాలని మహా ఋషుల ఉవాచ.

ఈ గృహస్థాశ్రమంలో దంపతులు ఆతిథ్య, అభ్యాగతులను, బ్రహ్మచారులను, సన్యాసి, భిక్షువులను, అనాథలను, భృత్యులను ఆదరించి వారికి ముదము చేకూర్చి తద్వారా పుణ్యము సంపాదించుకొనుట ఆచారము. పితృకార్యము చేసి పితృ దేవతలను సంతుష్టిపరుస్తారు. పూజ, వ్రత, యజ్ఞ యాగాదులను చేసి దైవానుగ్రహం పొందుతారు.

అందువలన ఇహ, పర సంతోషములకు వివాహము అతి ముఖ్యమైన ప్రథమ సోపానమనే విషయం మరువరాదు. ఈ వివాహమునకు అత్యంత ప్రాముఖ్యత ఉంది కావున ఎవరు, ఎవరిని వివాహమాడకూడదో నిర్దుష్టంగా మనకు శాస్త్రరీత్యా చెప్పబడింది. ఇప్పుడు మనం వాటిని పరిశీలిద్దాం :

1. ఏక గోత్రము మరియు ఏక ప్రవర కలిగిన కన్యను ఏ వరుడు వివాహమాడరాదు.
2. ప్రవరలులలో ఒక్క ఋషి కలిసినను వివాహమాడరాదు.
3. మాతృగోత్రమై సపిండ అయిన కన్యను వివాహమాడరాదు.
4. వరుడు ఏడు తరముల లోపల గల తన తండ్రి బంధువులలో ఎవరిని వివాహమాడరాదు.

5. అలాగే 5 తరములలోపు తల్లి తరపు బంధువులను వివాహమాడరాదు.
6. తల్లి వరుస, భగిని వరుస, కుమార్తె వరుస అయిన కన్యను వివాహమాడరాదు.
7. పెంపుడు తల్లి కుమార్తెను లేక ఆమె తోబుట్టువులను లేక తోబుట్టువుల సంతానములను వివాహమాడరాదు.
8. పినతండ్రి, పెదతండ్రి, భార్య తోబుట్టువులను లేక వారి కుమార్తెలను వివాహమాడరాదు.
9. సవతి తల్లి అక్క, చెల్లెండ్రను, లేక వారి సంతానమును వివాహమాడరాదు.
10. అన్నదమ్ముల వరుస అయిన వారి కుమార్తెలను వివాహమాడరాదు.
11. గురుపుత్రితో ఎట్టి పరిస్థితులలోను వివాహము నిషిద్ధము మరియు గురువు –శిష్యుల వివాహము పూర్తిగా నిషిద్ధము.
12. మేనత్త కుమార్తెను, తల్లి చెల్లెలును లేక చెల్లెలి సంతానమును వివాహమాడరాదు.
13. అన్న భార్య చెల్లెలును వివాహమాడరాదు.
14. వీలైనంతవరకు అంటే తప్పని పరిస్థితులలో తప్ప కుండమార్పిడి వివాహము నిషిద్ధము. అంటే కన్యాదానం చేసిన ఇంటినుంచి తిరిగి కన్యను దానం స్వీకరించరాదు. ఒకవేళ తప్పనిసరి అయితే వేరే గోత్రీకులు కన్య పేరు మార్చి కన్యాదానం చేయాలి. కాని ఆమె తల్లిదండ్రులు తమ గోత్రంతో కన్యాదానం చేయరాదు.
15. తనకంటే వయసులో పెద్ద అయిన స్త్రీని వివాహం చేసికొనరాదు. అలా చేసుకొన్నచో వరహీనం అందురు.
16. వరుడు ఏకగర్భజనితులైన కన్యలిద్దరిని వివాహమాడరాదు. అక్కచెల్లెళ్ళ నిద్దరిని ఏక వరుడు వివాహమాడరాదు. (అంటే తన భార్య మరణించిన లేక సంతానహీనురాలైనను ఆమె చెల్లెలును చేసికొనరాదని భావము)

    ఒక ముఖ్య విషయం ఏమనగా ఒకే తండ్రికి జన్మించినను, తల్లులు వేరైనచో ఆ ఇద్దరి తల్లుల కుమార్తెలను అవసర పరిస్థితులలో వివాహము చేసికొనవచ్చు.
17. వివాహము నిశ్చయమైన తరువాత అంటే నిశ్చితార్థం జరిగిన తరువాత వధూవరుల గోత్రీకులలో ఎవరు మరణించినను, ఆ వివాహము 6 నెలలపాటు ఆపివేయాలి.

18. నిశ్చయ తాంబూలం తీసుకున్న తర్వాత వధూవరులలో ఎవరికైనను తల్లి, తండ్రి, సోదరుడు, మేనమామ మరణిస్తే ఆ వివాహం చేయరాదు. తప్పని పరిస్థితులలో మృత శౌచ శాంతి చేసుకొని తదుపరి సంవత్సరంలో వివాహమాడవచ్చు.
19. అక్కాచెల్లెళ్లకు, అన్నాచెల్లెళ్లకు, అక్కాతమ్ముళ్లకు ఆరు నెలల వ్యవధి లోపల వివాహం చేయరాదు.
20. ఒకే కుటుంబంలో 6 నెలలలోపు ఉపనయనము ఒకరికి, వివాహము వేరొకరికి చేయరాదు. రెండు ఉపనయనములు లేక రెండు వివాహములు ఆరునెలలలోపు చేయరాదు.
21. తన తల్లి, తండ్రి, గురువు పేరు ఉన్న కన్యను పేరు మార్చి నక్షత్ర శాంతి చేసి వివాహము చేసుకోవాలి.
22. మూలా నక్షత్ర కన్యను మేనమామ చేసుకొనరాదు.
23. ఒకే గురువు వద్ద విద్య నేర్చుకొన్న సహాధ్యాయులు వివాహమాడరాదు.
24. శాస్త్రరీత్యా వావి వరుస కుదరని పేర్లు గల వధూవరులకు వివాహంలో కన్యకుపేరు మార్చిన అనంతరం వివాహము చేయవలెను. అంతేకాని స్వకీయ నిషిద్ధ నామంతో వివాహము చేయరాదు. ఒకవేళ చేస్తే వారి దాంపత్యం దుఃఖమయం అవుతుంది.

**ఉదా :**

| | **వరుడు** | **వధువు** |
|---|---|---|
| | 1) ఆంజనేయ శర్మ | సీతామహాలక్ష్మి |
| | 2) రామారావు | కౌసల్య |
| | 3) శివశంకర్ | సరస్వతి |
| | 4) విష్ణుశర్మ | పార్వతి |

ఇలా పేర్లు ఉన్నపుడు సుఖ దాంపత్యం కోసం శాస్త్రరీత్యా వధువుకు నూతన నామకరణం చేసిన తరువాతే నిశ్చయ తాంబూలం తీసుకోవాలి.

25. కారణం ఏమీ లేకుండా ప్రతి మాటకు పెద్దగా నవ్వే కన్యను వివాహం చేసుకొనకూడదు.

**కన్యకు పేరుమార్చుటకు నామకరణ విధానం :**

కన్యకు శౌచ దోషము లేని రోజుల్లో ద్వాదశి, షష్టి, అష్టమి, అమావాస్య, గ్రహణమూ కాని రోజుల్లో కన్యను క్రొత్త పీట మీద కూర్చుండపెట్టి వైదిక బ్రాహ్మణుని చేత గాని లేక, తండ్రికి, తండ్రి చేత గాని అంటే తాతగారి చేతగాని క్రొత్త కుండలో గాని, లేక రాగిబిందెలో గాని నీరు పోయించి, ఆ నీటిలో మఱ్ఱి, రావి, జువ్వి, మామిడి లేక నేరేడు చెట్ల బెరడు ముక్కలు గాని లేక వాటి ఆకులు గాని వేయాలి. ఆ తర్వాత పచ్చి గరికను ఆ నీటిలో ముంచి కన్య తలమీద చల్లాలి. ఆ నీటిలో గంగోదకం ఉంటే కలపాలి. లేక ఏ పుణ్యనది నీరైనా తప్పక కలపడం ఉత్తమం లేదా గోమూత్రం 4 చుక్కలు వేయాలి. కన్య స్నానమాడిన పిదప నూతన వస్త్రాలు ధరింపచేసి నామకరణం చేయించి బ్రాహ్మణుల చేత పుణ్యాహవచనం, కులపెద్దల చేత ఆశీర్వచనం చేయించాలి. ఆ తర్వాత కన్య చేత కనీసం 5 గురు గొౖద్రాలు కాని ముత్తయిదువులకు పండు తాంబూలం ఇప్పించాలి.

హిందూ ధర్మశాస్త్ర ప్రకారం వివాహ సమయంలో పై అంశాలను నిర్దుష్టంగా పాటించాలి. కాని స్వలాభంతో మూర్ఖ నిర్ణయం చేసికొని, రాజీపడి శాస్త్రహీన వివాహం చేసికొని జీవితంలో దుఃఖపడకండి.

# 25. వధూవరుల జాతక పొంతనలో ఇతర విషయాలు "దశాసంధి"

ఎవరి జాతకచక్రంలోనైనా జీవితం అంతా ఒకే దశ ఉండదు. గ్రహాల దశలు మారుతూనే ఉంటాయి. అలాకాని పక్షంలో ఒకరికి శని దశ ప్రారంభిస్తే వారి జీవితం అంతా శని దశే ఉంటే వారి జీవితం ఎలా ఉంటుందో మనం ఊహించగలం. వారు జీవితం అంతా శనితో పీడింపబడాల్సి వస్తుంది. కాని నిజానికి అలా జరుగదు. శని దశ పోయి మళ్లీ మంచిరోజులు వస్తాయి. అంటే గురుదశ, శుక్రదశ లాంటి పుణ్యగ్రహ దశలో వారు ఆనంద జీవితం గడుపుతారు. అంటే గ్రహసంచారం వలన మానవ జీవితాల్లో సుఖదుఃఖాలు అనేవి వారి వారి గ్రహాల దశ వల్ల వస్తూ ఉంటాయి. అందుకనే మనం మాటలలో తరచుగా "మన గ్రహస్థితి బాగులేకపోతే దేవుడు మాత్రం ఏం చేస్తాడు" అనుకొని రాజీపడుతూ ఉంటాం.

ఒక దశ నుంచి మరియొక దశకు గ్రహం మారే ఆఖరి సమయాన్ని, క్రొత్త గ్రహం ప్రవేశించే దశా సమయానికి గల మధ్య కాలాన్ని దశాసంధి అంటారు. ఒక్కొక్కప్పుడు ఇది చాలా దుష్ఫలితాలు ఎక్కువగా ఇవ్వవచ్చు. ఎందుకంటే దశ పూర్తి అయి వెళ్లే గ్రహం, అలాగే ఆ స్థానంలో దశకు ప్రవేశించే గ్రహం, ఈ రెండూ పాపగ్రహాలే అయితే ఈ పాపగ్రహాల మధ్య ఉన్న నడిమికాలం అత్యంత దోషభూయిష్టం అని కొందరి పండితుల నమ్మకం. అందువల్ల వధూవరుల జాతకాలలో గ్రహదశ మార్పు ఇద్దరికీ ఒకేసారి రాకుండా ఉండాలని లేకపోతే అతి దుర్భర జీవితమే కాక ఒక్కొక్కప్పుడు మరణం కూడా కలగవచ్చునని వారి గట్టి నమ్మకం.

కాని, వధూవరుల ఆయుఃస్థానం బలంగా ఉన్నా, దశా ప్రారంభంలో వచ్చే గ్రహం తన ఉచ్ఛ క్షేత్రంలో ప్రవేశిస్తున్నా, లేక గ్రహాలు వర్గోత్తమమైనా దుష్ఫలితాలు ఉండవు. అందువల్ల దీనిని గొప్పగా ఒక అంశంగా తీసుకొని పరిశీలన చేయనవసరము లేదు.

పైగా దశాసంధి అనే దుష్ఫలితం కృష్ణా, గోదావరి మధ్య ప్రాంతాల వారికి వర్తించదనే నమ్మకం ఉంది. అందువల్ల ఆంధ్రదేశపు నివాసులు దీనిని పాటించనవసరము లేదు.

## "స్త్రీ దీర్ఘము"


స్త్రీ దీర్ఘాంశములో వధువు నక్షత్రం నుంచి లెక్కపెట్టినప్పుడు వరుని నక్షత్రం 13 నంబర్లు దాటి ఉండాలనేది ఒక నియమం. కాని ఈ నియమం కనుక మనం అనుసరిస్తే సంపత్తార, క్షేమతార, సాధనతార, మిత్రతార మరియు పరమ మిత్రతారలకు అర్థం ఉండదు. కాని జాగ్రత్తగా ఆలోచిస్తే పైన చెప్పిన సంపత్తు, క్షేమ, సాధన, మిత్ర, పరమమిత్ర తారలు తప్ప మిగిలినవి పొంతనకు అనర్హమని అర్థం చేసుకోవాలి. అంటే వధువు నక్షత్రం నుంచి లెక్కపెట్టినపుడు వరుని నక్షత్రం 9వ నక్షత్రంలో ఉండకూడదు అంటే 3-5-7 నక్షత్రాలు అని అర్థం మాత్రమే. ఎందుకంటే అవి విపత్తార, ప్రత్యక్తార, నైధునతార కాబట్టి. అంతేకాని కన్య నక్షత్రం నుంచి 9 నక్షత్రముల లోపల వరుని నక్షత్రం ఉండకూడదని కాదు అని మనం గ్రహించాలి.


ఒకవేళ వధువు నక్షత్రం నుంచి వరుని నక్షత్రం వరకు లెక్కపెట్టినప్పుడు 13 నక్షత్రాలు దాటినా గాని వారి నక్షత్రాలు కుదురుతాయని ఎవ్వరూ చెప్పలేరు. ఎందుకంటే అలా లెక్కపెట్టినప్పుడు సంఖ్య 16 వస్తే పనికి రాదు. ఎందుకంటే నైధునతార అవుతుంది. అలాగే 19 వస్తే జన్మతార అవుతుంది. అందువల్ల స్త్రీ దీర్ఘం గురించి ఎక్కువగా యోచింప పని లేదని మా ఉద్దేశ్యం. జన్మ, విపత్, నైధున, ప్రత్యక్తార కానప్పుడు 13 నక్షత్రాలు లేక ఆ పైన, అలాగే 7 నక్షత్రాల పైన, ఉంటే ఉత్తమమని గ్రహించాలి.

# 26. పుత్ర సంతానం

సాధారణంగా వధూవరుల జాతకం పరిశీలించడానికి ఏ జ్యోతిష్యుని వద్దకు వచ్చినా ఆ జ్యోతిష పండితుడు ఇద్దరి జాతకం విశ్లేషించి జాతకం కుదిరిందని చెప్పినా సంతృప్తి చెందరు కదా ఏమేమో ప్రశ్నలు అడుగుతూనే ఉంటారు. అలాంటప్పుడు ఏ పండితుడైనా విసుగు చూపించక వారి అనుమానాలను నివృత్తి చేయడం జ్యోతిష్యుల విధి అని వేరే చెప్పనక్కరలేదు. అలా వారు అడిగే ప్రశ్నలలో ఒక ముఖ్యమైన ప్రశ్న ఏమంటే ఈ వివాహం జరిపితే వారికి పుత్ర సంతానం తప్పక ఉంటుందా? అనేది. ఇది చాలా ముఖ్యమైన ప్రశ్న అని ఏ జ్యోతిష్యుడు మరచిపోకూడదు. ఎందుకంటే పున్నామ నరకం నుంచి రక్షించేవాడే పుత్రుడని వారి దృఢ విశ్వాసం. అందువల్ల పుత్ర సంతానం ఉన్నదీ లేనిదీ చూడడం అనేది వధూవరుల జాతక పరిశీలనలో ఒక భాగమేనని మనం గ్రహించి వారి అనుమానాన్ని మనం తీర్చాలి. అందువల్ల పుత్రసంతానం, వధూవరుల జాతకాలు పరిశీలించేటప్పుడు ఈ అంశం ఎలా చూడాలో అన్న విషయం గూర్చి మనం ఈ క్రింద చర్చించుకుందాము. మరో ముఖ్య విషయం ఏమంటే ఈ క్రింద ఇచ్చిన గ్రహస్థితి వధూవరులలో ఎవరికైనా ఫలితం ఒకటేనని గ్రహించండి.


1. లగ్నస్థానం నుంచి పంచమ స్థానంలో రాహు శనుల సంయోగం ఉంటే పుత్ర సంతానం ఉండదు. ఆ పంచమం మీద పాపవీక్షణ ఉంటే అసలు సంతాన హీనులుగా ఉంటారు. చక్రం –1 చూడండి.




ఈ స్త్రీ జాతక చక్రంలో లగ్నం మీనం. అక్కడి నుంచి పంచమ స్థానమైన కర్కాటక రాశిలో శని రాహువుల సంయోగం ఉంది. ఈ సంయోగం మీద రవి యొక్క సప్తమ వీక్షణ మరియు కుజుని యొక్క చతుర్ధ విశేష వీక్షణ ఉంది. అందువల్ల సంతానం ఉండదు. ఒకవేళ వరుని జాతక చక్రంలో పంచమ స్థానం బలంగా ఉన్నా స్త్రీ సంతానమే ఉంటుంది కాని పురుష సంతానం ఉండదు. పైగా సంతాన విషయంలో చాలా దుష్ఫలితాలు ఉంటాయి.

2. పంచమాధిపతి పాపగ్రహమై, ఆ గ్రహం పంచమ స్థానంలోనే మరియొక పాపగ్రహంతో కలిసి ఉంటే కూడా పుత్రసంతానం ఉండదు. చక్రం –2 గమనించండి.









చక్రం–2 లో లగ్నం ధనుర్లగ్నమయినది. లగ్న స్థానం నుంచి పంచమ స్థానం అయిన మేషరాశిలో పాప గ్రహమైన కుజుడు శనితో కలిసి ఉండటం వల్ల పుత్ర సంతానం ఉండదు.


3. రెండవ అంశంలో చెప్పినట్లుగానే పంచమ స్థానంలో శని చంద్రులు ఉండి, వారిపై పాప వీక్షణ ఉంటే పుత్ర సంతానం ఉండదని గ్రహించాలి. ఈ క్రింది చక్రం –3 చూడండి.


ఈ చక్రంలో లగ్నస్థానం తుల అయినది. ఆ తుల నుంచి పంచమ స్థానం కుంభం అయినది. ఆ పంచమములో శని చంద్రులు ఇద్దరూ కలిసి ఉన్నారు. పైగా రవి యొక్క పాప సప్తమ వీక్షణ ఉంది. కాబట్టి ఈ కలయిక వల్ల పుత్ర సంతానం ఉండదు.





4. పైన ఉదహరించిన మాదిరిగానే గురు రాహువుల కలయిక పంచమంలో ఉంటే పుత్ర సంతానం ఆ దంపతులకు లోపిస్తుంది. కాని ఆ పంచమ స్థానం మీద పాప వీక్షణ ఉంటేనే ఈ ఫలితం చెప్పాలి. చక్రం –4 చూడండి. ఈ జాతక చక్రంలో ఈ జాతకుని లగ్నం కుంభ లగ్నం అయి ఉండగా లగ్న పంచమం అయిన మిధునంలో గురు రాహువుల కలయికయే కాక వారి మీద శని యొక్క సప్తమ వీక్షణ ఉండటం వల్ల పుత్ర సంతానం ఉండదని గ్రహించాలి.




5. ఏ జాతకంలో అయినా సరే పంచమాధిపతి బలహీనుడయితే అంటే పాప గ్రహంతో కలిసి ఉండడం గాని లేక శత్రు క్షేత్రంలో ఉండటం లేక పాప వీక్షణలో ఉండడం వల్ల కూడా పుత్ర సంతానం ఉండకపోవచ్చు. ఈ క్రింది చక్రం –5 చూడండి.


రాశి చక్రం






ఈ చక్రంలో లగ్నం వృశ్చిక లగ్నం అయినది. పంచమ స్థానం మీనం అయినది. పంచమాధిపతి అయిన గురువు శత్రుక్షేత్రంలో ఉన్నాడు. పైగా ధనూ రాశి నుంచి పాప గ్రహమైన కుజుని యొక్క సప్తమ వీక్షణ ఉంది. ఇలా పంచమాధిపతి అన్ని విధాల భంగపడితే పుత్రసంతానం ఉండదని తెలుసుకోవాలి.


6. లగ్నస్థానంలో ఎవరికైనా శని రాహువులు కలిసి ఉండి వారిమీద పాప వీక్షణ ఉండకూడదు.




7. వధూవరుల జాతకాలలో ఇద్దరి పంచమ స్థానాలు కనుక బుధ స్థానాలై ఉండి ఆ స్థానాల్లో బుధుడు ఉంటే, పాప వీక్షణ ఉన్నా లేకున్నా మరియు శుభ గ్రహ వీక్షణ ఉన్నా లేక శుభ గ్రహ కలయిక ఉన్నా పుత్ర సంతానం ఉండదు. ఈ క్రింది చక్రాలు–7A&7B గమనించండి.






ఈ వధూవరుల ఇద్దరి జాతకాలలోనూ పంచమ స్థానాలు బుధక్షేత్రాలై శుభ వీక్షణ అంటే ఇద్దరి పంచమ స్థానాల మీద కూడా సప్తమ గురు వీక్షణ ఉన్నా ఆ శుభ వీక్షణ నిర్బల వీక్షణమయి బుధుని యొక్క బల ప్రభావం ప్రకోపించి పుత్ర సంతాన హీనులుగా చేస్తాడు.


8. లగ్నాధిపతి మరియు రాహువు కలయిక పంచమ స్థానంలో ఉండకూడదు. పాప వీక్షణ ఉండకూడదు.








9. పంచమాధిపతి రాహువు కలిసి పంచమ స్థానంలో ఉండకూడదు. పాప వీక్షణ ఉండకూడదు.









10. అలాగే రవి రాహువులు కలిసి సప్తమ స్థానంలో ఉండకూడదు.




11. ఏ జాతక చక్రంలోనైనా పంచమాధిపతి పురుష గ్రహమై ఆ పురుష గ్రహం బుధునితో కలిసి పంచమ స్థానంలోనే ఉండి దాని మీద శుభవీక్షణ ఉంటే వారి మూడవ కాన్పు తర్వాత కవల పిల్లలు కలుగుతారు. ఈ క్రింది చక్రం చూడండి




ఈ చక్రంలో పంచమ స్థానం సింహం. సింహరాశి అధిపతి రవి. పురుష గ్రహమైన రవి బుధుని కలిసి పంచమ స్థానంలో అంటే స్వస్థానంలో ఉన్నాడు. ఈ గ్రహస్థితి వల్ల కవల పిల్లలు కలుగుతారు. ఒక ముఖ్య గమనిక ఏమంటే ఈ గ్రహస్థితి భార్యాభర్తల రెండు జాతకాలలో ఉండాలనేది పండితాభిప్రాయం.

**"పుత్ర సంతాన సిద్ధి కోసం శ్లోకం"**

దేవకిసుతా గోవిందా
వాసుదేవ జగత్పతే !
దేహిమే తనయం కృష్ణా
త్వామహం శరణం గతః !
నమోదైత్యై దుర్గాయై
సతతం నమః !
పుత్రసౌఖ్యం దేహిదేహి
గర్భరక్షా కురుష్వనః !!

# 27. ముహూర్త వివరాలు

ఈ పుస్తకం ప్రచురించిన తరువాత చాలా మంది నన్ను అభినందిస్తూ అనేక ఫోన్లు చేసారు. ముఖ్యంగా వధూవరుల దగ్గర నుంచి చాలా ఫోన్లు వచ్చాయి. వధూవరుల గురించి వారి తల్లిదండ్రుల గురించి నేను వ్రాసిన "మీది ఏ సాంప్రదాయం" అనేది చాలా నచ్చిందని మన సమాజంలో మార్పుకు ఈ వ్యాసం చాలా దోహదపరుస్తుందని తమ సంతోషం వ్యక్తం చేసారు. ఆధునిక పోకడలతో మనం చేసే పొరపాట్లను సరిదిద్దేందుకు నేను చేసిన వ్యాసంగం కనువిప్పు కాగలదని అందరూ తప్పక చదవాలని ఆకాంక్షించారు. పైగా పుస్తకం ఖరీదు చాలా తక్కువ పెట్టినందుకు "శ్రీ వెంకటేశ్వర బుక్ డిపో" అధినేతకు తమ కృతజ్ఞతలు తెలుపమని అడిగారు. వీరందరికీ నా నమోవాకములు. మరియు నా రచనలను ఆదరిస్తూ ఉన్న పాఠక మహాశయులకు నా కృతజ్ఞతలు మరోసారి తెలుపుకుంటున్నాను. వధూవరులకు నా ఆశీస్సులు.

నాకు వచ్చిన ఫోన్లలో చాలామంది "పుస్తకం చాలా బాగుంది. అన్ని విషయాలు చక్కగా సరళ భాషలో వ్రాశారు. మేము మీ పుస్తకం చదివిన తర్వాత ఏమీ తెలియని మాకు నక్షత్రాల నుంచి వివాహ నిమిత్తం వధూవరుల జాతక పరిశీలనదాకా క్షుణ్ణంగా నేర్చుకున్నాము. మరి వివాహ ముహూర్తము గురించి ఎందుకు వ్రాయలేదు? ఈ రోజుల్లో వివాహ ముహూర్తములు దోష భూయిష్టంగా పెడుతున్నారు. ఈ పుస్తకం వివాహం గురించే కాబట్టి వివాహ ముహూర్తాల గురించి కూడా వ్రాయమని వందల పాఠకులు నాకు ఫోన్ చేసారు. ఇలాంటి ఫోన్లు ఇంకా రోజూ వస్తూనే ఉన్నాయి.

వారి కోరిక తీర్చడం నా విధి అనుకున్నాను. ఎందుకంటే వివాహముహూర్తాలు చాలా దోషభూయిష్టంగానే ఉన్నాయి అనేది వాస్తవమే కాని నేను ఎప్పుడూ ఈ దోష నివారణ గురించి ఏమి చేయాలి అనే విషయం ఆలోచించలేదు. వందల పాఠకుల వద్దనుంచి వచ్చిన ఫోన్ల నేపథ్యంలో ఈ ముహూర్త విభాగం మీద విడమర్చి ఒక అధ్యాయం వ్రాసినందువల్ల ఎన్నో వేల మందికి సహాయమవుతుందని గ్రహించిన తర్వాత నేను ముహూర్త విషయాలు వ్రాయకుండా వదిలివేయడం నా యొక్క పొరపాటే అని గ్రహించాను. అందువల్ల ఇప్పుడు ఈ ముహూర్తాల గురించి వ్రాసి మీకు మరో

అధ్యాయంగా మీ అందరి కోరిక మేరకు ఈ ముద్రణలో అందిస్తానని వారి సలహా అడిగినపుడు పబ్లిషర్స్ కూడా ప్రజాభీష్టం తప్పక నెరవేర్చమని నన్ను మరీ మరీ ప్రోత్సహించారు. వారి ప్రోత్సాహం నాకు మరింత ఉత్సాహం, బలం చేకూర్చింది.

శాస్త్ర ప్రకారము వివాహములకు పంచబలములు అతి ముఖ్యమైనవిగా గుర్తించారు. మొదటిది జాతక బలం, రెండవది ముహూర్త బలం, మూడవది క్రతువు బలం, నాలుగవది ఆశీర్వచన బలం, ఆఖరిది అన్నశాంతి. వీటిని గురించి అన్నీ వివరముగా చర్చించుట ఇక్కడ సమయోచిత సందర్భము కాదు కాబట్టి మనము కళ్యాణ ముహూర్తముల గురించి మాత్రమే విపులంగా వివరాలు తెలుసుకుందాము.

ఎప్పుడూ వివాహ ముహూర్తము సాధ్యమైనంత బలమైనదిగాను, దోష రహితము గాను, పవిత్రముగాను ఉండాలి. వివాహ ముహూర్త సమయములోను లగ్నస్థితిని కూడా గమనించి ముహూర్తము పెట్టాలి. సోమ, బుధ, గురు, శుక్ర వారములు శ్రేష్ఠములు కాని చాలామంది సోమవారము చేయకూడదనే భావములో ఉన్నారు. కాని ఆ రోజు వివాహం చేసినను దోషం కాదు. కాని ఆది, మంగళ, శని వారములు అశుభ దినాలు. ఆధునికత సౌకర్యం కోసం ఈ దినాలలో వివాహములు జరుపుట ఒక ఆనవాయితీగా మారినా దోషము దోషమే కాని, ఆచరణ మరియు ఆనవాయితీ ఉన్నంత మాత్రాన శాస్త్రబద్ధం గాదని మనం అర్థం చేసుకోవాలి. సుఖ జీవిత దాంపత్యం కోసం మనం శాస్త్ర విరుద్ధ పోకడలకు పోకూడదని నా భావన. వివాహానికి వచ్చే అతిధుల సౌకర్యం కన్నా, మీ సంతాన సుఖ దాంపత్య జీవితం ముఖ్యమని గ్రహించండి. కాని ఒక ముఖ్య విషయమేమిటంటే జన్మకుండలిలో పాప గ్రహాలయిన రవి, శని మరియు కుజులు వధూవరులలో వివాహ కారకులైతే, రవి దినమైన ఆదివారం, శని దినమైన శనివారం, కుజదినమైన మంగళవారం వివాహములు చేయవచ్చును. ఒకవేళ వీరు అంటే రవి, శని, కుజులు వధూవరుల రాశి చక్రాలలో పాపులై దుష్ఫలితాలు ఇచ్చేవారైతే మాత్రం చేయకూడదు. ఇది చాలా ముఖ్యంగా గమనించవలసిన విషయం.

తిధుల విషయానికి వస్తే రిక్త తిధులు అంటే చవితి, నవమి, చతుర్దశిలలో వివాహ ముహూర్తము పెట్టకూడదు. కాని శుక్ల పక్షములో చేయవచ్చు కాబట్టి తిధులలో వీలైనంత వరకు కృష్ణ పక్ష తిధుల కన్నా శుక్ల పక్ష తిధులు మేలైనవి. ఈ తిధులతో ముహూర్తములు శ్రేష్టమైనవిగా భావించాలి. ఈ రోజుల్లో అష్టమి, అమావాస్య, షష్టి తిధులలో ముహూర్తములు పంచాంగములో ఇస్తున్నారు. కాని ఇవి దోష తిధులు. కనుక వాటిని వదిలివేయటం

మంచిది. "ముహూర్త బలం ముఖ్యం గాని తిథి ముఖ్యం కాదు" అనేవారు చాలామంది ఉన్నా, లేక అలా ఎక్కువమంది వాదించినా దోషము పోదు. దోషము దోషమేనని గ్రహించండి. సంఖ్యాబలం ఉన్న ప్రజావాదన కన్నా సంఖ్యాబలం లేకున్నా వివాహ సంస్కార క్రతువు పవిత్రత మరియు పటిష్టత అతి ప్రాధాన్యములని మనం మర్చిపోకూడదు.

ఇక నక్షత్రముల గురించి ఆలోచిస్తే రోహిణి, మృగశిర, మఖ, ఉత్తర, హస్త, స్వాతి, మూల, అనూరాధ, రేవతి వివాహమునకు అత్యంత శ్రేష్టమైనవి. మన అవసరాన్ని బట్టి అశ్విని, చిత్త, ధనిష్ట, శ్రవణం నక్షత్రములలో కూడా వివాహ ముహూర్తములు నింద్యములు కావు. పైన చెప్పిన నక్షత్రములలో రోహిణి, శ్రవణం, రేవతి, పునర్వసు, హస్త నక్షత్రములు మరింత శుభమే కాక దాంపత్య జీవితంలో సుఖాలను ప్రసాదిస్తాయి. అలాగే ఉత్తరాత్రయం అంటే ఉత్తర, ఉత్తరాషాఢ, ఉత్తరాభాద్ర కూడా శుభ నక్షత్రాలే. ఒక ముఖ్య విషయం ఏమంటే వధువు జన్మ నక్షత్రం వివాహానికి అతి శుభం. కాని ఆ వధువు నక్షత్రం వరుని తారాబలం కుదిరితీరాలి. అలా కుదరకపోతే ఆ ముహూర్తము దోషభూయిష్టమే. యోగము కూడా సరిచూచుకోవాలి. వ్యతీపాత, వైధృతి, పరిఘ యోగము మరియు ఉపపత్త దోషములు ఉండకూడదు. కరణములన్నియు తీసుకోవచ్చు కాని విష్టి కరణము మిక్కిలి దోషము కాబట్టి పూర్తిగా విసర్జించవలెను.

ఇంక లగ్న నిర్ణయము చేసేటప్పుడు సప్త లగ్నములు శ్రేష్టముగా భావించబడుచున్నవి. అవి మిధున, కర్కాటక, సింహ, కన్యా, తుల, ధనూ, కుంభ లగ్నాలని తెలుసుకోండి. ముఖ్య విషయం గమనించాల్సింది ఏమంటే రవి కనుక చంద్రాధిపత్యము గల కర్కాటకములో ఉన్నా, లేక బుధాధిపత్యమైన కన్యలో ఉన్నా ఆ లగ్నములు వివాహములకు యోగ్యములు కావు. అందువల్ల రవి ఉన్న కర్కాటక, కన్య రాశులలో వివాహ ముహూర్తములు పెట్టరాదు.

ఇంక ఏ మాసములలో వివాహము చేయవచ్చో, ఏ మాసములలో చేయకూడదో తెలుసుకుందాము. ఆషాఢ మాసం, కార్తీక మాసం, పుష్య మాసములలో వివాహములు చేయరాదు. అలాగే వివాహము నిజ జ్యేష్ఠములోనే చేయాలి కాని అధిక జ్యేష్ఠ మాసములలో చేయుట నిషిద్ధమని మనం మర్చిపోకూడదు. వధూవరులు ఇద్దరూ జ్యేష్ఠులైనప్పుడు వారి వివాహం ఎట్టి పరిస్థితుల్లోనూ జ్యేష్ఠ మాసములో చేయరాదు. అలా చేస్తే త్రిజ్యేష్ఠ దోషమవుతుంది. అందువల్ల చేయకూడదు. ప్రస్తుత కాలంలో దక్షిణాయనమైనను అవసర రీత్యా శ్రావణ మాసంలో కూడా వివాహాలు చేస్తున్నారు. ఇది ఒక అవసరంగా మొదలై

కాలక్రమేణా ఆనావాయితీగా మారిందే కాని శ్రావణ మాస ముహూర్తములు మధ్యమములుగానే గుర్తించాలి. ఇంకొక విషయం ఏమంటే శూన్య మాసములందు వివాహములు నిషిద్ధం. శూన్య మాసాలంటే 1) చైత్రమాసంలో రవి మీనరాశిలో ఉన్నప్పుడు, 2) పుష్య మాసంలో రవి ధనస్సులో ఉన్నప్పుడు, 3) ఆషాఢ మాసంలో రవి మిధునరాశిలో ఉన్నప్పుడు, 4) భాద్రపద మాసంలో రవి కన్యారాశిలో ఉన్నప్పుడు వివాహ ముహూర్తములు మిక్కిలి అశుభములు కాబట్టి ఆ మాసాల్లో వివాహములు చేయకూడదు. ఇతర విషయములు కొన్ని ముఖ్యమైనవి కూడా మనం చక్కగా పరిశీలించిన తర్వాతే ముహూర్తం పెట్టాలి. ఆ ముఖ్యాంశాలు గురించి ఈ క్రింద ఇస్తున్నాను.

1) ముహూర్త నక్షత్రముతో వధూవరుల నక్షత్రములు సరిపోవాలి. అంటే వధూవరులకు ముహూర్త నక్షత్రముతో తారాబలం సరిపోవాలి. చాలామంది ఇప్పుడు తారాబలం వధూవరులలో / ముహూర్త నక్షత్రం ఎవరో ఒకరికి కుదిరినా చాలనే పోకడలతో ముహూర్తములు పెడుతున్నారు. ఇది వివాహ జీవితంలో దుష్ఫలితాలకు తావిస్తుంది. పైగా శాస్త్ర విరుద్ధం కూడా. కాబట్టి వధూవరుల తారాబలాల విషయంలో ఎప్పుడూ రాజీపడకూడదు. ఇద్దరి నక్షత్రాలు ముహూర్త నక్షత్రం కుదిరి తీరాలని మరిచిపోవద్దు.

2) ముహూర్తములు ఎప్పుడూ పండగ దినాలలో పెట్టరాదు. సంక్రాంతి, ఉగాది, వినాయక చతుర్ధి, దసరా, దీపావళి లాంటి పర్వదినాలలో ముహూర్తములు పెట్టుట సరికాదు. ఇటువంటి పుణ్య పండుగలలో వివాహములు చేయకూడదు.

3) ఇక వివాహం ఎవరిని చేసుకోవచ్చో, ఎవరిని చేసుకోకూడదో అన్న వివరాలు అన్నీ 24వ అధ్యాయంలో వివరంగా ఇవ్వబడినాయి కాబట్టి మళ్ళీ ఇక్కడ ప్రస్తావించడము లేదు.

4) వివాహ ముహూర్తములు పెట్టేటప్పుడు ముహూర్త సమయ గ్రహస్థితి చాలా ముఖ్యం. ఈ గ్రహస్థితిని కూలంకషంగా గ్రహించి ముహూర్తములు పెట్టాలి. ఏ పాటి రాజీ కూడా పడకూడదు. ఎందుకంటే గ్రహప్రభావం ఉధృతంగా ఉండి ఒక్కొక్కప్పుడు చాలా దుష్ఫలితాలు ఇస్తాయి. సరియైన ముహూర్త బలం లేకపోతే దాంపత్య విచ్ఛిన్న, వైధవ్యం, లేక సంతాన హీనత, రవి రాహువుల దోష ప్రభావం వల్ల దీర్ఘ కాల వ్యాధులకు వధూవరులు లోనుకావచ్చు. ఇంకా ఏలాంటి అశుభములైనా కలగవచ్చు. అందువల్లే గ్రహస్థితి వ్యతిరేకత ఉన్న ముహూర్తములు పెట్టకూడదు. ఒక్క విషయం ఏమంటే ఇప్పుడు వారికి కావలసిన దినాలలో, వారికి ఇష్టం వచ్చిన సమయంలో ముహూర్తాలు

పెట్టమని శాస్త్రజ్ఞుడిని చాలామంది తల్లిదండ్రులు ఒత్తిడి చేస్తున్నారు. మనం అలాంటి ప్రభావాలకు లోనై శుభము అని ముహూర్తములు మనం ఎప్పుడూ పెట్టకూడదు. అంటే పండితుడు పెట్టిన ముహూర్తానికి వివాహం చేయాలే కాని వారికిష్టమైన తేదీ, సమయాలలో ముహూర్తాలు పెట్టమని పండితుడిని ఒత్తిడి చేయకూడదు. ఉదాహరణకు “మా అబ్బాయి రాత్రి ముహూర్తమే కావాలంటున్నాడు. ఎందుకంటే దీపాలంకరణ బాగా చేయవచ్చు. దీపాల వల్ల వివాహ వేదిక డాంబికంగా, దర్పంగా ఉంటుందని గాని, లేక మా ఆడపడుచుది బొంబాయి అనీ ఆ తేదీకు రాదు అనీ, లేక మా తమ్ముడు పిల్లలకు పరీక్షలు కాబట్టి ఆ ముహూర్తం వద్దని, నన్ను ప్రలోభ పెట్టడానికి ప్రయత్నిస్తూనే ఉన్నా, నేను ఎట్టి పరిస్థితుల్లోనూ వారి మాట వినక ముహూర్త బల ప్రాముఖ్యం గురించి విశ్లేషించి చెప్పి తదనుగుణంగా ముహూర్తము పెడతానే గాని వచ్చిన వారి ఇష్ట ప్రకారం కాదు. అందరూ కూడా ఈ సత్యాన్ని అర్థం చేసుకొని వివాహ ముహూర్తములో ఉన్న పటిష్ఠతను గ్రహించాలని నా మనవి. శాస్త్ర పండితులు ధనాకర్షణకు తలొగ్గి తప్పుడు ముహూర్తములు పెట్టకూడదు. లేక మొహమాటపడి ముహూర్త విషయంలో ఏలాంటి రాజీపడకూడదు.

1) లగ్న స్థానము నుంచి షష్టమ, సప్తమ స్థానాలలో చంద్రుడు ఉండకూడదు. అలా ఉంటే దానికి ఘాత దోషము ఉంటుంది. అలాగే చంద్రుడు వివాహ ముహూర్త లగ్నములో గాని, షష్ట, అష్టమ, ద్వాదశ స్థానాలలో ఉండరాదు. అలా ఉంటే చంద్ర దోషం అవుతుంది. ఈ చంద్ర దోషం వల్ల చంద్రుడు మారక ఫలం ఇస్తాడు కాబట్టి దోషం ఉద్ధృతం అని మీరు గ్రహించాలి. చంద్రుడు ఏ రాశిలో అయినా సరే శుద్ధి చంద్రుడుగా ఉండాలి. అంటే పాప వీక్షణ గాని, లేక పాప గ్రహ సంయోగము గాని పనికిరాదు. ద్వాదశ చంద్రుడు వల్ల కలిగే దోషం రిప్ఫ దోషం అంటారు.

2) సప్తమ స్థానము వధూవరులకు కళ్యాణ స్థానము, ఈ కళ్యాణ స్థానము శుద్ధిగా ఉండాలే తప్ప ఏ పాపగ్రహము ఉండకూడదు. అలాగే ఏ శుభగ్రహము కూడా ఉండరాదు. వివరంగా చెప్పాలంటే సప్తమ స్థానం శూన్య స్థానమై ఉండాలి.

3) రవి కృత్తికా నక్షత్రములో ఉన్నప్పుడు మహూర్తములు పెట్టకూడదు. కర్తరిలో రవి కృత్తికలో ఉంటాడు కాబట్టి జాగ్రత్తగా పరిశీలించాలి.

4) రవి కర్కాటకము నందుగాని, కుంభరాశి యందుగాని, లేక ధనూ రాశులలో ఉన్నప్పుడు ముహూర్తములు పెట్టరాదు.

5) గురువు సింహరాశిలో ఉన్నప్పుడు ముహూర్తములు పెట్టరాదు.

6) రవి శుక్రుని కలిసి ఏక రాశిలో ఎన్ని రోజులు ఉంటాడో, ఆ రోజులన్నింటిలోనూ వివాహ ముహూర్తము పెట్టరాదు. శుక్రమౌఢ్యమి దోషం ఉంటుందని గ్రహించండి.

7) రవి గురువు కలిసి ఏక రాశిలో ఎన్ని రోజులు ఉంటాడో ఆ రోజులన్నింటిలోనూ ముహూర్తములు పెట్టరాదు. గురు మౌఢ్యమి దోషం ఉంటుందని గ్రహించండి.

8) కాని ఒక్క విషయం ఏమంటే ముహూర్త లగ్నం మీద గురువు యొక్క విశేష దృష్టి ఉంటే చాలా శ్రేష్టము.

9) ముహూర్త లగ్నం మీద కళ్యాణ కారకుడైన శుక్రుని యొక్క సప్తమ వీక్షణ కూడా ప్రశస్తమని మనం తెలుసుకోవాలి.

10) గురువు ఉదయించిన రోజు నుంచి 15 రోజులు మరియు అస్తమించుటకు ముందు 15 రోజులలో ముహూర్తము పెట్టరాదు.

11) శుక్రుడు పడమర అస్తమించబోవుచున్న ముందు 5 రోజులు ఉదయించిన తరువాత 3 రోజులలో ముహూర్తము పెట్టరాదు. ఒకవేళ శుక్రుడు తూర్పున అస్తమించి పడమర దిశలో ఉదయిస్తున్న తరుణంలో ఆ శుక్రాస్తమయానికి ముందు 15 రోజులు ఉదయానంతరం 10 రోజులు తప్పక విడువవలెనని నియమము.

12) ముహూర్త సమయంలో తృతీయ, షష్టమ, ద్వాదశ స్థానాలలో పాపగ్రహాలు ఉండడం మేలు.

13) వరునికి గాని, లేక వధువుకు గాని ముహూర్త సమయంలో లగ్న, రవి, చంద్ర బలములు చాలా ముఖ్యం. వరునికి రవి బలము, కన్యకు గురు బలము తప్పకుండా ఉండవలెను.

14) ముహూర్త సమయంలో వర్జ్య, దుర్ముహూర్తాది దోషములు ఉండరాదు.

15) వధువుకు గాని లేక వరునికి వారి వారి జన్మ లగ్న స్థానం నుంచి గాని, లేక చంద్ర రాశి నుంచి గాని అష్టమ, ద్వాదశ రాశులలో ముహూర్తము పెట్టరాదు.

16) అష్టమ స్థానములో ఏ గ్రహము ఉండకూడదు. అంటే అష్టమ స్థానం శూన్య స్థానమై ఉండాలి కాని, ఆ స్థానంలో పాపగ్రహాలు లేక శుభ గ్రహాలు గాని ఉండకూడదు. దీన్ని అష్టమ శుద్ధి అంటారు.

17) లగ్నము మీద గురువీక్షణ ఉన్నా, లేక ఆయన విశేష వీక్షణ ఉన్నా శుభము. ఒకవేళ లగ్న స్థానములో గురువు ఉంటే అది అత్యంత శుభముగా భావించాలి.

లగ్నస్థానములో గురువు ఉన్నా లేక లగ్న స్థానం మీద గురువీక్షణ ఉన్నా ముహూర్త గ్రహస్థితిలోని దోషాలను హరించి వేయునని శాస్త్రము చెపుతుంది.

18) రవి చంద్రుల సంయోగం ఏ రాశిలోను ఉండకూడదు. అంటే వివాహ సమయ దినమున అంటే ఆ తిథిలో లగ్నం నుంచి చూసినప్పుడు ఏ రాశిలోకూడా రవిచంద్రులు కలిసి ఉండకూడదు. అలా ఉంటే అత్యంత దారిద్ర్యంతో దాంపత్య జీవితమంతా దు:ఖమయమవుతుంది. అలాగే చంద్ర కుజ కలయిక కూడా నిషిద్ధం. ఎందుకంటే వారు మారక ఫలితం ఇస్తారు. ఇంకొక విషయం ఏమంటే బుధ చంద్రుల సంయోగం ఏ రాశిలోనైనా ఉంటే సంతాన హీనత్వం వస్తుంది. అలాగే గురు చంద్రుల కలయిక వల్ల ఆ వరునకు వేశ్యాభిలాష, లేక పరకాంత వ్యామోహం ఉంటుంది. చంద్రుడు శనితో కలిసి ఉండకూడదు. అలా ఉంటే ధనము చేతిలో నిలువక ధనాభావముతో బాధపడతారు. ఋణగ్రస్తులు కూడా కావచ్చు. ధనవ్యయం విపరీతంగా చేసి నష్టాల పాలవుతారు.

ఇక ఛాయా గ్రహాలయిన రాహు కేతువుల విషయానికి వస్తే రాహువు కలహములకు మూలకారకుడయి అందరితోనూ విరోధం కలుగజేస్తాడు. కేతువు దు:ఖాన్ని, ఆవేదనని కలుగజేస్తాడు. సంతోషము, శాంతి దాంపత్యంలో లోపిస్తాయి. అందువల్లే ఎప్పుడూ చంద్రుడు ఒంటరిగా ఏ రాశిలోనైనా ఉండాలి. ఎవ్వరితోనూ కలిసి ఉండకూడదు. అందుకనే చంద్రుడు శుద్ధి చంద్రుడుగా ఉండాలి అని శాస్త్రం చెపుతుంది.

19) ఇప్పుడు మనం సప్తమ శుద్ధి గురించి తెలుసుకుందాం. ముహూర్త లగ్న స్థానం నుంచి సప్తమ స్థానం శూన్యంగా ఉండడం శ్రేష్ఠము. అంటే ఆ స్థానములో ఏ గ్రహము ఉండకూడదు. ఇప్పుడు ఎవరెవరు సప్తమ స్థానంలో ఉంటే ఏ దోషమో తెలుసుకుందాం. లగ్న స్థానంలో రవి ఉండనేకూడదు. అలా ఉంటే స్త్రీకి వైధవ్య ప్రాప్తి కలుగుతుంది. చంద్రుడు ఉంటే ఆ వరునికి ద్వితీయ కళత్రము ఉంటుంది. అధవా లేకున్నా వేశ్యా వాంఛ, పరస్త్రీ సాంగత్యం తప్పక ఉంటుంది. సప్తమ కుజుడు తప్పక మారకత్వం కలుగజేస్తాడు. బుధుడు సప్తమంలో ఉంటే పుత్రదోషం ఉంటుంది. అంటే పుత్రులు ఉండరు. అధవా ఉన్నా అంగవైకల్యంతో జన్మిస్తారు. లేక పుత్రోదయమైనా ఆ శిశువు బాలారిష్ట దోషం వల్ల మరణిస్తాడు. సప్తమ గురుని వల్ల మిక్కిలి దరిద్ర బాధ అనుభవిస్తారు. ఋణాల బారిన పడి దు:ఖంతో జీవితం గడుపుతారు. శుక్రుడు ఉంటే సుఖ రోగములతో బాధపడతారు. జీవిత కాలం అంతా వ్యధతో శారీరక లేక యౌవన సౌఖ్యం అనుభవించలేక

న్యూనతా భావంతో, నిర్లిప్తతకు లోనై, దు:ఖమయ జీవితం గడుపుతారు. శని సప్తమంలో ఉంటే దోషం ఉద్ధృతం అని గమనించాలి. ఎందుకంటే సప్తమ శని వల్ల మారకత్వ ప్రభావం ఎక్కువగా ఉండటం వల్ల మరణం సంభవిస్తుంది. అలాగే సప్తమ రాహువు వల్ల అత్తగారికి లేక మామగారికి లేక మెట్టినింట్లో వారికి మరణం సంవత్సరంలోగా కలుగుతుంది. వరుడికి కూడా ఇదే ఫలితం ఉంటుంది.

20) గురు బుధులు సమసప్తమాలుగా ఉండకూడదు. అంటే మీన గురువు, కన్యా బుధుడు గాని లేక ధనూ గురువు, మిధున బుధుడుగాని ఎట్టి పరిస్థితుల్లో ఉండకూడదు.

21) దగ్ధ యోగ దినాలలో వివాహ ముహూర్తములు పెట్టరాదు. మీ సౌలభ్యం కోసం దగ్ధ యోగ దినాల వివరణ ఈ క్రింద ఇస్తున్నాను. జాగ్రత్తగా గమనించండి.

**దగ్ధ యోగ దోష దిన పట్టిక**

| సంఖ్య | వారములు | తిధులు | నక్షత్రములు |
|---|---|---|---|
| 1 | ఆదివారం | నవమి | భరణి |
| 2 | సోమవారం | ఏకాదశి | చిత్త |
| 3 | మంగళవారం | పంచమి | ఉత్తరాషాఢ |
| 4 | బుధవారం | తదియ | ధనిష్ఠ |
| 5 | గురువారం | షష్ఠి | ఉత్తర |
| 6 | శుక్రవారం | అష్టమి | జ్యేష్ఠ |
| 7 | శనివారం | ద్వాదశి | రేవతి |

**ముఖ్య విశ్లేషణ :** ఈ పైన ఇచ్చిన వారాలకు ఎదురుగా ఇచ్చిన తిధిగాని, లేక నక్షత్రం గాని లేక రెండూ కలిపి గాని లేక వేరు వేరుగా ఉండినా ఆ దినాలలో వివాహములు చేయకూడదు. కాబట్టి ఈ దోషాలు గమనించి ముహూర్తాలు పెట్టవలెను.

ఇప్పుడు ముహూర్తములు ఎలా నిర్ణయించాలో చూద్దాము.

1) ఏ మాసములో చేయవచ్చునో ఆ మాసము తీసుకోవలెను.

2) ఏ తిధులు పనికి వచ్చునో ఆ తిధి నిర్ణయము చేయాలి

3) ఏ వారములో చేయవచ్చునో ఆ వారము గుర్తించాలి

4) సమయమును నిర్ణయించి ఆ సమయము సూర్యోదయ కాలమునకు లగ్న ప్రమాణము గుర్తించి ముహూర్తము పెట్టవలెను. మనం నిర్ణయించిన సమయం పైన చెప్పిన దోషములు లేకుండా ఉండవలెను.

5) మనం ఎంచుకున్న సమయంలో వర్జ్యము, దుర్ముహూర్తము, రాహు కాలములు లేకుండా చూసుకోవాలి.

6) ముహూర్త నక్షత్రమునకు వధూవరుల తారాబలం కుదరాలి. చంద్రబలం ఉండాలి. దుర్ముహూర్తము పగలు దిన ప్రమాణాన్ని బట్టి మారుతూ ఉంటుంది. అంటే దిన ప్రమాణము సరిగ్గా 30 ఘడియలు ఉన్నప్పుడు, సూర్యోదయ మరియు సూర్యాస్తమయ సమయములకు సరిపడు 6 గంటలు ఎప్పుడు వస్తాయో చూడాలి. దానికి ఈ క్రింది పట్టిక ఘడియలు, విఘడియలలో కాకుండా మీ సౌకర్యం కొరకు గంటలు నిమిషాలలో ఇచ్చాను.

**"దుర్ముహూర్త నిర్ణయ పట్టిక"**

| | | |
|---|---|---|
| 1 | ఆదివారం | సాయంత్రం 4-24 |
| 2 | సోమవారం | మధ్యాహ్నం 12-24 మళ్ళీ 2-48 |
| 3 | మంగళవారం | ఉదయం 8-24 మళ్ళీ 10-48 రాత్రి |
| 4 | బుధవారం | మధ్యాహ్నం 11-36 |
| 5 | గురువారం | ఉదయం 10-00 మళ్ళీ 2-48 |
| 6 | శుక్రవారం | ఉదయం 8-14 మళ్ళీ 12-24 |
| 7 | శనివారం | ఉదయం 6-00 -- |

ముఖ్య విషయం ఏమంటే ప్రతిరోజూ దుర్ముహూర్తము ప్రవేశ కాలము నుంచి 45 ని॥ ఉంటుంది. కాని ఒక్క శనివారం మాత్రం 1గం॥ 35 ని॥ ఉంటుందని మనం జాగ్రత్తగా గుర్తు పెట్టుకోవాలి.

ఇలాగే రాహుకాలమును కూడా పరిశీలించాలి. రాహు కాల సమయంలలో ముహూర్త నిర్ణయం చేయకూడదు. అందువల్ల రాహుకాలం ప్రతిరోజు ఎప్పుడు వస్తుందో కూడా ఇక్కడ వివరంగా ఒక పట్టిక ఇస్తున్నాను.

## "రాహుకాల నిర్ణయ పట్టిక"

| సంఖ్య | వారము | ప్రారంభం | అంత్యకాలం |
|---|---|---|---|
| 1 | ఆదివారం | సాయంత్రం 4-30 | 6-00 |
| 2 | సోమవారం | ఉదయం 7-30 | 9-00 |
| 3 | మంగళవారం | మధ్యాహ్నం 3-00 | 4-30 |
| 4 | బుధవారం | మధ్యాహ్నం 12-00 | 1-30 |
| 5 | గురువారం | మధ్యాహ్నం 1-30 | 3-00 |
| 6 | శుక్రవారం | ఉదయం 10-30 | 12-00 |
| 7 | శనివారం | ఉదయం 9-00 | 10-30 |

రాహుకాలం ప్రవేశకాలం నుండి 1 గం॥ 30ని॥ ఉంటుంది.

లగ్న ముహూర్త స్థానములో గురువు ఉండిన లక్షదోషాలు హరిస్తాడని, శుక్రుడున్నా యాభైవేల దోషాలు హరిస్తాడని మరియు బుధుడున్నా పదివేల దోషాలు హరిస్తాడని శాస్త్రం చెపుతున్నా ఆ దోషాలు స్వల్ప దోషాలైతే పోతాయి కాని ఏక వింశతి మహా దోషాలు నశించి పోతాయని మనం భావించకూడదు. మరి మీకు మహా దోషములు ఏవో, స్వల్ప లేక అల్ప దోషములు ఏవో కూడా ఇక్కడ వివరిస్తే మీకు చాలా అనుమానాలు నివృత్తి అవుతాయనే భావంతో ఈ రెండు దోషములు గురించి విపులంగా వివరిస్తున్నాను.

ముందర మనం మహా దోషములు గురించి చర్చించుకుందాము.

1) పంచాంగ శుద్ధిలేకపోవడము
2) రవి సంక్రమణ దినము
3) శుక్ర మౌఢ్యమి ఉన్న మాసము
4) గురు మౌఢ్యమి ఉన్న మాసము
5) దుర్ముహూర్త సమయ దోషము
6) భృగు షట్క దోషము
7) కుజాష్టమ దోషము
8) గ్రహణ సమయ కాల దోషము

9) వైధృతి మరియు వ్యతీపాత దోషము

10) శూన్య మాస దోషము

11) గండాంత దోషము

12) చంద్ర కర్తరి దోషము మొదలగునవి.

ఇప్పుడు స్వల్ప దోషములు ఏవో పరిశీలిద్దాం.

1) అకాల మేఘ ఘీంకారము

2) గురు శుక్రులు సప్తమములో కలిసి ఉండటం

3) తోకచుక్క పొడిచిన సమయము

4) శూన్య తిథులు

5) దగ్ధ యోగ తిథి నక్షత్ర కాలములు మొదలగునవి.

ఈ స్వల్ప దోషములు లగ్నం మీద గురు, బుధ, శుక్ర వీక్షణ ఉన్నా లగ్నంలో ఈ గ్రహాలలో ఏ ఒక్క గ్రహం ఉన్నా దోష రహితములని మనం తెలుసుకోవాలి.

స్థూలంగా చెప్పాలంటే ముహూర్త నిర్ణయము గురించి వాటి దోషములు ఇత్యాది విషయాలు మీకు అర్థమయ్యే రీతిలో వివరించాను. ఇది చదివి మీరు స్వయంగా ముహూర్తం పెట్టే సాహసం చేయక గురు ముఖంగా ఇంకా ఎన్నో విషయాలు నేర్చుకొని, ఆయన వద్ద అనుభవం సంపాదించండి గాని ముహూర్తం పెట్టడం అనే విషయం తేలికగా తీసుకోవద్దని నా మనవి.

**వివాహ లగ్న పటలం :** వివాహ ముహూర్తాలు పెట్టేటప్పుడు మనం ముహూర్త లగ్నం నిర్ణయించిన తర్వాత ఆ లగ్నంలో గాని, లేక లగ్న స్థానం నుంచి ఏ గ్రహం ఎన్నో స్థానంలో ఉందో ఆ గ్రహస్థితిని కూడా మనం జాగ్రత్తగా పరిశీలించాలి. అలా పరిశీలించడానికి మీ సౌకర్యం కొరకు ఒక పట్టిక రూపంలో ఇస్తున్నాను. దీనివల్ల మీకు ఒక అవగాహన ముహూర్త బలం మీద ఏర్పడుతుంది. ఒక ముఖ్య విషయం ఏమంటే ఏ స్థానంలో నయినా పాపగ్రహం ఉన్నా దాని మీద గనుక గురువీక్షణ ఉంటే ఆ దోషం పరిహారం అవుతుందని గ్రహించాలి. గురువు గాని లేక శుక్రుడు గాని అస్తంగతులైతే ఆ స్థాన రాశిని ముహూర్త లగ్న రాశిగా నిర్ణయించకూడదు.

| స్థానం | రవి | చంద్రుడు | కుజ | బుధ | గురు | శుక్ర | శని | రాహు |
|---|---|---|---|---|---|---|---|---|
| లగ్నం | వైధవ్యం | ఆయుక్షయం | వైధవ్యం | సాధ్వి | సాధ్వి | సాధ్వి | దరిద్రం | మృతపుత్ర |
| 2 | దరిద్రం దుఃఖం | బహుపుత్రవతి | దరిద్రం, దుఃఖం | మానవతి, సౌభాగ్యవతి | ధనవతి, సౌభాగ్యవతి | ధనవతి సౌభాగ్యవతి | దరిద్రం, దుఃఖం | దరిద్రం దుఃఖం |
| 3 | పుత్రవతి | పుత్రవతి, ధనవతి | పుత్రవతి, ధనవతి | పుత్రవతి, ధనవతి | పుత్రవతి, ధనవతి | పుత్రవతి, ధనవతి | కీర్తివతి, ధనవతి | మృత్యుప్రదం, సౌభాగ్యవతి |
| 4 | దౌర్భాగ్యవతి | దౌర్భాగ్యవతి | అల్పధనవతి | సౌఖ్యం | సౌఖ్యం | సౌఖ్యం | అల్ప క్షీణవతి | పాపత్ని |
| 5 | నష్టపుత్రి | కన్య శీఘ్ర మరణం | నష్టపుత్రి | బహుపుత్రవతి | బహుపుత్రవతి | బహుపుత్రవతి | ఉగ్రరోగం | మరణం |
| 6 | సౌభాగ్యవతి, భక్తిశీల | వైధవ్యం | సౌభాగ్యవతి, భక్తిశీల | ధనవతి, కలహప్రియ | సౌభాగ్యవతి, భక్తిశీల | దరిద్రం | సౌభాగ్యవతి భక్తిశీల | సౌభాగ్యవతి, భక్తిశీల |
| 7 | వ్యాధి | ప్రవాసం | బంధనం | క్షయం | మృత్యు | మరణం | వైధవ్యం | ధననాశనం |
| 8 | సౌభాగ్యవతి | మృత్యు | రోగసహిత | పతివియోగం | పతివియోగం | మృత్యు | ధనవతి | మృత్యు, పతిప్రియ |
| 9 | ధర్మశీల | స్త్రీ ప్రసవ భ్రమణం | ధర్మశీల | ఆరోగ్యం | ధర్మశీల | ధర్మశీల | వంధ్య | వంధ్య |
| 10 | పాపాసక్త | ధనహీన | మృత్యు, వ్యభిచారి | సౌభాగ్యవతి | సౌభాగ్యవతి | సౌభాగ్యవతి, ధనవతి | పాపాసక్త, ధనవతి | వైధవ్యం |
| 11 | బహుపుత్రవతి | ధనవతి | పుత్రిన్విత | ధనవతి | ఆయుష్మతి | ధనవతి | ధనాద్య | సౌభాగ్యవతి |
| 12 | దరిద్రవతి | ధనవ్యయకరి | మానవతి | బహుపుత్రవతి | ధనవతి | పతివ్రత | మానవతి | కులట |

# 28. నపుంసకత్వం


ఈ పుస్తకం అంతా వ్రాసి, ముద్రణకు పంపించిన తర్వాత నా దగ్గరకు ఒక అమ్మాయి, ఆ అమ్మాయి తల్లిదండ్రులు వచ్చారు. వారు మాట్లాడుతూ తమ అల్లుడు నపుంసకుడని ఆరోగ్యరీత్యా పరీక్షించి వైద్యులు ఇతడు దాంపత్య జీవితానికి అనర్హుడని తేల్చి చెప్పారని, అందువల్ల న్యాయస్థానం ఇద్దరికి విడాకులు మంజూరు చేసిందని, ఇప్పుడు తమ కుమార్తెకు మరల వివాహం చేయాలనే తలంపుతో ఉన్నామని, కాబట్టి మంచి సంబంధం ఉంటే చెప్పమని అడిగారు. జడ్జిమెంటు కాపీలూ, పై లోపం వరుడికి ఉందని రుజువైంది కాబట్టి విడాకులు మంజూరు చేస్తున్నట్లుగా న్యాయాధిపతి పేర్కొన్నారు.

వారు వెళ్ళిన తర్వాత నేను ఆలోచనలో పడిపోయాను. నేను ఇంత పుస్తకం వ్రాసినా అత్యంత ముఖ్యమైన అంటే సాంసారిక జీవితానికి ప్రాణమైన పురుష సామర్థ్యం గురించి వ్రాయకపోవడం పెద్ద లోపమనే అనిపించింది. జాతక పరిశీలనలో నేను వ్రాసిన అంశాలు అన్నీ చూసినా, ఈ అంశం మాత్రం విడిచిపెట్టడం తప్పు అని నాకు రూఢిగా అర్థమైపోయింది. అందుకని ముద్రణ ఆపివేయించాను. తర్వాత అనారోగ్యం వల్ల కొన్ని రోజులు పుస్తకం ఆగిపోయింది. ఎంతో ప్రాముఖ్యం గల అంశం విడిచిపెట్టడానికి మనసు అంగీకరించక ఈ క్రింది విషయాలను వ్రాసి మీకు ఆఖరి అధ్యాయంగా చేసి అందిస్తున్నాను. వధూవరుల జాతక పొంతన పరిశీలించేటప్పుడు ఈ అధ్యాయంలోని అంశం కూడా ఒకసారి జాగ్రత్తగా పరిశీలించి చూడడం ప్రతి జ్యోతిష్యుని విధి అని మళ్లీ మళ్లీ చెప్పక్కరలేదు అనుకుంటాను. ఇప్పుడు అసలు విషయానికి వద్దాము.

1) ఏ పురుష జాతకంలోనైనా లగ్నంలో పాపగ్రహం ఉండటమే కాక కర్కాటక, వృశ్చిక మరియు మీన రాశులు, ఆ జాతకుని లగ్నస్థానం నుంచి షష్టమ ద్వివ్వాదశ రాశులుగా ఉండి అందు శని ఉండి, ఆ శని మీద పాపగ్రహ వీక్షణ ఉన్నా, మరొక పాప గ్రహంతో సంయోగం చెంది ఉన్నా అతడి పురుష సామర్థ్యం ఉండదు.

ఈ చక్రం చూడండి.

| | | | |
|---|---|---|---|
| బు | కు | | చం |
| లగ్నం రవి కే | 1 | | శని |
| శు | | | రా |
| | | | గు |





ఈ జాతకునికి లగ్నస్థానం నుంచి షష్టమ స్థానం కర్కాటకమయి అందు శని ఉన్నాడు. ఆ శని మీద మేష రాశి నుంచి పాపగ్రహమైన కుజుని యొక్క చతుర్ధ వీక్షణ వల్ల దోషం. పైగా లగ్న స్థానంలో రవి యొక్క నివాసం గమనించండి. మిధునరాశి నుంచి శని మీద రాహువు యొక్క ద్వాదశ వీక్షణ కూడా ఉండటం వల్ల ముగ్గురి పాపగ్రహ వీక్షణలు మరియు లగ్నం నుంచి షష్టమ కర్కాటక శని వల్ల ఈ జాతకునికి పురుష సామర్థ్యం ఉండదు.

2) లగ్న స్థానం నుంచి షష్టమంలో కాని ద్విద్వాదశ స్థానాలలోకాని శని ఉండి ఆ శని మీద పాపవీక్షణ ఉన్నా లేక శని కనుక 6,12 దుర్భల స్థానంలో అంటే మేషరాశిలో ఉండి లగ్నస్థానంలో పాపగ్రహం ఉంటే లేక లగ్నాధిపతి అస్తంగతుడైనా, లేక భంగపడినా ఆ జాతకుడికి పురుష సామర్థ్యం ఉండదు.


ఈ క్రింది చక్రం చూడండి.


| | | | |
|---|---|---|---|
| | శ చం | కుజ లగ్నం | కే |
| | 2 | | |
| గు | | | శు ర |
| రా | | | బు |



ఈ జాతకునిది వృషభ లగ్నం. ఆ లగ్న స్థానం నుంచి ద్వాదశ స్థానమైన మేష రాశిలో శని బలహీనుడై దుర్భలుడుగా ఉన్నాడు. పైగా లగ్న స్థానంలో పాపగ్రహమైన కుజుడు ఉండటమే కాక లగ్నాధిపతి అయిన శుక్రుడు సింహరాశిలో గ్రహనాథునితో కలియుట చేత అస్తంగతుడయ్యాడు. అందువల్ల ఈ జాతకుని చక్రం పరిశీలించిన తర్వాత ఈతనికి పురుష సామర్థ్యం లేదని గ్రహించాలి.


3) ఏ పురుష జాతక చక్రంలోనైనా లగ్నస్థానంనుంచి ద్వితీయ, పంచమ, సప్తమ స్థానాలలో బుధ, శని, కేతువులు కనుక ఏ స్థానంలోనైనా ఉండి వారికి పరస్పర వీక్షణ ఉంటే ఆ జాతకుడు పుంసత్వముండదని తెలుసుకోవాలి. ఈ క్రింది చక్రం చూడండి. ఈ జాతకుని చక్రంలో లగ్నం మీన రాశి. పంచమంలో శని ఉండి తృతీయ వీక్షణంగా బుధుని చూస్తున్నాడు. అంటే పరస్పర దృష్టి బలంగా ఉంది కాబట్టి ఈ జాతకునికి పురుష సామర్థ్యం ఉండదని గ్రహించాలి.





4) ఏ పురుష జాతక చక్రంలోనైనా చంద్ర శుక్ర సంయోగం కనుక మేషం, మిధునం, సింహం, తుల, ధనస్సు, కుంభంలో ఉండి వారిమీద శని వీక్షణ ఉంటే అట్టి జాతకునికి పురుషత్వముండదని అర్థం చేసుకోవాలి.


5) శని శుక్ర సంయోగం లగ్నస్థానం నుంచి అష్టమ స్థానంలో గాని లేక, దశమ స్థానంలో గాని ఉండి వారి మీద బుధ వీక్షణ ఉంటే ఆ జాతకుని నపుంసకునిగా భావించవచ్చు. ఈ చక్రం చూడండి.





ఈ జాతకుని దశమ స్థానంలో శని శుక్ర కలయిక కలిగి ఆ కలయిక మీద నపుంసకుడైన బుధుడు స్వస్థాన వీక్షణ వల్ల పురుష సామర్థ్యం ఉండదు.

6) ఏ పురుష జాతకంలోనైనా శనాధిపత్యంలోని ఏ రాశిలోనైనా రవి శనుల సంయోగం ఉండి సప్తమాధిపతి మీద పాపవీక్షణ ఉంటే ఆ జాతకుడికి పురుష సామర్థ్యముండదు. ఈ క్రింది చక్రం చూడండి.









శనికి ఆధిపత్యం మకర కుంభాలు. ఈ చక్రంలో కుంభరాశిలో రవి శని కలిసి ఉన్నారు. వారి మీద స్వక్షేత్రం నుంచి పాపగ్రహము దాంపత్య నాశనకారి అయిన కుజుని చతుర్థ వీక్షణే కాక రాహువుకు ఉచ్ఛస్థానమైన మిధున రాశినుంచి శని రవిల మీద రాహు వీక్షణ కూడా ఉంది. జాగ్రత్తగా గమనించండి. శుక్రుడు శత్రు స్థానంలో ఉన్నాడు. గురువు దుర్బలుడైనాడు కాబట్టి గురుబలం లేదు. ఎందుకంటే సప్తమాధిపతి అయిన బుధుని మీద గురువు యొక్క పంచమ శత్రు వీక్షణ వల్ల దాంపత్య జీవితం ఛిద్రమౌతుంది.

7) ఎవరి పురుష జాతకంలోనైనా శుక్ర స్థానం నుంచి లెక్కపెట్టినప్పుడు షష్టమ,

అష్టమ, ద్వాదశ రాశులలో శని బుధులు సంయుక్తంగా కలిసి ఉండి ఆ కలయిక మీద పాపవీక్షణ ఉంటే అట్టి జాతకులకు పురుష సామర్థ్యం ఉండదు. ఈ క్రింది చక్రం చూడండి.


శుక్రస్థానం నుంచి షష్టమ స్థానంలో బుధ శని సంయోగం ఉంది. వారి మీద





చతుర్ధ కుజ వీక్షణ వల్ల దోషం అని గ్రహించి అలాగే నక్షత్రం గుర్తులు ఉన్న అష్టమ లేక ద్వాదశ స్థానాలలో శని బుధులున్నా దోషమని మీరు గ్రహించండి. కాని అష్టమ, ద్వాదశ స్థానాల మీద పాపగ్రహ దృష్టి ఉండాలని మర్చిపోకండి ఇక్కడ అష్టమ స్థానం మీద.


8) ఏ పురుష జాతక చక్రంలోనైనా చంద్రుడు మరియు శుక్రుడు కలిసి ఏ పురుష రాశిలోనైనా ఉండి లగ్నం గాని, రవి సప్తమవీక్షణ మరియు ద్వాదశ స్థానం మీద శని యొక్క సప్తమ వీక్షణ ఉంది అని గ్రహించండి. బుధాధిపత్య రాశులైతే లేక బుధుడు శత్రు క్షేత్రంలో ఉన్నా ఆ జాతకునికి పుంసకత్వముండదని తెలుసుకోవాలి. ఈ చక్రం చూడండి.




ఈ చక్రంలో చంద్ర శుక్ర సంయోగం పురుష రాశిలో ఉంది. లగ్నాధిపతి బుధుడు శత్రు క్షేత్రంలో ఉన్నాడు. పైగా లగ్నం బుధాధిపత్యంలో ఉండగా ఆ లగ్నానికి సప్తమ కుజవీక్షణ ఉందని గమనించండి.


9) సాధారణంగా ఎవ్వరూ వధూవరుల జాతక పొంతన పరిశీలించేటప్పుడు నవాంశ చక్రం పరిశీలించరు. కాని నవాంశ చక్రం వైవాహిక జీవిత సరళిని, భార్యాభర్తల దాంపత్యంలోని మధురిమలను మరియు ఇతర లోపాలను కూడా చూపిస్తుందని మనం మరచిపోకూడదు. నవాంశ చక్రంలో ఏ పురుష జాతకంలోనైనా కేతువు మీద సప్తమ వీక్షణగా శని మరియు బుధుని వీక్షణ ఉండకూడదని తెలుసుకోండి. ఈ దోషం ఉంటే దోష ప్రభావం వల్ల అతనికి రతి మీద విముఖత ఉంటుంది. ఎక్కువ కాముకత్వము చూపి స్త్రీని రంజింపచేయలేకపోవచ్చు. క్రింది చక్రం చూడండి.





కేతువు మీనరాశిలో ఉన్నాడు. ఆ రాశి మీద బుధ, శని సప్తమ వీక్షణ సంయుక్తంగా ఉంది. ఇలా ఒకే స్థాన వీక్షణలు దోషం అని మీరు అర్థం చేసుకోవాలి.

10) ఏ పురుష జాతకంలోనైనా జన్మలగ్నం బేసి రాశి అయి ఉండి, చంద్రుడు కనుక సమరాశి యందుండి, అలాగే కుజుడు కూడా ఏదేని సమరాశియందుండి, ఆ కుజుని వీక్షణ కనుక ఆ జాతకుని లగ్నస్థానం మీద గాని, లేక చంద్రుని మీద గాని ఉంటే ఆ పురుషుడికి స్త్రీ వాంఛ లేక నపుంసకుడిగానే ఉండిపోతాడు. ఇంకొక విషయం ఏమంటే కేతువు కూడా కుజుని లాగానే ఏదేని సమరాశి యందుండి లగ్న మరియు రాశి స్థానాలు కనుక బేసి స్థానాల్లో ఉండి ఆ కేతువు వీక్షణ కనుక లగ్నం మీద గాని లేక చంద్రుని మీద గాని ఉంటే, గ్రహస్థితి యొక్క ఫలితం కూడా నపుంసకత్వమేనని గ్రహించాలి.




పైన చెప్పిన కారణాలే కాక మరికొన్ని అంశాలు ఏమంటే ఏ జాతకంలోనైనా పురుషుడికి శుక్రుడు కనుక శతృక్షేత్రంలో ఉన్నా అస్తంగతుడైనా లేక, జన్మసమయంలో వక్రగతిలో ఉన్నా, వృషభ, తులా రాశులలో చంద్రుడున్నా మరియు లగ్న స్థానం నుంచి సప్తమ స్థానంలో శుక్రుడుండి లగ్నాధిపతి వీక్షణ కనుక సప్తమ శుక్రుని మీద ఉన్నా లగ్నాధిపతి స్వక్షేత్రంలో ఉండి సప్తమ స్థానంలో శుక్రుడున్నా – ఈ జాతకులకు రతి వాంఛ చాలా తక్కువగా ఉంటుంది. స్త్రీ విముఖత ఎక్కువ. అందువల్ల అల్ప సంతానం ఉంటుంది. ఇంకొక విషయం ఏమంటే చతుర్థంలో చంద్ర శనులు కలిసి ఉండి వారిమీద పాపగ్రహ వీక్షణ ఉన్నా లేక శుభవీక్షణ లేకున్నా దోషమేనని గ్రహించాలి.

ఈ పైన వ్రాసినవి మీరు చక్కగా చదివి అర్థం చేసుకొని, శ్రద్ధగా వధూవరుల ఇద్దరి జాతకాల సప్తమ, అష్టమ భావాలు జాగ్రత్తగా విశ్లేషించి ఒక నిర్ణయానికి రావాలి గాని తొందరపడి ఏ నిర్ణయానికి రాకండి. వధూవరుల సంతాన స్థానాలు కూడా చక్కగా పరిశీలించాలని హెచ్చరిక చేయడం మంచిదని భావిస్తున్నాను. ఎందుకంటే ఈ అధ్యాయం మీద ఒక చక్కటి అవగాహన పూర్తిగా మీకు ఏర్పడి అనేక వేల జాతకాల పరిశీలన తర్వాత నేను తెలుసుకున్నా శాస్త్రాధారం ఉంది కాబట్టి నేను ఈ అధ్యాయం వ్రాయడానికి సాహసించాను. దీనిలో ఏదైనా అభ్యంతరాలు, తప్పులు ఉంటే నాకు తప్పక తెలియచేయమని విజ్ఞులు, పండితులకు మనవి.

# 29. అభ్యాస చక్రాలు

## అభ్యాసం - 1

| | | | |
|---|---|---|---|
| శు | ల / గు కే | | |
| | వధువు జాతకం | | శ |
| బు ర కు | నక్షత్రం : స్వాతి | | |
| | | రా చం | |

| | | | |
|---|---|---|---|
| | ల కే | బు | శు ర |
| | వరుని జాతకం | | కు శ |
| చం | నక్షత్రం : శ్రవణం | | |
| | | రా | గు |

## అభ్యాసం - 2

| | | | |
|---|---|---|---|
| శు | కే | ల / గు | |
| ర బు | వధువు జాతకం | | చం శ |
| కు | నక్షత్రం : ఆశ్లేష | | |
| | | రా | |

| | | | |
|---|---|---|---|
| చ లగ్నం | | శ | |
| కు | వరుని జాతకం | | కే |
| రా | నక్షత్రం : రేవతి | | |
| | బు శు గు | ర | |

## అభ్యాసం - 3

| | | | |
|---|---|---|---|
| | కు | చం | శ కే |
| | **వధువు జాతకం** | | లగ్నం |
| గు శు | **నక్షత్రం : రోహిణి** | | |
| రా, ర బు | | | |

| | | | |
|---|---|---|---|
| | ల చ | | కే |
| | **వరుని జాతకం** | | ర |
| | **నక్షత్రం : భరణి** | | కు బు |
| రా | | గు శ | శు |

## అభ్యాసం - 4

| | | | |
|---|---|---|---|
| గు | కు | కే | ర బు శ |
| | **వధువు జాతకం** | | శు |
| | **నక్షత్రం : ఉత్తర** | | |
| | రా | | లగ్నం చం |

| | | | |
|---|---|---|---|
| | | శ | లగ్నం |
| కు | **వరుని జాతకం** | | కే చ |
| రా | **నక్షత్రం : పుష్యమి** | | |
| | గు | ర బు శు | |

## అభ్యాసం - 5

| | | | |
|---|---|---|---|
| | కు | | రా |
| | **వధువు జాతకం** | | ర బు |
| లగ్నం చ | **నక్షత్రం : శ్రవణం** | | శు |
| కే | గు | | శని |

| | | | |
|---|---|---|---|
| గు | కు | బు కే | ర శ |
| | **వరుని జాతకం** | | శు లగ్నం |
| | **నక్షత్రం : జ్యేష్ఠ** | | |
| | చం రా | | |

## అభ్యాసం - 6

| | | | |
|---|---|---|---|
| | | శు | లగ్నం ర |
| రా | **వధువు జాతకం** | | బు చం |
| | **నక్షత్రం : ఆశ్లేష** | | శ కే |
| గు | | కు | |

| | | | |
|---|---|---|---|
| బు | | శ | కే |
| ర శు | **వరుని జాతకం** | | |
| గు | **నక్షత్రం : మూల** | | |
| రా చం కు | | | లగ్నం |

# కళ్యాణ జాతక విశ్లేషణ



రచయిత : "జ్యోతీషాచార్య"
డా॥ **పండిట్ మల్లాది మణి**, Ph.D
స్వస్థలం : విజయవాడ
నివాసం : హైదరాబాద్
వయస్సు : 70 సం॥

**ఇతర రచనలు :**
1. సర్వాంగ ముహూర్తసారణి
2. జాతక యోగ ప్రాశస్త్యం
3. కాల సర్పదోషం
4. జాతక మోక్షప్రదాయిని
5. జాతక సుధాసారమ్
6. అముద్రితాలు-2

## ఈ పుస్తకం గురించి ......

మీ అబ్బాయికి ఒక సంబంధం వచ్చింది. పిల్ల చాలా బాగుంది. చదువు, ఉద్యోగం, గోత్రం, శాఖ అన్నీ చక్కగా కుదిరాయి. మీ పిల్లవాడికి ఆ పిల్ల ఫోటో కూడా నచ్చింది. మీరు పిల్ల జాతకం చూపిస్తే మీ జ్యోతిష్కుడు జాతకం అసలు కుదరలేదన్నాడు. మీకు అయ్యో అనిపించింది. ఎందుకైనా మంచిదని మరొకరికి ఆ జాతకం చూపించారు. ఆయన జాతకం కుదిరిందని నొక్కి చెప్పాడు. మీరు అయోమయంలో పడిపోయారు. ఎందుకంటే కొందరు భేషుగ్గా ఉందన్నారు. మరొకరు పూర్తిగా విసర్జించమన్నారు. ఇలాంటి పరిస్థితి మీకు రాకుండా ఉండాలంటే ఈ పుస్తకం మీరు చదవండి. వధూ-వరుల జాతకాలు రెండూ పొంతన కుదిరిందో లేదో మీరే స్వయంగా పరిశీలించగలరు. నెలల తరబడి నేర్చుకోనక్కర్లేదు. సంవత్సరాల కొలది ఎవరి వద్ద శుశ్రూష చేయక్కర్లేదు. అతి తేలికగా మీరే జాతకాలు కుదిరాయో లేదో పదిమందికి చెప్పగలరు. ఎంతో మందికి సహాయం చేసిన వారవుతారు.

జాతకరీత్యా మీరు సరియైన కోడలిని ఎన్నుకోగలరు. లేక మంచి జాతకం కలిగి ఉన్న అల్లుడిని తెచ్చుకోగలరు. ఇది మాత్రం ముమ్మాటికీ నిజం.